# THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204105
UNIVERSAL LIBRARY

# శ్రీరామవిజయము.

## పూర్వకాండము.

ఇది


కాకినాడ వాస్తవ్యులు:

కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారిచే


విరచింపఁబడి, ప్రచురింపఁబడినది.


ప్రథమముద్రణము 1000 ప్రతులు.

కాకినాడ:—పట్టుసుట్టు శేషగిరిరావుగారి జార్జిప్రెస్‌యందు

ముద్రింపఁబడియె.

1934.



కాపీరైట్]


[వెల 0-12-0.

# కృతిప్రశంస.

——: 0 :——

ఆర్యావర్తము!!! పుణ్యభూమి!!! ఆర్యధర్మము!!! ఏయుగములోనివో, ఎవరినిగూర్చినవియో, యనుకొను కాలమువచ్చిన యీదివసములలో "ఈ శ్రీరామవిజయము" వెలువడుట మిక్కిలి శుభావహము. తుపానునందగుల్కొని, దిక్కుగానక, సంక్షోభించి కొట్టుకొనుచున్న నావకు, ధ్రువ దర్శనమైనటులున్నది!

ఆర్యానార్యులు స్వరూప స్వభావాదుల సామ్యభేదము లత్యంత పరిశీలనావిచక్షణ దక్షతతో ప్రస్ఫుటముగ హృద్యముగ చిత్రించినది, శ్రీమద్వాల్మీకరామాయణము. సకలకళాప్రపూర్ణుఁడగు నిండు చంద్రుని బోలు శ్రీరామునిగాంచి, మునీశ్వరులుసహితము సమ్మోహితులైపోయిరట. అట్టిశ్రీరామచంద్రుని గుణరూపవిశేషములు, రసజ్ఞకవికోవిదులకావేశముఁగొల్పి, తన్మయతఁగల్గించి రామకథను వేవిధముల గానముజేయించుట యందాశ్చర్యమేమి? అట్టి పురాణగాధలనెల్ల శోధించి, పరిశీలించి, రసవంతములౌ విశేషాంశములసేకరించి, పార్వతికి బంగారునగలు తొడిగినపోల్కి., నందనంబున మన్వాదుల నాటినటుల, జంద్రికలోనెత్తావి చిలకరించినరీతి, నాదికావ్యము నెంతయు నలంకరించిఁ యీగ్రంథకర్త ఆంధ్రవాణి కపూర్వ సుందరోజ్వలతారహారమొసగుటయేకాక, మిక్కిలి యాంధ్రదేశసేవగూడఁ జేసినటుల భావించుచున్నాను.

ఏమనందురా, సర్వసాధారణముగ నేఁడు మనదేశమందు పిన్నలు పెద్దలు, స్త్రీలు పురుషులు, చదువుకొను సారస్వతము మనదేశసాంప్రదాయములకు, నాదర్శములకు, మన నిత్యజీవితములకు, సంబంధము లేకుండుటయేకాక, విరుద్ధమై, మన ఆర్యజాతి నామరూపముల విస్మరింపఁజేయుటయో, లేక వికృతంబుగఁ బ్రదర్శించి, హేయభావముదయింపఁజేయుటయో ఫలితముగఁ బరిణమించుచున్నది. స్వస్వరూపము మాసి యాత్మగౌరవముపోయి, ఆత్మజ్ఞానములేక, నున్నంతకాలము మనకాత్మవిశ్వాసముకాని, కర్తవ్యాకర్తవ్య పరిజ్ఞానముకాని, విధ్యుక్తధర్మ నిర్వహణ పరాయణత్వముకాని, సిద్ధింపనేరదు. మనజాతికి మోక్షము లేదు. ఆత్మకు వికాసమురాదు.

శ్రీరామవిజయమను నీగ్రంథము శ్రీరామచంద్రుని పూర్వులగు దిలీప, రఘు, అజ, దశరథులయొక్కయు, రామచంద్రుని తరువాతవారగు, కుశ, అతిథి, నిషధ, నలులయొక్కయు సూర్యవంశ రాజన్యచూడామణుల జీవితగాథలతో, ఇతిహాసములతో, అనేక ధర్మసూక్ష్మనిర్ణయ ప్రధానమగు చర్చలతో, హితబోధలతో, నిండియుండియు కాంతాసమ్మితమై, కావ్యములలో గావ్యమై, పురాణములలో బురాణమై, దేశచరిత్రలలో దేశచరిత్రయై, నవలలో నవలయై, అన్నిలక్షణములతో, అన్నిచాయలం గన్పరచుచు, ఆదర్శప్రదర్శకమై, భావోత్తేజకమై, మిక్కిలి మనోహరమై, వెలయుచున్నది. చేబట్టి చదువునపుడు, మనోహరకథా గుచ్ఛమువలె హృదయోల్లాసకరమై, "తరువాత"..... "అటుపైన"......"మనపూర్వులెంతటి పవిత్రులు! ఎంతటినాగరికులు! ఈనేటి నాగరికతకంటె నా నాగరికతయెంత యుత్కృష్టము ! లోకకల్యాణప్రదము!"......"అట్టి దివ్యపురుషుల సంతతివారమా మనము! అహా!!" అనుభావముల మాటి మాటికి రేకెత్తించుచుండును.

కళాశాలలలోం దప్పక పఠనీయగ్రంథమై, అచిరకాలముననే యిది విద్యార్థుల మనోహృదయములంజొచ్చి, అటనుండి మానవకోటికి మంగళకరమగు శక్త్యుత్సాహముల వెలువరించుగాక !

ఈ యుత్తమగ్రంథము నత్యంతప్రేమతో భగవంతుని మంగళాశీర్వాదము గోరుచు, దన దేశీయులకందజేయుచున్న గ్రంథకర్త, శ్రీపిఠాపుర మహారాజావారి కళాశాలలో ముప్పదినాలుగువర్షములు సంస్కృతపండితులుగానున్న, బ్రహ్మశ్రీ కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారు ఉభయభాషాకోవిదులు, గొప్పరసజ్ఞులు, అసమానబోధన ప్రజ్ఞాధురీణులు, అనువిషయము వారిశిష్యకోటికిని ఆంధ్రదేశమునకుగూడ విశదమైయుండ వారినిగూర్చి నేబ్రశంసింపంబూనుట సాహసము, హాస్యాస్పదము కావున నాసోదరదేశీయులతోంగలసి వారికి నాకృతజ్ఞతాపూర్వకవందనములర్పించుచు నేవిరమించెదను. జాగులేక నికవారి రచనామృతమును నాసోదర సోదరీమణులెల్లరు దోడనంజవి జూచి యానందింతురుగాక !

కాకినాడ,
15—10—1934.

బులుసు వెంకటసుబ్బారావు, బి.యె.బి.యల్,
అడ్వకేటు.

# నా యూహ

శ్లో॥ సూర్యాంవందేక్ష్వాసింధుం దివ్యతేజోవిరాజితమ్ ।
యదష్టాంశ్యాలోకకల్యాణా మస్యాంతేజన్మనః ఫలమ్॥

ఈభారతవసుంధరనుగల క్షత్రియవంశములలో సూర్యవంశ మసమానయశోవిరాజితమై వెలయుచున్నయది. ఈప్రభాకరాన్వయమున జన్మించిన పురుషసింహుల ఘనోదారజీవితములు మానవసంఘమునకేకాక దేవతానీకమునకుకూడ లక్ష్యములై భాసిల్లుచున్నయవి. ఈయినకులాలంకారలగు సతీలలామల నిర్మలజీవితవాహినులు ముల్లోకములఁ బవిత్రముచేయఁ జాలియున్నవి. ఈదినమణిసంతతిసంభవులగు బాలుర పరాక్రమక్రమములు సురాసురవీరులనుగూడ బెగ్గడిందఁజేయుచున్నయవి.

అట్టిపురుషసింహుల యుదారజీవితములతోడను, అంతటిసతీలలామల పుణ్యచరితములతోడను, అట్టిబాలవీరుల మనోహరోపాఖ్యానములతోడను, విరాజిల్లుచున్న భాస్కరాన్వవాయ చరిత్రములఁ జదువువారి జిహ్వయే రసాభిజ్ఞయగు రసన, వానినాకర్ణించు శ్రవణములే నాదకళోపాసకములగు శ్రుతిపుటములు.

సూర్యవంశమింతటి మహిమాఢ్యము కావుననే శ్రీహరి, ఇతర రాజన్యకులముల విడచి, ఈభానుగోత్రమున మానవుఁడుగా జనింపఁ గుతూహలియయ్యెను. శబ్దార్థసారవేదియగు కాళిదాసకవీంద్రుఁడునుఁ అనేకదివ్యావతారచరితములున్నను జేకొనక, ఈసూర్యవంశ్యసార్వభౌమ జీవితములనే తనప్రథమకావ్యమగు రఘువంశమున ఘనముగా వర్ణించి, నిజకావ్యకల్పకముయొక్క యనుపమానభావసుమసౌరభములఁ గవితోద్యానవీథులఁ బ్రసరింపఁజేసి, విబుధానందమును సమకూర్చియున్నవాఁడు.

కావున నట్టియమూల్యగుణశోభితమగు సూర్యవంశ్యచరిత్రమౌక్తికహారమును ఆంధ్రసరస్వతీమాతృకంఠమునసమర్పింపఁ గుతూహలుఁడనై యీతెనుంగు కబ్బమును సమకూర్చితిని. వాల్మీకివిరచితమగు

శ్రీమద్రామాయణమున వర్ణింపఁబడిన దాశరథిగాథనే ప్రథానేతివృత్త
ముగఁ జేకొని శ్రీరామవిజయమని పేరిడితిని.

ఈగ్రంథమంతగొప్పది, కాకున్నను దీనినిసమకూర్చుటలో నేఁ
జెందిన శ్రమమాత్రమధికమే. సుందరాంగినిఁ గన్నతల్లికిని, కురూ
పినిఁ బ్రసవించిన మాతకును, నొప్పులలో భేదముండ నేరదు. అటులనే,
ప్రౌఢకావ్యనిర్మాతకును, నీరసగ్రంథరచయితకును, శ్రమతుల్యమే.

పావనమందాకినీజలౌఘముల జటాజూటమునఁదాల్చి, యానం
దించుశంకరుఁడు నీరసభక్తుఁడొసగు అల్పాభిషేకనీరములఁ గూడఁదలనిడి
కొని, యానందించునేకాని, నిరసింపఁడు. అటులనే సరససారస్వత
రసాస్వాదమగ్నులగు సహృదయులు సామాన్యకావ్యములఁగూడ నాద
రింతురేకాని తృణీకరింపరు.

నేనీగ్రంథమును వ్రాయుటకుఁ గలకారణములలో మొదటిది
దేశమున రాజభక్తిని, పితృగౌరవమును, సోదరప్రేమను, కళత్రానురాగ
మును, సుహృద్భావమును, లోకనగుధర్మములఁ బెంపొందింపఁజేయుటకు
దగిన సాధనము రామాయణకథయే యను నిశ్చయము. రెండవది పర
దేశగాథలకంటె నిజవిషయకథలు భారతీయులకు నెక్కుడురుచ్యములు
గా నుండునను భావము. మూడవది శ్రీరామచంద్రుని పుణ్యచరితమును
వ్రాసి,ధన్యతనందఁ గోరిక.

ఈకావ్యమునందు పూర్వకాండము,బాలకాండము, అయోధ్యా
కాండము,అరణ్యకాండము, కిష్కింధాకాండము,సుందరకాండము,యుద్ధ
కాండము,ఉత్తరకాండము,అనియెనిమిదిభాగములుకలవు.అందుదిలీపచరి
తము మొదలు దశరథుఁడుపుత్రకామేష్టిచేయువఱకుఁ గలకథపూర్వకాం
డమున వర్ణింపఁబడినది. ఉత్తరకాండమునందలి కథప్రస్తుతముత్తరకాండ
మని పేర్కొనఁబడుచున్న దానిలోనిదికాదు. ఇందలికథ కుశలవచరి
తముతోఁ బ్రారంభింపఁబడి నలచరితముతో ముగియుచున్నది. మిగత
కాండములయందలి కథ వాల్మీకివర్ణితమే, కాని యన్నికాండములయం
దును నితరరామాయణములనుండి, ఇంపగునుపాఖ్యానములను ఘనము
లగుభావములను దీసికొని వానినిఁబెంచియు, సంగ్రహించియు, నిందు
వ్రాసియుంటిని.

నేనీయష్టకాండాత్మకమగు శ్రీరామవిజయాష్టదళపద్మమును లోకకళ్యాణముల సమకూర్చుటయే నిజజీవితఫలమని యెంచు విశాలాశయులగు నన్న ఇనవంశమునకు జనకుండును, జరాచరసౌఖ్యవిధాతయు నగు, సూర్యభగవానుని పాదపంకజములకంకితముగా సమర్పించితిని.

నేనీగ్రంథమునవ్రాయుచున్నపుడు ముద్రితపత్రముల దిద్దుటలో సాహాయ్యమొనర్చిన ఆంధ్రసాహిత్యపరిషద్వ్యవహర్తలగు బ్రహ్మశ్రీ కొత్తపల్లి సూర్యారావుగారికిని, సరిగసమయమునకు గ్రంథమును ముద్రించి యొసంగిన జార్జిముద్రాక్షరశాలాధికారులగు మ॥ రా॥ రా॥ పట్టమట్ట శేషగిరిరావుగారికిని ధన్యవాదముల సమర్పించుచున్నవాఁడను.

ఇట్లు,

విబుధవిధేయుఁడు,

కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి.

# కృతిసమర్పణము.

ఏపుణ్యాత్ముఁడు నిత్యసూర్యోపాసకుఁడనియు, గానకళాభోజుఁడనియు, దానకర్ణుఁడనియు, సోదరవత్సలుఁడనియు, శాంతస్వభావుఁడనియుఁ బ్రసిద్ధిగాంచి యుండెనో యట్టి, యస్మన్మిత్రులగు శ్రీవేంకటమహాలక్ష్మీసమేతులైన మహారాజరాజశ్రీ దివాన్ బహద్దరు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తిగారికి ఈశ్రీరామవిజయపూర్వకాండము కృతిగా నొసంగబడినది.



దివాన్‌బహద్దర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తినాయుడుగారు.

శుభమస్తు.

# శ్రీ రామ విజయము

# పూర్వ కాండము

——:o:——

## ప్రథమాధ్యాయము

### —: సుదక్షిణా కల్యాణము :—

శ్లో. సూర్యంవన్దే కృపాసిన్ధుం దివ్యదేజోవిరాజితమ్
యద్వంశ్యాల్లోక కల్యాణం మన్యంతే జన్మనః ఫలమ్.

సరయూనదీతీరమున సకలసంపదలతోఁ జెన్నారు అయోధ్య యను పురమొండు కలదు. ఈ పురరాజము ఉత్తరకోసల దేశసార్వభౌములకు రాజధానియై తనరారుచున్నయది. ఇందుఁ బరిపాలనమొనర్చిన చక్రవర్తులలో దిలీప రాజేంద్రుఁడు విశ్వవిఖ్యాతకీర్తియై తేజరిల్లుచున్న వాఁడు. ఈ నృపాలుఁ డొకప్పుడు దిగ్విజయాభిలాషియై రాజ్యపాలన మున, మంత్రుల నియమించి మంచి ముహూర్తమునఁ జతురంగ బల సమేతుఁడై, అయోధ్యనుండి బయలువెడలి క్రమముగాఁ బరదేశాధీశ్వ రులఁ గోసలపాలనమునకు లోపడి కప్పములుగట్టునట్లొనర్చుచు, నిజవిజ యవార్తలు భూచక్రమున వ్యాపింపఁజేయుచు, జైత్రయాత్రను సాగిం చుచుండెను.

ఇటుల బహువిషయముల జయించి దిలీపుఁడొకదివసమునఁ బ్రధానసేనానాయకుఁడగు సుమతిని బిలిచి యిట్లుపలికెను. "సేనాపతీ! మనము సాకేతమునువీడి చాల కాలమైనది. ఇపుడు మనకోసల పాలన మునకు లోపడని రాజులెవ్వరైనఁ గలరా? మనమిఁక జయింపవలసినదేశ మెయ్యది ?"

సుమతి:—శూరాగ్రణీ! ఈ భూమండలమునఁగల చక్రవర్తుల నందఱిని గోసలసింహాసనమునకు జోహారులొనర్చుచుఁ గరముల సమర్పిం

చువారినిఁగఁ జేసితిరి. కాని మగధదేశనాయకుఁ డగు జయసేనుఁడు మాత్రము మీకు నముఁడు కావలసియున్నవాఁడు. అతనిఁ గూడ నిర్జించినచో నిఁక భూవలయమునఁ దమ యాజ్ఞలకు నెదురాడువాఁ డుండఁబోవఁడు.

దిలీప:—సుమతీ! నేఁడేలొకో! యిదివఱకెన్నఁడును స్ఫురింపని నాదక్షిణనేత్రమును, కుడిచేయియు, నదరుచున్నయవి. దీనిఁబట్టిచూడ మనకేదియో శుభ మీమగధదేశయుద్ధమున సమకూరు నని పొడకట్టుచున్నది.

సుమతి:—రాజేంద్రా! తామేగిన దిక్కులయందెల్ల జయమనాయాసముగ సమకూరుచున్నయది. ఈమగధజనపదమునఁగూడ జయము సమకూరుటలో సంశయము లేదు. ఇఁక శుభశకునములకు ఫలమేమైయుండునో! కాని, మహారాజా! ఆ జయసేనునకు లోకోత్తరగుణవతి యగు తనయ గలదనియు నాపె కనునగు భర్తను సమకూర్చుటకా నృపాలుఁడు విశ్వప్రయత్నములఁ జేయుచున్నవాఁడనియుఁ దెలియవచ్చుచున్నయది. ఒకచో నానృపుఁ డాకన్యారత్నమును మీకుఁగానుకగానొసఁగి, మీతో సంబంధము నెఱపునేమో!

దిలీప:—ఆలమున విచ్ఛికత్తులఁ జేఁబూని పగతురతోఁ గయ్యమాడఁగోరువారు వియ్యమందుట యెట్లుపొసగును? నిమిత్తము లెప్పుడు నిర్హేతుకముగఁ గూడఁ గలుగుచుండును. మంత్రీ! మనకీ వితర్కములతోఁ బనిలేదు. బలముల మగధదేశముపైకి నడపింపుము.

సుమతి:—రాజేంద్రా! తాము చేకొనఁదగిన కరగ్రహణము ఈ జయసేనవిజయముతో సంపూర్ణమగును. మనము రేపటిసాయంకాలమునకు మగధను జేరఁగలము. అని యిట్లుసంభాషించి,మగధదేశముపైకి వెడలిపోయిరి.

మగధనాయకుఁ డగు జయసేనునకు సుగుణాలవాలయు, అసమానశీలయు, అనన్యసౌందర్యలీలయు, నగు సుదక్షిణయను పుత్రిక కలదు. జయసేనుఁ డాకన్యకామణికిఁ గులశీల వయోరూపాదులచేఁ

తుల్యుఁడగు రాకుమారునిఁ దెచ్చి వివాహముసేయఁగోరి నృపకుమారుల చిత్రములను, వారి వారి కులశీలములను బరిశీలించి వారియందుఁ దనతనయకుఁ దగిన వరుఁడు గానరాకుండుటచే, సుదక్షిణకు ననువగు భర్తను సమకూర్చుట యెటులనా ! యని యోజించుచుండెను.

ఇటులుండ నొకనాఁటి సూర్యాస్తమయ సమయమున, సూర్యకులదీపకుఁ డగు దిలీపుఁడు మగధరాజధాని యగు కుసుమపురము నరికట్టి విజయభేరీ నినాదములచే విజయసేనునకు నిజవిజయాగమన వార్తను వెల్లడించెను. మాగధనుఁడగుఁ మగధనాథుఁడును, సేనాసమేతుఁడై, పురమువెడలి పురావరోధకు లగు సైనికులఁ జెండాడుచుండ, దిలీపుఁడు జయసేనునిఁ దాఁకి శస్త్రపరంపరలచే శత్రుసైన్యములఁ జెల్లాచెదరుగాఁ జేసి యసహాయుఁడయ్యు నిర్లక్ష్యముగా నిజసైనికులపై బాణవర్షములఁ గురియుచున్న జయసేనుని పరాక్రమమునకు మెచ్చి, అతని సమ్మోహనాస్త్రముచే నిశ్చేష్టునిగాఁ జేసి, శిబిరమునకుఁ గొంపోయి, బందీగ నొనరించి, ప్రయాణపు బడలికచేతను, యుద్ధాయాసమువలనను, కడుండస్సి, శిబిరములోనికేగి, యోధవేషమపనయించి పాన్పుపైఁ బవ్వళించెను.

యుద్ధభూమిని దిలీపప్రతాపమునకుఁ దాళఁజాలక పలాయితులైన జయసేన సేనానులు కోట కేగి దుర్గద్వారముల మూయించిరాణివాసమును సంరక్షింపఁ బ్రయత్నించుచుండిరి. సుదక్షిణపరిచారికలవలనఁ దన జనకుఁడు పరశిబిరమున బందీయై యుండుటను దెలిసికొని నిజసఖుల రాఁబిలిచి రహస్యముగా నిట్లు పలికెను.

సుదక్షిణ:—సకియలారా ! మన సేనానులు తమ యేలికను బరకరగతునిగాఁ జేసి, సిగ్గువీడి, వీటఁబ్రవేశించి, కోటగుమ్మముల బిగియించి యేమూలలనో యొదిఁగి యున్నవారలు. వీరు భీరువు లగుటచే మనప్రభువు పగఱకుఁ జిక్కవలసివచ్చెను. ఇట్టిపట్టుల క్షత్రియకులసంజాతలగు మానినీమణులు తేజోవిహీనలై రిత్తవడి యంతిపురముల నణఁగియుండఁ జాలరు. కావున మనమెల్లరమును బురుషవేషములతోఁ గవచముల ధరించి కరవాలములఁ జేఁబూని రణరంగమున కేగి రహస్యముగాఁ జెఱ

యందున్న మనరాజేంద్రునిఁ గొనివత్తము. ఒక్కచో సైనికు లప్రమత్తులై మనల ముట్టడించిన గంతములఁ బ్రాణములున్నంతవఱకు వెనుదీయక కత్తులచే వారి కుత్తుకల నుత్తరింతము. సఖులారా! అపకీర్తిపంకమగ్నలమై యింట జీవించుటకంటెఁ బ్రభుగౌరవమునకై రణస్థలిని బ్రాణములు విడుటమేలు.

చెలులు:—రాజపుత్రీ! నీవు తెలిపినది లెస్స : మేమును మన మహారాజును విడిపించుటకు సిద్ధముగా నున్నవారము.

అని పలుక సుదక్షిణ సఖుల ధైర్యమునకు సంతసించి, రాజపుత్రవేషధారిణులగు చెలికత్తియలు వెంటరాఁ బురుషవేషముతో, నానిశీథసమయమున, మాఱుదారిని నిర్భయముగా దిలీపస్కంధావారమునఁ బ్రవేశించి, నిశ్శబ్దపదసరసిజవిన్యాసములతో నాశిబిరవాటికఁ గలయఁ దిరిగి, జయసేనుఁ డున్న డేరాను కనుంగొని, యర్థరాత్రమగుటచేఁ గనుమఱిగియున్న కావలివారలకుఁ దెలియకుండ జయసేనునిఁ బల్లకియందుఁ బరుండఁబెట్టి, కోటలోనికిఁగొంపోవునట్లు పరిచారికల కాజ్ఞాపింప, వారతివేగముగా నాతేని రహస్యమార్గమున దుర్గములోఁ జేర్చిరి. పిమ్మట సుదక్షిణ యిట్లుపలికెను.

సుదక్షిణ:—నెచ్చెలులారా! మనయేలిక సురక్షితముగాదుర్గములోనికేగెను. కాని యింతటితో మనపని తీరలేదు. మన మీ దిలీపుని గోటకుఁగొంపోయి, యీవీరుఁడు మన మహారాజున కొనర్చిన పరాభవమునకుఁ బ్రతిక్రియగావింప వలయు. కావున నిర్భయముగ రండు. మనమిట్లు చేయఁజాలుదుమో! లేమో! యని సందేహింపకుఁడు. నామనస్సాక్షి తప్పక యీరాజునుబట్టుట సాధ్యమని, బోధించుచున్నది. మఱియు నావామనేత్రము శుభసూచకముగా నదురుచున్నయది. మనకు విజయముచేకూరుట నిక్కువము. అని పలికి సఖులు తనవెంటరాఁ దిన్నగా దిలీపుఁడు నిదురించుచున్న గుడారమునకేగి నిజపరివారమును రహస్యముగానుండ నియమించి ప్రియసఖి యగు విజయతో దిలీపశిబిరములోనికేగెను. ఆసమయమున దిలీపుఁడు గాఢనిద్రఁ జెంది యుండెను. అట్లు నిదురించుచున్న యానృపకుమారుని హృదయాకర్షకమగు సౌందర్య

మును, ఆ రాకొమరిత కన్నులారఁగాంచి నిశ్చేష్టయై క్షణకాలమూరక నిలిచి పిమ్మట చెలికత్తెతో నిట్లు పలుకఁదొడఁగెను.

సుదక్షిః—సఖీ! ఈపటమందిరమున సన్ననిదుప్పటిని బైఁగప్పి కొని నిద్రించుచున్న యీవన్నెకాని సోయగమును గనుఁగొనుము. శారదాభ్రమధ్యమునను న్న చంద్రుని వెన్నెలవలె నెట్లింపు గొలుపుచున్నదియో! ఈ సుకుమారాకారుఁడు నిద్రాముద్రితనేత్రుఁడయ్యు నామానసమును హరించుచున్నవాఁడు. ఇఁక నే నెట్టు లీమోహనరూపుని బాశబద్ధునిగాఁజేసి కోటకుఁ గొంపోవఁజాలుదు? ఆహా! నే నేయూహతో సిటకువచ్చితినో యాతలంపేమాయె? ఇపు డేదియో యననుభూతమగు వ్యామోహము నామానసము నలముకొనుచున్నయది. నేనీరాజచంద్రుని బట్టఁజాలకుంటిని సరేకదా! శిబిరమునువీడి పైకిఁబోవ నేరకుంటి. కావున, ప్రియసఖీ! ఈ శూరశిఖామణి లేవకమున్నె నన్నీ డేరాలోనుండి పైకిఁ గొంపోయి నాగౌరవమును గాపాడుము.

విజయః—రాజపుత్రీ! మహాబలుఁడగు మనసిజుఁడు నవానురాగపాశములచే నిన్నీకోసలనృపాలునితో గట్టిగా నంటఁగట్టినాఁడు. అబలనగు నే నెట్లీ కట్టును సడలింపగలను? కాని నెచ్చెలి యీసురూపుఁడు మేల్కాంచిన నిన్నేమిచేయునో యని భీతిల్లకుము. ఎవ్వఁడు నిన్నిట్టి స్థితికిఁ దెచ్చెనో వాఁడే యీ తేనిగూడ మాటుతో నవకు మరల్పఁగలఁడు. ఈరాకుమారుఁడు కనువిచ్చి నీమనోహర నిజరూపమును దిలకించిన వెంటనే నిశ్చేష్టుఁడగుట నిక్కువము. అప్పుడు నీవతని ననాయాసముగాఁ బట్టఁగల్గుదువు. అని పలుకుచుండ "జయసేనుఁడు గుహాద్వారమునుండి గూఢముగాఁ బాఱిపోయె" నని సైనికులు కోలాహలము చేయుచుండుటచే, దిలీపునకు నిద్రాభంగమై యాతఁడు కనుదెఱచి కట్టెదుటఁ దన్నుఁ గట్టు నుద్దేశముతోఁ బాశహస్తయై శిరమువంచి, నిలిచియున్న సుదక్షిణను జూచి విస్మితుఁడై తనలో "ఈసుకుమారాకారుఁడెవ్వఁడై యుండును! శూరరక్షితమగు నాశిబిరము నెట్లు చొరఁగలిగె? ఇది స్వప్నమై యుండునా? సేనాకలకలముకూడ వినవచ్చుచున్న దే? ఈ రాజకుమారుని జూడంజూడ వింత వొడముచున్నయది. ఈతనిమోము పున్నమచందురునిపగిదిఁ

జక్కఁగా నున్నయది. చూపులు నల్లకలువలంబోలి యున్నవి. బాహువులు మృణాలనాళముల ననుకరించుచున్నవి కాని క్షత్రియ యువకుల కుండవలసిన సహజశరీరపాటవ మీ సుందరాంగునియందుఁ గానవచ్చుటలేదు. ఈ నడిరేయి భటులఁబరాభవించి యిట్లు నిర్భయముగా నాపటమందిరములోఁ బ్రవేశించుట చూడ నీతఁడు నాకెద్దియో కీడుసేయఁదలచినట్లు విదితమగుచున్నది. కావున నీతనిఁ గనికరించివిడువరాదు. అయ్యో! పాపమీబాలవీరుని హత మొనర్చిన యేతల్లి దుఃఖము నందునో! ఏకాంత పతివియోగము పాలగునో! ఏలకో యీబాలునిపై స్నేహభావము పొడముచున్నది కాని, శత్రుబుద్ధికలుగుట లేదు." ఇట్లు దిలీపుఁడు వితర్కించుచుండ—

సుదక్షిణ తానెంత దాఁపఁబ్రయత్నించినను నణఁగుపడక, నూత్నవరావలోకనసమయమునఁ గన్యకలకుఁగలుగు సహజసాత్త్విక భావములు పుష్పగర్భమునుండి పరిమళములు పైకివచ్చునట్లు హృదయమునుండి వెలికిఁదెలియరాఁదొడఁగెను. దిలీపుఁడాచేష్టలఁదిలకించి యిట్లుతలంచెను. ఈనృపకుమారుఁడు నన్నుఁజూచి తలవంచి పాదాంగుష్ఠముతో నేలపై వ్రాయుచుఁ గన్నెత్తి నన్నుఁ జూడఁజాలకున్నవాఁడు. ఈతని హావభావములఁజూడ నాకు సంశయము కలుగుచున్నయది. ఈతఁడు పురుషవేషముతోనున్నను నవయనవికారములచే స్త్రీత్వమును బ్రకటించుచున్నవాఁడు. కావున నీతని సహచరుని బ్రశ్నించి తెలిసికొనియెదను.

దిలీపుఁడు:—ఓయీ మీరెవ్వరు? ఈ యర్ధరాత్రమున నిట్లు మాగుడారములోఁ బ్రవేశింపఁ గారణ మేమి? సత్యము నివేదింపుము. అనృతమును బలుకకుము. కోసలరాజులు సత్యప్రియులు, ననృతద్వేషులుఁగావుననిజము తెలిపి గౌరవింపఁబడుఁడు. కల్లలాడిగాసిల్లకుఁడు అని పలుకుచుండ, రక్షకభటులేతెంచి మహారాజా! జయసేనుఁడు కావలివారల మోసపుచ్చి శిబిరమునుండి పాఱిపోయినాఁడు. ఈసంగతిసుమతి తమకుఁ దెలుప మమ్ముఁబంపినాఁడు.

దిలీపుఁడు:—అతఁడెటులఁ బాఱిపోఁగలిగె? బహుశః, అతని పలాయనమునకు వీరి సహాయముండితీరును. ఇదేదియో కపటనాటకమే

ఈవేషధారుల నటనమును దానినే తెలుపుచున్నది. భటులారా! చేజిక్కిన రిపుని గాపాడ నేరక యూరక మాటలాడిన బ్రయోజన మేమి. పొండు ప్రమత్తులై యుండుడు - అని వారలం బంపెను.

అంత సుదక్షిణ చెలికత్తియ యగు విజయ కర్తవ్యమును జక్కగ యోచించి, యిక సత్యము దెలుపకున్న మానప్రాణములు దక్క నేరవని గుర్తించి, దిలీపునితో నిట్లుపలికెను. కోసలరాజచంద్రా! ఈపురుష వేషముతోనున్న కన్య జయసేన మహారాజుయొక్క పుత్రిక. మీచేఁ బట్టఁబడిన యానృపుని విడిపించిన దీపెయే. తనతండ్రినిబంధించినమిమ్ముఁ బట్టి, కోటకుఁగొంపోవ నెంచియీపటకుటీరములోనికివచ్చినిదురపోవుచున్న మీదివ్యమంగళస్వరూపమును జూచినతోడనే కన్యకాజనుల గారడిసేయు మనోభవుఁ డీపెయూహలఁ దాఱుమాఱొనర్చెను. ఇట్లాయనంగుఁడు క్షణకాల మడ్డురాకున్న చో మీరీపాటికిఁ గుసుమపురదుర్గములోనుండి యుందురు. ఇది మానృత్తాంతము. ఇఁక బిమ్మటికార్యము మీచేతిలోనున్నది. అది మీరే యోజింపవలయుఁగాని మాబోంట్లు నివేదింపవలసినదికాదు. అని పలికెను.

ఇట్లుండ సురక్షితముగాఁ గోటలోఁజేరిన జయసేనుఁడుచారుల వలన సర్వవృత్తాంతమును దెలిసికొని తనపుత్రిక శత్రుశిబిరమునఁ జిక్కి రానేరకుండుటకు మిక్కిలివగచి మంత్రులరాఁబిలిచి వారితోఁ గర్తవ్యముం గూర్చి చర్చింప మంత్రులు "ప్రస్తుతము సామమే కార్యసాధనమనియు నవక్ర విక్రముఁడగు దిలీపునికడ దండోపాయము నిరర్థకమని"యు సహేతుకముగాఁ దెలిపిరి.

జయసేనుఁడు వెంటనే యుపాయనముల సమకూర్చి వేదవేదాంగ పారగుఁ లగు వాఱులఁ బిలిపించి నమస్కారపూర్వకముగానిట్లుదెలిపెను. "భూసురోత్తములారా! నన్ను మీరిప్పు డొక యిక్కట్టునుండి కాపాడవలసియున్నది. మహనీయులారా! మీకుఁ బ్రియశిష్యయు నాకు ననుంగుఁబుత్రియు నగు సుదక్షిణ నన్ను శత్రుశిబిరమునుండి విడిపించి తాను రిపుకరగతయై యటనిలిచిపోయినది. కావునమహానుభావులారా! ఈయుపాయనములఁ దీసికొని యటకేగి దిలీపునకు నొసంగి మీ సామ

గానములచే ఆవీరుని సంతసింపఁజేసి సుదక్షిణనుగొనితెచ్చి నాకుబుత్రి కాదానముఁజేయఁగోరుచున్నవాఁడను. మఱియు మీ కెట్లుచేసిన శుభము సమకూరునని తోఁచునో అట్లు చేయనగును. మీరు నాకు గురువులును శాసకులునుగూడ అయియున్నవారు. ఇపుఁడు మీభూసురాశీః ప్రయోగములుతక్క నాభాసురాస్త్ర ప్రయోగము లుపయుక్తములు కానే అవు. ద్విజోత్తములారా! నాక్షేమము మీహస్తగతమై యున్నయది. అన

భూసురులు:—రాజేంద్రా! మాకింత నివేదింపవలెనా? ఇదె మేము ఆ దిలీపునికడకేగి సురక్షితముగా సుదక్షిణను దీసికొనివత్తుము అనిపలికి, ఆబాడబులు కానుకలవెంటఁగొని ఉదాత్తానుదాత్త ప్రచయ స్వరముల మేళగించి, శ్రుతిమనోహరముగ శ్రుతిగీతములఁ బాడుచు, దిలీపుని శిబిరద్వారముచేర, దిలీపుఁడును ఆవేదనాదము విన్నతోడనే వినయ వేషముతో విప్రులకెదు రేగి, నమస్కరించి గుడారములోనికి గొంపోయి, ఉచితాసనముల నుపవేశింపఁజేసి "వేదవిదులారా! తామిటకు రాఁగారణ మేమి?"

విప్రులు:—ఓ రవివంశభూషణా! మేము సుదక్షిణానిమిత్తముగా నీకడకువచ్చియుంటిమి. నృపావతంసా! వినయ వినతవదనయై పురుష వేషముతోనున్న ఈ కన్నియ మా మహారాజు జయసేనునిపుత్రిక. సువిధేయ. సుదక్షిణ నామధేయ. జయసేనుఁడును కులీనుఁడగు తేఁడు మీ యినకులముతో సంబంధమునెఱపఁదగు వంశగౌరవముకల వాఁడు. వీరవరేణ్యా! నీచే నీభూచక్రమంతయు జయింపఁబడినది. కావున ధర్మజ్ఞయు, శీలసంపన్నయు, కళాకోవిదయు, నగు ఈకన్యకామణిని వీరశుల్కనుగాఁ బరిగ్రహింపుము. ఈ సుందరాంగి సర్వవిధముల నీకుఁ సహధర్మచారిణిగా నుండఁదగియున్న యది మా మహారాజును నీకుఁ గన్యాదానమొసంగి, కృతార్థుఁడు కాఁగోరుచున్నవాఁడు. దానవీరా! మా యేలిక మాకై యెదురుచూచుచుండును కావునమాకీ సుదక్షిణ నొసంగి పంపఁగోరుచున్న వారము.

దిలీపుఁడు:—భూసురవరులారా! మీరాకొమరితను సఖీసహి

తముగాఁ గొనిపోవచ్చును. ఈ సుదతి పురుషరూపముతో మమ్ము మోసగింపవచ్చినది. కాని మే మీమె కెట్టికష్టమును గలిగింపలేదు. ద్విజాశీర్వచనములకు దైవముకూడ సాయపడవలయునుగదా. విప్రోత్తములారా ! భక్తితో నే సమర్పించు నీ బహుమతుల స్వీకరింపవలయును. అని బహువిధామూల్యవస్తువుల నొసంగెను. ద్విజులును దిలీపుని కల్యాణపరంపరావాప్తునిగా దీవించి, సఖీసహితముగాసుదక్షిణను వెంటనిడుకొని వెడలిపోయిరి.

జయసేనుఁడు:—ఇంకనుభూసురేంద్రులు సుదక్షిణను దోడ్కొనిరారైరి. ఆరాజు వీరినిగూడఁ జెఱపట్టి యుండునా ! లేక తిరుగ నన్నొసంగినఁ గాని నాపుత్రికను విడువననుచుండెనా ! అని యిట్లు వితర్కించుకొనుచుండ విప్రులు సుదక్షిణావిజయల దోడ్కొనివచ్చి రాజునకు సమర్పించి, యిట్లనిరి. "జయసేన మహారాజా! ఆదిలీపుఁ డసమానరూపగుణశోభితుఁడు. మేము మున్నెన్నఁడు నిట్టి సుగుణాలవాలుఁడగు రాజకుమారునిఁజూచి యెఱుంగము. ఈనీపుత్రికను, ఆరాజచంద్రునకొసంగి ధన్యుఁడవుకమ్ము. నీపుత్రికచేసికొన్న జన్మాంతర సుకృత పరిపాకముచే స్వ విక్రమతులిత సురేంద్రుఁడును, నిజరూప నిర్జితరతీంద్రుఁడును నగు దిలీపరాజచంద్రుఁడు మనోవల్లభుఁ డగుట సంప్రాప్తమయినది. కావున రత్నాకరుఁడు లక్ష్మినిని మహావిష్ణువునకొసంగినట్లు, నీవును సుదక్షిణను దిలీపున కొసంగి కృతార్థుఁడవగుము. అతఁడు పరిగ్రహించునో లేదో యని సంశయింపకుము. ఆవీరుఁడు గంభీరముగాఁ బరిగ్రహాంగీకారమును సూచించి యున్నవాఁడు."

జయసేనుఁడు విప్రులకు సత్కారముంజేసి "ద్విజవరులారా ! మీరుచేసిన యుపకారమునకును, ఉపదేశమునకును, నేనెంతయుఁ గృతజ్ఞుఁడను."అని వారలఁ బంపి, యంతఃపురమునకు వెడలిపోయి తనయర్ధాంగియగు కళావతితో నాలోచించి యామఱునాఁ డుదయము కాఁగానే మంత్రి పురోహితాదుల దిలీపుని కడకుఁ బంపి యా నృపకుమారుని మహావైభవముతోఁ గోటకుఁ దోడ్కొని వచ్చి, సుదక్షిణ నొసంగి పాణిగ్రహణమహోత్సవము జరిపెను.

దిలీపుఁడును జయలక్ష్మియు గృహలక్ష్మియు వెంట రా మహా నందముతో నయోధ్య ప్రవేశించి ప్రజలఁ గన్నబిడ్డలవలెఁ బాలింపఁ దొడఁగెను. సూర్యుఁడు భూమిపైనున్న నీటిని నిజకరములచేఁ జేకొని తిరుగ భూమిపై వర్షించునీతిని, దిలీపుఁడును బ్రజలనుండి పన్నులఁ దీసికొని తిరుగ వారిక్షేమమునకే వినియోగించుచున్నవాఁడు. మఱియు విద్యాశాలలను, వైద్యాలయములను, రక్షకనిలయములను, నెలకొల్పి ప్రజలకు విద్యాధనమును, ఆరోగ్యభాగ్యమును, సంరక్షణసుఖమును, సమకూర్చుచున్నవాఁడు. ఆతని పాలనమున సంసారులు సంతతికిఁ దలిదండ్రులమని చెప్పుకొనుట తప్ప మిగత భారములతో వారికి నిమిత్తములేదు. ఆ బాధ్యతలన్నియు నానృపుఁడే వహించుచున్నవాఁడు. సూర్యమండలమునఁ దిమిరమునకుఁ దావులేనిపోటుల దిలీపరాజ్యమున నవినీతికిఁ జోటులేదు. అసమానధీశాలియగు నారాణ్మౌళి చతుస్సముద్రముద్రితమగు ధరామండలమునంతను నొక చిన్నపురమునువలె ననాయాసముగాఁ బాలింపఁదొడఁగెను

ఇటుల నా రాజేంద్రుఁడు కేవల రాజ్యపాలనముననే కాలము గడుపక సమయోచితముగ సుదక్షిణాన్వితము లగు యజ్ఞయాగాదులం గూడ సుదక్షిణాసహితుఁడై నెఱపుచుండెను దిలీపునికీర్తి త్రిలోకముల వ్యాపించి ప్రకాశింపఁదొడఁగెను. సురేంద్రుఁడొకనాఁడు రాక్షసబాధానివారణమునకు, ఆ నరేంద్రుని సాహాయ్య మపేక్షింప నాతఁడు రాజ్యభారము మంత్రులపైనిడి, అంతఃపురమునకేగి నిజకాన్తతో "నే వచ్చువఱకు నతిథిపూజాదిసత్కార్యముల నేమఱక సాగించుచుండుము." అని తెలిపి దివ్యవిమానారూఢుఁడై దివికి వెడలిపోయెను.

---

## ద్వి తీ యా ధ్యా య ము.

### —: భరద్వాజాగమనము :—

సుదక్షిణయు నిజపతియానఁ దలనుదాల్చి సద్వ్రతాచరణ తత్పరయై యుండెను. అంతనొకనాఁడు భరద్వాజమునీంద్రుఁడు శిష్యసహితముగా సుదక్షిణామందిరమునకు రాఁగా, ఆరాజమహిషి వినయభయ

భక్తులుమీఱ నమస్కరించి, అర్ఘ్యపాద్యాదులచే నర్చించి ఘటితాంజలి పుటయై నిలువ, ఆ మునిసింహుఁడు వినయ భాసురములగు నా సాధ్వి సపర్యలకు నానందించి దీవించి తన కా పూఁట యాతిథ్య మొసంగు మని తెలిపెను. ఆయిల్లాలు నపరిమితానందముతో నిట్లుపలికెను.

సుదక్షిణ:—సంయమీంద్రా! నే మున్ను చేసికొన్న పున్నె మే దియో నేఁడుమిమ్ము శిష్యసహితముగా నిటకుఁగొని తెచ్చినది. లేకున్న రజోగుణదోషదూషితములగు రాజమందిరము లేడ ? సత్త్వగుణ భాసు రములగు భూసురమానసము లేడ ? అని మునివరునకు విందు సేయ సంకల్పించెను. భరద్వాజుఁడును సరయూనదికేగి స్నానాదులఁ దీర్చికొని శిష్యులు వేదగానము చేయుచు వెంటరాఁ దిన్నగా సుదక్షిణామందిర మునకు వచ్చెను. అంత సుదక్షిణ గురుశిష్యుల నుచితాసనములపైఁ గూర్చుండఁ బ్రార్థించిమొక్కసారి షడ్రసాన్నపూరితములగుబంగరుపళ్లె రముల వారిముంగుంచి కాంచనకలశము చేఁబూని యామునికరోదక మీయరాఁగా కళావిదుఁడగు నాభరద్వాజుఁడు, అస్తోకానందముతోఁ దనయెదుట నిలిచియున్న యాసతీమణిముఖారవిందమును బరికించి చూచి, యాపె సంతతిహీనయగుటను గుర్తించి, యిట్లు పలికెను.

భరద్వాజుఁడు:—సాధ్వీమణీ! నేను సంతానహీనుల యింట భుజింపను. ఇది నా వ్రతము కావున వేఱుతలఁపక నేఁబోవుటకనుమతింపుము. అని పీఁటనుండి లేచి నిలిచియున్న భరద్వాజునిఁజూచి, యాసాధ్వి నిశ్చేష్ట యై క్షణమూరకుండి, చేతనున్న కాంచనపాత్రమును గ్రింద నునిచి చేతులు జోడించి యిట్టుల బ్రార్థించెను

సుదక్షిణ:—ఓ యుదారచరితా ! ఇట్లు సిద్ధాన్నములఁ బరిత్య జించి, వెడలిపోవుట మీయట్టి కృపాళురకు న్యాయముకాదు. ఓశాంత స్వరూపా! నాపైఁగరుణించి నన్నీ పరాభవమునుండి కాపాడుఁడు. ముని చంద్రా! నేఁజేయు నుపచారములలో నేదియేని లోపమున్న నేనుసవరిం పఁగలను. ఇఁక సంతానసంపదయో పరమేశ్వర కటాక్షసాధ్యముకాని, మానవప్రయత్నసంపాద్యము కాదుకదా ! కావున దైవిక మగు లోప మునకు దుహితృసమాననగు నన్నవమానింపఁదగునా.?

మఱియు నే దిలీపసార్వభౌమునిచే నతిథిసత్కారమున నియమిత నైయున్నదానను, మీరట్లు నా సపర్యలఁ జేకొనక వెడలిపోయినవార్త నాథర్త చెవిసోఁకినచో నా నృపవరేణ్యుఁడు దుఃఖితుఁడౌటయేకాక న న్నతిథిపూజావిముఖనుగా భావించి కోసలమునుండి వెడలనంపును. కోస లరాజుల కతిథిపూజ యత్యంతాదరణీయముకదా! కావున నో మునికుల తిలకా! నాయందు వాత్సల్యముంచి భక్తిపూర్వకముగా దత్తమైన యీ భక్తమును భుజియింపఁ బ్రార్థించుచున్నదానను."

భరద్వాజుఁడు:—ఓ సాధ్వీమణీ! పరలోకసాధనమగు వ్రత మును విడువజాలను. తల్లీ! నీపై నా కెట్టియాగ్రహమును లేదు. అమ్మా! దిలీపుఁడు నీపైఁగోపింపఁడు. కోసలరాజులు, అనాలోచితముగాఁ గార్య ముల నాచరింపరు. పుత్రీ! నీ కచిరకాలములోనే సురేంద్రుని జయింప సమర్థుఁడగు నందనుఁ డుదయింపఁగలఁడు. నీ కీలోకమునఁ గీర్తియేకాని యపకీర్తిరానేరదు." అని యోదార్చి వెడలిపోయెను.

అంత దిలీపుఁడు స్వర్గమునుండి పత్నీసందర్శనాపేక్షచే, అయో ధ్యకేతెంచెను. "కుటుంబికి నిజదారను వీడి స్వర్గమున నుండుటకూడ రుచింపదుకదా! దిలీపుఁడు వచ్చినవెంటనే యంతఃపురమున కేగసుదక్షిణ పతిపాదములకు నమస్కరించి యుచితాసనాసీనునిగాఁ జేసి చెంత నిలిచి చామరమును జేఁబూని శిరమువంచి వీవసాగెను అతఁ డామెనుఁజూచి "ప్రాణేశ్వరీ! ఇదియేల నీవదనారవింద మిట్లువాడియున్నది? మంత్రులె వరైన నీయాజ్ఞల నుల్లంఘించిరా? లేక సేవకు లెవరేని నపరాధములఁ జేసియుండిరా? అటుగాక వ్యాధియేదియేని భాధించుచున్నదియా? నా యెడఁబాటే నీకిటుల నలసటనుగల్గించెనా? కాంతామణీ! నిన్నుఁ బాస విధిలేక దేవకార్యమగుటచే స్వర్గమున నొంటరిగ నుంటినేకాని యచటి దివ్యవైభవములు నాకెంతమాత్రమును రుచింపవాయె"

సుదక్షిణ:—ప్రాణవల్లభా! అద్వితీయపరాక్రమభాసితు లగు భానుకులసార్వభౌములఁజేఁపట్టిన కాంతామణులకుఁ బరాభవము లెట్లు గలుగఁగలవు? మఱియు నాకెట్టివ్యాధియు లేదు. కాని యొక్కమానసిక వ్యాకులము మాత్రము నన్నుగాసిపెట్ట మొదలిడినది. జీవితేశా! మన

కిపుడెంతసిరి యున్నను, మరెంతటి రాజ్యమున్నను, నిష్ఫల మని తెలిసి కొనుఁడు. మనకు సంసారులు ముఖ్యముగాఁ బొందఁదగిన యానందము కానవచ్చుటలేదు. మహారాజా! సంతానము లేనివారిసంపదలు, అడవి గాచిన వెన్నెలలవలె నిరర్థకములు.

ప్రియవల్లభా! లలితమోహనము లగు నిజశిశురోదనముల వినఁ గుతూహలపడుచున్న నాపీనుల కిప్పుడు వీణావేణునాదములు రుచింపకు న్నయవి. స్వసుతముఖచంద్రలావణ్యావలోకనలోలము లగు నా నయ నములకుఁ బ్రకృతిరామణీయకము వెగటగుచున్నది. ఆహా! పసిబిడ్డల బోసినోటి లేనగవులఁబరికించియలరుటకును, చిన్నపాపల ముద్దుపలుకుల విని మురియుటకును, కాన్తలెంతటి నోములు నోఁచియుందురో! హృద యేశా! నేనిఁక సంతానహీననై మనఁజాల"నని భరద్వాజాగమనవృత్తాం తమును దెలిపి, కంటఁగన్నీరొలుకఁ బతిపాదములపైఁ బడెను.

దిలీపుఁడు:—"ఆహా! రాజ్యపాలనమునందును, క్రతువిధానముల యందును, సురసాహాయ్యమునందును,ముగ్నుఁడనైయుంటినేగాని సంతో షజనకమగు సంతానములేదని, తెలియనైతిని. నిజమే! ఈ సతీమణి తెలి పినట్లు సుతవిరహితుల సిరులు సువాసనలేని సుమముల ట్లామోదజనక ములు కాఁజాలవు. ప్రేయసీ! లెమ్ము. త్రికాలవేదియు నఘటనఘటనా సమర్థుఁడును నగు వసిష్ఠభగవానుఁడు మనకులగురుఁడై యుండ సంతాన ములేదని మనము సంతాపము చెందఁదగదు. ఆతపోనిధి మనమనోరథ మీడేర్పఁగలఁడు. కావున నెల్లియె మన మా మునితల్లజునిపల్లెకుఁబోయి సంతాపమును దీర్చుకొందము" అని యోదార్చి మంత్రులరాఁ బిలిపించి "మంత్రిపుంగవులారా! మేము కృతార్థులమై వచ్చువఱకుఁ బ్రజలఁ జక్కఁగఁ బాలింపుఁడు."అని పరిపాలకశక్తుల వారికొసంగి, స్యందనారూ ఢుఁడై భార్యతోఁగలసి వసిష్ఠాశ్రమమునకు వెడలిపోయెను.

దిలీపుఁడట్లు బైలువెడలి, సంతతిలేదని వాపోవుచున్న నిజకాం తకుఁ గాంతారమార్గమున నిసర్గసుందరములగు నగోపగాదుల రమ్య తను జూపుచు నానాఁటిసాయంకాలమున కాతఁడువసిష్ఠాశ్రమముం జేరి రథమునుండి భార్యాసహితముగ దిగి కాలినడకను నామునికుటీరమున

కేగుచు, ఒకచో నివరిధాన్యములకై యుటజద్వారముల కడ్డముగా నిలిచి బిడ్డలవలె మునిభార్యల నిరోధించుచున్న బాలహరిణములఁ బరికించుచు, వేఱొకచోట నెండ ప్రోవుటచేఁ బోగుచేయబడియున్న ధాన్యరాసుల ప్రక్కను పరుండి, వనమునఁ గొఱికిన గఱికిపోఁచల నెమ్మదిగా నెమరు వేయుచున్న గోగణములఁ జూచుచు, మఱియొకచోటఁ బువ్వులఁగోయు చున్న మునికన్నియల చెంత వ్రాలి, పాదులలోని నీటిని ద్రాగుచున్న విహగసంతతుల నవలోకించుచు, వేఱొండుతావున వృక్షచ్ఛాయను గూర్చుండి, సామగానము సేయుచు సమిధల విఱుచుచున్న విద్యార్థుల దర్శించుచుఁ, దిన్నగా నిజగురుని పర్ణశాల కేగి, దిలీపుఁడు పత్నీసహితుఁడై అరుంధతీవసిష్ఠుల పాదారవిందములకు వందన మొనర్చెను. అపుడు ఆ మునీంద్రుఁ డిట్లు ప్రశ్నించెను.

వసిష్ఠుఁడు:—దిలీపరాజేంద్రా! కోసలప్రజలఁ జక్కఁగఁ బాలించుచుంటివా? ఇపుడు నీవిటకు నీరాణితో రాఁగారణమేమి?

దిలీపుఁడు:—మునిచంద్రా! మీరు మాయోగక్షేమములఁ గనుఁగొనుచుండ మాపరిపాలనము సంపన్నము కాకుండు టెట్లు? కాని తాపసేంద్రా! గుణవతి యగు నీ మీకోడలు సంతతి లేని కారణమున సంత చెందుచుండుటచే రాజ్యాదివైభవములు నా కంతగా సంతసమును గూర్పఁజాలకున్నయవి. జ్ఞాననిధీ! దిగ్విజయ మొనర్చి తాఁ దెచ్చిన పారితోషికముల వినయముతో నాకుఁ జూపుచున్న పుత్రుని గాఢాలింగనముఁ జేసికొని, నాభుజములపై నున్న రాజ్యభారమును నా తనయుని బాహువులపై నుంచి, వానప్రస్థమున కేగు భాగ్యము నాకుఁ గలుగ నేరదని తోఁచుచున్నది.

అయ్యో! నాపితరులు సంతానహీనుఁడ నగు నే నొసంగుచున్న తిలోదకముల నాయనంతరము తమకుఁ బిండదాన మొనర్పు భాగ్యశాలి యుండఁడుకదా! అను విచారముతోఁ జేకొనుచున్నవారు కాఁబోలు? ఆహా! ఇంతదనుక జగత్ప్రసిద్ధులగు సార్వభౌములఁ గని వన్నె కెక్కిన యినకుల మింతటితో సమాప్తమొందునని తోఁచుచున్నది.

గురూత్తమా! దానయజ్ఞాదులవలనఁ గలుగు సుఖము లోకాంతరములఁ బొందఁ దగినది కాని యిహలోకమునఁ జెందఁదగినది కాదు. ఇఁక సంతానసౌఖ్యమో యుభయలోక తారకమై వెలయుచున్నయది. కావున నట్టి సంతతిలేక నవయుచున్న మాపైఁ గరుణించి, మాకు మన శ్శాంతినిఁ గలిగింపవలయును. కాని యిట్లుపేక్షింపఁజనదు. భానువంశ సంపదలు మీహస్తగతములై యున్నయవి.

సుదక్షిణ:—దేశికేంద్రా! నన్ను బిడ్డలు లేని గొడ్రాలినిగాఁ జేయక సంతానమునుగన్న యిల్లాలినిగాఁజేయఁ బ్రార్థించుచున్న దానను. తనయులఁ గననితరుణి ఫలములఁగాయని తరువువలె వ్యర్థజీవితయగును. వంధ్యయని పేర్కొనఁబడును. అరుంధతీరమణా! నాకుఁ బుత్రభిక్ష యొసఁగి నాజీవితసుమమును సుతామోదభరితమునుగాఁ జేయుఁడు.” అని కంటనీరువెట్టుచు గురుపద సరసిజములపైఁబడి విలపింపఁదొడఁగెను.

అంత నామునిదంపతులు, ఆరాజదంపతుల దీనావస్థకు జాలి నొందిరి. అపు డరుంధతి యిట్లుపలికెను.

అరుంధతి:—సాధ్వీమణీ! నిజమే. నీవనినట్లు కులకాంతల స్వాంతములు సంతానకాంక్షాకలుషితములైనచో సర్వముఁ దాఱుమాఱుగాఁ గాననగును. దిలీపపత్నీ! లెమ్ము. విచారింపకుము. మీగురువరులు మీ మనోరథ మీడేర్తురు! అనిన వసిష్ఠుఁడును యోగదృష్టితో వారి కంత వఱకు సంతతి కలుగకుండుటకుఁ గారణముఁ గనుఁగొని, యిట్లుపలికెను. “ధర్మశీలుఁడా! దిలీపనృపేంద్రుఁడా! మున్ను నీ వొకతఱి త్రిదివమున కేగి, యటఁగొంతకాలముండి,సుదక్షిణాసమాగమాభిలాషివై,యతిత్వరితముగా నయోధ్యకేగుచు మార్గమధ్యమున నొక కల్పవృక్షచ్ఛాయను నిలిచియున్న కామధేనువును గుర్తింపవయితివి. అపు డాదివ్య ధేనువు “నన్నిట్లు నిర్లక్ష్యముచేసిన యీరాజునకు నాసంతానము నారాధించు వఱకు సంతతి లేకుండుగావుత”మని శపించినది. ఆకాశగంగాతరంగధ్వానములమధ్య నీవుకాని నీ సారథికాని యా శాపోక్తుల నాలింపరైతిరి. ఆకారణముచే నీకు సంతానముకలుగుట కాతంకమేర్పడినది. పూజ్యులఁ బూజింపకుండుటచే శ్రేయఃప్రతిబంధక మేర్పడును.

కాని రాజేంద్రా! నీవు భయపడ నగత్యము లేదు. ప్రస్తుతమా కామధేనునందిని మా యాశ్రమమున నున్నయది. దాని నారాధించి నచో నీవు శాపముక్తుఁడవై సంతతినిఁ బడయఁగలవు." అని శ్రుతిసుఖదమగు సువార్తను దెలిపెను.

దిలీపుఁడు:—మునిసార్వభౌమా! ఆనందినీధేనువును మే మెట్లారాధింపవలయునో యుపదేశింపఁ గోరుచున్నాఁడను, అని పలుకుచుండ వనమధ్యమునుండి నందినీధేనువు వారికడకు వచ్చి నిలిచెను. వసిష్ఠుఁడు, ఆ సురభినిఁ జూచి, "దిలీపరాజమౌళీ! నీమనోరథ మీడేఱినట్లేతలంపుము. ఏమందువా! మన మీ కల్యాణిపే రుచ్చరించుచుండఁగనే యమోఘమగు కార్యసిద్ధివలెఁ గట్టెనుటికి వచ్చినది. ఇట్లు వచ్చుట శుభసూచకము" అని పలికి నందినీసమారాధనమార్గము నుపదేశించి దీవించెను.

దిలీపుఁడు గురూపదిష్టరీతిని బత్నీసహితుఁడై గో సమారాధన వ్రతమునుఁ జేయఁ దొడఁగెను. ఇట్లామహారాజు పసులకాపరివలె గోసేవ చేయుచు నిరువదియొక్క దివసములు గడపెను. ఇరువది రెండవనాఁడు, ఆభూపాలుఁడు పూర్వపురీతిని నందినివెంట నేగ నాగోవు మార్గాంతరమునఁ బోయి, భారతరాజ్యరమామస్తకమున వెలయు నవరత్నకిరీటమట్లు నిజశిఖరకాంతులచేఁ దేజరిల్లుచున్న హిమగిరిదరి పార్శ్వమున కేగి సంచరింపసాగెను నందినివెంట నేగు దిలీపుఁడును మనోహరమగు హిమాలయసౌందర్యమును, అత్యాసక్తితోఁ జూచుచుఁ గొంచె మేమఱియుండ, నామంచుకొండ గుహలోనుండి యొక సింగము వచ్చి, ఆనందినిపైఁ బడెను. అపు డాధేనువు బర్వతకందరములు ప్రతిధ్వనించునటులు 'అంభా' యని యఱచెను. ఆ ధ్వనిని దిలీపుఁడు విని త్రుళ్ళిపడి, చూడ నందిని యొక సింహముక్రిందఁ బడియుండెను. వెంటనే, ఆరాజసింహుఁడు గోసమీపమున కేగి, నేలపైఁబడి కదలనేరక తనవైపు దీనముగాఁ జూచుచున్న మొదవుపై జాలియు, గోవుపైఁ బడియున్న సింగముపైఁ గినుకయు, నిజమానసవీథిని బర్యాయములుగాఁ బఱవ, "ఆహా! గురుద్రోహిని, గోహంతకుఁడనుగూడ నైతినిగదా"యని విచారించి,వెంటనేవింటబాణమును సంధింపనెంచి, కరమును తూణీరము

పైకిఁబోనిచ్చి యమ్మునందుకొనఁబోవ నాకర మటుఁగదలక నిలిచిపోయెను. అందుచే నాతఁడు చిత్రగతప్రతిమవలె నిశ్చేష్టుఁడై యుండ సింహము చిఱునగవుతో నిట్లు పలికెను.

సింహము:—మహీపాలా! ఇషుసంధానమునకై వృథాగా నేల శ్రమపడియెదవు? నాపై నీవు శరమును వదలినను బ్రయోజనము లేదు. పాదపములఁ బడవేయు గాలిబలిమి, కొండలఁ గూలఁద్రోయఁగలుగునా? రాజా! నన్నొక సామాన్యవనమృగమునుగా భావింపకుము. వినుము నాయుదంతమును:—

పార్వతీపతికింకరులలో నే నొక్కరుఁడ. నాపేరు కుంభోదరుఁడు. అదిగో! నీముందు మిన్నంటఁగోరుచున్నట్లున్నతముగాఁ బెరిఁగియున్న దేవదారుమహీరుహమును గనుఁగొనుము. మున్నీపాదపమును బార్వతి బంగారుకుండలతో స్వయముగా నీరుపోసి పెంచినది. అందుచే దీని నా దేవదేవుఁడు పుత్రసమముగాఁ జూచుచున్నవాఁడు. ఒకప్పుడు వనమత్తేభములు గండముల తీటదీర్చుకొనుటకు దీనిమొదటిపై రాచు దీనిబెరడూడిపోయెను. అది చూచి పార్వతి విచారింప, శంకరుఁడు నన్ను సింహమునుగాఁ జేసి వనవారణముల నివారించి దీనిఁ గాపాడుచుండు మని నాకాజ్ఞాపించెను.

అది మొదలు నేనీమంచుమలకోనలోఁ దిరుగుచు నాఁకలిగొనినపుడు కంటఁబడిన మెకములఁజంపి మెసఁగుచు నాయుక్కుంటి యానవొప్పున నీమ్రానును కారేనుఁగుల బారినుండి కాపాడుచున్నవాఁడను.

కావునఁ బరమేశ్వరకటాక్షరక్షితుఁడ నగు నన్ను నీవు సంహరింపఁజాలవు. ఆఁకలిగొనియున్న నా కీగోవు నాహారముగా దొసంగి వెడలిపొమ్ము. అతిమానుషశక్తుల సంహరింప నేరమి మానవవీరులకు నవమానహేతువు కానేరదు.

దిలీపుఁడు:—ఓ దివ్యమృగరాజమా! పరమేశ్వరసదృశుఁ డగు నాపరమేష్ఠినందనుఁడు నా కెంతయుఁ బూజ్యుఁడు ఆతపోధనున కీగోవు ప్రాణాధికమగు ధనము. అందుచే నేనీగోవును విడిపోఁజాలను. కావున నీవు నన్ను భుజియించి యీగిడ్డిని వదలుము.

సింహము:—అయ్యయ్యో! ఇదేటికోరిక! ఏకాతపత్రశోభిత మగు నఖండసామ్రాజ్యసంపద యేడ? గడ్డిగాదముం దిని బ్రతుకు నీ గోడ్డేడ? ఓ వెడంగుఱేఁడా! నిన్నుఁజూడ నేర్పరివిగాఁ దెలియవచ్చుట లేదు. నిజముగా నీకుఁ బ్రాణిసంరక్షణాపేక్షయే యున్నచో, నొక్కయావుం బెయ్యకై యసువుల విడువక, దీనినాకొసంగి, రాజరాజ వగుటనే బహుజనులం దండింపవలెఁ గాపాడుము. ఇట్టి గోసహస్రముల నొసంగఁజాలిన నీపై నీగురుఁడును గోపింపఁడు. ఇటులఁ జేసినచో గోభక్షణముచే నేనును, సహస్రాధికగోలాభముచే వసిష్ఠుఁడును, బ్రజాపరిపాలనముచే నీవును సంతృప్తులము కావచ్చును.

దిలీపుఁడు:—ఓశివానుచరుఁడా! క్షతిత్రియుఁడన నార్తులఁగాపాడువాఁడని, యర్థము ప్రసిద్ధమైయున్నది. అట్టిసార్థకమగు క్షత్రియకులమున, నందును నుత్తమక్షత్రియులని, ప్రతిభఁగాంచిన భాస్కరాన్వయసంజాతులనడుమ, జనించిన నేను క్షత్రియపదార్థమును నిలుపఁజాలనినాఁడు నాకీరాజ్యాది వసువులతోఁ బని యేమి? లోకనిందామలీమసము లగు వసువులతోఁ బ్రయోజన మేమి? మఱియు సోదరుఁడా! ఈగోవును సామాన్యమగు నావునుగాఁదలంపకుము. ఇద్దానినిసకలకామదయగు కామధేనునందినినిగాఁ దెలిసికొనుము. మిత్రమా! నీవన్నయట్లు గడ్డిగాదములఁ దిని జీవించు నీపాఁడియావునుఁ గాపాడి మధురాన్నములమెక్కు నన్నుఁ దిని, నీయాఁకలి దీర్చికొనుము.

ఓ ప్రమథవరేణ్యా! దైవసము లగు గురువులచే గోసంరక్షణార్థము నియమింపఁబడిన నేను దానినిఁగాపాడనేరక విడిచినచో నెట్టిదోహీనగుదునో, యెంతటిపాపినగుదునో యీవృక్షసంరక్షణార్థము త్రినేత్రునిచే నియుక్తుఁడవైన నీకు నేవేఱుగాఁ దెలుపవలయునా? ఘనాశయా! ఆర్తుఁడనగు నాపైనీకు సౌహార్దమున్నచో నాయీ యనిత్యదేహమునుం జేకొని శాశ్వత మగు నాకీర్తికాయమునుఁ గాపాడుము. దినకరకుల సంభవులు నిజకీర్తిసంరక్షణమునకై ప్రాణముల నైన విడుతురు కాని, బుద్బుదతుల్యములగు జీవితములకై కీర్తిసంపదను బోఁగొట్టుకొనరు.

సింహము:—"మానధనా ! నిజముగా నీవు గోవును సంరక్షింపఁదలఁచితివో వెంటనే నీదేహమును నాకాహారముగా నొసఁగుము." అన దిలీపుఁ డాపలుకుల విన్నతోడనే "ధన్యోస్మి"అని సింహమునకు ముందు సాష్టాంగముగాఁబడెను. అంత "వత్సా! లెమ్ము. ధన్యుఁడ వైతివి" అని యమృతోపమాన మగు నాదమువినరా నారాజులేచి చూచునసరికి పాలు గారుచున్న పొదుగుతో, నక్షత మగు దేహసంపదతో, యథాప్రీతిగా ఘాసమును మేయుచున్న గోవు కానవచ్చెను. సింహము మాత్రము కానరాదయ్యెను. అపుఁడు దిలీపుఁడు విస్మితుఁడై యానందినీధేనువునకు నమస్కరించి నిలువ నాగో విట్లుపలికెను.

గోవు:—రాజచంద్రా! నీధైర్యమును, నీశీలమును, బరీక్షింపఁదలఁచి యిట్లొక మాయసింహమునుఁ గల్పించితిని. నిజముగా నాపై మృగేంద్ర మెద్దియుఁ బడియుండలేదు. వసిష్ఠప్రభావసంరక్షిత నగు నన్నుఁ జంప నెవరికిఁ దరమగును? ఘనాశయా ! గురువులయెడ నీవుఁ జూపిన యవ్యాజభక్తికిని, నాపైఁగనుపఱిచిన ఘనగౌరవమునకును నేనెంతయు సంతసమందితిని. కావున, పుత్రా! కావలసినవరములం గోరుకొనుము.

దిలీపుఁ డాదివ్యగోభాషితము విన్నతోడనే, పులకితగాత్రుఁడై, చేతులుజోడించి, ఇట్లుపలికెను. "ఓ నందినీమాతా ! నీసేవకురా లగు సుదక్షిణాగర్భమున సుగుణాలవాలుఁడగు సుతుఁ డుద్భవముందునట్లనుగ్రహింపుము, ఈలోకమున నేఁగోరుభాగ్య మియ్యదియే.

నందిని:—కుమారా! నీయభీష్టమీడేరును. ఇఁకమనమిట జాగు సేయఁజనదు. నాపాలకై యాతాపసేంద్రుఁడు కనిపెట్టికొనియుండును రమ్ము. పర్ణశాల కేగుదము అని సంతోషిత స్వాంతుఁడగు దిలీపుఁడు వెంటరాఁగా నాసురభి మునిపల్లియ కేగెను.

ఆభూకాంతుఁడు నటకేగి యరుంధతీ వసిష్ఠులకు నమస్కరించి, సంతోషముతో నందినీధేనువుయొక్క యనుగ్రహోక్తులఁ దెలియఁజేసి, పిమ్మటఁ గాననమున జరిగినగాథను వివరించెను. అపుడచ్చటనున్న సుదక్షిణాదేవి ఆసువార్తను విన్నతోడనే బిడ్డనుగన్నతల్లివలె నుప్పొంగెను,

వసిష్ఠుఁ డామాటలనువిని, సంతసించి నందినీధేనుక్షీరముల దిలీపునకు నొసంగి, పానమొనర్పుమన నాతఁడాపాలను గన్నులకద్దుకొని క్రోలెను.

దిలీపుఁ డారాత్రి నిజపత్నితో నట నివసించి తెల్లవాఱినతోడనే యరుంధతీవసిష్ఠులకును, సవత్సయగు నందినీధేనువునకును బ్రదక్షిణ నమస్కారములొనర్చి వారిదీవనలనందుకొని, పరమానందముతో స్యందనారూఢుఁడై పత్నితో సాకేతమునకు వెడలిపోయెను.

## —♦ తృతీయాధ్యాయము ♦—

### రఘుజననము.

దిలీపమహారాజు కృతార్థుఁడై రాణితోఁగూడి సంతోషముగా నయోధ్యకేగుచున్నాఁడను సువార్త కోసలరాజ్యమంతటను వ్యాపించెను. అందుచేఁ బ్రజలెల్లరును మహానందముతో మహారాజసందర్శనమున కెదురుచూచుచుండిరి. దిలీపుఁడు వసిష్ఠాశ్రమమునుండి సాకేతమునకేగుచు దారిలో ఘోషములయందలి పెద్దగొల్లలు సమర్పించు నచ్చావునేతిని నాదరపూర్వకముగాఁ జేకొనుచు, అగ్రహారములయందలి సోమయాజులుచేతులెత్తిచేయు, నాశీర్వచనముల నమస్కారపూర్వకముగాఁ బరిగ్రహించుచు, నగరములయందలి సంస్థానాధిపతులొసంగు పారితోషికముల గౌరవపూర్వకముగా నందుకొనుచుఁ గోసలమున కేగెను.

చంద్రనిరాకరుఁ జకోరములు నిరీక్షించునటుల రాజచంద్రుని యాగమనమునకుఁ బ్రజలు ప్రతీక్షించుచుండిరి. కావుననే సాకేతవాసులు తమయేలిక రాకనుదెలిసికొని మంత్రులముందిడుకొని యారాజదంపతుల కెదు రేగి ఘనమర్యాదలతో స్వాగత మొసంగి కోటలోనికిఁదోడ్కొని వచ్చిరి. దిలీపుఁడును వారినందఱను నాదరపూర్వకముగాఁ గుశలమడిగి, సుతప్రాప్తిసువార్తను దెలిపి, యానందింపఁజేసెను. పౌరులాశుభవార్త నువిని సంతసించి యిట్లుపలికిరి.

పౌరులు:—దిలీపసార్వభౌమా! నేఁడు మాకిదియొక గొప్పమహోత్సవదివసము. ఏమందురా? ఏప్రభువులు ప్రజాసంరక్షణమే నిజజీవితఫలముగానెంతురో, ఏక్షత్రియులు పరప్రాణరక్షణార్థము తమజీవితములధారవోయుదురో, ఏనృపాలురు దానములకే ధనములనార్జింతురో,

ఏరాజశేఖరు లేకపత్నీవ్రత నిష్ఠాగరిష్ఠులో, ఏసామ్రాట్టులు సకలకళా ప్రవీణులయ్యు మితభాషణులో, భూలోకమునుండి దేవలోకమువఱకును గోపుమార్గము పొడవునను నేచక్రవర్తులచేఁ బ్రతిష్ఠింపఁబడియున్న యున్నతజయస్తంభములపై "సత్యము పలుకుము, ధర్మమాచరింపుము, పెద్దలఁ బూజింపుము, భగవంతుని మఱవకుము." మొదలగు విధివాక్యములును, "అసత్య మాడరాదు, పరదారలఁ బరికింపరాదు, ప్రాణుల హింసింపరాదు" లోనగు నిషేధవచనములును సువర్ణాక్షరములతోఁ జెక్కఁబడియున్నవియో యట్టి భువనత్రయ ప్రసిద్ధు లగు రవికులసార్వభౌముల పరిపాలనాభాగ్యము, ఏలినవారితో నంతరించునేమో! యను భయము నేఁడు తీఱినది. మామనోరథమీడేఱినది. రాజేంద్రా! సూర్యవంశపరిపాలన సౌఖ్యమును గోసలవాసులెఱుంగుదురుకాని, వారిఁబరిపాలించు సార్వభౌము లెఱుంగరు. మహీరుహశీతలచ్ఛాయాసౌఖ్యము పాంథులకుఁ దెలియునుగాని పాదపములకుఁ దెలియరాదుకదా!

దిలీపుఁడు:—సోదరులారా! నిష్కళంక ప్రేమమున నిట్టిదియు. లోకమున రాజులు కీర్తివిరాజితు లగుటకుఁ బ్రధానహేతువు, ప్రజలు సహృదయులై యుండుటయే. అటుగాక వారు కపటవర్తనులైనచోఁ బాలకుఁ డెంతటి రాజనీతికోవిదుఁడైనను మఱెంతటిదయామయుఁడైనను, ప్రజారంజకుఁడుకానేరఁడు, చౌటినేలలఁ జల్లఁబడు విత్తనములెంతటి ఫలప్రదములయ్యును, జక్కఁగాఫలముల నియ్యఁజాలవుకదా! సస్యోత్పత్తికి సుక్షేత్రమెంతముఖ్యమో, పాలకఫలప్రాప్తికి సుప్రజాసంపత్తియు నంతముఖ్యమే యనిపలుకపురజనులామృదుమధురోక్తులవిని, "భూపాలసనునకు దినమణికులభూషణులేతగుదురు" అనియానందపరవశులైరి. సత్యమే. సరసిజములు లక్ష్మీవిలసితములై యామోదవంతములగుటకుఁగారణము కాసారవారిపూరము; ప్రజలు సంపన్నులై యానందభరితు లగుటకుఁ గారణము ప్రభుప్రేమరసవారము.

అంతఁ గొంతకాలమునకు నాదిలీపకాంత ప్రాచీదిగ్రీతిని, ప్రభాకరునిఁగన్నయటులు, దివ్యకళాశోభితుఁడగు సుతునిఁగనియెను. దిలీపుఁడా సువార్తవిన్నవెంటనే వసిష్ఠునిఁదోడ్కొనివచ్చి, జాతకర్మాది సంస్కార

ములఁ జేయించి, యాబాలునకు "రఘువు" అని నామకరణ మొనర్చెను. ఇట్లా బాలుఁడు బాలక్రీడలచేఁ దలిదండ్రుల నానందింపఁజేయుచు నల్లారుముద్దుగాఁ బెరుఁగుచుండెను దిలీపుఁడు రఘువునకుఁ బ్రాఁడవ యేఁట నుపనయన మొనర్చి వసిష్ఠునికడకు విద్యాభ్యాసమునకై పంపెను.

అచిరకాలములోనే రఘువు గురుకులమున సకలవిద్యల నభ్యసించి యయోధ్యకేతెంచి యసమానశస్త్రవిద్యాపారంగతుఁ డగు దిలీపునికడ సమస్తశస్త్రాస్త్రములఁ దెలిసికొని, శౌర్యయౌవనము లంగరక్షకులవలెఁ జెన్నార సకలకళాపరిపూర్ణుఁడై వెలయుచుండెను.

దిలీపుఁడు సర్వసమర్థుఁ డగు తనయుని గాంచి సంతసించి తాను ముగింపవలసియున్న నూఱవజన్నమును బూర్తిచేయఁదలఁచి నిజనందనుని నశ్వరక్షకునిగా నియమించి యజ్ఞతురగమును విడిచెను. అంత రఘువు రాజకుమారసైన్యసమేతుఁడై యాయాగతురంగమును గాపాడుచు నిరాటంకముగా నేఁగుచుండెను. అది తెలిసికొని దేవేంద్రుఁడు స్వారాజ్యచ్యుతిభీతుఁడై యదృశ్యముగా నాగుఱ్ఱమును గొనిపోయెను. తురగసంరక్షకులగు సైనికులు దానిని గాననేరక రఘువునకు నివేదించిరి.

ఆరాజనందనుఁడు హయ మెటు పోయినదియుఁ దెలియనేరక ఖిన్నుఁడైయుండఁ గట్టెదుటఁ గామధేనునందిని గానవచ్చెను, అపు డాతఁడు దానికిఁ బ్రదక్షిణనమస్కారము లొనర్చి ప్రార్థింప దయాస్వభావయగు నాసురభితనయ దిలీపనందనునకు దివ్యదృష్టి నొసంగి, గుఱ్ఱమును గొనిపోవుచున్న శతమఖుని దృగ్గోచరునిగాఁ జేసెను. రఘువు సైంధవమును స్యందనమునకుఁ గట్టికొనిపోవుచున్న సహస్రాక్షునీక్షించి, యిట్లు పలికెను.

రఘు:—సురేంద్రా! యజ్ఞభాగములఁ జేకొనువారలలో నీవ యగ్రగణ్యుఁడవు. మఱియు మఖధ్వంసకుల శాసించుటలో నసమానశూరుఁడవు. అట్టి ధర్మరక్షకుఁడవగు నీవే క్రతువిఘ్నకర్త వగుట పాడి గాదు. ధర్మపథముల సంచరింపవలసినవాఁడు కుమార్గముల నడచుట తగవగునా?

ఇంద్రుఁడు:—దిలీపనందనా! నిజపదరక్షణాసక్తులకు ధర్మరక్షణముకంటె స్వపదపరిపాలనమే ముఖ్యము. ధర్మవీరా! నీజనకుఁడు భూలోకరాజ్యము సంతతము వశపఱుచుకొనుటయే కాక శతవాజిమేధములఁ బూర్తిచేసి, నాకలోకరాజ్యమును గూడ నాక్రమింప నభిలషించుచున్నవాఁడు. అట్టితఁని నేఁ గ్రతువిఘ్నము సేయక, స్వారాజ్యభ్రష్టుఁడనై యుండవలయునో? లేక క్రతునాశన మొనర్చి స్వస్థానము నిలువఁబెట్టుకొనవలయునో? నీవ యోజింపుము.

రఘు:—విబుధేంద్రా! చంచలములగు నాకసంపదల నాశింపవలయునో? శాశ్వతము లగు శ్రుతిమర్యాదలఁ బ్రేమింపవలయునో? మీరే యోజింపుఁడు.

ఇంద్ర:—దిలీపాత్మజా! త్రిదివసంపద లనిత్యములగుచో వాని సంపాదింప నీజనకుఁడేల యమితసుఖముల నొసఁగు శ్రమలఁ జెందుచున్నవాఁడు? పరులకు ధర్మోపదేశముచేయుట సుకరము. కాని దానినాచరించుటమాత్రము దుర్ఘటము.

రఘు:—అసురారీ! మీకు సురపదసంరక్షణమే సుఖదము. కాని, మారవికులజులకు ధర్మపథసంరక్షణమే ప్రమోదావహము.

ఇంద్ర:—కుఱ్ఱఁడా! స్థితిని మించి ప్రసంగింపక గుఱ్ఱమునువీడి సుఖముగా నింటికేగుము.

రఘు:—సురపుంగవా! యాగవాజిని మీరు విడువకున్నచో నే విడిపింపవలసివచ్చును. ప్రథమముననే నాబాణప్రయోగము పూజ్యులగు మీపైఁ జేయుటకు మనసొప్పుటలేదు. కావున మన్నించి యజ్ఞీయాశ్వమును వదలి, ధర్మమును గాపాడుఁడు.

ఇంద్రుఁడు:—రాకుమారా! సుకుమారుఁడవని నిన్ను మాటలతో మఱలింపఁ జూచితిని, కాని, నీప్రసంగము లందు కాటంకమును గలిగించుచున్నవి. కానిమ్ము. నీశస్త్రవిద్యాప్రావీణ్యమును బ్రదర్శింపుము.
రఘు వామాట విన్నతోడనే వింట నారాచమును సంధించి మింటనున్న ఇంద్రునిఱొమ్ము దూసిపోవునటుల వదలెను. దేవేంద్రుఁ డాతని బాణప్రయోగనైపుణ్యమునకు మెచ్చి, యిట్లుపలికెను.

ఇంద్రుఁడు:—సేబాసు! నీయస్త్రవిద్యాకౌశలము, అద్వితీయముగానున్నయది. మెచ్చితి. వరమిచ్చితి. గుఱ్ఱముకాక వేఱెద్దియేనిఁగోరికొను మనెను. ఆహా! గుణపక్షపాతులగు వీరులు విపక్షపరాక్రమములఁగూడఁ గొనియాడుదురుకదా!

రఘు:—అమరేంద్రా! అశ్వములేకున్నను నాజనకుని యాగము ఫలప్రదమగునట్లనుగ్రహింపుఁడు.

ఇంద్రుఁడు:—కుశాగ్రబుద్ధీ! నీవుకోరినయట్లు నీతండ్రికిఁ గ్రతుఫలములభించును. ఇంతటినుండి నీవుమాకుఁ బ్రియమిత్రుఁడవైతివి. అని వెడలిపోయెను. రఘువును దిలీపునికడకేగి జరిగినవృత్తాంతమంతయు నివేదింప, నాకోసలేంద్రుఁడు సురేంద్రవిజేత యగుపుత్త్రునిగాఢాలింగనమొనర్చి దీవించి యిట్లుబోధించెను.

దిలీపుఁడు:—"ప్రియనందనా! ఈకోసలరాజ్యభారమును నీపైనిడి నేను తపోవనమునకేగి మునివృత్తిని గాలము గడపఁదలఁచినాఁడను కావున రాజ్యమునుఁజేకొని ప్రజాపరిపాలనమున నప్రమత్తుఁడవై, సూర్యవంశమర్యాదల మీఱక, యైహికాముష్మికసుఖములఁ బడయుము. అని వినయనమ్రుఁడగు సుతునకు రాజ్య మొసంగి శ్వేతాతపత్రచ్ఛాయను వీడి చెట్లనీడల భార్యతోఁ గాఁపురము సాగింప నేగెను. ఇదియే కాలవిభాగవిదులగు రవికులసార్వభౌములకు సహజలక్షణము.

దిలీపానంతరము రఘుమహారాజు కోసలసింహాసనాసీనుఁడై, రిపుమత్తేభసింహుఁడై ధర్మమార్గమున రాజ్యమును బాలింపఁదొడఁగెను. ప్రజ లాభూపాలుని పాలనమున మహానందభరితులై, దిలీపపరిపాలనసౌఖ్యమును మఱవఁ జొచ్చిరి. ఇది సహజమే జనులు సహకారఫలానుభవసమయమున నామ్రాతముయొక్క పూతకాయనాఁటి ముచ్చటల మఱతురు. నిజముచే నీఫలప్రాప్తికి నాకుసుమోత్పత్తియే సాధనము. అయిన నుత్తరోత్తరానందము పూర్వపూర్వవిస్మారకము.

ఇట్లు జనసమూహాదిగా నారఘువీరచరితముల నందనవనభూముల సురకాంతలును, సాకేతప్రాసాదభాగముల నాగరనారీమణులును, జెఱకుతోఁటలనీడలఁ గాఁపుకన్నియలును, కొండఱాతిగుట్టలఁ గోయచేడియ

లును, ఆసీనులై గానమొనర్పఁదొడఁగిరి. అంతశరత్కాలమురాఁగా ఆ రాజచంద్రుఁడు జైత్రయాత్రాభిలాషియై రాజ్యపాలనము మంత్రుల వశమొనర్చి సైన్యసమేతుఁడై అయోధ్యవీడి అంగవంగకళింగాది దేశముల జయించి విజయయాత్రాంతమునఁ గామరూపదేశముపైకి దాడి వెడలఁ గామరూపాధీశ్వరుఁడగు మీనకేతుఁడు రఘువునకు వశుఁడై, ఆ వీరశిఖామణిని మహారాజ మర్యాదలతో నిజపురమునకుఁ గొనిపోయి యమూల్యవస్తు సమలంకృత మగు నొక హర్మ్యమున విడియఁజేసి సన్మానించెను.

రఘుమహారాజును సుహృద్భావముతోఁ దన్నాదరించుచున్న యా మీనకేతుని రాజధానియగు ప్రాగ్జ్యోతిషపురమునఁ గొన్ని దివసములుండి ప్రయాణాయాసమును దీర్చికొనఁగోరెను.

మీనకేతునకు, ప్రభావతియను పుత్త్రిక కలదు. ఆకాలమున రూపగుణాదులతో నా కన్యారత్నమునకు సాటియగు నారీమణి భూతలమునఁ గానరాకుండెను. మీనకేతుఁడు తన కూఁతునకుఁ దగువరుని నిర్ణయింపఁదలఁచి "అద్దమున కెదురుగా నిలిచి తనవెనుక దారముతో వ్రేలాడఁగట్టిన శిరీషకుసుమముయొక్క కేసరములఁ బుష్పదళములు రాలకుండ బాణముతో నేల నెవఁడు పడవేయునో యట్టివానికిఁ బ్రభావతి నిత్తును" అని శపథపూర్వకముగా స్వయంవరమును బ్రకటించెను. కాని రాజపుత్త్రులెవ్వరును నట్లు చేయఁ జాలకుండిరి.

ప్రాగ్జ్యోతిషమున రఘుమహారాజొకనుక శ్రీవారము సాయంతన సమయమున వాహ్యాళికి వెడలి, యంబికాలయమునకు నేగుచున్న ప్రభావతియొక్క చక్కఁదనమును గనులారఁ గాంచి యిట్లు వితర్కించెను. "అహా! యీలోకోత్తర సుందరాంగి యెవ్వతె యైయుండును? భూమిపై కవతరించిన శ్రీదేవియా! లేక పాతాళమునుండి పైకివచ్చిన నాగకన్యకయా? అదికాక యిది కామరూప దేశమగుటచేఁ బూవిలుకాని కాంతయా! మానవవనితల కిట్టి రూప ముండునే! ఈపెపరవనిత కావునఁ దిలకింపఁ జనదు ఈసాధ్వియొక్క సత్వసుందరమగు ముఖవిలాసమును జూడ శాంతస్వభావగాఁ గన్పట్టుచున్నయది. నాకేల యీవిత

ర్కము. ఆహా! యీసతీమణి పుట్టినింటికిని, మెట్టినింటికినిఁగూడఁ గీర్తినిఁ దేఁగలుగును. ఇట్టి పట్టిని గనుటకుఁ దలిదండ్రులెంతటి నోములు నోఁచియుందురో! నాకీప్రసంగ మనవసరము. సదాశయముతో సంద ర్శింపఁదగును. నేనిదివఱ కెందఱనో లావణ్యవతులఁగాంచియుంటిని, కాని, యపుడు నా కిట్టి వితర్కములును గలిగియుండలేదు. నేఁడేలకో! నా మానస మనవసరతర్కములలోనికి దిగుచున్నది! సూర్యవంశజులచిత్త ములయందనౌచిత్యభావము లుదయింపవు అని తలంచుచు నిజావా సమున కేగెను.

వర్ష కాలమున భూగర్భమున నడఁగియున్న విత్తనములు మొలక లెత్తును. యౌవనసమయమున హృదయక్షేత్రమున లీనమైయున్న యను రాగ బీజములు, అంకురింప మొదలిడును. ఈయది సకలప్రాణులకు సహజము.

ప్రభావతియు రఘుగుణముల వినుటయేకాక యానాఁడు ప్రత్య క్షముగా నా తేజశ్శాలి సౌందర్యమును బరికించి పార్వతీమందిరమున కేగి యాదేవినిఁ దనమనోరథ మీడేర్పు మని ప్రార్థించి స్వమందిరము నకు వెడలిపోయెను.

## చ తు ర్థా ధ్యా య ము.

### —: ప్రభావతీకల్యాణము :—

మీనకేతు మహారాజు రఘుమహారాజునకుఁ దనపుత్రిక నీయఁ దలఁచి మంత్రి నాతనికడకుఁబంపి తన మనోరథమును తెలియఁ జేసెను. రఘువును నిదివఱకు రాజకుమారు లెవ్వరికిని సాధ్యముగాని లక్ష్యభేదన మును దానొనర్పఁ గోరి దర్పణమున దిరిసెనపువ్వును జూచుచు దానికిం జిల్కముల నూడనేసెను. అంత మీనకేతుఁడు ఘనానందముతో, ప్రభా వతిని దిలీపసుతునకొసంగి పాణిగ్రహణమహోత్సవము నెఱపెను.

రఘు వట్లు ప్రభావతినిఁ బరిణయమాడి, హిమవత్పర్వతసమీప మున వానప్రస్థులై యున్న నిజపితరు లగు సుదక్షిణాదిలీపులకడ కేగి వధూసహితముగా వారికి నమస్కరింప నావృద్ధదంపతు లీనూత్న జంప తుల దీవించి, యాదరింప రఘువచట రెండుమూడు దివసములుండి వారి

యొద్ద సెలవుతీసికొని యర్ధాంగితో నయోధ్యకేగెను. ఇట్లు రఘువు సకల సద్గుణవతియగు ప్రభావతితోఁగూడి విద్యావిలసితమగు వివేకము కరణి వెలయుచు ధర్మపరిపాలనమున సుప్రసిద్ధుఁడై గురువులయాజ్ఞలకు బద్ధుఁడై దీనావనమునకు సంసిద్ధుఁడై గృహస్థధర్మములఁ జక్కఁగ నెఱవేర్చుచు గోసలరాజ్యమును బాలించుచుండెను. అంత నచిరకాలములోనే యీ దంపతులకు మేనకాహిమవంతులకుఁ బార్వతి పుట్టినటుల సుగుణాలా వణ్యరాశియగు నొక్కకూఁతురు పుట్టెను వారాబిడ్డకు, కుముదిని యని పేరుపెట్టి ఘనానురాగముతోఁ బెంచుకొనుచుండిరి.

కుముదినియు శుక్లపక్షచంద్రికవలెఁ గ్రమక్రమముగా వృద్ధిఁ గాంచుచుండెను. ఆమె రూపగుణసంపదలచేఁ దల్లియగు ప్రభావతినిఁ బోలియుండెను రఘువు తనపుత్రికకు వివాహానుకూలమగు ప్రాయము రాఁగానే తగినవరుని సమకూర్పఁ బ్రయత్నించుచుండెను. ఇటులుండ దేవేంద్రుఁడు రఘువు నొకపర్యాయము దేవలోకమునకు రాఁగోరెను. అపుడారాజేంద్రుఁడు మంత్రిలసాహాయ్యంబున,ప్రభావతిని రాజ్యమును బాలింప నియమించి త్రిదివమునకు వెడలిపోయెను.

ఆకాలముననే సింధుదేశాధీశ్వరుఁడగు శూరసేనునకును కాంతిమతికిని గుణచంద్రుఁడను పుత్రుఁడు పుట్టెను. ఆబిడ్డఁడు పుట్టినరెండవ నెలలోనే కాంతిమతి వ్యాధిపీడితయై మరణకాలమాసన్నముకాఁగా నిజనాథునిఁబిలిచి తనచేతులతో నాశిశువును భర్తహస్తములలో నునిచి యిట్లుపలికెను.

కాంతిమతి :—ప్రాణేశ్వరా! తల్లి లేనిబిడ్డను సంరక్షించుభారము మీపైఁ బడినది. దైవగతినిదాఁట శక్యముకాదుగదా! మనోవల్లభా! ఈసేవకురాలిని మఱవకుఁడు. జన్మాంతరమునఁగూడ మీరేనాకుమనోవల్లభు లగునటుల భగవంతుఁడనుగ్రహించుఁ గావుత!

శూరసేనుఁడు:—ఓప్రాణేశ్వరీ! నీబిడ్డను నా కొప్పగించితివి కాని, యీయగతికుఁడగు పతి నెవ్వరికి నొప్ప జెప్పితివి? ఆహా! సంసారమంధకారబంధురమగుచున్నది. నీవెంటవత్తునన్న నీశిశుపోషణమొనర్పుమని యాజ్ఞాపించితివి. ప్రేయసీ! యీమానవుఁడునిన్నుఁదప్ప వేఱొక

కాంతనుఁ గామింపఁడని, తెలిసికొనుము. ఇదే నీచేయిపట్టి శపథముచే యుచున్నవాఁడను. సాధ్వీమణీ ! నీకుభగవానుఁడుత్తమగతులఁ గల్పిం చుగావుత మనిపల్కుచుండ నారాజమహిషి ప్రాణములవిడచెను. శూర సేనుఁ డాపిల్లవాని నమితమగుగారాబముతోఁ బెంచుచుండెను. గుణచం ద్రుఁడు క్రమక్రమముగా సకలవిద్యలనభ్యసించుట యేకాక, సార్వభౌ మపుత్రుఁడయ్యు నిగర్వచూడామణి యై, ఆగర్భశ్రీమంతుఁడయ్యు దీన సేవాపరాయణుఁడై, సకలకలాకోవిదుఁడయ్యు వినయశోభితుఁడై సౌంద ర్యయౌవనకలితుఁడయ్యు శీలభాసురుఁడై వెలయుచుండెను.

ఇటులుండ - యవనదేశాధిపతియగు నిష్కుఁడు సింధుదేశమును ముట్టడింపఁ గుట్రఁ బన్నుచున్నటులఁ దెలియరా శూరసేనుఁ డపారసై న్యసమేతుఁడై, యవనదేశముపైకి దాడివెడల, నిష్కుఁడు సింధువాహినీ సమూహములఁ జూచినతోడనే, భయకంపితుఁడై, శూరసేనునితో సం ధిచేసికొనకున్న జీవించుటశక్యము కాదనితలంచి, సుందరీలలామయు, యామినీనామయు, నగుతనయను, వెంటనిడికొని శూరసేనుని శిబిరము నకేగి యిట్లుప్రార్థించెను.

నిష్కుఁడు:—సింధుసార్వభౌమా ! నాతప్పులక్షమియించి, నాపై దయఁజూపవలయును. ఇదిమొదలు నేనుమీకులోఁబడి యుందును, ఇఁక ముందెన్నఁడును మీపరిపాలనమునకు వ్యతిరేకముగా సంచరింపను, మనమైత్రికిఁజిహ్నముగా నాయీకొమరితను గానుకనుగాఁబరిగ్రహింపఁ గోరుచున్నాఁడను.” అను నాప్రార్థనఁ డాయౌవనీముఖసౌందర్యమునుఁజూ చి వ్యామోహితుఁడై తానుదిరుగఁబరకాంతలఁ బరిగ్రహింపనని, నిజ కాంతకడఁ బ్రతినచేసియు, మనోదౌర్బల్యమునకులోనయ్యెను. అగును ! పురుషవరులు కాలుజాఱిపడకుండనుండుట దుర్ఘటమీకాంతావలోకనఘ ట్టముననేకదా !

తుదకాశూరసేనుఁడు యామినీమోహముచే నిష్కునిప్రార్థనము నకుసమ్మతించి, యవనకన్యకను గానుకనుగాఁ జేకొని యాయవనావనిని వీడి కోసలమునకేగి, యాయామినీవధూటిని, పూలరాణినిగాఁ జేసి కోట లోవిడిగా నొకమేడలోనుంచెను.

యామిని గుణచంద్రుని గుసమానలావణ్యమునుం జూచి, చలిత చిత్తయై యాసుశీలునిమోహాతిమిరమునం బడంద్రోయం జూచెను. కాని, యాతేజశ్శాలి నీతిపథసంచారియగుటచే నాయామినితలంపులకు నను కూలుండు కాండాయెను. అంతనాయువనకాంత యాతనిపైంగ్రోధమునువ హించి, యాతనిహతమొనర్ప నిశ్చయించి, శూరసేనునిం దనకుటిలాను రాగముచే స్వాధీనునిగాం జేసికొని, సమయముచిక్కినపుడెల్ల గుణచం ద్రునిశీలమును గూర్చిసందేహమొదవునట్లు బోధింపందొడంగెను.

శూరసేనుండునిజనందనుని స్వభావస్వచ్ఛత నెఱింగినవాడగుటచే నాకామినిమాటలవిశ్వసింపక పెడచెవినిబెట్టుచుండెను. తుదకెట్టులో యా మాయలాండి గోమతీసునిచిత్తమునకుం గొంచెమనుమానమంకురింపంజే సెను. అందుచేం గాంతిమతీకాంతుండు గుణచంద్రుండు గోమతీపురమున నుండిన, చిక్కులుకలుగవచ్చునని తలంచి యాసచ్చరిత్రుని వసుమతీపుర మున నివసింపనియమించెను. గుణచంద్రుండు జనకునియాజ్ఞానుసారము సంతోషముతో వసుమతీపురమునకు వెడలనుండ, యామిని నిజపరిజనుల రహస్యముగాం బిలిచియిటుపలికెను.

యామిని:—సేవకులారా! మీరుగనలుగురును గుణచంద్రునితో నేగి, విధేయులగు కింకరులవలె, సంచరించుచు నాతని నెట్లైన హతమొ నర్పుండు. అట్లుచేసినచో మిమ్ములనున్నతాధికారులనుగాం జేయుదును." అని వారికిం గొంతధనమొసంగి, గుణచంద్రుని వెంటంబంపెను. గుణచంద్రుం డు సపరివారముగా వసుమతీపురమునకేగి, కొంతకాలమటనుండి పుణ్య తీర్థముల సందర్శింపం గుతూహలముకలవాండై, పరివారమంతను నచట దిగవిడిచి, యామినీనియుక్తులగు వంచకుల నిజభక్తులనుగాం దలంచి, తన వెంటం దీసికొని దివ్యస్థలముల సేవించుచుం గొన్నిదివసముల కయోధ్యా పురమునకేగి, యచ్చటనొకమిద్దెటింటి నద్దెకుందీసికొని, నీతికాకరమైతన రారు సాకేతపురమునం గొన్నాళ్లుండంగోరెను.

ఇటులుండ నావంచకసేవకులొకనాంటి యర్థరాత్రిమున జోరభయ మెఱుంగమిని దలుపులుదెఱచి యుంచుటచే, నిరవరోధకముగా రాజావ రోధమును బ్రవేసించి, యాంతఃపురస్త్రీల యమూల్యాభరణముల నప

హరించి, పాటిపోవుచుండ రాజభటులుమేల్కని దొంగలవెంబడింప నా చోరులు తిన్నగాగుణచంద్రుని మందిరములోనికేగి, యానగల నారా కుమారుని మంచముక్రిందనుంచి, నిదురించుచున్న వారివలె నటింపఁదొడఁగిరి.

వారిని దఱుముకొనివచ్చుచున్న రక్షకభటులు వెంటనే యాయింటిలోనికేగి, గృహమునంతను బరిశోధించి, మంచముక్రిందనున్న యలంకారములఁగాంచి, గుణచంద్రసహితముగా నా మేడలోనున్న వారినందఱినిఁ జెఱసాలలోనుంచిరి. తెల్లవాఱినతోడనే రక్షకభటాధికారి వారినందఱిని రాజాస్థానమునకుఁగొనివచ్చి, వారిని ద్వారముకడ రక్షకభటసంరక్షణముననుంచి, సభామందిరములోనికేగి మంత్రులతో రాత్రిజరిగిన దొంగతనమునుగూర్చి సవిస్తరముగానివేదించి ముష్టవస్తువుల మంత్రులము౦దుంచెను.

మంత్రులావ్యవహారమునువిని, కోసలరాజ్యసీమలోఁ జోరులు చొరఁబడుటకు వింతఁజెంది, వెంటనే యాయపరాధుల లోనికిఁదీసికొని రమ్మని, యాజ్ఞాపింప రక్షకభటాధికారి దొంగలనులోపలికిఁ గొనితెచ్చుచుండ వారిమధ్యనుపేందుఁడో యనునట్లు దివ్యతేజముతోఁ దేజరిల్లుచున్న గుణచంద్రునిఁజూచి వెఱఁగంది యాతఁడుసబాస్థరమునకురాం వెంటనే, యప్రియత్నముగానిజాసనములనుండి క్రిందికిదిగి "దయచేయుఁడు" అని మంత్రులు సన్మానపూర్వకముగా నాసనమొసంగిరి. కాని యారాజపుత్రుఁడు దానికంగీకరింపక నిజసేవకులతోఁ గలిసినిలిచెను.

అపుడమాత్యులు వ్యవహారపరిశీలనమునకు గడంగి, మున్ముందుంపరిచారకులఁబిలిచి "అపరాధులారా! మీరేదేశమునుండి యిటకువచ్చితిరి? వచ్చియెన్నాళ్లాయెను? ఈమహనీయునితో మీకుఁగలసంబంధమేమి? అనిప్రశ్నింప నాకుటిలులు ధనాశచేఁ బాపభీతిలేక యిట్లసత్యములఁ బలుకఁజొచ్చిరి.

సేవకులు:—మంత్రిపుంగవులారా! మాదిసింధుదేశము మేమిచటికివచ్చి నాలుగుదివసములైనది. ఈతఁడు మానాయకుఁడు, గజదొంగలలోఁబేరెన్నికఁగన్నవాఁడు. మోసములకుమిన్నఁడు మాచేఁగన్న

ములవేయించియు దారులఁగొట్టించియు, సొమ్ములగడించుచు, రాజపుత్రునివలె శీవిగఁగాలమును గడుపుచున్న వాఁడు. మేమీతనియాజ్ఞచే నెందరినోచంపితి మెన్నియో కోటలదోచితిమి. కాని మేమిదివఱకెచ్చటను బట్టుపడ లేను. మాపాపముపండుటచేఁ దుదకుమీవీటఁ జిక్కితిమి. సత్యమునునివేదించిన యపరాధులకుఁ గోసలరాజ్యమున దండనముండదని ప్రసిద్ధియుండుటచే నిజమెఱింగించితిమి యీపైమీదయ.

మంత్రులామాటలనమ్మనేఱక గుణచంద్రునిఁజూచి "ఆర్యా! తామీదొంగలతోఁగూడి యుండుటకుఁగారణమేమి? వీరు తెలిపినదానిలో సత్యమెంతకలదు. మీసౌమ్యసుందర రూపమునుఁజూచిన, స్వభావకుటిలులకుఁ గూడసదాశయములుదయించు ననుటకుసందియము లేదు. అట్టితఱినీచోరులు తెలిపినయుదంత మెట్లు సరిపడును? కావున వాస్తవమునువివరింపఁ గోరుచున్నారము.

గుణ:—నయశీలులారా! కోసలామాత్యులారా! వీరు నాపరిచారకులు నేనుదీర్థాటనాభిలాషచే, వీరినివెంటనిడుకొని, పుణ్యస్థలముల సేవించుచు నిటకువచ్చియుంటిని. వీరుమున్నెన్నఁడునిట్టిపాపకార్యములఁ జేసియెఱుంగరు. అసత్యములాడియెఱుఁగరు. నేఁడేమివింతయో వీరినుడువులు తలక్రిందుగాఁ గానవచ్చుచున్న యవి. నాకీస్థేయమునుగూర్చి యేమియుఁదెలియదు. ఇంతకుమించి నేఁదెలుపఁదగినదేదియు లేదు. మీకెట్లుచేసిన ధర్మమనితోచునో యట్లుచేయుఁడు."

అనముఖ్యామాత్యుఁడగు నయరుచియిట్లుపలికెను. "అమాత్యసోదరులారా! ఈతఁడెవ్వఁడో పూతచరితుఁడు వీరలుకుటిలవర్తనులగు సేవకులు. వీరిట్టికుష్టులని యెఱుఁగక, యీసజ్జనుఁడు వీరలసేవకులనుగాఁజేకొనెను. కావున, నీతులువలు పలికినవాఙ్మూలమును బట్టియీతఁడు శిక్షింపఁదగినవాఁడుకాఁడు. మనము వేగిరపడి వ్యవహరింపఁదగదు. ఈ యభియోగమంతను బత్త్రముపైవ్రాసి, పట్టమహిషియగు ప్రభావతీదేవిగారికిఁ దెలియఁజేసి యావిదుషీమణి యొసఁగునాజ్ఞకు వేచియుందము" అనమంత్రులందరు నయరుచితో నేకీభవించిరి. ఆతఁడావ్యవహారమంతయు నొకపత్త్రికపైవ్రాసి దానినిరాణికందఁజేసెను. ఆదేవిదానిబరిశీలించి దాని

పైనిట్లువ్రాసెను. "అమాత్యశేఖరులారా! మీరుపంపినవ్యవహారపత్రి మును బరిశీలించిచూడ మీవలె నేనును శిక్షానిర్ణయమునుగూర్చి సం శయించుచున్నదాన, కావున, రాజనీతివిశారదులగు మీసార్వభౌములు వచ్చువఱకును, ఆమహానీయుని మనకోటలో నిర్బంధవాసప్రాసాదమున సకలసౌకర్యములనొసంగి యుంచుటకును, మిగిలినపాటచ్చరులఁ జెఱ సాలల బంధించుటకును, ఏర్పాటుచేయవలయును. కొలఁదికాలములో మనమహారాజు రానైయున్నవారు. వారువచ్చి సత్యనిర్ణయమునుజేయఁ గలరు." అనియారాణిశిరుగఁ బత్రమునుమంత్రులకందఁజేసెను.

మంత్రులామహారాజ్ఞి నిర్ణయమునకు సంతసించి, దొంగలఁగారా గారములనుంచి యాగుణచంద్రునిమర్యాదతో రాజమందిరమునఁ బ్రవేశ పెట్టి యతనికిఁగావలసిన సదుపాయములఁజేయనుద్యోగుల నియమించిరి.

గుణచంద్రుఁడు మంత్రులుతనయెడఁ జూపినగౌరవమునకు వారిఁ బ్రశంసించి, నిజకింకరుల మోసమునకు వింతచెందెను. కాని యిటువింత చెందవలసినంత విరుద్ధముగానవచ్చుటలేదు. ఏమందురా! విద్యాధికులై వేలకువేలు వేతనములఁగైకొను పెద్దయుద్యోగులే లంచములకాశించి ఘాతుకకృత్యములఁ జేయుచుండఁ, గొలఁదిజీతములలో నున్న నీచసేవ కులు ధనములకాశించి, దారుణకార్యముల నాచరించుట, వింత యెట్ల గును?

అట్లు నిర్బంధముననుంచఁబడిన యాగుణచంద్రుఁడు తత్వవేత్త యగుటచే అవస్థానుసారముగా నానందింపఁదొడగెనేకాని దుఃఖింపనేరఁ డాయెను. నిజమే, సుఖదుఃఖములు మానసికప్రవృత్తులుకాని బాహ్య వస్తువులుకావు. కావుననే వివేకధనులు తాముమహారాజులై సౌధాం తరముల నివసించుచున్నను, ధనహీనులై విపినవీథులఁ దిరుగుచున్నను జిత్తమున నానందించుచునే యుందురు. అజ్ఞులు సుఖదుఃఖములు బా హ్యవస్తుసంజనితములని, భ్రమయుటచేఁ బదార్థములయొక్క సం యోగవియోగములచే సుఖదుఃఖములు కలుగుచున్నవనుకొందురు?

## పంచమాధ్యాయము.

### —: వీణాగానము :—

ఒకరేయి చందమామ పున్నమవెన్నెలల వెదచల్లఁ దొడఁగెను. చల్లగాలి మెల్లగాఁ గమ్మతావులతోఁ గలసి సాగమొదలిడెను అప్పుడా సాకేతపురము యోగిపుంగవుని మానసము మాడ్కి నిశ్చలమై, నిశ్శబ్దమై, శాంతముగా నుండెను. ఆనిర్మల నిశీథ సమయమున గుణచంద్రుఁడు వీణను చేఁబూని చిదానందముతో నాసచ్చిదానంద మయుని గూర్చి గానముసేయ మొదలిడెను.

అప్పుడు రఘుపుత్రిక యగు కుముదిని మేడలో హంసతూలికా తల్పముపైఁ బరుండి ఇటులుతలంపఁ దొడఁగెను. "కొలఁది దివసములలో నాజనకుఁడు స్వర్గమునుండి కోసలమునకు రానున్నవాఁడు. మాతండ్రి నాకుఁదగు భర్తను సమకూర్ప నుద్యుక్తుఁడు గానున్నవాఁడు, కాని దైవమెట్టి వరునిసంఘటింప నున్నవాఁడో? కేవల మైహిక సుఖ లాలసునికంటె, సత్వ సంపన్నుఁడగు భాగ్యశాలియే ప్రార్థనీయుఁడు. ఇంతకు నాయదృష్ట మెట్లున్నదియో? అని యోజించుచుండ, శ్రుతి సుఖదమగు వీణానాదము చెవికి హాయిగ వినరా, ఆరాజపుత్రిక శయ్యనుండిలేచి గవాక్షముకడకేగి శ్రుతిసమ్మిళితమై యింపుఁగొలుపుచున్న యావిపంచీ నినాదమునువిని, గానకళాకోవిద యగుటచే నమితానందము నంది, తనప్రక్క నిదురించుచున్న తారయను చెలికత్తియను లేపి యిట్లు పలికెను.

కుముదిని:—ప్రియసఖీ! నేఁడునీవింత వేగముగా నిదురించుచుంటివేల? తారా! అటువినుము. ఎక్కడనుండియో చెవులకింపును గొలుపు వీణానాదము వినవచ్చుచున్నయది. ప్రియసఖీ! మనమెన్నఁడును హృదయాకర్షకమగు నిట్టి వల్లకీరవమును విని యెఱుంగమే! ఈసాకేతమున మనకుఁ దెలియని వైణిక విద్వాంసులెవరు కలరు? చెలీ! యీ వితర్కమున కేమిగాని నీ వొకతడవ వా కిటికీకడ కేగి, యాగానామృతమునుఁ గ్రోలిరమ్ము.

తార:—నృపనందినీ! చింతలెఱుంగని వారిచెంతకు నిద్రాదేవి పరుగిడివచ్చును. కావున నిశ్చింత నగునన్ను నాపెవచ్చి గాఢాలింగనము చేసికొన్నది. నీవు వరాభిలాషిణి వగుటచే నాదేవి సంపర్కము లేక మేల్కొని యుంటివి.

కుముదిని:—తారా! నాకు నీప్రత్యుత్తర మక్కఱలేదు. అదిగో వినుము. మొదటవాయింప నెత్తికొన్న భైరవివర్ణము ముగింపఁబడి, తోడివర్ణము ప్రారంభింపఁ బడినది. ఆహా! సఖీ! ఈయది మొదటి వర్ణమునకంటె నెంతో మనోహరముగా నున్నయది. వీణవాయించినకొలఁది నాదముయొక్క రమ్యత హెచ్చుచుండును.

తార:—ప్రియసఖీ! నీకు మొదటివర్ణ మాతగా రుచింపదు. ఇఁకనీతోడి వర్ణము విన్నచో నీసంతసమునకు మేరయుండదు. ఈరెండవ వర్ణమునకున్న పసందు, ఆమొదటి వర్ణమున కెట్లుండును. మఱియుఁ గృతియందు నీకుఁబ్రీతి మెండు.

కుముదిని:—తారా! ఈయర్థరాత్రిమున నింతయింపుగా వీణ వాయించు వారెవరై యుందురు? తంత్రులనాదమును బట్టిచూడఁ బురుషుఁ డీవిపంచీ వాదనమొనర్చుచున్నట్లు తెలియ వచ్చుచున్నది. స్త్రీల యంగుళులు సుకుమారము లగుటచే నింతటి గంభీరనాదమునుబుట్టింపఁ జాలవు.

తార:—సఖీ! కలావిదులకు రాజసన్మానములపై నాస మెండు. అందుచే నీవిపంచీ విద్వాంసుఁడు నిజగాన మాధుర్యమును మనజన పతికిఁ జవిఁజూపి సన్మానములఁ బడయ నేదేశమునుండియో వచ్చి యుండును.

కుముదిని:—ప్రస్తుతము మహారాజు పట్టణమునలేఁడు. అదిఁయు టుండనిమ్ము. సర్వప్రాణి సంతోష జనకమగు గానామృతమును గ్రోలి యానందింపఁదగు పౌరులెల్లరు, నిదురించు తఱిని వీణవాయింపఁ గారణ మేమందువు?

తార:—కొందరు లుబ్ధవిద్వాంసులు తమవిద్యానైపుణ్య మితరుల కబ్బునేమో యను కడుపుబ్బుచే నేనిశీథ మందునో యేమరణ్య

మందునో యభ్యాసము చేయుచుందురు. ఈపాటకుఁడా సాంప్రదాయములోని వాఁడని తోఁచుచున్నది.

కుముదిని:—తారా! మాటలాడక నిశ్శబ్దముగా వినుము. అదిగో జగన్మోహనమగు మోహన రాగ మాలాపము చేయఁబడుచున్నది. ఆహా! యేమి యీరాగ సుధారసము! ఇయ్యది యెండు మోడులఁ గూడఁ జిగురొత్తఁ జేయును. బండఱాలనుగూడఁ గరఁగింపఁ జాలును.

తార:—నీవన్నమాట నిజము. సంగీతవిద్యాగంధమెఱుంగని నాకుఁగూడఁ దలయూఁప నూహ పుట్టుచున్నయది. అట్టితఱి గానకళాకోవిదవగు నీవీగానముచేఁ బులకితాంగి వగుటలో వింతయేమి యున్నది?

కుముదిని:—సఖీ! కాలుష్య విరహితమగు గంగాతరంగిణివలె సాంకర్య రహితమగు నీమోహన రాగవాహిని, యెంతహృదయ రంజకముగా నున్నదో వింటివా!

తార:—అగును వర్ణసాంకర్యము జాతిమర్యాదను జెడఁగొట్టునటుల, రాగసాంకర్యము గానసౌభాగ్యమునుఁ బాడుచేయును.

కుముదిని:—నెచ్చెలీ! ఈగాన మెచ్చటినుండి వచ్చుచున్నదియో? ఆగాయక సార్వభౌముఁడెవ్వఁడో రహస్యముగాఁ దెలిసికొని రమ్ము పొమ్ము. జాగుసేయకుము." అనఁ దార వీణానాదమునుఁ బట్టి తిన్నగా గుణచంద్రుఁడున్న మేడకడకేగ, తార యంతఃపురస్త్రీల చెలికత్తియ యగుటచే ద్వారపాలురు నిరోధింపరైరి. తార మేడపైకేగి కిటికీలోనుండి వీణవాయించుచున్న రాకుమారునిఁ దిలకించి, యాతని యనుపమాన రూపసంపద కచ్చెరువంది యీసొగసుకాఁడు వాయించుచున్న మోహన రాగము ముగియువఱకు నచటనుండి, యాతఁడు తాన మారంభింప నటనుండి కుముదినీమందిరమునకు వచ్చెను. కుముదిని తారనుజూచి యిట్లు ప్రశ్నించెను.

కుముదిని:—తారా! నేఁజెప్పి నట్లాతయుఁ దెలిసికొని వచ్చితివా! ఆవిపంచీవిద్వాంసుఁడెవ్వఁడు?

తార:—రాజపుత్రీ! ఏమని వర్ణింతునమ్మా! నీకొక శ్రోత్రానందమే సమకూరెను. నాకన్ననో శ్రోత్రనేత్రముల రెంటికిని ప్రమోదము సంప్రాప్తమాయెను. వినవలయునన్న నాతని వీణనే వినవలయుఁ జూడవలయున్న నాతని రూపమునే తిలకింపవలయును.

కుముదిని:—సఖీ! ఆవైణికుఁ డంతటి సుందరాంగుఁడా! ఇంత సంతసించుచుంటివి?

తార:—సందేహమేమి? కన్నులున్నందులకు ఫలమాతని రూపలావణ్యమును గాంచుటయే!

కుముదిని:—నెచ్చెలీ! అట్లగుచో నన్నొక్కసారి యటకుఁ గొంపోయి నానేత్రములకుఁ గూడ విందొనర్పుము కాని తారా! మనమెవ్వరి కంటఁ బడకుండ నతిరహస్యముగా నటకేగవలయును. లేకున్నఁ బరులు నాశీలమును శంకింతురు దేనినైనఁ దొలఁగింపవచ్చును గాని, పైనిఁబడిన లోకాపవాదమును బాపుకొన శక్యముగాదు.

తార:—సుందరీ! నీవెవ్వరి కంటఁబడి శోధింప నుంటివో తెలియదు. భయపడకుము. ఇది నిశీథసమయ మగుటచే నిన్నెవ్వరును గనుఁగొనరు. రమ్మి నీకాసుమశరునిఁ జూపెదను." అని కుముదిని నటకుఁ గొంపోయి జాలమార్గములోనుండి వాని సోయగమును బ్రత్యక్షముఁ జేసెను. ఆదివ్య లావణ్యమూర్తి నవలోకించిన వెంటనే కుముదినీమానసనభోవీథిని నవానురాగకళాభాసురుఁడగు భావసుధాంశుఁడు దయింపఁ దొడఁగెను.

ఆహా! సచ్చిదానందమయుఁ డగు పరబ్రహ్మయొక్క జన్మకుఁ గారణమెట్లగమ్యమో యటులనే స్వచ్ఛానురాగమయుఁ డగు భావకలానిధి యుత్పత్తికిని హేతువు నూహ్యముకదా! కావుననే యొకమహాకవి యిటులఁ దెలిపి యున్నవాఁడు. "వ్యతిషజతి పదార్థానాంతరః కోపి హేతుః నఖలుబహిరుపాధీన్ ప్రీతయస్సంశ్రయంతే॥" అనఁగాఁ బయికిఁ దెలియరాక యంతర్లీనమై యున్న హేతువెద్దియో పదార్థముల సమకూర్చును; అనురాగములు బాహ్యోపాధుల నాశ్రయింపవు, స్వయం వ్యక్తములు.

అట్లు గుణచంద్రుఁడు కొంతసేపు వీణవాయించి, పిమ్మట విషం చీస్వరముతో నిజకంఠ రవమును జతపఱిచి భక్తిపరవశుఁడై భగవం తునిఁ గీర్తించి, యనంతరమిట్లు తలంపఁ దొడంగెను. "ఆహా! ఏమి! యీవిధివిలాసము. సింధుదేశాధీశ్వరుని కేకపుత్త్రుఁడనై గురుకులమున సకలవిద్యల నభ్యసించి, భయభక్తులతో నీతిమార్గమున సంచరించుచు, నేపాప మెఱుంగక, శాంతముగాఁ గాలమును గడపుచున్న నాకీ కారా వాసమేమి? సకలసుగుణాలవాలయగు నాతల్లి, కాంతిమతి నాబాల్య ముననే దివికేగుటయుఁ జలచిత్తయగు యవనకాంత సవతితల్లి యగు టయు విధివైచిత్ర్యముకాక మఱేమున్నది?

అన్నా! నాసేనకు లెంతటి వంచకులు? తప్పక వీరలు నన్ను హతమొనర్చు నాసపత్నీమాతచే నావెంటఁ బంపఁబడినవారై యుందురు వీరికాపె యమిత ధనమొసంగి యుండును. చీ! యీ ధనాశచే మానవు లెంతటి పాపములకుఁ బాల్పడుచున్నవారు? దావానలము చక్కని ఫలవృక్షములఁ గాల్చు భంగి, ఈధనాగ్ని యమూల్యమగు మానవత్వమును మాడ్చివేయుచున్నయది. ఈసృష్టియందుఁ జీఁకటి వెలుతురులవలె, బ్రవృత్తి నివృత్తులు సృష్టింపఁబడియున్నవి. జనులు మూఁడువంతులకుఁ బైఁగాఁ బ్రవృత్తి మార్గముననే తమజీవయాత్రల సాగించుచున్నవారలు. ఏపదిగురో నివృత్తి పథమున బ్రదుకఁ గోరు చున్నవారు; కాదుకాదు. నేనునాకర్మను నిందింప వలయునుగాని నా కింకరుల దూరరాదు.

కోసలమంత్రులు త్వరపడు వార లగుచో నాకు ఘోరశిక్ష సంప్రాప్తమయ్యుండెడిది. దీనికేమిగాని ముందు రఘుమహారాజు వచ్చిన పిదప నెట్టి యవమానమునకు లోనయ్యెదనో? అయ్యయ్యో! నామూ లమున స్వచ్ఛమగు సింధురాజ వంశమునకుఁ దీఱని కళంకమేర్పడినది. ఔరా! యమాయకుడగు నాసింధురాజేంద్రుని, ఆయవన యువతి, యెట్లు మోసగించుచున్నయది. గుణవతియగు నర్ధాంగి సమకూరుటకుఁ బురుషుఁ డెంతటి పుణ్యాత్ముఁడై యుండవలయును?

హా కరుణానిధీ! ఇఁకను నన్ను బ్రతికింప నెంచితివా? సర్వాంతర్యామీ! నీకు నాశీలమెట్టిదో తెలియదా యేమి? ఓ దీనదయాళూ! నాజీవితాంబరమునకు నపవాద మాలిన్యమంటకుండఁ జేయుము. అట్లు కాదు. మనుజులకు శుభాశుభములు వారికర్మల ననుసరించి సంప్రాప్తములగుచుండును కాని భగవదిచ్ఛచే సమకూఱఁజేరవు. కాని మానవులీకర్మ రహస్యము నెఱుఁగక. నిష్కళంకదయాస్వరూపుఁడగు భగవంతుని మంచిలో నుతింపకున్నను, చెడుగులోఁ దిట్టఁజొత్తురు. అంతియే కాని తమదుశ్చరితముల దిద్దుకొనఁ గోరరు కన్నులుండియు గోతిలోఁ బడినటులఁ దెలివియుండియు మోహకూపమునఁ బడుచున్నవారు. ఓ కృపాసింధూ! నాచిత్తము చంచల వస్తువులకై యాశపడక యచంచలమగు నీచరణ సరసీరుహ ధ్యానమునందు నడఁగి యుండునట్లొనర్పుము. లోకము కుటిలజన పీడితముకాక సౌఖ్యము నందుఁగావుత. ఓ యమేయ శక్తిసంపన్నా! నిన్ను నిజముగా నమ్మియున్నవారలకు, ఆనందభాగ్యము చేకూరుట నిక్కువము. విపన్నతకుఁ గారణము నిన్ను మఱచియుండుటయే. ఇందుకు, ప్రహ్లాద చరితమే నిదర్శనము" అని పరిపక్వ హృదయుఁడై పలుకుచుండఁ గోట గుమ్మముకడఁ గాలనివేది నాలుగు ఘంటల మ్రోగించెను. ఆధ్వనినివిని కుముదిని రాత్రికాల మంతవేగముగ నేగుచున్నందులకుఁ జింతించి, ఆనృపకుమార చంద్రుని వీడఁజాలక తనలో "తెల్లవాఱ వచ్చుచున్నయది కన్నుల కఱవు తీఱకున్నయది. కానిమ్ము, ఈశుభాశయుఁడు తెలిపినటుల విధివిలసితములు వింతమార్పులఁ దెచ్చిపెట్టుచుండునుగదా! ఇఁక నేనిట నిలువఁ జనదు." అని శరత్కాల మేఘచ్ఛన్నమగు చంద్రకళవోలె తెల్లనిమేలిముసుఁగుతోఁ దారవెంటరా వెడలిపోయెను.

---

## షష్ఠాధ్యాయము.

## కుముదినీ సమావలోకనము.

ఒకనాఁటి వేకువ జామున నిజసంచారానుకూలమగు రాత్రి జాఱి పోవుచున్నదని నక్కలు మొఱలిడుచుండ, స్వవిహారోప యుక్తమగు

పగలు వచ్చుచున్న దని విహంగములు ఆనంద గానము చేయుచుండ, పరమ హంసలు పరబ్రహ్మములో నైక్యమగునట్లుల దారలు పగటిలో గలిసి పోవుచుండ, సూర్యోదయము కాఁజొచ్చెను అపుడు కుముదిని యంతఃపురమున నొంటరిగఁ గూర్చుండి యేదియో యోజించుచుండెను. రెండుదినములనుండి యామెకుఁ గ్రొత్తవిన్నాణము తళుకొత్తఁ జొచ్చెను. వెనుకటివలె స్నానపూజాదులపై నాదర మంతగాఁ గానవచ్చుట లేదు. క్రొత్తకోరికల మిత్తిదేకదా! తార యామెకడకు వచ్చి యిట్లు పలికెను.

తార:—రాజపుత్రీ! కోసినపువ్వులు పళ్ళెరముల నట్లేయున్నవి. నేఁడునీవు విగ్రహారాధనమును మాని మానసికారాధనములోనికి దిగితివి కాఁబోలు. లేక యీకుసుమములు మనసిజసాయకము లని తలంచి ముట్ట మానితివో?

కుముదిని:—సఖీ! చూచితివా! తుదకు మన కోసలదేశ మర్యాద యేస్థితికి వచ్చినదియో?

తార:—నీవంతటి మార్పేమి కంటివి? ఇంత వింత చెందుటకు

కుము:—ఇంటికి వచ్చిన దైవసముఁడగు నతిథి పూజింపఁ బడలేదు సరియకదా, తుదకుఁ జెఱయందుఁగూడ నుంచఁ బడియెను. ఇది తగునా?

తార:—అంతటి యతిథిదైవమెవరు? నీమాట లాశ్చర్యముగా నున్నయవి సాకేతమున నతిథు లవమానింపఁ బడుట యసంభవము.

కుము:—తెలిసియుండియు నడుగుదు వేల? నీవె కదా నాకా సత్పురుషునిఁ జూపితివి.

తార:—ఆతఁడా! గారవింపఁ బడకేమి మర్యాదనెఱింగిన మన మంత్రులు, ఆదొంగలతోని రాజమందిరమున నిలిపి యాదరించిరే కాని యలుసుచేయ లేదే!.

కుము:—తారా! నీవాసచ్చరితుని యుదంతము నంతనువినియు దొంగల తోఁడందు వేల?

తార:—కన్యామణి! నగల దొంగిలించిన వారికంటె నీతఁడే గజదొంగ. ఏమందువా, ఆచోరులు బాహ్యాలంకారములను మాత్రమే దొంగిలింపఁ గలిగిరి. ఈతఁడన్ననో యాభ్యంతర వస్తువులను గూడ దోచుకొనినాఁడు

కుము:—సఖి! ఈతఁడపహరించిన యాభ్యంతరపదార్థమేది?

తార:—ఎంత చమత్కారిణివే! ఈతఁడు నీహృదయ రత్నము నపహరింపలేదా? అభిమాన మున్నచోఁ దప్పులు గానరావులే.

కుము:—ప్రియసఖి! నీకు నాహృదయమును దాపనేల నీవన్న మాట నిజమే. ఆతఁడు నామానసచోరుఁడే. కాని దైవానుకూల్య మెట్లుండునో. కోరికలు పుట్టినంతనే సంతసింపఁ జనదు. అవి నెఱవేఱి నపు డానందింపవలెను.

తార:—నీవిపుడు నీహృదయమును వెల్లడింప నగత్యము లేదు. ఇదివఱకే నాకుఁ దెలిసినది

కుము:—నేఁ దెలుపకయే నాహృద్గతాభిప్రాయమును నీ వెట్లు తెలియం గలిగితివి, నీకు యోగ దృష్టికలదా?

తార:—సఖీ! చంద్రోదయముచే సముద్రమునం దుఁ గలుగు మార్పు తరంగ గతులచేఁ దెలియఁ బడునట్లు, రాగోదయముచే నంత రంగమున జనించు మార్పు, లంగ వికారములచే నెఱుక పడును.

వారిట్లు సంభాషించుచుండ నంతఃపుర పరిచారిక వచ్చి యిట్లు పలికెను.

పరిచారిక:—"అమ్మా! కుముదినీదేవి! మహారాజాగారు రాణి వాసమునకు వచ్చియున్నవారు. వారును, రాణిగారును దేనిని గూర్చి యోకాని చర్చించుచు, మిమ్ము వేగముగఁ దోడ్కొని రమ్మని సెలవి చ్చినారు, కావున దయచేయుఁడు"

కుముదిని:—"ఏమీ! మాజనకులు స్వర్గమునుండి వచ్చిరా? సంతోషము, కాని, వారెపుడువచ్చియుండిరి? నాకుఁ దెలియనే లేదే! మా తల్లిగారు, ఆసచ్చరితుని గూర్చి మానాయనగారితో మాటలాడియుం దురు. ఆసందర్భములో న న్నేదియో ప్రశ్నింపఁ దలచి రని తోఁచుచు న్నది. సఖీ! పోయివత్తునా?

తార:—ఆహా ! నెచ్చెలీ! ఎంతటి జాణవు. రాణిగారితో నావ యసుకానిఁ గూర్చి ముచ్చటించి యుంటివా! బాగు ! తలిదండ్రులింట నుండిరో, పైకేగిరో తెలియనంతటి స్థితికి వచ్చితివా.

కుముదిని:—కూఁతురు తల్లితోఁ దన తలంపెఱింగించుటలో జాణతన మేమున్నది. ఆరా ! యిపుడె వచ్చెద వేచియుండుము.

తార:—పోయిరమ్ము. మమ్ము మఱువకుము. రేపు మంచి ముహూర్త ముండునేమో ?

కుముదిని:—ముహూర్త మెందులకు. జరుగవలసిన శుభకార్య మేమి.

తార:—ఎందుకా! నాచెలికత్తియ పెండిలికి. కొందఱు కన్యకామణులకు వరు లిట్టే దొరకుదురులే?

కుముదిని:—నిజమే! అందుకుఁ దగిన నేర్పుకత్తియలగు చెలికత్తియలు దూతికలై యున్నచో, అని వెడలిపోయెను.

అట గుణచంద్రుఁడు (తనలో) ఆహా ! రఘుమహారాజు నన్ను వాత్సల్యముతో సన్మానించి, మంత్రులు నన్నుఁ జెఱయందుంచినందుకుఁ జాల నొచ్చికొనినాఁడు. ఆహా ! యేమి యీభూపాలుని పరిపాలనా విధానము. ఈరాజ్యమున నవినీతుఁ డొక్కరుఁడును గానరాఁడు. ప్రజల నింతఁ జక్కఁగఁ బరిపాలించు నేర్పు భానుకుల భూపాలురకే దక్కి యున్నది. ఈసాకేతాధిపతి "నేను సెలవుతీసికొని మాదేశమున కేగుదును" అని నివేదింప "కొన్నిదినములు మామందిరమున నుండి మా యాతిథ్యమును గైకొని వెళ్ళవచ్చును." అని నాకుఁ దనప్రాసాదము ననే విడిది యేర్పాటు చేసినాఁడు. కావున నేనెట్లీ సార్వభౌముని మాట లఁ గాదన నేర్తును! పెద్దల యాజ్ఞల మీఱరాదుకదా.

ఓహో ! ఏమియీ దుర్గ వైభవము. ఇంత విస్తీర్ణమగు కోట భూమండలమున గానరాదు, ఇందలి చలువరాతి కట్టడముల పనివాని తనముఁజూడ నియ్యది దివ్యశిల్పి నైపుణ్యముకాని సామాన్య మానవుల నేర్పు కాదని యూహ పుట్టుచున్నది. ఈవీటి బాటలు సజ్జన మానస ములవలె తిన్ననై కుటిలములుగాక విశాలములుగాఁ గన్పట్టుచున్నయవి.

మఱియు విపణి వీథుల విన్నాణమును జూడఁ గుబేర పురమును తలంపు కలుగుచున్నది. ఇట యంతఃపురాగారములు లెక్కకు మిక్కుటముగాఁగాన వచ్చుచున్నయవి. సైనికావాసముల సరణులు పరిగణింపఁ దరమే కాదు.

ఇదివఱకు నేను నిర్బంధమున నుండుటచే నిందలి రాజమందిరముల రామణీయకమును గనులారఁ గాంచుట కవకాశము చిక్కినది కాదు. ఇపుడు నేను నిర్దోషినిగాఁ బరిగణింపఁ బడుటచే సౌధోపరితలమున కేగి, నగరవైభవమునుఁ బరికింతును. అని మేడపైభాగమున కేగెను. అపుడు కుముదిని చెలికత్తియలతోఁ గలసి నిజసౌధమునకుఁ జేరియున్న పూలతోఁటలోఁ గుసుమములఁ గోయుచుండెను.

గుణచంద్రుఁడు మేడపైనుండి తారాగణముల నడుమ చంద్రకళ వోలె సహచరీగణమధ్యమున నున్న రాకుమారికను జూచి, ఆకన్యకామణి సౌందర్యమున కచ్చెరువంది, ఇట్లు వితర్కింపఁ దొడఁగెను. "ఇపుడు నేనున్నది దివ్యకన్యాసంచార సుందరమగు నమరావతీ పురమా! లేక మానవకుమారీ విహారవిలసిత మగు సాకేతనగరమా ? ఆహా ! యేమి యీదినకర కులసామ్రాజ్య వైభవము! పుట్టవలయునన్నఁ గోసలదేశమున నే పుట్టవలయును." అనుచుఁ గుసుమాపచయ మొనర్చుచున్న కుముదిని విలాసముల ఱెప్పవాల్పక చూచుచుండెను. అంతఁ గంచుకి వచ్చి గుణచంద్రునితో నిట్లుపలికెను

కంచుకి:—ఆర్యా ! సౌఖ్యముగా నుంటిరా? (ఓహో! ఈతని మానస మెటకో పోయియున్నది. నామాటలితని చెవినిఁ బడుటయే లేదు. అని తలయెత్తి తోఁటలోఁ బుష్పములఁ గోయుచున్న రాజకన్యను గనుంగొని సరే! అయస్కాంతశిల యినుమును నాకర్షించునట్లు, ఈకుముదినీ తారుణ్య మీతని మానసమును లాగికొనినది. మదవతులు కంటఁబడకున్నంత వఱకే మగవారిబింకములు" తిరుగఁ బలుకరించి మాతును) "సదాశయా! నామాటలొకింత యాలకింతురా ?" గుణచంద్రుఁడామాటవిని వెనుకకుఁదిరిగి కంచుకినిఁ జూచి తానంతఃపుర కాంతలఁ జూచుచున్నందులకు లజ్జితుఁడై తనలో "నేనీకన్యకాతిలకమును జూచుచుండుట నీతఁడు కనుగొని యుండును. ఇదివఱకు సేవకులతప్పులకు శిక్ష కలిగినది. ఇఁక

నిపుడేలికదోషములకు దండనము సమకూరనున్నది. నేనిపు డేమని యీతనితోఁ దెలుపుదును" అని వితర్కింపఁ దొడఁగెను.

కంచుకి:—సదాశయా! ప్రత్యుత్తరమీయ రేల? మామహారాజుగారు సాయంతన వాహ్యాళికి బైలుదేఱ నున్నవారు. వారిటకు వచ్చి మిమ్ముఁగూడఁ దోడ్కొని పోఁదలఁచినారు. ఈసంగతి మీకుఁ దెలుపుమన నేవచ్చితిని. నృపనందనా! నాకు మీరు ప్రథమ దర్శన మొసంగినప్పుడే "నిన్ను బ్రియమిత్రునిగా భావింతును." అంటిరి కదా.

గుణ:—ఔను. అంటిని. ఇప్పుడందులకు సందేహింపఁ గారణ మేమి?

కంచుకి:—శుభాశయా! మొదట నేఁబల్కరింప వినిపించుకొన రైతిరే యట్టి పరాకునకుఁ గారణమేమి.

గుణ:—మిత్రమా! వినుము నాబధిరతకుఁగారణము. నేను, కోటయొక్క చక్కఁదనమును జూచుకోర్కెతో నిట నిలిచి పరికించుసరికి, ఈపుష్పవాటికయందు, ఇందుముఖు లెవరో విహరించుచుండుట కానన య్యెను. అంత నే నావారిజాక్షుల పావనరూపములకు నచ్చెరు వొంది 'వీరి లచ్చరలై యుందురా? లేక నారీమణులై యుందురా' అని వితర్కించుచుంటిని. అపుడు నీవునన్నుఁ బలుకరించి యుండనోపుదువు.

కంచుకి:—నేర్పుకాఁడా! పరస్త్రీలనట్లు పరికింపఁదగునా? వారు నాకకాంతలైననేమి? మానవకామినులైననేమి? అట్టివితర్కమునకు నీమానసమునఁ జోటీయఁదగునా?

గుణ:—మిత్రమా! అనపేక్షితముగా నేవీరినిఁజూచుట తటస్థించినదికాని, సాపేక్షితముగాఁగాదు. అయినను నేఁజేసినపనికి వగచుచున్న వాఁడను.

కంచుకి:—మానధనుఁడా! నీవీ సుందరీమణుల నీక్షించుటలో దోష మేదియును లేదు. వీ రెల్లరును నవివాహితలగు యువతీమణులు కావున భీతిల్లకుము. మిత్రమా! యటుచూడుము. చెలికత్తెయ మెడపైఁ జేయివేసి యాచంపకశాఖను వంచి, పూల గోయుచున్న కన్నియమిన్న

యీకోసల సార్వభౌముని కూఁతురు. ఈమెపేరు కుముదిని, సచ్చరిత్ర, సకల కలాకోవిద.

గుణ:—అటులనా! ఈసుందరి రఘురాజపుత్త్రికయా? ఈసతీమణికరగ్రహణ మొనర్చుటకు భాగ్యశాలి యెవ్వఁడేని నిర్ణీతుఁడాయెనా?

కంచుకి:—ఆ! మొన్న నేమహారాజు వచ్చి రాణితో నాలోచించి వరనిర్ణయము చేసినాఁడు

గుణ:—ఆతఁడెవ్వఁడో? యనన్యసామాన్య పుణ్యశాలిగానుండ నోపు. ప్రియసఖా! ఆయదృష్టవంతుఁడే దేశ రాజనందనుఁడు? వివాహ మెప్పుడు జరుగును?

కంచుకి:—అతఁడు సుగుణసంపన్నులలో నగ్రేసరుఁడు, మానధనులలో నగ్రగణ్యుఁడు, ఆర్తసంరక్షకులలో నాయకుఁడు, విద్వాంసులలో మొదటివాఁడు, గానకళాకోవిదులలోఁ బ్రథముఁడు. గుణచంద్రుఁడని పేరెన్నికఁగన్నవాఁడు.

గుణ:—కంచుకీ! నన్నిటు పరాభవింపఁ దగునా! సాకేతపౌరులు కలలోఁగూడఁ గల్లలాడరని ప్రసిద్ధికదా!

కంచుకి:—మిత్త్రమా! అందుకుసందేహము లేదు. వారు నిత్యసత్యవ్రతులగు సాకేతసార్వభౌముల పరిపాలనములోనివారు.

గుణ:—వారట్టివారగుచో నీవీ వ్యాజోక్తులేల పలుకవలయు?

కంచుకి:—ఈయది యెంతమాత్రమును గపటోక్తి కాదు. యథార్థవచనము వినుము. మామహారాజు దివమునుండి భువికిరా వెంటనే రాణివాసమున కేగఁ బ్రభావతి మీచరిత్రమునంతను సవిస్తరముగా భర్తకు వివరించెను. మీపైఁగుముదినికి గాఢానురాగ ముదయించినటులఁ గూడఁ దెల్పినది. అందుపైని మహారాజు కుముదినిని బిలిచి ప్రశ్నింప సిగ్గుచేఁ బ్రత్యక్షముగా మాటలాడఁజాలక, తనసంకల్పమునొక లేఖలోఁ జిత్రించి తండ్రి కందిచ్చెను. ఆలేఖను రఘుపు చదివి మీరు సర్వవిధములఁ దనపుత్త్రికకు సరియగు వరులని తలంచి, యామెను మీకొసంగ నిశ్చయించెను.

గుణ:—ఇదియంతయు నభూతకల్పనముగా నున్నయది. కానిమ్ము. నన్నాసుందరాంగి యెట్లుచూచినది ? నాచరితమామె కెట్లు తెలియ వచ్చెను ?

కంచుకి:—ప్రౌఢయగు మీవీణాగీతిక దూతికయై, ఆరాజ పుత్రినంతఃపురాంతరమునుండి మీకడకుఁ గొని తెచ్చినది." అని జరిగిన విషయమునంతను వివరించెను.

గుణ:—మిత్రమా! నీపలుకులు నాకువింతను బుట్టించుచున్నవి కాని, విశ్వాసమును గల్గించుటలేదు. ఇయ్యదినాదోషమో లేక నీమో సమో ?

కంచుకి:—ఆర్యా! నన్ను మోసగానింగాఁ దలంపకుము. వినుఁడు నేఁడుమహారాజు మీకుఁగుసుమదినిపై ననురాగము కలదోలేదో తెలిసి కొనుఁడని నాతోఁ దెలిపినాఁడు. కాని నేనుమిమ్ముడుగకముందే మీహృ దయము వెల్లడియైనది. రాజకుమారా! మారాకొమరిత మీకునచ్చిన దియా ?

గుణ:—సన్మిత్రమా! సాకేతసార్వభౌములతో సంబంధమును గోరనివారుందురా, యని వారిట్లు సంభాషించుచుండ మహారాజుగారి గుఱ్ఱపుబండి గుమ్మముకడ నిలువఁ గంచుకి శకటముకడకేగెను. రఘు మహారాజు కంచుకినిజూచి "కంచుకీ! గుణచంద్రుఁడేమి చేయుచున్న వాఁడు ? ఆతనిహృదయమునుఁ గనుఁగొంటివా ?"

కంచుకి:—మహారాజా ! చంద్రికాపాప్తికై జకోరమునలెఁ గుసుమదినీ పరిగ్రహణమునకు నాతఁడుకుతూహలుఁడై యున్నవాఁడు. ప్రభువరా ! లోకమునలక్ష్మినిగావలదను వారుందురా?" అన రాజా మాటల విన్నతోడనే బండిదిగి మందిరములోనికేగ గుణచంద్రుఁడు రాజునకునమస్కరించి, యాసనముపైఁగూర్చుండఁ బ్రార్థించెను.రఘువు గుణచంద్రుని దనప్రక్కఁ గూర్చుండఁగోరి యిట్లుపలికెను.

రఘువు:—గుణచంద్రా ! ఇఁకహృదయమును మఱుగుపఱుప నేల ? నయశీలా ! రేపటెల్లుటఁ గుసుమదినీపాణిగ్రహణమహోత్సవ మేర్పాటు చేయనచ్చునా ?

గుణ:—మహారాజా! ఇట్టినిర్ణయములు తెలిదండ్రులు చేయఁదగినవి.

రఘువు:—గుణసంపన్నా! నీజనకుఁడు నాకుఁబ్రాణసఖుఁడు. కావుననీవు కళత్రసహితముగా నాతనికడకేగవచ్చును. అతఁడు కడుదూరమున నుండుటచే నిటకుఁబిలిపింప వ్యవధిచాలదు. కావున సందేహింపక కుముదినినిఁ జేకొనుము.

గుణ:—పెద్దలయాజ్ఞలకు బద్ధుఁడను కానిమహారాజా! నాకింకరులఁదప్పుల క్షమియించి, వారిని గారావిముక్తులనుగాఁ జేయఁగోరుచున్నవాఁడను. ఇత్తఱివారు దుఃఖితులై యుండుట నాకిష్టములేదు.

రఘువు:—మహోత్సవసమయములఁ గారాగారములనుండి బందీలవిడుచుట మాకుమర్యాద. నీసేవకులుతప్ప వేఱెవ్వరుఁజెరసాలలయందు లేరు. కావుననీయనుచరులు విడువఁబడుదురు." అని వెడలిపోయెను.

## సప్తమాధ్యాయము.

## కుముదినీకల్యాణము.

ఒకనాఁటి సాయంకాలమునఁ బగలుండినఁగలయిక కలుగనేరదని జగద్బాంధవుఁడగు సరోజినీకాంతుఁడు కుముదినీచంద్రుల సమావేశమునకుఁ దనయనురాగమును జూపుచు వెడలిపోయెను. కలువచందురుల పెండ్లిసోయగమును జూచుటకుఁ దారాసీమంతినులు గుంపుగుంపులుగా రాఁదొడంగిరి. నిశీథినియింటఁ జరుగఁబోవు కుముదినీచంద్రుల పరిణయమునకు దిక్కాంతలఁ బేరంటమునకుఁ బిలువ తమిస్రాఘోష బయలు వెడలెను. సప్తర్షులును వధూవరులనాశీర్వదింప రాఁదొడంగిరి. అంత గురునియాజ్ఞానుసారము చంద్రుఁడునిజకరమును సాచి కుముదినియొక్క పల్లవపాణిని, పరిగ్రహించెను. ఆముహూర్తముననే వసిష్ఠుఁడు కుముదినీ గుణచంద్రుల పాణిగ్రహణ మహోత్సవమును యథావిధిగ జరిపెను. విప్రోత్తములాశీర్వదింపఁ గోసలరాజదంపతు లానందింప, పౌరులుసంతసింప నావివాహమతివైభవముగా జరిగెను. రఘుమహారాజు వధూవరులకు నమూల్యములగు బహుమానముల నొసంగి నిజమంత్రియగు నయ

రుచిని సైన్యసమేతముగా సహాయ మొసంగి యానూతనదంపతుల సింధు దేశమునకుం బంపెను. గుణచంద్రుఁడర్ధాంగితోఁ గూడి గోమతీపురమునకు రాఁగానే శూరసేనుఁడు గొప్పయూరేగింపుతో వధూవరులఁ గోటలోనికిఁ గొని తెచ్చి గృహప్రవేశ మహోత్సవమును మహావైభవముతో జరిపెను. ఆవధూవరులు శూరసేనునకు నమస్కరించి యాతని యాజ్ఞానుసారము యామినీప్రాసాదమున కేగి యామెకు వందనములొనర్పఁ గుటిలస్వభావయగు నాకుటిలాలక పైకిఁ బ్రేమను బ్రదర్శించుచుఁ గోడలిఁ గౌఁగిలించుకొని యమూల్యములగు నాభరణాదులనొసంగి, యాదరించి పంపెను. ఇట్లు రెండుమూఁడు దినములు గడువ నాయామిని విషవైద్యునిచే రహస్యముగాఁ గన్నులుపోవు మందుచేయించి దాచి యొకదివసమున నానూత్నదంపతులకు విందుచేయఁ గోరిక కలదని, సింధురాజుతోఁ దెలిపి యాతనినొడఁబఱిచి, శూరసేనసహితముగా రాజబంధువుల నందఱినిఁ దనమందిరమునకు రప్పించి ఘనగౌరవముతో విందేర్పాటుచేసెను.

శూరసేనుఁడు వధూవరులను వెంటనిడికొని యచటికిరాఁగానే ఆయామిని యెదురేగి లోనికిఁదీసికొనివెళ్ళి పీటలపైఁగూర్చుండఁబెట్టి ఫలహారపుఁ బళ్ళెరముల వారిముందు బెట్టించి, మందుకలిపిన వంటకములుగల పళ్ళెములను కుముదిని గుణచంద్రుల ముందుపెట్టించెను. గుణచంద్రుఁడు భార్యాసహితుఁడై కర్మవశమున దోషముకనిపెట్టనేరక యాభక్ష్యముల భుజించెను. అందుచే నావధూవరులు గ్రుడ్డివారైరి. అహా! నీచహృదయులు మహారాజులైనను రాణులైనను సహజదోషముల విడువఁజాలరు.

ఆవధూవరులతో గోమతీపురమునకు వచ్చిన కోసలమంత్రియగు నయరుచి యానూత్నదంపతులకుసంప్రాప్తమైన దురవస్థకిట్లువిచారింపఁ దొడఁగెను. "ఆహా! పట్టుమనిపదినాళ్ళైన దాంపత్యసుఖముల నీదంపతులనుభవింప లేదే! ఇంతలోనే యెంతటివిపరీతము జరిగినది. నేనెట్లీ దారుణవార్తను రఘుసార్వభౌమున కెఱింగింతును? అయ్యయో! యీకుముదిని యెంతటిదౌర్భాగ్యురాలు! ఇఁక నీవధూవరుల జీవితములునిష్ఫలములు ఆహా! ఈశ్వరవిలాస మెంత చిత్రము! సంసారసౌఖ్యములకు మెఱపుల

కున్నంతటి నిలకడకూడఁ గానవచ్చుటలేదే! పాపమీరాచబిడ్డ కేవలము గుర్రిడ్డితనమునకు నత్తింటఁగాలిడినది. కట్టా! నేనేమిచేయువాఁడ. కాదు కాదు. నేనిట్లు విచారింపఁబని లేదు మారాణిప్రభావతి సాధ్వీశిరోమణి ఆపెకీవార్తఁదెలిసినఁ దనపాతివ్రత్య ప్రభావముచేనీరికి నేత్రముల నొసంగఁగలదు. కావున నేనువెంటనే యయోధ్యకేగి ప్రభావతీదేవి కీవార్త ను దెలియఁజేయుకును." అని వెడలిపోయెను.

సాకేతమున రఘుమహారాజును బ్రభావతియుఁ గుముదినితమ్మ్మ వీడి యత్తవారింటికేగుటచే నామె యెడఁబాటునకుఁ గొంచెము విచారముగానుండిరి. నిజమే! పుట్టినదిమొదలు తమకడనేపెరిఁగిన బిడ్డలొక్క మాఱు దూరమగుచోఁ దలిదండ్రులబెంగటిలరా! అంత నాదంపతులి ట్లు ప్రసంగింపఁదొడఁగిరి

రఘువు:—ప్రాణేశ్వరీ! సామాన్యముగాఁ గన్నియలఁగన్నవారికి వారివియోగము తప్పదు. ఇంటనుండి దలిదండ్రులఁ గనిపెట్టుకొని యుండువారు పుత్రులు, మనకిపుడు పుత్రసంతతిలేదు. అందునిమిత్తము తీర్థాటన మొనరింతము రమ్ము.

ప్రభావతి:—ప్రాణేశ్వరా! సంసారసంబంధములు మిథ్యావిలసితములని ప్రాజ్ఞులెరింగియుఁ బ్రకృతివశమున వానినివిడువఁ జాలరు. మబ్బు జందురునిఁగప్పునట్లు మాయ వివేకమును మూయుచున్నను; మనోవల్లభా! మొన్నటినుండియు నామానసమెందులకో ఉన్నట్లుండి భయమొందుచున్నది. కూతునకు దగువరుఁడు సమకూరుటచే నానందింపవలసిన సమయమున, ఈభీతియేలకో? తెలియరాకున్నయది. ఇట్లు వారుసంభాషించుచుండఁ గంచుకి యొకయుత్తరమును దెచ్చిమహారాజున కందిచ్చెను. ఆరాజాయుత్తరమును జదివి "హాకుముదినీ గుణచంద్రు లారా!" యని మూర్ఛపోయెను. అంతప్రభావతి తత్తరపాటుతో భర్త కుపచారములుచేయ నాతేఁడు మూర్ఛతేరి యాయుత్తరమును భాను మతికిచ్చెను. ఆపెయాలేఖను జూచి కన్నీరువిడువసాగెను. ఇట్లారాణి కొంతసేపు విచారించి ధైర్యముఁబూని నిజవల్లభునితో నిట్లుపలికెను.

ప్రభా:—ప్రాణనాథా! విపత్కాలమున మిమ్ముబోంట్లకు ధైర్యముతగునుగాని విచారమనువుగాదు. ఆపదలుకాపురముండునా లెండు. కర్తవ్యమును యోచింపుడు." "సుఖస్యానంతరం దుఃఖందుఃఖ స్యానంతరం సుఖం" అని పెద్దలు తెలిపియున్నారు. ఇది సత్యమగుబోధ. దుఃఖములనడ్డుటకుంగాని, సుఖములం గొనివచ్చుటకుంగాని యెవ్వరికి సాధ్యముకాదు. రఘువు నయరుచిని లోపలకురప్పింప, ఆతఁడు మహా రాజుకడకు వచ్చెను. రాజాతనితో నిట్లుపలికెను. "మంత్రీ! నాపుత్రిక భర్తృసహితముగా నంధురాలగుట నిజమేనా? హఠాత్తుగానంతటి విప త్తెట్లు సంప్రాప్తమయ్యె.

నయరుచి:—మహారాజా! ఆగుణచంద్రునకు యామినియను యవనాంగన యొకర్తు సవతితల్లి. ఆపె వధూవరులకుఁ దనమందిరమున విందేర్పాటుచేయ శూరసేనసహితముగా మేమందఱమటకేగి ఫలహార ములఁ జేకొంటిమి ఆవెంటనే కుముదినీగుణచంద్రు లంధులైరి దోష ముదైవమునకుఁ దెలియవలయు.

ప్రభా:—ఆహా! మాపుత్రికకు సవతియత్త కూడఁగలదా? అందునునాపె యవనాంగనయా? సరే! యికఁ దెలుప నగత్యము లేదు.

రఘు:—మంత్రీ! కుముదినీగుణచంద్రులు గుడ్డివారైనపిమ్మట నీవు వారినిఁ జూచియుంటివా? ఆదంపతులు మాకేదియేని తెలుపుమ నిరా? అహా! దైవమాయ. నాబిడ్డపట్టుమని పదినాళ్ళు సంసారసుఖ మనుభవింపకమున్నే యొంతటి ఘోరవిపత్తు తటస్థమైనది. రాజులైన నేమి రారాజులైననేమి లలాటలిఖితమును మార్పఁజాలుదురా! ఇఁక నాదంపతులు దురంతచింతఁబడి, జీవితాంతమువఱకు దుఃఖింపవల సినదే. ఆహా! మానవానందము లెంత చంచలములు. వివాహమహో త్సవమునకై నిర్మింపఁబడిన యీకాయమానాలంకారము లిప్పటకిని గన్నులపండువుగాఁ గానవచ్చుచున్నయవి. కాని యీకల్యాణ మండప మున నెవరికిఁ బాణిగ్రహణ మహోత్సవము జరిగెనో, యావధూవరులు మాత్రము కన్నులు లేనివారై నవయుచున్నవారు. కుమిదినీజీవిత సౌ ఖ్యమింతటితో ముగిసినది విధివిధానము నడ్డువారెవ్వరు.

నయరుచి:—రాజేంద్రా! తామిట్లు విచారింపఁదగదు. శూరసేనమహారాజు కుముదినీగుణచంద్రులకు సంప్రాప్తమైన కష్టమునకుఁ బరితపించుచున్నవాఁడు. ఆరాజేలనో? తాఁదక్క నితరుల నెవ్వరిని వారికడకుఁ బోనిచ్చుటలేదు. వారికిఁగావలసిన సదుపాయముల నన్నిటినిస్వయముగా దగ్గఱనుండి తనకువిశ్వాసముగల దాసీదాసాదులచేఁ జేయించుచున్నవాఁడు. నేనాయంధదంపతులఁ జూడనేరక వారిచెంతకుఁబోలేదు.

కోసలేంద్రా! విధివిధానమును దాఁటుమాఱుజేయఁజాలు సమర్థులు లేకపోలేరు. అజుఁడు మానవలలాటపట్టికను వ్రాసిన యక్షరపంక్తులఁ దుడిచివేసిస్వేచ్ఛగా వానిమార్చివ్రాయు ధీరలుసాధ్వీమతల్లులు, అందుకుసందేహములేదు. నిజాసమానపాతివ్రత్య మహిమలచే దుఃఖములఁబాఱఁదోలి జీవకోటికిసుఖముల సమకూర్చినవారును, ఈ పరిదృశ్యమానమగు ప్రకృతినంతను దమయిచ్ఛవొప్పున నడపించినవారును, తమయకలంక ప్రతిభావిశేషములచే దేవదానవాదులఁగూడ భయకంపితులనుగాఁ జేసినవారునగు సాధ్వీలలామలు- ఈభారతభూమి నెందఱోకలరు. రాజేంద్రా! ఆసాధ్వీమణుల మాటయేల? తమకర్థాంగియగునీప్రభావతీదేవి తనపాతివ్రత్య మహిమచే శరద్వతునిమృతసుతునిఁ బ్రతికింపలేదా? సుశీలవైధవ్యమును దూరముచేయలేదా? దిక్పాలుర గర్వమడంచి నీతినిఁగఱపలేదా? కావున మహారాజా! కరమున దీపకళికనుబట్టికొని, చీఁకటికిభయపడునట్లు సతీమణియగు ప్రభావతీ కరగ్రహణ మొనర్చిన మీరిట్లు విచారింపఁబనిలేదు. నేను గోమతీపురమున నిలువకపరుగిడి వచ్చుటకుఁగారణము తమకీవార్తను దెలియఁజేసిమిమ్మిటకుఁబంపుటకే. కావున నృపవరా! మీరలు ప్రభావతీదేవిగారితోఁ గుముదినీగుణచంద్రులకడకేగి యాదంపతులకు దృష్టిసంపదను సమకూర్పుఁడు.

రఘు:—ప్రాణేశ్వరీ! ఈనయరుచి తెలిపినదంతయు సత్యము. సంసారులలో నొక్కపతివ్రతలే విధివిధానములఁ దాఁటుమాఱుగాఁజేయఁ జాలినవారు. ఇందుకు మనమంత్రి తెలిపినటు లనేకనిదర్శనములు కలవు.

ప్రేయసీ! మనమిదివఱకే, తీర్థాటనాభిలాషులమై యుంటిమి; ఇప్పుడు తీర్థస్వార్థములు రెండును బడయనగు సమయము దైవకృపచే సమకూరినది కావునఁగోసలరాజ్య భారమునుమంత్రిలపైనిడి యీనాఁడేబయలుదేఱుదము. అట మనలఁదలంచి యాతపస్విని యెంత విలపించుచున్నదియో?

ప్రిభావతి:—ప్రాణవల్లభా! నాయభ్యంతర మేదియునులేదు. భగవంతుని కృపయున్నచో నాదంపతులకు సౌఖ్యము చేకూరుటలో సంశయముండదు. రఘువాసాధ్వి మాటలకు సంతసించి, వెంటనేరాజ్యమును నయమునకి స్వాధీనముచేసి, ప్రిభావతితో గోమతీపురమునకు వెడలిపోయెను.

సింధు నాయకుఁడగు శూరసేనుఁడు రఘుమహారాజు ప్రిభావతి తోఁగూడి, తనపురమునకు వచ్చుచున్నాఁడను వార్తనువిని, "వారినెట్లు చూచువాఁడ"నని దిగులొంది, ఆసమయమునఁబట్టణముననుండుటకంటెఁ బురమువిడిచి పరారినగుట మేలనిఁతలంచి, వేఁటనెపమున వెడలిపోనిశ్చయించి, మంత్రియగు సుశీలునిఁబిలిచి యిట్లనెను. "సచివోత్తమా! క్రూరసత్వములు గ్రామములపైఁబడి ప్రజల బాధించుచున్నవియట. కావున నటవికేగి, వానిసంహరింపవలసియున్నది. నేనువచ్చువఱకు నీవు కుమువిదినీ గుణచంద్రులఁ గంటికిఱెప్పవలెఁ గాచుచుండవలెను గుణచంద్రుని యాలోచనముపై రాజ్యకార్యములఁ జూచుచుండవలయును. నేనిటలేనప్పుడు, ఆయామిని దేనినేనిఁజేయుమని కోరినచోఁ జేయవలదు దేనినిమఱచినను నాయంధదంపతుల సంరక్షణమును మాత్రముమఱువకుము." అని వెడలిపోయెను.

సుశీలుఁడు:—అయ్యో! ఈరాజెంతపిచ్చివాఁడు కోటలోఁగ్రూరభుజంగిని బెంచుచు నటవియందు శ్వాపదముల వేఁటాడనేగుచున్నవాఁడు. నిజనివాసమంటుకొని తగులఁబడుచుండఁగొండలకేగి, దావానలమును జల్లార్పఁగోరు వానిపోలిక నాయేలికకుఁబట్టినది.

ఆహా! గృహచ్ఛిద్రములలోఁ దగులుకొనినవారు, ఎంతటి మహిమాఢ్యులైనను, మఱెట్టివిద్వాంసులైనను నిష్ప్రయోజకులగుదురుకదా

ఈనృపుని ముఖవైఖరినిఁజూడ నీతఁడు తిరుగఁబురమునకు వచ్చునో రాఁడో యనిసంశయము గలుగుచున్నది. నిజమే! ఇపుడీతనికి సంసారమున సుఖములేశమైనఁ గానవచ్చుటలేదు. గుణనిధియగు ప్రథమకాంత లోకాంతరగతయయ్యెను. దుశ్శీలయగు యవనకాంత ఇంటఁజేరి చిత్తవ్యాకులమును కలిగించెను. సజ్జనసార్వభౌముఁడనదగిన నందనుఁడు కళత్రసహితముగా గుడ్డివాఁడయ్యెను. ఇట్టిస్థితిలో నాయేలిక యెట్లునిశ్చల చిత్తుఁడుకాగలఁడు.

ఆహా! సూర్యకాంతివంటి కాంతిమతి జారిపోవ. నీయవనఘూకి యంతఃపురమునఁజేరినది. ఈదుష్టస్వభావ తన్నుఁబీడించుచున్నను శాంతస్వభావుఁడగు గుణచంద్రుఁడు తనతండ్రితో దీనిదుర్ణయములఁ దెలుపఁడుసరియేకదా, ప్రియస్నేహితులతోఁ గూడ పల్లెత్తియెట్టిపలుకులను నుడువఁడు. ఇపుడునేను గుణచంద్రునికడకేగి రాజువేఁటకేగినసంగతినిఁ దెలుపుదును. అని గుణచంద్రమందిరమునకు వెడలిపోయెను.

## అష్టమాధ్యాయము.

## స తీ మ హి మ ము.

శూరసేనుఁడు గోమతీపురమును వీడినమఱునాఁడు రఘుమహారాజు ప్రభావతీసహితుఁడై యటకువచ్చెను. ఆమహారాజు రావెంటనే సింధుమంత్రిలెదురేగి చక్రవర్తిమర్యాదలతో దుర్గములోనికి నాకోసలేశునిఁ గొనివచ్చిరి. అంతనారఘుపు "కుముదినీగుణచంద్రు లెచ్చటనున్నవా"రని అడుగ సుశీలుఁడా రాజదంపతుల గుణచంద్రమందిరమునకుఁ దోడ్కొనిపోయెను. వారపుడు, అంధులైయున్న జాయాపతులఁ గనుఁగొని, దుఃఖమగ్నులైరి. ప్రభావతి కుముదినినిజూచి కంటఁగన్నీరు పెట్టుచు నిట్లనియె.

ప్రభావతి:—అమ్మా! కుముదినీ! నీతలిదండ్రులఁ జూడనేరవా? అనిపుత్రికనుఁ గౌఁగిలించుకొని కన్నీరువిడువఁ జొచ్చెను.

కుముదిని:—జననీజనకులారా! మాదురవస్థనుదెలిసి మమ్ముఁ జూడవచ్చితిరా? తల్లీ! మీకీదుఃఖవార్త నెవ్వరు తెలిపిరి. ఆ! బహుశః

మీకీవార్తను నయరుచి తెలిపియుండును. అమ్మా! నీపాదములనిటు చాఁపి నాచేతులకుఁదగులునట్లు చేయుము. తవివితీరఁ బట్టుకొని వందన మొనర్తును తల్లీ! కుంకుమతిలకసుందర మగు నీపావనవదనమును జూచుట కలవా యెకదా. జననీ! నాసఖులు సుఖముగానున్న వారలా? మాతరో! వారికిఁగూడ నాదురవస్థ తెలిసెనా? అమ్మా! మాటలాడ వేల? దుఃఖించుచుంటివా? నాయనగారేరి? పలుకరింప రేమిటలకు?

రఘు:—పుత్రీ! ఎంతటివిపత్తునఁ బడియుంటివి. తల్లీ! అమావాస్యకుసాగరముపొంగునట్లు నీయీదుస్థితికి నాదుఃఖసముద్రముపొంగుచున్నయది. దానినాఁపుకొనుటకుఁ గష్టముగా నుండుటచే మాటలాడఁ జాలకుంటిని. పుత్రీ! వివాహమైనవెంటనే నిన్నుసాకేతమున నిలువనియ్యక నీభర్త తొందరపడుటచే నిటకుఁబంపితిని. మీర లయోధ్యలో నుండిననీయాపద రాకుండెడిది. నాతొందరపాటే మీకీకష్టమునుఁ దెచ్చినది.

కుము:—దయాసాగరా! మీరుచేసిన త్వరపాటెద్దియును లేదు. పుట్టిననాఁటనుండి గారాబముతోఁ బెంచి సకలకళల నభ్యసింపఁ జేసితిరి. మఱియు మీకుఁదెలుపక నేస్వయముగాఁ బ్రేమించిన వరుని మాఱుమాటాడక నాకుమనోవల్లభునిగాఁ జేసితిరి. నిష్కళంకానురాగముతో విలువలేని సారెచీరెలనిచ్చి యత్తింటికిఁబంపితిరి. ఇకఁ నావిషయమున మీరొనర్చిన లోపమేదియో వివరింపుఁడు.

ఈయంధతయందురా? నిజకర్మజనితము కాని, పరజన కృతము గాదు. కావున, మీకీదుఃఖముతో సంబంధము లేదు. పితరులారా! దైవాధికుఁడగు భర్తకునేస్వయముగా నుపచారములఁ జేయఁజాలకుంటి ననెడి విచారముతక్క మఱెట్టిఖేదమును లేశమైననామానసమున నంకురింపలేదు. అంకురింపనేఱదు. ఇదియిచ్చకపుమాటకాదు. సత్యవచనము. జననీ! నీయట్టి పతివ్రతాతిలకముల కటాక్షముండిన నీచంచలప్రపంచమునుఁ జూడనగుమాపేకాక, నిత్యమగు పరబ్రహ్మనుసందర్శింప సమర్థమగు దివ్యదృష్టికూడ సమకూరును. ఇందు కొంతమాత్రమును సందేహము లేదు.

గుణచంద్రుఁడు:—ఓసాకేతసార్వభౌమా! ఈమీపుత్త్రికారత్నమదృష్టహీనుఁడనగు నన్నుఁజేపట్టుటచే నిట్టిదురంతదుఃఖము చెందవలసినదాయెను. ఈకన్యకామణి నాశరీరసంపదనే చూచినదికాని, నాదురదృష్టరూపమునుఁ దిలకింపనేఱదయ్యె, నామూలమున, కుముదినియు, నాపెనుమూలమున మీరును దుఃఖింపవలసినవారైతిరి. ఇట్టిదుర్దశలో దుఃఖానభిజ్ఞయగు నీసుకుమారి దృష్టిదరిద్రుఁడనగు నాకడనుండుట తగదు. కావున, నాయందనుగ్రహముంచి యీకోమలాంగినిఁ గోసలమునకుఁ గొంపోవఁగోరుచున్నాఁడను.

కుము:—మనోవల్లభా! మీరిట్లుపలుకుట న్యాయముకాదు. మీవలన నాకెంతమాత్రము దుఃఖము కలుగలేదు. పరికింపనావల్లనే మీకుఁగష్టము సంభవించినది. అత్తింటివారికిసుఖదుఃఖములుకొత్తగాఁగాలువెట్టిన కోడండ్రభాగ్యాభాగ్యములపై నాధారపడియుండును. అని పెద్దలు తెలుపుచున్నవారు. ఆరీతినే, నేను గృహప్రవేశమైనతోడనే, మీకీవిపత్తుతటస్థమైనది. కావున నియ్యదినాదోషమేకాని, మీదోషముకాదు. హృదయేశ్వరా! నన్ను నాతలిదండ్రులఁదీసికొని పొండనుచుంటిరే, ఇది మీయట్టి ధర్మజ్ఞులకును, దయామయులకును, తగునా? గ్రుడ్డివాననై మీసుందరవదనారవిందమును జూడనేరకుంటినే యని యడలుచుండ మీకుదూరమై, మనోహరములగు మీధర్మబోధల వినియానందించు శ్రుతిభాగ్యమునుఁగూడఁ దొలఁగింపనెంచితిరా?

ఆర్యా! నాయంతరాత్మ మీశీలసంపదలఁ జూచి మిమ్ముఁబ్రేమించినదికాని, మీబాహ్యరూపమునుఁ జూచి వ్యామోహమునుఁ జెందలేదు. కావున, మీరుకన్నులులేనివారైనను, లేక తామరసాక్షులైనను, దరిద్రులైనను, ధనికులైనను, సరే, వానితోనాకు నిమిత్తములేదు. నాకుసదాసంతసమును సమకూర్చునది మీసచ్చరితమే. దానికెన్నఁడునుఁ గొఱంతయుండనేరదుకదా? కావున నేనుహీనస్థితి నుంటిననియు దానికి మీరు కారణమనియు, భావింపఁజనదు. ప్రాణేశ్వరా! నన్నెన్నఁడు మీకుదూరముసేయఁ బ్రయత్నింపకుఁడు.

రఘువు:—కుముదినీగుణచంద్రులారా! యియ్యది మేమొనర్చిన పాపఫలముకాని, మీరొనర్చిన దురితదోషముకాదు. స్వసంతతిసుఖదుఃఖములకుఁ బితరులపుణ్యపాపములె కారణములు. మేముపూర్వజన్మమున నెవరిబిడ్డలనో గ్రుడ్డివారినిగాఁ జేసియుంటిమి దానిఫలమిప్పుడుమాకుసంప్రాప్తమైనది. కర్మఫలము లవశ్యానుభవనీయములు, అని ప్రభావతిని జూచి యిట్లుపలికెను. సతీమణీ! ఇంకజాగుసేయక నీపాతివ్రత్యప్రభావముచే, ఈవధూవరులకు నేత్రసంపదనొసంగుము. నీసతీత్వమును బ్రకటించుట కింతకంటె మంచిసమయము దొరకబోదు.

ప్రభావతి:—ప్రాణేశ్వరా! శతఘ్నికి శత్రుసంహారమొనర్చు శక్తి యగ్నిచూర్ణమువలనఁ గలుగునట్లు, సతికిసామర్థ్యము పతిపాదపరాగమువలనఁ జేకూరుచున్నది. కాని, కేవల స్వశక్తిచేఁగాదు. సతికిఁబతియే దైవమని, రఘువునకుఁబ్రదక్షిణ నమస్కారములుచేసి, కరపుటము సంఘటించి "ఓ సర్వాంతర్యామీ! పరాత్పరా! దయామయా! నేను నిజముగాఁబతిపాదభక్తిపరాయణ నగుచో, నాకరస్పర్శచే నీయంధదంపతులకు దృష్టిభాగ్యము సమకూరుఁగావుత." అనిప్రార్థించి కుముదినితలపై నొకచేతిని గుణచంద్రునిశిరమున, రెండవకరమునుబెట్టి "వధూవరులారా! మానసమున భగవంతుని ధ్యానించి యొకరినొకరు చూడు" డన వారన్యోన్యావలోకన సంతుష్టాంతరంగులై ప్రభావతీపాదములపై సాష్టాంగముగాఁబడి, నమస్కరించి, పిమ్మట రఘుపాదములకు వందనములొనర్చిరి అప్పుడు గుణచంద్రుఁడిటులఁబలికెను.

గుణ:—"ఆర్యులారా! మీఘనత నెంతవర్ణింతును. ఆహా యుదారజీవితులారా! అసమానపరాక్రమ తేజముచేఁబురుషమండలమున భర్తయు, నిరుపమాన పాతివ్రత్య కాంతిచే స్త్రీ మండలమున భార్యయు, ఇటులఁదేజరిల్లుట మీదాంపత్యమునందే కానవచ్చుచున్నది. పావనచరితులగు మీయట్టి జాయాపతుల రాకచేమాగోమతీపురము పవిత్రక్షేత్రమైనది. మీరిదివఱకో నాకుఁ గళత్రభాగ్యమొసంగియు, నేఁడునేత్రసంపద నొసంగియు, నాజీవితమునిహపర సౌఖ్యా

నుకూలముగాఁ జేసితిరి. "ఈలోకమున సంసారికిసంపదలు సత్కళత్రప్రాప్తిచేఁ జేకూరు"ననెడి ఆర్యోక్తి నాజీవితమున సువ్యక్తమైనది.

రఘువు:—గుణచంద్రా! మమ్మునీవింతగాస్తుతింపఁ బనిలేదు. తలిదండ్రులు నిజసంతతికి సౌఖ్యముల సమకూర్చుట విధియైయున్నది ఇందపూర్వ మేదియు లేదు.

ప్రభావతి:—సుగుణాలయా! మాతనూజాత మూలమున నీకు సౌఖ్యము బ్బెననుట కేవల వినయోక్తి. భాగీరథి, పావనవాహిని యగుటకుఁగారణము నారాయణపదపద్మ సమాశ్రయణమే, స్త్రీ పూతజీవితయగుటకు హేతువు నిజపతిపాద సరసిజాశ్రయణమే. వేఱొక మార్గము లేదు లేదు. మఱియు బిడ్డలారా! సంసారదీపకళకు సతీపతుల స్నేహానికరము సాధనమని తెలిసికొనుఁడు.

ప్రభావతీరఘువులు:—నూతనదంపతులారా! మీరిరువురును సావిత్రీసత్యవంతులవలె వర్ధిల్లుదురుగావుత. ఆసర్వమంగళామనోహరుఁడు మీకుసకల సంపదల నొసంగుత.

కుముదినీగుణచంద్రులు:—దయామయులారా! మాకుఁగనుల నొసంగి కాపాడితిరి. ప్రత్యక్షదైవతములరగు మీరలు కొంతకాల మిట నుండి మాసేవలఁజేకొని మమ్మానందింపఁజేయఁ బ్రార్థించుచున్నవారము. అన నారాజదంపతులు వధూవరులచేతఁ గొంతకాలముండుటకు ననుమతింప వారపారానందమునొంది వారినిఁబూజింపఁ దొడఁగిరి.

ప్రభావతీపాతివ్రత్యమహిమచే నవవధూవరులకు నేత్రములు సమకూరినవను సువార్త గోమతీపురమంతటను సూర్యకాంతివలె వ్యాపించెను. పట్టణమున నెటు జూచినను జనులు గుంపులుగుంపులుగాఁజేరి, ప్రభావతినిఁ బ్రశంసించువారును, యామినిని దూషించువారును మన మహారాజేమూఢు డనువారును, ఓహో! పాతివ్రత్యమునకెంతటి మహిమలు కలవని వింతచెందువారును, ఇకమనకు గుణచంద్రుఁడే రాజైన బాగుండు ననువారును, కాన రాఁదొడఁగిరి. అపుడు యామిని నిజ సేవకులవలన జరిగినదంతయుఁ దెలిసికొని విస్మితచిత్తయై యిట్లు చింతింపసాగెను.

యామిని:—స్త్రీలు తమపాతివ్రత్య ప్రభావములచేవిధినిర్మాణములఁగూడ నిరాకరించునంతటి మహిమాఢ్యలై విలసిల్లుచుండ, ఆస్త్రీజాతిలోనే జన్మించిన నాయట్టి హీనాశయలు దురితపంకముల దిగఁబడి, నిరర్థక జీవితలగుచున్నవారలు. ఆహా! మొదటఁగామ వ్యామోహము చేతను, పిమ్మటఁ గ్రోధప్రాదుర్భావముచేతను, నేనెన్నియో పాప కార్యముల నాచరించియుంటిని. ఆహా! జగదీశా! నేనొనర్చిన దురిత కృత్యముల నిపుడింతటి భయంకరరూపము కలవానినిగాఁ జూపుచుంటివే! కృపానిధీ! ఈయనుగ్రహము నేనువానినాచరించుటకు ముందేల చూపవైతివి?

అహాహా! సుతుని బడయఁగోరితినా! పతిని హతునిఁజేయఁజూచితినా! ఇదియంతయుఁజాలక తుదకీనూత్నదంపతుల నంధులనుగాఁజేసితినా! అయ్యయ్యో! నేనీపాపకార్యములఁ జేయించుటకు వెచ్చించిన ధనమున కంతు కలదా? నిజముగా నాకీవివేకము మొదటనే యున్నచో, ఆధనముతోడ జనహితకార్యముల నెన్నియోచేసి యుండనగునుకదా. ఔరా! భగవద్విలాసమెంత చిత్రము. ఒకవైపునఁ బ్రభావతీ జీవితముచే లోకకళ్యాణమునకు స్త్రీలే ప్రధానకారణమని తెలియఁజేయుచు, నికనొకవైపున నీయామినీజీవితముచే స్త్రీలే లోకవినాశమునకు ముఖ్యలని స్థిరముచేయుచున్నయది. అబ్బా! నేఁజేసిన పాపములు పరిహారమగుటయెట్లు? వానినిఁదలంచిన కొలఁది నాదేహము కంపమెత్తుచున్నయది, స్మృతి తప్పిపోవుచున్నయది; చూపు కానరాకయున్నది; ఏమిచేయుదాన నెటకేగుదాన!

సాధ్వీలలామల కొకదైవమును, నాయట్టి గయ్యాళిగంపలకొక దయ్యమునుకలఁడా? అటుఁగాక సర్వసముఁడగు సర్వేశ్వరుఁడొక్కఁడే యున్నచో నింతటి విపరీతసృష్టి యెట్లుద్భవమగును? ఆహా! గుణచంద్రా! వినయసాగరుఁడవగు నీజీవితమునకు నేఁగాళరాత్రినైతిని కదా! వత్సలుఁడగు నీతండ్రికి నీపై ననుమానమంకురింపఁ జేసితినే నాదుశ్శీలముచేతనే యాతేఁడు సజ్జనభీతుఁడై యెటకో వెడలిపోయినాడు. ఆహా! కుటిలమానసలగు నాయట్టి తరుణులమూలమున నెన్నియో

రాజ్యములు తబ్బిబ్బులైనవి! ఇఁక నాయపకీర్తి ఫలకములు దిక్కుడ్యములపై నినుపసీలలతోఁ గట్టిగా బిగింపఁబడఁగలవు. అదేమిచిత్రమోకాని యీభూమిపై మధురోదకముకంటె నుప్పినీళ్లు హెచ్చుగ నున్నట్లుమంచి వారికంటెఁ జెడ్డవారు హెచ్చుగా నుందురు. ఆహా! నావంటి వంచక జీవుల సృష్టించుటలో భగవంతుని తలంపేమైయుండునో! రోగము లున్నఁగాని యౌషధగుణములు తెలియరావు. ఖలులున్నఁగాని సుజన శీలములు వెల్లడికానేరవు. ఈభేదమును జూపుట కజుఁడుసృజించియుండును. అనుచు పశ్చాత్తప్తుఁడై విచారింపఁ బోడగెను.

## —: నవమాధ్యాయము :—

### —: గుణచంద్రపట్టాభిషేకము :—

గుణచంద్రుఁడు తనతండ్రిపురమున లేకుండుటచేఁ జింతించి సుశీలునిఁబిలిచి యిట్లుపలికెను.

గుణ:—సచివపుంగవా! ప్రభావతీప్రభావముచే మాదంపతులకుఁ జూచుభాగ్యమబ్బినది. కాని యిట్టి సంతోషసమయమున నాజనకుఁడు లేకుండుట నాకుఁజాలఖేదముగానున్నయది. కావున నీవరణ్యమునకేగి శీఘ్రముగా మనయేలికనుఁగొనిరమ్ము. నేనేగుదునన్నఁ గోసలచక్రవర్తి భార్యాసహితముగా నిటఁగోటలో నివసించియున్నవాఁడు. వారినివిడిచి వెళ్లుటమర్యాదకాదు.

సుశీలుఁడు:—వినయసాగరా! నేనిదెవనమునకేగి మీజనకులఁ గొనివత్తును. మీరుదృష్టి సంపన్నులైరని తెలిపిన మిమ్ముఁజూచుటకు వారుపరుగిడివత్తురు. అని తిన్నగానడవికేగెను.

శూరసేనుఁడు పిచ్చియెత్తినవానివలె నిట్లుపలుకుచు నడవిని దిరుగఁదొడఁగెను. "గుణచంద్రా! గుణచంద్రా! తండ్రీ! నాముూలమున నీకెట్టికష్టమువచ్చినది. హా! ప్రాణేశ్వరీ! కాంతిమతీ! స్వర్గము నుండి నాదుశ్చేష్టలఁ జూచుచుంటివా? హా! కాంతిమతీనందనా! అర్ధాంగితోఁగూడ నంధుఁడవైతివిగా! అయ్యో! యెంతదుఃఖించుచుంటివో కదా! అబ్బా! నేనెంతటికూరాత్ముఁడను. మనోహరమగు నిజ

సుతుని సౌఖ్యసౌధమును నేలఁగూల్చితినే! కాంతిమతీ జీవిత కాలము నాఁటి వెన్నెలరాత్రులు గడచిపోయినవి. నేనిపుడు యామినీవ్యామోహాంధకార నిశలఁదిరుగుచుంటిని". అనుచుండ సుశీలుఁడువచ్చి "మహారాజా! జయము! జయము!" అన రాజుతిరిగి చూచియిట్లుపలికెను.

శూర:—జయమా? ఇఁకమీఁదట నపజయ మని హెచ్చరింపుము. సుశీలుఁడా! నాయాజ్ఞనుల్లంఘించి యిటకేలవచ్చితివి? అయ్యో! నాపిచ్చి! నన్నొకయబల తృణీకరించుచుండఁ బురుషులు చులకన చేయుటలో వింతయేమున్నది. మంత్రీ! అంధులగు నాకుమారదంపతుల నొంటిగవిడిచి రాఁదగునా? అయ్యో! యీపాటికా క్రూరవ్యాఘ్రి యాసుకుమారుల హతమొనర్చియుండును.

సుశీలుఁడు:—మహారాజా! శాంతచిత్తులరై నేనివేదించుమాటల నాలింపుడు.

శూర:—శాంతచిత్తమా! అది యేగిచాలకాలమైనది; నేనీ లోకమునఁ గనఁదగినదియుఁ జూడఁదగినదియు నెద్దియునులేదు. పరలోకమున నసిపత్రవనము కానవలసియున్నది. యమునిమాటలు వినవలసియున్నవి

సుశీ:—ప్రభువరా! కుముదినీగుణచంద్రులు కోసలరాజ్ఞియగు ప్రభావతీపాతివ్రత్య మహిమచే దృష్టిసంపన్నులై సుఖముగా నున్నవారలు, మిముఁజూడ గోరుచున్నవారలు, వారికడనిపుడు భానుమతీ రఘుమహారాజులున్నవారు వారొంటరిగాలేరు.

శూర:—అహా! యెంతటిసువార్త! మంత్రీ! యిదిసత్యమా! సత్యమేయైయుండును. ప్రభావతీ పాతివ్రత్యము లోకప్రసిద్ధము. కాని మంత్రీ! అవినీతిపరుఁడనగు నేనెట్లాపుణ్యదంపతులఁ జూచువాఁడ?

సుశీ:—నృపవరేణ్యా! సజ్జనులుగుణములనేకనుఁగొందురు. అవగుణములగణింపరు. రఘుమహారాజు సుజనాగ్రగణ్యుఁడు. కావున మీరు సంశయింపఁబనిలేదు. ఆకోసలసార్వభౌముఁడు మిమ్ముఁజూడ నభిలషించుచున్నవాఁడు. పురమునకుదయచేయుఁడు. అన నాశూరసేనుఁడు సుశీలునితో గోమతీపురమునకు వెడలిపోయెను. ఇట గోమతీపురమున

యామిని పశ్చాత్తాపసమన్వితయై కుముదినీగుణచంద్రుల కడకేగి తాఁ జేసిన తప్పులక్షమింపుడని వేడికొన, గుణచంద్రుఁడు "అమ్మా నీవువిచారింపకుము, నీపైనాకు మాతృభావమేకాని శత్రుబుద్ధిలేదు. నీకోడలును నేనును నీయిష్టానుసారముగా నడచికొందుము." అనయామిని సంతసించి, కుముదినిని వెంటనిడికొని ప్రభావతికడకేగి నమస్కరించి తనతప్పిదములఁదెలిపి యిట్లువేఁడికొనెను.

యామిని:—సాధ్వీమణీ! ప్రభావతీదేవీ! యీదంపతులకు సంధ తెఁదొలఁగించి యానందమును సమకూర్చినటులు నాయజ్ఞానాంధతనుఁ బోనడఁచి జ్ఞానదృష్టినొసంగుము. అమ్మా! నేనిపుడుపశ్చాత్తప్తనై నేఁ జేసినపాపములకు భయపడుచున్నదానను. సతీరత్నమా! నాపాపములు తొలఁగిపోవుమార్గమేదియేని గలదా! పరమశత్రువులనైన శరణన్నమాత్రాన నభయమొసంగి కాపాడుట యినకుల నృపాలురకును, వారినారీమణులకును వ్రతముకదా!

ప్రభావతి:—సోదరీ! విచారింపకుము. ప్రాణులు కర్మవశమున శుభాశుభకార్యములఁజేయుచుందురు. గాలిచే, లతావిటపములు కదలునట్లు కర్మముచే స్త్రీపురుషులు సచరించుచుందురు. సతికిఁబతిసేవను మించిన సన్మార్గములేదు. కావున నిన్నుసతినిగా నెంచినపతిని దైవముగా భావించి పూజింపుము. ఇద్యదియే స్త్రీలకు యజ్ఞము. ఇదియే మోక్షసాధనము. పాపకార్యములఁజేసి పశ్చాత్తాపమును జెందువారల భగవంతుఁడుక్షమించును. పాపకృత్యముఁలొనర్చి పాషాణములవలెనుండు వారిని పరమేశ్వరుఁడు కఠినముగా దండించును. సుదతీ! తిరుగవ్యామోహమునఁబడి చెడిపోకుము.

యామిని:—అమ్మా! ప్రభావతీ! ఇందుగుజిగురు బురదనీటిని నిర్మలము చేయునటుల నీయుపదేశము నాకలుషమానసమును స్వచ్ఛముగాఁజేసినది. తల్లీ! కుముదినీ! నాతప్పులను మన్నించినన్ను నీకొకపరిచారికనుగాఁ జేకొనుము. ప్రభావతీసుతవగు నీసేవయేనాకు శుభప్రదము. కామధేనుసేవయెట్టిదో దానినందినీసేవయు నట్టిదేకదా! అని ప్రభావతీ కుముదినులఁ బ్రార్థించెను.

కుముదిని:—అమ్మా! యామినీదేవి! ధీమంతులుకూడఁ బ్రమాదములకు లోనగుదురు. తప్పులదిద్దికొనుటయే వివేకలక్షణము. ఈశ్వర కృపచే మీకిపుడుచీఁకటితొలంగి వెలుఁగుకానవచ్చినది. ఇఁకమీజీవిత యాత్ర పుణ్యప్రదముగా సాగును; నేను మీకుపచారములఁ జేయఁ దగిన దాననుగాని, మీచేఁ బనులఁజేయించుకొనఁదగినదాననుగాను. మీరునాకు గౌరవనీయులు. కావున, మీరు మీపుత్రిల క్షేమముగనుఁ గొనుచు నిశ్చింతగా నుండఁగోరుచున్నదానను. అన, నాయామిని యా వినయోక్తులకానందించి ప్రభావతీ కుముదినుల విడిచి తనమందిరమున కేగెను.

శూరసేనుఁడు సూర్యోదయమగుచుండ సుశీలునితో గోమతీపురముఁ బ్రవేశించెను. గుణచంద్రుఁడు తండ్రిరాక నెఱింగి సతీసహితుఁడై యెదురేగి నమస్కరింప నాతఁడాతని గాఢాలింగనమొనర్చి యానందబాష్పములు కన్నులనుండిరాల నిటులఁబలికెను. "సుపుత్రా! తిరుగ నినుఁజూచు భాగ్యము నాకుఁ గలుగదనుకొంటిని. మహానుభావురాలగు ప్రభావతి యనుగ్రహముచేఁ గన్నులార నినుఁజూడఁగలిగితి. తండ్రీ! కుముదిని సుఖముగా నున్నదియా? మీకు నేత్రదానమొసంగిన యాపుణ్య దంపతులెచ్చటనున్నవారు? వారి రాజమర్యాదలతోఁ బూజించుచుంటివా? నేనుమీకు దండ్రియనుపేరుతోనున్న శత్రువును. గుణచంద్రా! కుముదినీకరగ్రహణముచే భాగ్యశాలివైతివి.

గుణ:—తండ్రీ! మీరనినట్లు నేనిపుడు మహాభాగ్యశాలినైతిని. సందియములేదు. దేశద్రిమ్మరిని కావలసిన నాకుననువ్రతయగు కోసల రాజనందన యర్ధాంగియైనది. అంధులమై యవియుచున్న దంపతులము దృష్టిసంపన్నులమైతిమి. నన్నెడఁబాసి పోఁదలంచిన జనకుఁడు కన్నులకుఁగానవచ్చె, నాపైఁగోపించిన తల్లికి నేనిపుడు పుత్రుఁడనైతిని. పావనులగు సూర్యవంశరాజదంపతు లత్తమామలైరి. ఈశుభపరంపరలచే నాజీవితము సర్వవిధముల భాగ్యవంతమైనది

శూర:—గుణచంద్రా! ఇఁకనొకశుభము నేనుఁగనులారఁ గాంచవలసియున్నయది. అది నీపట్టాభిషేకమహోత్సవము.

గుణ:—ప్రియజనకా! మీకయ్యది శుభదమైనను నాకుదుఃఖదమే. సర్వసమర్థుఁడును, సుతవత్సలుఁడునునగు తండ్రి రాజైయుండ నాతనియండఁజేరి, సుఖముగా నుండఁదగిన నాకు రాజ్యభారమున్న ఖేదజనకముగాక మోదజనకమెట్లగును? కావున, పుత్రవత్సలా! నాయందుఁ గృపయుంచి కొంతకాలము మీపరిపాలన సౌఖ్యమును ప్రజలకు సమకూర్పవలయును. మీరులేనిచో నేనీరాజ్యమును బరిపాలింపఁజాలను.

శూర:—పుత్త్రా! వినుమురహస్యము. నేనిఁక యేలికనుగానుండుట తగదు. నాచరితము కళంకితమగుటచే లోకులకేవగింపు కలిగినది. దాన నాపై వారికిగౌరవము సన్నగిలినది. ప్రజాగౌరవములేని రాజు నీరములేని సాగరమట్లు నిరసింపఁబడును. దాన రాజునకును, ప్రజకునుఁగూడ దుఃఖమేకాని సుఖముండనేరదు. శీలశుద్ధిలేనివాఁడు సింహాసనారోహణమున కనర్హుఁడు. కావున పితృగౌరవమును గాపాడఁగోరుదేని, మాఱుమాటాడక రాజ్యమును స్వీకరింపుము. పితృవాక్యపరిపాలనమును మించినసత్కార్యము పుత్త్రునకు వేఱొండులేదు. నీవన్నివిషయములఁ బ్రాజ్ఞుఁడవు. ప్రజలుకూడ నిన్నేరాజుగాఁబడయఁ గోరుచున్నవారు.

గుణ:—మహారాజా! ప్రస్తుతము మీరలు రాజ్యమును విడువకుఁడు. కొంతకాలము సింధువసుందరనుఁబరిపాలింపుఁడు. తండ్రీ! ప్రభావతీబోధలచే యామినీదేవి నిర్మలమానసయై నన్నుఁబుత్రదృష్టితోఁ జూచుచున్నయది. తల్లి నెఱుంగని నేనామెను మాతఁగాఁ బూజింపఁదలఁచితిఁ గావున, నాకోరికనీడేర్పుఁడు.

శూర:—దీనికేమిఁగాని రండు. ముందారాజదంపతుల దర్శింతము. అన, గుణచంద్రుఁడు కొంతమనశ్శాంతినంది తండ్రినివారికడకుఁ గొంపోయి, నిజజనకునిరాకను వారికిఁదెలిపెను. రఘుమహారాజును, శూరసేనునకెదురేగి యాతనికరము పట్టుకొని యిట్లనెను.

రఘు:—సన్మిత్రమా! వేఁటముగిసినదియా? ప్రియబాంధవా! నీవీవీట లేకుండుటచే నాకేమియుఁ దోఁచుటలేదు. ఈలోకమున సంతో

షమును సమకూర్చు వస్తువులలో మిత్రకళత్రములు ప్రథమగణ్యములు కదా?

శూర:—సాకేతసార్వభౌమా! పరులమర్యాదోక్తులచే నాదరించు నేర్పు మీరవికులజులసొమ్ము. నిజముగా నేనిపుడేవిధముగాఁ జూచినను మీతో బాంధవము నెఱపుటకుఁ దగినవాఁడనుగాను. మీదంపతులు నాపుత్త్రికకు బాంధవులగుటచే నీతఁడు ధన్యుఁడాయెను. ప్రాణసఖా! రఘురాజేంద్రా! మనగురుకులవాసమునాఁటిమైత్రిని మఱవక జ్ఞాపకముంచుకొంటిరే! ప్రభావతీవల్లభా! మీదంపతులుచూచుచుండ గుణచంద్రునకుఁ బట్టాభిషేకమహోత్సవము నెఱపి వెంటనే తపోవనమున కేగి మునివృత్తినుండ నిశ్చయించితిని.

రఘు:—సింధురాజేంద్రా! నీయభిలాష యెంతయుఁ ప్రశంసనీయము. రాజులు వార్ధకమునమునివృత్తినుంపుటయే సమంజసము. కాని నేనొకమాటఁ చెప్పఁదలఁచి యున్నాఁడను.

శూర:—సన్మిత్రమా! నాకు మీయానలఁ దెలుపుటకు సందియమేల?

రఘు:—ఆప్తవరుఁడా! ప్రజలఁ బాలించుటకెన్నియో లోకతంత్రముల ననుభవపూర్వకముగాఁ దెలియవలసియున్నది. కావున నీగుణచంద్రుఁడనుభవజ్ఞుఁడగువఱకు నీవుమహారాజవై గుణచంద్రుని యువరాజునుగాఁ జేసి, యీతనికిఁబరిపాలననైపుణ్యమునుగఱపిపట్టభద్రునిగాఁ జేసి పిమ్మటఁ దపోవనమునకేగుము. ఇదియే నేఁ జెప్పఁదలఁచినది.

గుణ:—తండ్రీ! ఈసార్వభౌములు తెలిపినటులు నాకులోకజ్ఞత చేకూరువఱకు నన్ను విడిచిపోవలదు. మాదంపతుల సపర్యలఁ గైకొనుచు నిటనుండి మమ్మానందింపఁజేయఁ బ్రార్థించుచున్న వాఁడను.

కుముదిని:—సింధురాజవరేణ్యా! నేనుఁగాపురమునకురా వెంటనే తాము రాజ్యమును వీడి వెళ్ళిపోవుట ధర్మము కాదు. తా మిప్పట్టున మాప్రార్థనముల మన్నింపకున్న నేను దప్పక లోకనిందలకుఁ బాత్రి నగుదును. "కోడలు కోటలోఁ గాలుపెట్టిన తోడనే మామగారి నడ

వికి నెట్టిన" దని లోకులనక మానరు. కావున మాయందు దయయుంచి మాసేవల నందుకొనఁ గోరుచున్న దానను.

ప్రభావతి:—అన్నా! సింధురాజేంద్రా! చక్రవర్తులు సుతవిన్యస్తరాజ్యభారులై మునివృత్తిని వనమున నుండుటయే యొప్పిదము కాని రాజ్యమసమర్థుల వశముచేసి వనమునఁ దపమాచరించుట కంటె దేశమునఁ బ్రజఁ బాలించుటయే లెస్స.

శూర:—సోదరీ! నేను మీయాజ్ఞానుసారము నడువకున్నఁ గృతఘ్నుఁడ నగుదును. నాసుతునకును నాకోడలికిని మాపులొసంగిన పూతచరితవు ఈశ్వరాజ్ఞలనైన మీయాజ్ఞలగునుగాని, సతీమణులయాజ్ఞల నతిక్రమింపఁజనదు. కాని సోదరీ! నేనికసింహాసనాసీనుఁడనై ప్రజలఁ బాలింప నంగీకరింపను ఇపుడే గుణచంద్రునకు రాజ్యమొసంగి, కొంత కాలముండి, వెడలిపోవుదును. అనిపలికి తనయునిఁబట్టాభిషిక్తునిగాఁ జేసి యిట్లుబోధించెను.

శూర:—గుణచంద్రా! నేటినుండియునీవు సామాన్యమానవుఁడవు కావు సింధుసార్వభౌముఁడవు కావున ధర్మసంరక్షణమే నీధర్మమని తెలిసికొని సన్మార్గమునఁ పరిపాలన మొనర్పుము.

రఘు:—చిన్న వాఁడా! రాజుపట్టాభిషిక్తుఁడైన వెంటనే తానొక యమానుషపురుషుఁడనని తలంపరాదు. నిజమారయ రాజొకదేశసేవకుఁడు. ఈసూక్ష్మము నెఱుంగక రాజులు గర్వముతోఁ బ్రజలఁ బాలింపమొదలిడుదురు. అదెంతమాత్రమునుతగదు. రాజుతా,శ్రమలఁజెంది ప్రజలకుసంతసమును సమకూర్చుచుండవలెను.

ప్రభా:—పుత్రీ! రాణినైతినని గర్వింపక ప్రజాహితకార్యములకై పతిని హెచ్చరించుచుండుము. పతిసేవాపరాయణవై యాతని యాజ్ఞలకెన్నఁడు నెదురాడకుము.

కుముదిని:—తలిదండ్రులారా! మమ్ము విడచి యేగెదరా? కొంతకాలమిటనుండిమమ్మానందింపచేయరాదా?

రఘు:—అమ్మా! రాజ్యభారము పైనున్నంతకాలము స్వేచ్ఛగానుండ వలనుకాదు.

ప్రభావతి:—తల్లీ! నీవు గర్భవతివైతివను శుభవార్త తెలిసిన తోడనే తిరుగనిటకువత్తుము. బెంగటిల్లకుము. అత్తమామల కనువర్తినివై యుండుము. అని కుముదినిగుణచంద్రుల దీవించి శూరసేనునిచే సన్మానితులై యారాజదంపతులటనుండి పుణ్యతీర్థముల సేవింప వెడలి పోయిరి.

## —: దశమాధ్యాయము :—

## కౌత్స చరితము.

రఘుమహారాజు పత్నీసహితుఁడై సర్వతీర్థముల సేవించి, సాకేతముచేరి కొంతకాలమునకు విశ్వజిత్తనునొకగొప్ప జన్నమొనర్చి, ఆయజ్ఞమునందు సర్వస్వమునుదానమొనర్చి కట్టుబట్టలతోడను, మట్టికుండలతోడను, కాఁపురముసాగించుచుఁ జేతఁగాసుకూడలేక యున్నసమయమున, గులపతియగు వరతంతుమహామునికడ విద్యనభ్యసించి విద్వాంసుఁడైన కౌత్సుఁడను ద్విజకుమారుఁడు సమావర్తనమునకు గురునిచే ననుజ్ఞాతుఁడై గురుదక్షిణను జేకొనుఁడని గురునిఁబ్రార్థింప వరతంతుఁడు "వత్సా! నీనిష్కళంకగురుసేవకు మెచ్చితిని. మాకేదియు నియ్యనక్కఱలేదు. గృహమునకేగి గుణవతియగు కన్యకను బరిణయమాడి గృహస్థధర్మముల నెఱపుచు సుఖివైయుండుము, పో" మ్మనెను.

అందుకాశిష్యుఁడు విద్యార్థులందఱును గురుదక్షిణలసమర్పించి కృతార్థులగుచుండ, తానట్టి, భాగ్యమును బడయకుండుటకుఁ జింతించి, గురుదక్షిణనుదీసికొనుఁడని దేశికుని బీడింపఁదొడఁగెను. అంతనుపాధ్యాయుఁడు కుపితుఁడై, నీవునాయొద్దనభ్యసించిన పదునాలుగువిద్యలకును, పదునాల్గుకోట్లరూప్యముల నిమ్మనిపలికెను. కౌత్సుఁడామాటల నిజమనినమ్మి "ఇపుడునాయభీష్టమును దీర్చువదాన్యుఁడెవ్వఁడా! యని తలంచుచుండ లోకులురఘుమహారాజు యజ్ఞమునయాచకులెంత ధనమునుఁగోరుదురో యంతసొమ్మునొసంగిసన్మానించుచుండెనని, చెప్పు కొనువార్తలవిని, గురుకులమునువీడి, కొద్దిదినములు ప్రయాణమొనర్చి యయోధ్యచేరి, యుదయగిరిని దాఁటివచ్చు బాలసూర్యునిమాడ్కి భాసిల్లుచు దుర్గద్వారముదాఁటి కోటలోనికివచ్చుచున్న యాబాలసూరి

బ్రహ్మవర్చస్సును జూచి, రఘువాశ్చర్యమొంది, తాన త్తటిరిక్తుఁడై యుండుటచేఁ, బాద్యోదకమును మృణ్మయపాత్రిలో నిడికొని, యావిప్రకుమారునకెదురేగి, పూజించి రాజమందిరమునకుఁ గొనితెచ్చి, యుచితాసనాసీనునిగాఁజేసి, వినయముమీఱ నిట్లుప్రశ్నించెను.

రఘువు:—సుధీమణీ! దినకరదీప్తి నాకర్షించు సూర్యకాంతమట్లు నీవెవ్వరినుండి కళలనాకర్షించితివో యట్టిగురుభాస్కరుఁడు కుశలమా? కమ్మనిపూలను, తియ్యనిపండ్లను, చల్లనినీడలను, నొసంగికల్పతరులవలె మీకానందమును సమకూర్చు తపోవనతరువులకు వేఁడిగాడ్పులవలనఁ జెఱుపుకలుగుట లేదుకదా? పద్మకల్హారమరాళాదులచేఁ జేతోహరములై వెలయు స్రోతోవహములు చక్కఁగాఁ బ్రవహించుచున్నవియా? మానవసంఘ గౌరవపుర గోపురములకుఁ నల్లరాతిపునాదులనఁదగు విద్యార్థిగణములు శీలసంపన్నములై చెన్నారుచున్నవియా? నీవు బాగుగ విద్యలనభ్యసించి వత్సలుఁడగు గురువరునిచేఁ గళత్రసంగ్రహమునకనుమతుఁడవై వచ్చితివనితలచెదను ఇపుడునీవు సర్వప్రాణిసంరక్షణానుకూలమగు గృహస్థాశ్రమమునకుఁ దగియున్నవాఁడవు.

సదాశయా! నీరాకచేనానందించుచున్న నామానసము నీవు విధించు కార్యమునుగూడ నెఱవేర్చి, కృతార్థతనందనుత్సుకపడుచున్నది. నీవు గురుకార్యనిర్వహణమునకు వచ్చితివో? లేక నిజార్థసిద్ధినిఁ బడయఁగోరి వచ్చితివో? తెలుపుము. నీయట్టి సద్విద్యార్థులు ప్రకృతిసౌందర్యసుందరములై, కామాదిదోషదూరములై, శమాదిగుణసంపన్నములై, నిశ్చలచిత్తవృత్తులతో నానందముగా విద్యల నభ్యసింపననువగు గురుకులములవిడిచి, వృథాగాఁదిరుగఁగోరరుకదా! కావున నీరాకకుఁగారణమును దెలిపి నాచేఁగార్యమును జేయించుకొనఁ గోరుచున్నాఁడను. గృహస్థుఁడు విద్యార్థులు వచ్చినవెంటనే వారినాదరించి పంపవలయునుగాని, జాగుచేసి వటువుల నింటనాపరాదు విద్యార్థుల కాలము మూల్యమైనది. వారొకక్షణముకూడ వృథాచేయఁగోరరు.

కౌత్సుఁడు:—రవికులజలధిసోమా! మీకోసలవంశము వినయమునకు నిలయము. నీవు పరులనాదరించుటలో నీపూర్వులమించి యు

న్నాఁడవు. నృపవరా! సూర్యుఁడు వెలుఁగందుచున్నప్పుడు చీఁకటికిఁ జో టుండనటుల నీవు పాలించుచుండ పీడకెడముండదని తెలిసికొనుము మాకన్నిటను సౌఖ్యమే మహారాజా! సర్వధనము నర్థులకొసంగి సు కృతమాత్రావశిష్టుఁడవైయున్న సంగతిఁ దెలియఁజాలక, నిన్ను యాచిం పవచ్చిన నాయసముయజ్ఞతకు వగచుచున్నవాఁడను. రాజేంద్రా! నీవిప్పు డు వెన్నులఁగోఁపులకొసంగి తిన్నగనిలిచియున్న జొన్నగడవలె, వసువు లనర్థులకొసంగి కేవలమున్నతదేహయష్టితో శోభించుచున్నవాఁడవు. కాని యనిలము సుమసౌరభముల దిగంతముల విస్తరింపంజేయునటుల యాచకనివహము నీదానఘనతను దిగంతముల వ్యాపింపఁజేయుచు న్నయది.

భూపవరేణ్యా! అర్థుల కొసంగసమర్థములుకాని యర్థముల వృద్ధి చేయువ్యర్థజీవులకంటె విబుధోపభుక్త వసుసంపన్నుఁడగు రాజు రాజ సముఁడై వెలయును. రాజచంద్రా! చాతకపోతకము గూడ నిర్గళితసార మగు శరద్ఘనమును యాచింపఁ గోరదుకదా! కావున, నేవేఱొక వదా న్యునికడకేగి గురుదక్షిణను సంపాదించుకొందును. పోయివచ్చెద. నీకు శుభము చేకూరుఁగావుత. అని వెడలనున్న కౌత్సుని కరముపట్టుకొని రఘువిట్లుపలికెను.

రఘు:—కుత్సనందనా! నీవు మీగురువుల కియ్యవలసిన ధన మెంత? యద్దానినెంత కాలములో సమకూర్పవలయు?

కౌత్సుఁడు:—భూపమణీ! నేమాగురువులకు సమర్పింపవలసిన దక్షిణ పదునాల్గుకోట్లరౌప్యములు. మూడుదివసములు దాఁటరాదు.

రఘువు:—విద్యానిధి! సకలకళాపరిపూర్ణుఁడగు నొకవిప్రవటు చంద్రుఁడు గురుదక్షిణార్థియై, యయోధ్యకువచ్చి, విఫలమనోరథుఁడై వేఱొకదాతకడ కేగెనను నవాపవాదకళంకము నామూలమున దానై కనిధానమగు దినకరవంశమునకుఁ బట్టకుండఁ గాపాడుము. అన్యులకడ కేగక రెండుమూఁడునాళ్లు మాతే, తాగ్నిశరణాలయమునఁ జతుర్థాగ్ని వలె నివసించియుండుము. ఈలోపున నీవుకోరిన ధనమును సమకూర్తును. ఇట్లుచేసినచో నీగురుదక్షిణాధనమును, నాకులగౌరవ సంపదయు, సము

కూరును. అన, నందులకా బ్రహ్మచారి వల్లెయన, నాతఁడు కౌత్సునిఁ దేత్రాగ్నిశాలకుఁ గొంపోయి యందు నివసింపఁజేసెను.

రఘువారాతిరి కంటికినిదురలేక యర్థిమనోరథ మీడేర్చుట యెటులనాయని చింతించుచుండెను. పరార్థసంపాదన పరులకు నిద్రాహార ములుండనేరవు కదా! అట్లు చింతాక్రాంతుఁడై యున్నయామేలిక కడకు సతీమణియగు ప్రభావతివచ్చి యిట్లుపలికెను.

ప్రభావతి:—ప్రాణేశ్వరా! ఏదియో దీర్ఘముగా యోజించుచున్నటులఁ గానవచ్చుచున్నారే! ఆయాలోచనమేదియో మీయర్థాంగి వినఁదగునా.

రఘువు:—ప్రేయసీ! అర్థాంగు లెఱుఁగరాని తలంపులు పతుల కుండునా! నాతలంపువిన్న నీవుకూడచింతాక్రాంత వగుదువని తలంచి నీకుఁదెలుపక, నాలోనేనే యోజించుకొనుచుంటిని.

ప్రభా:—నాథా! అటులైననేమీకర్థాంగి నగుటయెట్లు? మనోవల్లభా! మీరు తెలుపకున్నను నేనుగ్రహించితిని.

రఘువు:—మనోహారిణీ! కుశాగ్రబుద్ధులకు గ్రహింపరాని విషయములుండునా? అయినను నీవు తెలిసికొన్న దేదియో తెలుపుము.

ప్రభా:—హృదయేశా! "మనకింకను పుత్రప్రాప్తి కాదాయెనే యని యోజించుచుంటిరి. నిజమే సూర్యవంశజులు స్వనందనులపై రాజ్యభారములనునిచి వనములకేగి మునివృత్తిని కాలముగడుపఁ గోరుదురుగదా?"

రఘు:—సతీమణి! అగును మావంశజులట్టి కోరికలుకలవారలే కాని ప్రస్తుతము నేనుచింతించుచున్నయది నీతలంపునున్న యభిలాష కాదు. అదివేఱు.

ప్రభా:—అట్లైనఁ బ్రజాసౌఖ్యసంపాదన చింతయా? లేక శత్రువిజయాలోచనమా? అదిగాక యర్థిమనోరథపూరణాభిలాషయా?

రఘు:—కులభాషిణీ! నీవు తెలిపినవానిలో మొదటిదిపుడు కాదు. ఎల్లప్పుడునుచింతించునదియే. రెండవది నిస్సపత్నుఁడనగుటచే, నాలోచనా విషయముకాదు. ఇఁక మూడవవిషయమే నామానసమును

వ్యాకులపెట్టుచున్నయది. వినుము మనత్రేతాగ్నిశాలలోనున్న మహానీయుఁడు సకలవిద్యాపారంగతుఁడగు వరతంతుశిష్యుఁడు. ఈతఁడు గురుదక్షిణార్థము నన్నుయాచింప నేతెంచినాఁడు. ఆబ్రహ్మచారికిఁ గావలసిన ధనమన్ననో పదునాల్గుకోట్లు; ప్రస్తుతముమనకడ పదునాలుగుగవ్వలు కూడలేవు. ధనమిచ్చుటకుగడువో, రెండుమూఁడు దినములు. ఇట్లున్నను నానాలుక మాటాడనేరక యిత్తునని యాద్విజబాలునితో బాసచేసినది సతీమణీ! దానప్రతిజ్ఞయా! చేయఁబడినది. ధనముసమకూరు దారియా కానరాకున్నయది. దక్షిణార్థముల నియ్యఁజాలక ప్రాణముల విడుతునుపో; యాపైని దక్షిణాధికారియగు దండధరునిప్రశ్నలకుఁ బదులుచెప్పుట యెట్లు?

ప్రభా:—కోసలసార్వభౌమా! ప్రపన్నజనార్తిహరుఁ డగు రమారమణుఁడు మనకండయైయుండ మీకీయర్థమున నింతచింతయేల? రేపు సూర్యోదయమైనవెంటనే యాసూరిపుంగవునకు వలయుధనమొసంగి, సంతసింపఁజేయవచ్చును. కావున విచారముపీడి శ్రీహరినిఁదలంచుచు సుఖముగా నిదురింపుఁడు.

రఘు:—అట్లుసంతసింపఁజేయుటకు నీరాత్రిమనకు ధనమెచ్చట నుండివచ్చును? నాచిత్తమెట్లు విశ్రాంతిఁజెందఁగలదు? కన్నులకు నిద్ర యెట్లువచ్చును? మనలఁబరీక్షించుటకు భగవంతుఁడు గట్టిపట్టుపట్టినాఁడు.

ప్రభా:—ధీరవరేణ్యా! పరాత్పరుని కృపయున్నచో మనధనాగారములు ధనరాసులతో నిండిపోవును. కనుఁడు ఆలక్ష్మీకాంతునకు సతులపైఁగలవాత్సల్యమును, అనికనులుమూసికొని యంజలిఘటియించి యేకాగ్రచిత్తయై "దీనావనపరాయణా! నారాయణా! ఇదివఱకెన్ని సారులోనాప్రార్థనల సార్థకములుచేసి, నామర్యాదలఁగాపాడితివి. తిరుగ నిపుడు నీకరుణావలోకనమొకసారి యిటుప్రసరింపఁ జేయవలసిన సమయమువచ్చినది కావున నామనోరథమీడేర్చి, నాప్రాణేశునిమర్యాదనుగాపాడఁ వేడికొనుచున్న దానను,అనిప్రార్థించుచుండఁ, గోశాధికారి వద్దనుండిలేఖను పట్టుకొనివచ్చి కంచుకిరఘువునకిచ్చెను. అతఁడాయుత్తరమును విప్పిచూచి, పరమానందభరితుఁడై, ప్రభావతితో నిట్లుపలికెను.

ప్రాణేశ్వరీ ! నీపాతివ్రత్యప్రభావముచేఁ గోశాగారము లన్నియు నమే యధనములతో నిండియున్నవి, చూడుమీయుత్తరమని, యాలేఖను ప్రభావతికియ్య, ఆపె దానిఁజదివి పతిగౌరవమును గాపాడినశ్రీయఃపతినిఁ గొనియాడెను. ఇట్లాదంపతులు సంతుష్టాంతరంగులై సంభాషించుచుండ వందిమాగధులు మేల్కొలుపులఁ బాడఁదొడఁగిరి, ఆదంపతులు తెల్లవాఱనుండుటచే స్నానాదికృత్యములకై వెడలిపోయిరి.

రఘుమహారాజు భార్యాసమేతుఁడై త్రేతాగ్నిశాలకేగి యగ్నులనారాధించి, కౌత్సుని సమీపించి నమస్కారపూర్వకముగా నిట్లు పలికెను.

రఘువు:—విద్యానిధీ ! మీగురుదక్షిణకు వలయుధనము సిద్ధము చేయఁబడినది. దానిఁ బ్రతిగ్రహించి నన్నుఁగృతార్థునిఁగాఁ జేయుము" అని యా విద్యార్థిని, గోశాగారమునొద్దకుఁ గొంపోయి, కొట్లలోగుట్టలుగానున్న ధనసంచయమునుజూపి "శిష్యాగ్రణీ ! ఈవిత్తమంతయునీయది దీనిఁజేకొనినీగురువుల కొసంగుము నీవు రావెంటనేధనమొసఁగి పంపక యొకరాత్రి యాఁపినందులకు మన్నింపుము.

కౌత్సుఁడు:—దానశీరా ! నృపవరా ! గురుదక్షిణకై నీయొద్దకు వచ్చితిని కాని ధనాశచేరాలేదు. నన్ను నాగురువులుకొనిరమ్మనినది పదునాల్గుకోట్లుకాని యీకొట్లలోని ధనమంతయుఁ గాదు, కావున, చతుర్దశకోటి రౌప్యముల నాకొసంగినఁజాలును.

రఘు:—బాలపండితుఁడా ! ఇటువినుము, మీధన మిదివఱకునా యొద్దలేదు. నీనిమిత్తమీవిత్తమును నాయర్థాంగి భగవంతునిబ్రార్థించి సిద్ధముచేసినది. కావున నేఁనీవిత్తమును జేకొనువాడనుగాను. ఈధనము నంతను నీతోఁగొనిపొమ్ము.

కౌత్సుఁడు:—ఉదారాశయా ! ధర్మములపేరుచెప్పి ధనముల నార్జించు కుత్సితులవలె నీకౌత్సుఁడు గురుదక్షిణ పేరుపెట్టి ధనమునుఁ గొంపోవ వచ్చెననుకొంటివా ? రాజా ! నాగురువులు కోరినదానికంటె పైఁగా నొకకాసునుగూడ నేనంటువాఁడనుకాను.

రఘు:—గురువిధేయా! మీగురువులునిన్ను పదునాలుకోట్ల కంటె నెక్కుడుగాఁ దీసికొనిరావలదని యాజ్ఞాపించియుండిరా? లేక నీవే నిషేధించుచుంటివా?

కౌత్సుఁడు:—రాజేంద్రా! మాగురువులట్లు వలదని నిషేధమును దెలుపలేదు కాని, పదునాలుగుకోట్లని పరిగణమునచేసియున్నప్పుడు పైఁగాఁదీసికొని రావలదనియే తాత్పర్యము.

రఘు:—పండితవరా! ప్రతివాక్యమునందునను సంఖ్యాపరిగణనము నిషేధార్థమును దెలుపదు. వానికిరెండుమాటలు బోధించిపంపుము. మాయింటనాలుగు దినములుండి పొమ్ము, అనినపుడు రెండు, నాలుగు సంఖ్యలు కొలఁదియనునర్థమునె దెలుపును. కాని నీవుఁతలంచినట్లు మూఁడవమాటచెప్ప వలదని కాని మైదవనాఁడుండవల దని కాని తెలుపవు. అటులనే పదునాలుఁగవ నధికమనియర్థముకాని యంతకు పైనఁ దేవలదని కాదు. అదియునుగాక యెవ్వఁడేనియర్థి తనకుఁబదునాలు నూపాయలనిమ్మని యడిగినపుడు దాత వానికి నూటపదియాఱు లొసఁగిన సంతసింపవలసినదే కాని నిరాకరింపఁజనదు

కౌత్సుఁడు:—వదాన్యాగ్రణీ! మనకీవాద మెందులకు? నాగురువులు నేఁదెచ్చిన విత్తమునంతయు వలదనక చేకొనినచో నాకునుసంతసమే లేక, వారుకోరిన దానికంటె నెక్కుడు వలదనినచో నావిత్తమును నీవే చేకొనవలయును. ఇందుకంగీకరింతువేని నావెంట ధనముల బట్టించుకొనిరమ్ము. అన నందులకు రఘువంగీకరించెను. సాకేతపౌరులీ వింతవివాదమునువిని విస్మితులైరి. ఆహా! యట్టి దానశౌండులగు పార్థివులును అంతటి నిస్పృహులగు విద్యార్థులును సంచరించిన భారతదేశసౌభాగ్యమును వర్ణింపఁదరమగునా. సంతుష్టియే సౌఖ్యమనియు, త్యాగమే జీవితఫలమనియు, నహింసయే యీశ్వరారాధనమనియు, నెఱింగినవారికి ధనవ్యామోహ మెట్లు కలుగును? అంత నారాజసింహుఁడు ధనమంతను శకటాదులపైనుంచి వసిష్ఠకౌత్సుల వెంటనిడుకొని వరతంతుమునీంద్రుని యాశ్రమమునకేగ వరతంతుఁడు, ఆబ్రహ్మర్షికిని నారాజర్షికిని నర్ఘ్యపా

ద్యాదులొసంగి యాదరించి యసంఖ్యేయములగు ధనగోణులఁ దిలకించి కౌత్సునిజూచి యిట్లుప్రశ్నించెను.

వర:—వత్సా ! కౌత్సా ! అలభ్యమగు నీఘనాతిథిభాగ్యమునే కాక యమేయమగు నీవిత్తసంచయమునుగూడ గోనులతో గొనితెచ్చితివే. యిట్టిశ్రమకుఁ గారణమేమి ?

కౌత్సు:—ఓ గురుసార్వభౌమా ! పూజ్యపాదుల యాజ్ఞానుసారము దక్షిణనుగొనితెచ్చు కుతూహలముతో నేనీసూర్యవంశ రాజేంద్రుని కడకేగి "గురుదక్షిణార్థము చతుర్దశకోటిరూప్యముల నాకొసంగుఁడు" అనికోర నీమహారాజు నన్నాదరించి యీయమిత ధనమునాకొసంగి కొంపోవుమనెను. అంతనేను నాకుఁగావలసినవి పదునాల్గు కోట్లనియు, నంతకుమించిన ధనములనేఁజేకొనననియు నెంతబలిమాలినను వినక మీకడకు నీధనములఁ దీసికొనివచ్చెను.

రఘు:—మునీంద్రా ! ఈమీశిష్యుఁడు తెలిపినదంతయు సత్యము. ఈధీశాలి నాదగ్గఱకు వచ్చినపుడు నాకడఁగాసుకూడలేక రిక్తహస్తుఁడనై యుంటిని. కానియిట్టి సత్పాత్రునకు దానమొసంగిన నావంశము తరింపఁగలదని మదిఁదలంచి యీబ్రహ్మచారిని మాయింటనారాత్రి నివసింపఁగోరితిని. అంత నేనుధనమెట్లు సమకూర్తునా యని చింతించుచుండ నాయర్థాంగి నావ్యాకులమును దెలిసికొని నిజపాతివ్రత్య మహిమచే నీధనమునంతను సమకూర్చినది. ఇదియంతయు బ్రహ్మచారినిమిత్తము సమకూర్పఁబడిన దగుటచే నీకౌత్సునిఁ దీసికొనుమని ప్రార్థింప నీవటుడు నామాటవినక నాగురువులు కోపింతురని చెప్పుటచేనీధనమును నేస్వయముగా మీకొసంగఁ గొనితెచ్చితిని. కావున నాయందును, మీశిష్యునియందును వాత్సల్యముంచి యీధనమును గురుదక్షిణగాఁ బరిగ్రహింపఁ బ్రార్థించుచున్నవాఁడను.

వరతంతు:—నయవర్తీ ! కోసలచక్రవర్తీ ! ఇటుపైను మీకౌత్సుఁడు నన్ను గురుదక్షిణ గైకొనుఁడని ప్రార్థింప నేవలదంటిని. కాని యీతఁడు మాటిమాటికి గురుదక్షిణచేకొనుఁడని బాధింప నేవిసుగుఁజెంది కోపముతోఁబదునాల్గుకోట్లు తెమ్మంటిని. ఈతఁడామాట సత్యమని

తలఁచి నీయొద్దకువచ్చి ధనమును యాచించెను. భూపవరా! సమాధి నిష్ఠులమై కనులుమూసి పరబ్రహ్మమును ధ్యానించుమాకు సర్వదా కన్నులు దెఱచుకొని సంరక్షింపవలసిన ధనమొసంగి మమ్ముఁదబోధన దరిద్రులనుగాఁ జేయఁజూచుట న్యాయముకాదు. నృపవరా! మాకీ ధనమువలదు. కౌత్సా! యీధననదీప్రవాహముచే నీగురుకులమును ముంపనెంచితివా? నృపవరేణ్యా! మాకుధనమెందులకు? ఇటమేము ధనముతోఁ గొనఁదగిన వస్తువులెవ్వియు లేవు.

కావునవృథాగా నీధనరాసుల నీయడవిలోఁ గుమ్మరింపక కొని పొమ్ము. రాజచంద్రా! యీయమాయకుఁడగు కౌత్సుఁడు ధనప్రభావ మెట్టిదియో యెఱుంగడు. కావున నేనిన్నింతధనమును యాచింపనెంచెను. ఇందుఁగొంతధనమును కౌత్సున కొసంగుము. దానవీతఁడు గృహస్థధర్మముల సాగింపఁగలఁడు. అటులనధర్మభీతులై ధననిస్పృహతో మాటలాడుచున్న వారివాదముల విని వసిష్ఠుఁడిట్లు పలికెను.

వసిష్ఠుఁడు:—ధనవిరాగులారా! మునిరాజవటువులారా! ఏమి మీయుదారవాదము! లోకములో విత్తప్రాప్తికై వివాదపడువారుందురుకాని, ధనములువలదని తగవులాడు వారుందురా? సత్యరతులారా! మీమీభావములు వెల్లడియైనవి. ఇదిబ్రహ్మచారివిత్తమని రాజేంద్రునకును, ఇయ్యది శిష్యవిత్తమని మునీంద్రునకును, ఇద్ది గురువిత్తమని వటుచంద్రునకును, తలంపులుండుటచే మీయువ్వురును ధనములవలదనుచుంటిరి. నిజమారయ నీధనముతో మీకందఱికిని సంబాధముకలదు. కావున నీనృపాలుని ధనపాలకునిగాఁజేసి, యీధనమునుగురుకులములఁ బోషించుటకును, గురువరుల గౌరవించుటకును, విద్యావ్రతస్నాతులగు విద్యార్థుల సన్మానించుటకును, నుపయోగింపవలయును. అట్లొనర్చిన మీకందఱకును బుణ్యములు చేకూరఁగలవు.

ఆవసిష్ఠనిర్ణయమునకా ముగ్గురును సంతసించిరి. అపుడు కౌత్సుఁడు సంతుష్టస్వాంతుఁడై తన్ను గురూద్ధారమునుండి యుద్ధరించుటయే కాక, గురుకుల సంస్థలఁ బోషింపఁదగుసంపదల నొసంగినందులకు నా రఘుమహారాజును "నీసుగుణములకనురూపుఁడగు పుత్త్రుఁడిఁబడయుము"

అనిదీవించెను. వసిష్ఠవరతంతులు "తథాస్తు తథాస్తు గోబ్రాహ్మణ గౌర వసంపాదన పరులగు సూర్యకులచక్రవర్తు లాచంద్రార్కముగా వర్ధిల్లు దురుగాక!"మని దీవించిరి. రఘుమహారాజునమోఘములగువిప్రాశీర్వాదముల నందుకొని వసిష్ఠకౌత్సులతోఁగూడి యాధనమునుబట్టించుకొని సాకేతమున కేగి, రాజసభఁగావించి యందుఁగౌత్సునకు పదునాల్గులక్షలొసంగి వెంటనేయాతనికిఁ దగుకన్యనుదెచ్చి వివాహమొనర్చి తనయాస్థానమునఁ బండితునిగాఁజేసి యాదరించెను. కౌత్సుఁడును మహానందముగా నయోధ్యలో నివసించెను సువాసనలచే సుమగుచ్ఛములకు వెల హెచ్చునట్లు సుచ్ఛాత్రులమూలమున నాచార్యులకుఁ గీర్తి హెచ్చును.

## ఏకాదశాధ్యాయము.

—: అ జ జ న న ము :—

ఒకనాఁడు సూర్యోదయ సమయమున రఘురాజపత్ని యగుప్రభావతి పార్వతి కుమారునిఁ గన్నయట్లు, సుతునిఁబ్రసవించెను. ఆపిల్లవానికి వసిష్ఠుఁడు అజుఁడనిపేరుపెట్టెను. ఆకుమారుఁడు రూపగుణాదులచేఁ దండ్రినిబోలి పెద్దదీపమునుండి వెలుఁగందిన చిన్నదీపమువలెఁ దేజరిల్లుచుండెను. దినదినాభివృద్ధినందుచున్న యాబాలచంద్రుఁడు తలిదండ్రులకేగాక, పౌరులకుఁగూడ ముద్దుఁగొలుపుచుండెను రఘువు నిజసుతునకుపనయనమొనర్చి,గురుకులమునకుఁబంపెను. ఆనృపనందనుఁ డనతికాలముననే సకలవిద్యలయందునుఁ గృతార్థుఁడై, గురువునకును, రఘువునకునుఁ గూడసంతోషమును సమకూర్చెను అంతఁగాచగోళములోనికి విద్యుత్కాంతి చేరిప్రకాశించునటులు, ఆరాజకుమారునిగాత్రమున యౌవనకళ ప్రవేశమై తేజరిల్లఁ దొడఁగెను. అట్టినవయౌవనలక్ష్మిచేసర్వాంగసుందరుఁడై యొప్పుచున్న నిజనందనుని గాంచి, రఘుమహారాజతనికిఁ దగు కన్యారత్నమును సమకూర్ప నెంచుచుండెను.

ఇటులుండ విదర్భదేశాధిపతియగు భోజమహారాజు తనసోదరియగు నిందుమతికి స్వయంవర మేర్పఱిచి రఘువునకు శుభలేఖనుఁబంపనాతఁడాలేఖనుజూచి తనపుత్త్రున కన్నివిధముల నిందుమతితగినకన్నియ

యని తలంచి, అజుని విదర్భకుఁ బంపెను. అజుఁడు సైన్యసమేతుఁడై యయోధ్యనువీడి, కుండినపురమునకుఁ బోవుచు నొకదివసమునఁ దుంగభద్రానదీతీరమున విడిసి, ప్రియసఖుఁడగు సుదేహునితోఁ నశ్వారూఢుఁడై సాయంతన సమయమునఁ దుంగభద్రాతీర వనవిభవములఁ దిలకింప నేగెను.

అట్లామిత్రులిరువురు నదీతీర రామణీయకములఁ జూచుచుఁ గొంతదవ్వేగ, ముందు మనోహరమగు నాశ్రమమొండు కానవచ్చె. దానిఁజూచి రాకుమారుఁ డిట్లనియెను

అజుఁడు:—మిత్రమా! చూచితివా! ఈయాశ్రమ సంపదను. మునులు తమతపశ్శక్తిచే లోకోత్తరనిర్మాణములఁ జేయఁజాలుదురు. కావుననే యిట్టి యపూర్వమగు తపోవనము నిర్మింపఁబడెను. మహారాజులెంత ధనము వెచ్చించినను, ఇట్టి వనముల నిర్మింపఁజాలరు. సఖుఁడా! యిది యెవరితపోవనమై యుండునో?

సుదేహుఁడు:—రాజనందనా! నీవనినట్లీయ్యది మానసకల్పితముకాని మానవనిర్మితము కాదు. దీనిరీతినిఁ బరికింప నందనవనమను భ్రాంతి కలుగుచున్నయది. ఆహా! ఏమి యీపూవులు, పండ్లతో నలరారుమ్రాకుల సోయగము.

అజుఁడు:—నెచ్చెలీ! లోనికేగి పరికింతము. సన్నిహితులగు తాపసోత్తముల సందర్శింపకుండ నేగరాదు. కావున నిందలిమునికి వందనములిడి వత్తము. రమ్ము.

సుదే:—ధర్మజ్ఞా! నీవన్నమాట సత్యము. సజ్జన సందర్శనము సకలార్థప్రదము. అని వారు తురగములనుండి దిగి, వాని నాశ్రమద్వారముకడ నిలిపి, లోనికేగి, కొంతదూరమా వనవిభవములఁ జూచుచుఁ బోవు, సలిలమధ్యమునఁ గంఠమువఱకు మునిఁగి ముఖము మాత్రము పైకిఁబెట్టి కన్నులుమూసి కమలాక్షుని ధ్యానించుచున్న సిద్ధాంగనయొక్క భక్తిభాసితమగు వదనకంజమును గాంచిరి.

సుదేహుఁడు:—మిత్రమా! ఈసరోవరమున నున్నపద్మములు గాలిచేఁ జలించుచుండుటవలన నీపె ముఖముకంటె వేఱుగాఁ, దెలి

యవచ్చుచున్నయవి. కాని, యవ్వియు, నిశ్చలములైనచో నీవదనము గుర్తింపఁ దరముకాదు.

అజుఁడు:—మిత్రమా! అంతియెకాదు. వానియందు మధుకర నినదము వినవచ్చుచున్నయది. ఇట, మధురిపుగానము శ్రుతమగుచున్నది.

సుదేహుఁడు:—ఈసతీమణి యెవ్వతె యై యుండునో? కన్యగా నుండి, వరుని నిమిత్తమో, భార్యగా నుండి, భర్తనిమిత్తమో, తల్లిగా నుండి సంతతినిమిత్తమో, తపమాచరించుచున్నదని తలంచెదను.

అజుఁడు:—సుదేహా! ఈమె పరకాంత యగుట మనకుఁ బరికింప నర్హ్వారాలుకాదు. భానువంశజులకుఁ బరస్త్రీలు, తల్లులవంటివారు, కావున మనమింతటితో నీవనవిలోకనమును ముగించి, విడిదకేగుదము.

సుదేహుఁడు:—మిత్రమా! మన మన్యభావముతో నీసతీమణి, వదనసరసిజమును జూచుటలేదు మాతృభావముతోడనే పరికించుచుంటిమి నృపనందనా! రవికులజులకుఁ బాపపుతలంపులును, రవికరములకు నలుపులును గలుగునా?

అజుఁడు:—సఖుఁడా! యీసాధ్వీమణి వదనపంకేరుహమున భక్తిలక్ష్మి యెట్లు తాండవమాడుచున్నదియో కనుము.

సుదే:—నిజమే భగవద్భక్తుల ముఖచంద్రులకుండు సౌమ్యకళ వేఱెవ్వరికిని నుండఁబోదు. వాని దర్శనము పాపహరము;శుభప్రదము. అనుచుండ, నాకాసారవారి మధ్యమునుండి యాసిద్ధాంగన పైకి వచ్చి యజునిఁజూచి యిట్లుపలికెను.

సిద్ధాంగన:—మహాశయా! నిన్నుఁ జూడ నాతపస్సునకు మెచ్చి వర మిచ్చుటకు వచ్చిన సరసిజాక్షునివలెఁ గానవచ్చుచున్నవాఁడవు. ఆర్యా! నీరాకచే నీయాశ్రమము పవిత్రితమైనది. నిన్నుఁగన్న తల్లియెంతటి పుణ్యాత్మురాలో! నీకుఁ దండ్రియనిపించుకొనుటకు నీజనకుఁడెంత తపమాచరించియుండునో. నీపావననామమున విలసిల్లు నక్షరముల విసఁ గోరుచున్నదానను

సుదేహుఁడు:—అమ్మా! యీపూతచరితుఁడు సాధ్వీమతల్లియగు

ప్రభావతికిని, నయశాలియగు, రఘుసార్వభౌమునకును నందనుఁడు. అజనాముఁడు సుగుణధాముఁడు.

సిద్ధాంగన:—సచ్చరితా! నే నీతని రాకకై భక్తవత్సలుఁ డగు మధుసూదనుని మదినినిలిపి యెన్నియో వత్సరములనుండి ధ్యానమొన ర్చుచుంటిని. ఆ కరుణామయునకిప్పటికి నాపై దయవచ్చినది. కట్టా! ప్రాణేశ్వరా!" అని యాపె మూర్ఛిల్లెను. అంత సుదేహుఁడజుని యాజ్ఞచే నలినీదళముతోఁ సరోవారినిఁ గొనితెచ్చి, యాపెపైఁజల్లి మూర్ఛ తేర్ప, నాఁడివ్యాంగన దీర్ఘమగు నిట్టూర్పువిడిచి యజునిఁబ్రీతితోఁ జూడఁ దొడఁగెను.

అజుఁడు:—తల్లీ! నీ వెవ్వతెవు? నీ వెందులకై తపమాచరించు చుంటివి? నన్నుఁజూచి సంతసించుచుంటివే, యీసుతునిపై నీకిట్టి దయ యేలకలిగె? నేఁజేయవలసిన సేవ యేదియేనికలదా? సూర్యవంశసంభవులు పరులబాధలఁ దొలగింప, సంసిద్ధులై యుందురని, తలంపుము.

సిద్ధాంగన:—సోదరా! నాదీనజీవితమును వినుటకుముందు నా పర్ణకుటీరమునకు నచ్చి నాయాతిథ్యమును స్వీకరింపుము. నీవు నాకుఁ బ్రత్యక్షదైవమని భావింపుము". ఇట్లనుచుండ గుఱ్ఱపురౌతులగు సేనానులునచ్చి, "అజకుమారా! మహాప్రమాదము సంభవించినది. వనమత్తేభ మొకటి పర్వతాకారముతోఁ నెక్కడనుండియో హటాత్తుగావచ్చి సేనాశిబిరములపైఁబడి, సర్వమును ధ్వంసము చేయుచున్నయది. మా ప్రయత్నములన్నియు వ్యర్థములైనవి. వేగముగా మీరటకు వచ్చి దాని సంహరింపకున్న సైన్యము మనకు దక్కుటయరిది." యన నా మాటలువిన్నతోడనే యజుఁడు ఖిన్నుఁడై "అమ్మా! నేనేగి, యాదుష్టగజమును సంహరించి తిరుగవచ్చి నీయాశీర్వాదములఁ జేకొందును. సెల వొసంగుము.

సిద్ధాంగన:—తమ్ముఁడా! దుష్టసంహారమును, శిష్టసంరక్షణమును, క్షత్రియకుమార లక్షణములు. కావున వెంటనే యామదగజమును సంహరింపుము. నేనుగూడ, నీపరాక్రమావలోకనమునకు

వత్తును. నీవు ముందేగుము. అనగజుఁడు వారినందఱిని వెంటనిడికొని వెడలిపోయెను.

అజుఁడు సేనానులతో సేనానివహముకడకువచ్చి స్కంధావారమునఁ జొరఁబడి శిబిరములనూడఁబెఱికి సైనికులఁదఱుముచున్న యగనిభమగు నాగిభమునీక్షించి, వింటనొకవాఁడికోలనుగీలించియామదవారణకుంభస్థలమున నాటనేయనది మహాఘీంకృతితో నేలఁగూలెను. అంత నాగజదేహమునుండి యొకదివ్యపురుషుఁడు పైకివచ్చి యిట్లు పలికెను.

దివ్యపురుషుఁడు:—రఘునందనా! నీచాప నైపుణ్యముచే నేను శాపవిముక్తుఁడ నైతిని. నీవొనర్చిన మహోపకారమునకుఁబ్రత్యుపకృతిఁ జేయకున్నచో నాజన్మ వ్యర్థమగును. కావున నీసమ్మోహనాస్త్రమును జేకొని నన్నుఁ గృతార్థునిఁగాఁ జేయుము.

అజుఁడు:—ఓదివ్యపురుషుఁడా! నీవెవ్వఁడవు! నీకీ భయంకర కరి రూప మెట్లువచ్చె?

దివ్య:—ప్రభావతీనందనా! వినుము; నేను ప్రియదర్శనుఁడను గంధర్వరాజతనయుఁడ. ప్రియంవదాభిధానుఁడ. నేనొకప్పుడు కైలాసమునసున్న పార్వతీపతిని సేవింపఁగోరి, నాకాంతతోఁగలసి కైలాసమునకేగుచు, మార్గమధ్యమున మతంగాశ్రమమునుఁ దిలకించి దాని సొగసునకచ్చెరువంది యందుదిగి, నాప్రేయసియగు భానుమతితోఁ బుష్పములఁద్రుంచియు, ఫలముల రాల్చియు, స్వేచ్ఛగా విహరించుచుండ, మతంగమునివచ్చి నన్నుఁజూచి, కోపించి, వెంటనే, "మదగజమవై వనములఁ దిరుగుచుండుము" అని శపియించెను, అతీవ్రశాపోక్తి నేనాలించినతోడనే మూర్ఛితుఁడనైతిని. నాకాంత శీతోపచారములచే నాకుఁ జైతన్యమును గలిగించి, మునిపాదములపైఁబడి యిట్లు ప్రార్థించెను.

భానుమతి:—మునిసార్వభౌమా! నాపతియొనర్చిన యపరాధమును క్షమియించి, శాపమును మరల్చి, పుత్రికాసమనగు నన్నురక్షింపుఁడు. అట్లు మీరు దయచూపకున్న నన్నుఁగూడ మదేభినిగా శపియించి నాభర్తతోఁ గలసి యుండునట్లనుగ్రహింపుఁడు" అని కన్నీరు వరదలై పారవిలపింపఁదొడఁగెను. నిప్పువేడిమిచే నీటికిఁగలిగిన

వెచ్చదనము నిలువక, నిజమగు చల్లఁదనము నిలుచునటుల ఆముని వరునకునాపైఁ గలిగినకినుక జాతిశాంతాత్ముఁడయ్యెను. అందుచే నామ తంగ మునీంద్రుఁడు నాయాలిమాటలకు జాలిచెంది "సాధ్వీ ! ముందు కొంతకాలమునకు రఘునందనుఁడీమార్గమునవచ్చును, ఆతఁడు బాణ ముచే గజరూపముననున్న నీనాథునిఁగొట్టును. అపుడునీప్రాణేశ్వరుఁడు ద్విపరూపమునువీడి నిజదేహమునుఁ జేకొనును. అందాకనీవు నాయీ తపోవనమున దీనబాంధవుఁడగు శ్రీనివాసుని భక్తినియమములతో నారాధింపుము. ప్రస్తుతమునేనీ యాశ్రమమునువదలి. హిమవంతమున కేగి, కొంతకాలముఁదపముఁజేయఁ దలంచితిని." అనియాశ్రమమునువీడి వెడలిపోయెను. ఆవెంటనేనేను జ్ఞానహీనమగు నీమదహస్తిరూపమును దాల్చి యడవులఁదిరిగితిరిగి, శాపాంతమాసన్నమగుటచే, ఈతుంగభ ద్రానదీతీరమున విహరించుచు నీచేఁగొట్టఁబడి, నిజరూపమునుఁ బొంది తిని. ఇదినావృత్తాంతము. కావునఁ బ్రత్యుపకృతిగా నీగాంధర్వాస్త్ర మునుఁ బరిగ్రహింపుము. దీనిచేనరివీరసంఘముల నవలీలగజయింపగలు గుదువు." అననజుఁడు స్నేహభావముతో నాయస్త్రమునుఁజేకొనెను. ఇట్లానరగంధర్వ రాజనందనులు సుహృద్భావముతోఁ బ్రసంగించిరి.

ప్రియంవదుఁడు:—మిత్రమా! రవికులరత్నమా! నాకైనా కాంత యేతవిలపించుచున్నదియో, ఎచ్చటనున్నదియో, వేగమేనే బోయి యావియోగినిని వెదకి కలసికొందును. సెలవిమ్ము. పోయివ చ్చెద. నీకుమంగళము చేకూరుఁగావుత.

అజుఁడు:—ప్రియసఖా! ఒకయోగినియిటకుఁ గొంతదూర మునఁ దపోవనమున మాచేఁజూడఁబడినది. మమ్మాసాధ్వితిలకించి కరు ణారసమొలుక పలుకరించి "కష్టా! ప్రాణేశ్వరా !" యనిమూర్ఛిల్లినది. ఆభక్తురాలు నీయర్ధాంగియని తోచుచున్నది.

ప్రియంవదుఁడు:—సుకృతాత్ముఁడా! నీవునిశితబాణముచే నా స్వరూపసంపదను సువాణిచే నాపత్నీభాగ్యమునుఁ గూడసమకూర్చి తివి." అనుచుండ భానుమతి యటకేతెంచి, నిజరూపముతో వెలయు చున్న భర్తనుఁజూచి యానందభరితయై యాతనిపాదములకుఁ బ్రణ

మిల్లి, యత్యానందముచే నోటమాటరాక కొంతవడికటులనే నిలచి యుండెను. అపుడాగంధర్వుఁడు భానుమతినిఁగాంచి కనులనానందాశ్రువులొలుక నిటులఁబలికెను.

ప్రియం:—ప్రాణేశ్వరీ! నాకుదివ్యదేహమొసంగి, కాపాడిన యీపురుషవరేణ్యునకు మనముకృతజ్ఞులమై యుండవలయును. నిజముగానీతని దర్శనము మనకుఁగలుగకున్నచో మనవియోగమునకు మేర లేకుండెడిది.

భానుమతి:—ప్రాణేశ్వరా! మనకీతఁడు ప్రత్యక్షదైవమై వెలయుచున్నవాఁడు. ఈమహనీయునకు మనమును మనసంతతివారును కృతజ్ఞులై యుండవలసినదియే.

ప్రియంవదుఁడు:—రఘురాజనందనా! మేమునీయుపకారము నెన్నడును మరువఁజాలము. నీవురమ్మనినపుడెల్లవచ్చి నేఁజేయనలసిన సేవలఁజేసి, పోవుచుందును. సంశయములేదు. ఇకమాకు సెలవొసంగుము." అని యాగంధర్వుఁడు నిత్యచంద్రికా విలచితమగు చైత్రరథమున విహరింపఁ గాంతతోనేగెను. అజుఁడును ఇందుమతీవిహార సుందరమగు విదర్భపురమున వధువును వరింపనేగెను.

## —: ద్వా ద శా ధ్యా య ము :—

### ఇందుమతీ కళ్యాణము.

ఇందుమతి సౌధోత్సంగమునుండి తనసోదరుఁడగు భోజనృపాలుఁడు కుండినపురగోపురముకడ నిలచి, వినయమువిూఱఁ బురములోనికి దయసేయుడని, యాహ్వానింప స్యందనారూఢుఁడై పట్టణములోనికి వచ్చుచున్నరఘునందనునిఁ దిలకించెను. అపుడాపాటలాధరి వదనారవిందము సూర్యుఁడేదిక్కునన్న నావైపునకుఁ దిరుగు సూర్యకాంత సుమమువలె, నాప్రభావతీసూనుఁడే వైపునకేగునో యాప్రక్కనుఁదిరుగఁజొచ్చెను. ఆపెసఖులదికనిపెట్టి యిటులఁదమలోఁదాము సంభాషింపఁదొడఁగిరి.

కళావతి:—సఖీ! సువదనా! స్వయంవరము జరిగినట్లున్నది. తగిన వరుడే సమకూరెను

సువదన:—స్వయంవరము రేపు జరుగవలసియుండ నేడెట్లుజరుగును ? లేక యీస్వయంవరము వేఱా ?

కళావతి:—అగును. నేడీక్షణమాలికాస్వయంవరము సాగినది.

సువదన:—అట్లైన రేపుజరుగనున్నది సుమహారసమర్పణము మాత్రమే !

కళావతి:—అంతయే, కాని యీనాటిత్రియామ యేకయామమైన బాగుండును.

ఇందుమతి:—(చిరునగవుతో) సఖియలారా ! వింతగాసంభాషించుచుంటిరి. కాని నెచ్చెలులారా ! రేపటి స్వయంవరము నీనాడే జరుపుచుంటిరే. ఇట్టిశక్తికలమీరు త్రియామనేకయామనుగాఁ జేయఁజాలరా ? అనిసంభాషించుచుండ భోజమహారాజు ఆయజుని బ్రత్యేకముగానాతనికై యేర్పాటుచేయఁబడిన సౌధములో విడియఁజేసెను. కుండినపురవాసులెల్లరు నారఘునందనుని సుందరగంభీరాకారమును జూచియాతడిందుమతికెంతయుఁ దగినవల్లభుఁడని పలుకఁజొచ్చిరి.

ఆమఱునాడుదయమున రాజులెల్లరు కుండినపురోద్యానమున నిర్మింపఁబడిన స్వయంవరమంటపమునకు రాఁదొడంగిరి. భోజుఁడు మంటపద్వారముకడనిలచి, వచ్చినవారినందఱినాదరించి, లోనికిఁ గొంపోయి సింహాసనములపైఁ గూర్చుండఁబెట్టుచుండెను. అజుఁడును స్వయంవరోచితవేషముతో నటకురాగా వైదర్భుఁడాతని మర్యాదతోఁ దోడ్కొనివచ్చి రత్నాలంకృతమగు నొకసింహాసనమున నాసీనునిగాఁ జేసెను.

అపుడామంటపముననున్న రాజకుమారులెల్లరును, ఆరఘునందనుని లావణ్యమునుజూచి విస్మితులైరి. ఘనావలోకనముచే మహీస్థలినుండి, మింటికెగయుమరాళములవలె నారాఘవాలోకనముచే రాజకుమారహృదయములనుండి స్వయంవరణాశలు పైకెగిరిపోయినవి.

అగరుధూపములును, కస్తూరికాగంధములును, కుసుమసౌరభములును, ఘ్రాణానందమును సమకూర్చుచుండ, వీణావేణుగానములు శ్రుతిసుఖదములై వెలయుచుండ, వందిమాగధులు రవిచంద్రవంశరా

జులఁ గీర్తించుచుండ, భూలోకవైకుంఠమందిరమువలె నాస్వయంవర మంటపము ప్రకాశించెను.

అపుడు రత్నసింహాసనాసీన నృపనందనరాజహంసరాజితమై, స్వయంవరావలోకనాగత నారీజన వదననళినశోభితమై, నానాదేశాగతరాజపుత్త్రసైనికనివహ శైవలపరివృతమై, భేరీమృదంగషట్పదఝుంకారసంకులంబై, యొప్పునాకళ్యాణసభా సరోవరమునకు రాజహంసివలె స్వచ్ఛపటావగుంఠిత శరీరలతికయు విలోలనీలకుంతలలసమాన లలాటతటయు, స్మితసుందరవదన సరసీరుహవిరాజమాన్యయు, నగునిందుమతి, నెచ్చెలియగు సునంద, తనకుముందునడువ స్వయంవరమంటపము లోనికేతెంచెను. చరిత్రాభిజ్ఞయుఁ జతురభాషణనిపుణయు నగుసునంద యిందుమతికి ముందునిలచి, వివిధవిలాసలసితులగు నృపనందనులచరిత ములఁగ్రమముగా నిట్లువర్ణింపఁదొడఁగెను.

సునంద:—ఇందుముఖి! కరమునఁదామరనాళమునుబట్టి రక్తారవిందమును గిరగిరఁద్రిప్పుచు నీవైపురెప్పవాల్పక చూచుచున్నసొగసుకాఁడు, అంగదేశరాజనందనుఁడు నీవీతనిఁజేపట్టి చంపావతీపురమునకేగి పావనగంగాతరంగిణీవనభూముల నానందముతో విహరింపఁదలంచితేని ఈజాజిమాలను నీతనికంఠమున వేయుము.

సరసిజాక్షి! చెదరి, రత్నకేయూరాగ్రలగ్నమైన మౌక్తికహారమును సవరించుకొనుచు వాల్గంటనిన్నుగనుచున్న సుందరాంగుఁడు అవంతీభూపాలసుతుఁడు ఈతనిఁబరిణయమై యుజ్జయినీపట్టణమునకుఁజని ప్రాసాదవాతాయనములలోనుండి సిప్రానదీతరంగ శీకరశీతలములగు మందమారుతముల సంతోషముతో సేవింపఁదలఁచినచో నీతనిగళమున నీచంపకహారమును వేయుము.

మరాళయానా! యెడమప్రక్కకు దిరిగి చెలికానితో మాటలాడుచు నొయ్యారముగా నినుదిలకించుచున్నయందగాఁడు చేదిదేశనరపాలసూనుఁడు. ఈతనిఁబాణిగ్రహణ మొనర్చి మాహిష్మతీపురికేగి నర్మదాసితసైకత వేదికలఁ గుతుకముతోసంచరింపఁగోరుదువేని యీవకుళస్రజమునీతని కుతుకమున వేయుము.

నీలవేణీ! తెల్లనిలేతమొగలిఱేకుపైఁ గోనగోళ్ళతో నక్షరముల
వ్రాయుచు నిన్నుబరికించుచున్న వన్నెకాడుసూరసేనదేశపు ఱేనికొడుకు
ఈతనిఁబెండ్లియాడి మధురానగరమునకేగి యమునానదిని మోదముతో
జలక్రీడలాడఁ గోరుదువేని యీతనిమెడ నీమల్లియదండను వేయుము.

విదుషీమణీ! తనవ్రేలినున్న వజ్రపుటుంగరము నుత్తరీయముచే
శుభ్రముచేయుచు నిన్నుదేఱిపాఱఁజూచు మోహనాకారుఁడు కళింగదేశ
నరేశ్వరునిపుత్త్రుఁడు ఈతనికర్ధాంగివై కళింగపట్టణమునకేగి మృదుసిక
తాకలితములగు సాగరతీరముల మోదముతోఁ దిరుగఁగాంక్షింతువేని
యీతనిగ్రీవమున నీమాలతీసరమును వేయుము.

సుందరాంగీ! దూరమునుండి శిరమువంచి నినుజూచుచుండు
టచేఁ బ్రక్కకునొఱగిన నవరత్నమకుటమును చేతులెత్తిసరిచేయుచు
నీపైఁజూపులఁ బఱపుచున్నరసికుఁడు పాండ్యదేశపుప్రభునికుమారుఁడు.
ఈతనికిఁబ్రాణేశ్వరివై కాంచీపురికేగి కావేరీతీరవనవిభవముల హర్షము
తోఁదిలకింపఁగోరుదువేని యీతనికందరమున నీమందారస్రజమును వే
యుము.

శుభాంగీ! ఎడమచేతితోఁ గుడిమీసపుకొనను బైకిఁద్రిప్పుచుఁ
గుడిచేత నెడమతొడపైఁ నిడికొనిచిరునగవొప్ప నినుఁజూచీచూడని యట్లు
నటించుచున్నగంభీరుఁడు కోసలదేశసార్వభౌముని యాత్మజుఁడు. ఈతని
కిరాణివై సాకేతపత్తనమునకేగి సౌధోపరిభాగముననుండి సరయూనదీ
తీరమునవున్న అశ్వమేధయాగయూపముల లెక్కింపఁగుతూహలమున్న
చో నీసితపద్మదామము నీతనికంఠమున సమర్పింపుము ఈబాలవీరుఁడు
కులరూపవయోగుణాదులచే నీకుసరియగువరుఁడు అనిసునంద రఘునం
దనునిగూర్చి ప్రశంసించినతోడనే తనువుపులకలెత్త నాసారసాక్షి య
జునివదనము ననురాగముతోఁబరికించి వెంటనే లజ్జావనతవదనయైనిలువ
భావజ్ఞయగుసునంద పరిహాసముగా నిటులఁబలికెను.

రాకుమారీ మనముచూడఁదగిన రాజకుమారులు వందలకొలఁది
కలరు. రమ్మ, శీఘ్రముగా, ఇదేమి? మునుపటివలె నీకాలుగన్నులు
ముందునకుసాగకున్నయవి? ఒక్కరునికడనే యింతసేపునిలచిన నీస్వయం

వరమొక్కదివసముతో ముగియనేరదు. అనిపలుకుచున్న సునంద నిందుమతికోఱఁగాఁజూచి, యాపెచేతనున్న పుండరీకహారమును దీసికొని, యజునికంఠమున వేసెను.

అంత సభాసదులందఱు కౌముదిచంద్రునితోఁ గలిసిన యట్లీ యిందుమతి ప్రభావతీనందనునితోఁగూడినది. ఈయెన్నికకర్త వచ్చిన రాకుమారులలోఁ దనకుఁదగినవరుని నెన్నికొనినది అగును. తానేగు మార్గమున నెన్ని భూధరములడ్డున్నను వానినన్నిటినిదాటి, నదిసాగరముఁజేరునుకదా యని ప్రశంసింపఁదొడఁగిరి. అట్లిందుమతి యజుని వరించినతోడనే స్వయంవరమునకు వచ్చినరాజకుమారులెల్లరును నిజరూప వైభవముల నిందించుకొనుచుఁ దమతమబసలకు వెడలిపోయిరి. భోజమహారాజును ననుకూలవరసంగత యగునిజసోదరిని, వెంటనిడికొని, కుండినపురమున కేగెను. కుండినపురంధ్రీమణులు నూత్నదంపతులఁజూచువేడ్కతో మేడలపై కేగి, రాజవీధినూరేగుచు వచ్చుచున్న వధూవరులఁజూచి "ఓహో! అన్యోన్యానురాగసుందరమగు నీమిథునమును సమకూర్పనేరనిచోఁ బద్మభవుఁడీ స్త్రీపురుషుల సృష్టించుటలో బడినపాటంతయు వ్యర్థమైయుండెడిది యనిబలుకు మాటల నావధూవరులాలించుచు, తిన్నగాఁగళ్యాణమంటపము చేరిరి.

భోజుఁడు యథాశాస్త్రముగా నిందుమతిని, అజునకొసంగి వివాహము నతివైభవముగా జరిపి, తోబుట్టువునకును, భావమఱఁదికిని నర్వాములగు, పారిబర్హములను, పారితోషికములును నొసంగెను. అజుఁడు స్వయంవర వధూరత్నమును జేకొని, సంతోషముతో సాకేతమున కేగుచుండ, నీర్ష్యాళువులగు నృపాలసూనులు నిజసైన్యములతో నాతనిమార్గమునిరోధింప,ఇందుమతి, వార్షికమేఘావృతుడగు చంద్రునిపగిది, శత్రుచమూసమూహములచేఁ జుట్టఁబడియున్న మనోవల్లభుని జాలితోఁజూడ నజుఁడు మందహాసముతోఁ "ప్రేయసీ! ఈయుడుకుమోతులగు నృపకుమారుల పొగఱడంచెదను. కను"మని గంధర్వమిత్రుఁడొసంగిన సమ్మోహనాస్త్రముచే వారినందఱిని నిశ్చేష్టులను గాఁజేసి, నేలఁగూలనేసి, వెడలిపోయెను ఉదారహృదయులచేష్టలిట్టివియ అపారసైన్యసమే

తుడై తన్ను సంహరింప వచ్చినవిరోధుల నిశితాస్త్రములచేహత మొనర్ప శక్తుఁడయ్యు నట్టి మంగళసమయమున సమంగళ మగు ప్రాణిహింస తగదని భావించి ప్రాణములతో వారినివిడిచెను.

ఇట్లు రఘుకుమారుఁడు కళత్రవిజయసంపన్నుఁడై సాకేతము నకు రాఁగా నిజతనయునిజూచి రఘుమహారాజు సంతుష్టుఁడై రాజ్యపరి పాలనమును సుతునిపైనిడి, శాంతిమార్గమవలంబించి కాలమును గడుప నెంచెను. రాజ్యభారవహనార్హులగు సుతులు సమకూరినచో సముచు విదులగు సాకేతసార్వభౌములు రాజ్యసంపదలపై మక్కువనిడరు.

అంత రఘుమహారాజు పుత్రునిసర్వాంకషసామర్థ్యమును దెలిసి కొని యజునికరమున వెలయుచున్న పరిణయకంకణబంధము విప్పక మునుదే పట్టాభిషేకసూత్రమును గట్టించి కోసలలక్ష్మీపరిగ్రహమహో త్సవమును జరిపించి స్వసుతపరిపాలన నైపుణ్యమును గనులారఁ దిలకిం చుచు నిజనందనుఁడు ప్రజాహ్లాదయరంజకుఁడై రాజ్యమేలుచుండుటను దెలిసికొని విషయసుఖ విరక్తుఁడగుటచేఁ దపోవనమునకుఁ బోవఁబ్రయ త్నించెను. అపు డజుఁడు నిజజనకుఁడు తన్ను విడిచి తపోవనమునకేగ నుండుటను గుర్తించి, పితృపాదములపైఁ బడి "కొంతకాలమువఱకు నన్నువిడిచి తపోవనమునకు నేగవలదు". అని ప్రార్థింప, సుతవత్సలుఁ డగు నాతేఁడు తనయునిఁ దనియఁజేయుటకై యటనిలిచెను. కాని భోగి తానదలినకూసమట్లు రఘువు తానువిసర్జించిన భోగములఁజేకొనఁ డాయె. మఱియుఁబట్టణమున నివసింపనొల్లక పురమునకు వెలుపలనున్న తోఁటలోఁగుటీరమును గట్టించి యందు నివసించి పుత్రునకు దర్శన మొసంగుచుఁ గాలముగడుపుచుండెను.

అపుడా సాకేతరాజ్యము విరాగియై విశ్రమమునందనున్న రఘువు తోడను, సరాగుఁడై యభ్యుదయము నందుచున్న'యజునితోడను గూడి యస్తమింపనున్న చంద్రవలయముతోడను నుదయించి, పైకివచ్చుచున్న సూర్యబింబముతోడను గూడిన నభోమండలముతోఁ బోల్పఁదగియుం డెను. అజుఁడు నిజదేశసౌఖ్యమునకై మంత్రులతోఁగూడి యోజించు చుండ రఘువు మోక్షానందమునకై మునులతోఁగలసి చింతించుచుం

డెను. ఇట్లు రఘువు సుతుని కోరిక పైఁగొన్ని నెల లుండి పిమ్మటఁద్రివేణీ సంగమక్షేత్రమగు ప్రయాగ కేగి యొకపుణ్యదివసమున యోగముచే భౌతిక దేహమును వదలిముక్తినిఁబడసెను.

అజమహారాజ పితృవియోగమునకుఁ జాలదుఃఖించి, యేముఖ్య ఫలమునకై భారతీయులు పుత్రులఁబడయఁగోరుదురో యట్టి పైతృక కర్మము యథావిధిగా నాచరించెను. రఘునిర్యాణానంతరము, అజమహా రాజు సన్మార్గులసంరక్షించుచు, దుశ్శీలుర శిక్షించుచు జగతీతలమున ధర్మసంస్థాప నాగ్రేసరుఁడని పేరొందెను. ఇట్లుండ నిందుమతి గర్భవతి యై నెలలునిండ నొకసుముహూర్తమునఁ బుత్రునిఁ గనెను. అజుఁడా శిశువునకు దశరథుఁడని నామకరణ మొనర్చెను. ఆబాలుఁడు కల్పవృ క్షాంకురమువలె దినదినము మనోహరముగాఁ బెరుఁగుచుండెను.

ఇట్లా రాజేంద్రుఁడు పుత్రకళత్రములతోఁ గూడి నిస్సపత్నముగా రాజ్యసుఖముల ననుభవించుచు వనవిహారకుతూహలియై యొకవసంత వాసరమున నిందుమతితో నుద్యానమున కేగి వనవీథులవిహరించి కొంత వడికొక వివిక్తరమణీయమగు శాద్వలదేశమున నాసీనుఁడై ప్రియురాలి తో నేవియోయనుభవ రుచ్యములగు ముచ్చటల నాడుచుండెను. అంత నాకసమునుండి యాకస్మికముగా నొక దివ్యసుమమాలిక యాసుమగా త్రియురమునఁ బడ వెంటనే యాసారసాక్షి కనులు మూసికొని నిజ వల్లభునిపక్షముపై నొరఁగి ప్రాణములవిడిచెను అట్లు క్షణములో విగత జీవితయై తనయురమున వ్రాలియున్న యిందుమతి నీక్షించి యాకువల యేశుఁ డిట్లు విలపింపఁదొడఁగెను.

కోమలములగు కుసుమములుగూడఁ బ్రాణులహతమొనర్ప సాధ నములగుచో నికనాహంతకుఁడగు కృతాంతకునకు నేదిమారణ సాధ నము కానేరదు. అట్లు కాదు. ప్రాజ్ఞుఁడగు యముఁడు సుకుమారుల మృదు సాధనములతోడనే సంహరించును. సన్నని మంచు తుంపరచే విపన్నయగుపద్మిని యిందుకునిదర్శనము. నిజముగా మృదుసుమదామ మే హృదయమునసోఁకి ప్రాణములఁ దీయగల్గుచో నదియిపుడు నాయుర

మును దాఁకియు నన్నేలచంపకున్నయది. అట్లు కాదు, ఈశ్వరేచ్ఛచే నొకపుడమృతము విషముగను, విషమమృతముగను మాఱుచుండును.

కట్టా ప్రాణేశ్వరీ! ఉద్యానవన విహారముచే నీవదనసరోజమున జనించినస్వేదోదకబిందులవను లారకమున్నే నీవ స్తమించితివే. ఇస్సీ! సారహీన మగు నీయస్థిరదేహసంపద నాసింప రాదు! ఓ! శుభాంగీ! సుమాళిభూషితములును, సువల్లీవిలసితములును, వరాళిసదృశములును నగునీనీలకుంతలములఁ గదల్చుచున్న గంధవహుఁడు నీపునస్సమాగమా భిలాషను నామానసమున నంకురింపఁ జేయుచున్నవాఁడు. అయ్యో! కళ్యాణగాత్రి! ఏనీకోమలతర దేహలతికకు పేశలపల్లవ తల్పముకూడ పీడాకరముగానుండెడిదో యట్టి నీమృదుదేహమును కఠినకాష్ఠములపై నేనెట్లిడఁగలవాఁడ, నెటులవహ్నికీలల కాహుతిఁజేయఁగలవాఁడ.

ప్రియసఖీ! యీమావిగున్నయు, నీగురివెందతీఁగెయు నీచే దంపతులుగాఁ జేర్కొనఁబడినవికదా! అట్టితఱి నీలతావిటపములకుఁ బాణి గ్రహణోత్సవము జరుపకయే పరలోకమున కేగుట నీయట్టి దయామయు లకుఁ బాటికాదు. ఓ! బంధుప్రియా! నీవు శోకమగ్నులైన సఖులను దుఃఖార్ణవపతితుఁడైనభర్తను తల్లికై విలపించుచున్న బాలేందుసుందరుఁ డగు నందనుని నొక్కపెట్టున దిగవిడిచి నీవొక్కతెవు దివి కేగి స్వర్గసుఖ ముల ననుభవింప నెంచుటచూడ నీవుస్వార్థాభిలాషిణివిగాఁ గన్పట్టు చున్నదానవు.

కటకటా! దైవమా! ఇపుడు నా ధైర్యము తూలిపోవుచున్న యది. నాప్రేమము శూన్యమగుచున్నది నాజీవితభాగ్య మడవిగాచిన వెన్నెల యగుచున్నది. నాకన్నుల కంధకారము క్రమ్ముచున్నది. ఈ దుర్భరదుఃఖ సమయమునఁ బ్రాణముల విడుతునన్న, ఆబాలపాపఁడు తలిదండ్రులు లేనిబిడ్డఁడై ప్రాణముల విడుచును. ఇటు పుత్త్రవాత్సల్య మును, అటుకళత్త్రదుఃఖమును సమముగా నామానసము నాక్రమించు చున్నయవి. నేనేమిచేయువాఁడ నెందుల కేగువాఁడ. అహా! యొక్క త్రుటిలో నాజీవితమెట్లుతాఱుమాఱైనది. ఆయువెంతటిచంచలపదార్థము. హా! ఇందుమతీ! ప్రియసఖీ! ప్రాణేశ్వరీ! నాతోమాటలాడవా?

నేచేసినతప్పేమి? నీకింతకోపముతగునా?-నీనందనునినైనఁ బలుకరింపవా! అబ్బా! నేనీమోహనదేహమును విడువఁజాల విడువఁజాల.

ఓ! రఘురాజేంద్రా! నీకోడలు హఠాత్తుగా నన్నువిడిచినీలోకమునకు వచ్చియున్నచో బుద్ధిఁ గఱపి యిటకుఁ బంపుము, పుత్త్రుఁడా! దశరథుఁడా! మాతృవిహీనుఁడవగు నిన్ను నేనెట్లు పెంపఁగలుగుదును. చూచితివా నీతల్లి హృదయకాఠిన్యము, నీవుబిగ్గఱగా నేడ్చుచున్నను, నినోదార్పరాకున్నయది, యని యామృతదేహమును కౌఁగిలించుకొని బహువిధముల విలపింపఁదొడఁగెను. నిజమే! సంసారి నేత్రములులేకున్నను బ్రతుకఁగలఁడుగాని, కళత్రములేకున్న జీవించుటదుర్భరము. ఇట్లతి దీనముగా విలపించుచున్న యాకోసలాధిపు శోకమును విని తరుగుల్మాద్యచేతన వస్తుజాలముకూడ తుహినబిందురూపమునఁ గన్నీటిని విడువఁదొడఁగెను. వృక్షశాఖలనుండి పక్షిజాలములు కరుణకూజితములఁ బలుకఁజొచ్చె.

అట్లు ధైర్యము దూలి విలపించుచున్న యజునిచేతులనుండి మృతదేహమును, ఆప్తబంధువులతికష్టముపైని తొలఁగించి, అగరుచందనేంధనాదులతోఁ నగ్నిసంస్కారమొనర్చిరి. అజుఁడు సాకేతమున కేగక యాయుద్యానముననేయుండి క్రమముగా దశాహ్నికకర్మలనెఱవేర్చి కన్నీటిధారలతో నిజకాంతామణికిఁ దిలాంజలినొసంగి యాప్తసచివాదుల ప్రార్థనపైఁ బురమునకేగెను.

## —: త్రయోదశాధ్యాయము :—

## —: తత్వబోధము :—

ఈలోకమునఁ గాంతి నొసంగు వస్తువులెన్నియున్నను, గాంతా విరహితులకు జగమంతయు నంధకారబంధురముగాఁగన్పట్టును. అజుఁడు, ఇందుమతీ వియోగఖిన్నుఁడై యంతఃపురముననేనివసించుచు నాయిందుమతి కిష్టములైన వస్తువులఁజూచియు, ఆప్రియురాలొనర్చిన సానురాగోపచారములఁ దలంచియు, ఆసుధాసంభాషిణి పలికిన హితోక్తుల స్మరించియు, మధ్యమధ్య దనఁలేబాలుని ముద్దుమోమును దిలకించియు,

నన్యమెఱుఁగక, పిచ్చియెత్తినవానివలెఁ దనలోఁదాను మాటలాడు కొనుచునుండెను.

మంత్రిలు స్వతంత్రమూని, యాకోసలేంద్రుని బోధింపవెఱచి తపోవనమునకేగి వసిష్ఠమహర్షితో నజునికురవస్థనంతను దెలిపి తనుజేని కిఁదత్త్వబోధఁజేయుఁడని. ప్రార్థించి, యామునివరునయోధ్యకుఁ దోడు కొని వచ్చిరి. అంతవసిష్ఠుఁడంతఃపురమునను న్న యజునికడకేగ, నాతఁ డామహర్షి పాదములపైఁబడి, "ఆచార్యోత్తమా! నాయర్ధాంగినిఁగోలు పోయి, యిట్లువ్యర్థజీవితుడనై బ్రతికియుంటిని. తాపసేంద్రా! నేనెట్టీ దుర్భరప్రియావియోగదుఃఖమును భరింపఁగలవాఁడ? దీనినెట్లు మఱువఁ గలవాఁడ. ఆత్మహత్య నరకహేతువంచురుకదా? యని విలపింప వసిష్ఠుఁ డిట్లు పలికెను.

వసిష్ఠుఁడు:—రఘునందనా! ఇటుల బాలునికైవడి విలపింపఁ దగునా? నీవాపెవెంటఁ బరలోకమునకేగినను, ఆవెలఁదినిఁగలియఁజా లవు. మహారాజా! మృతజీవుల గతులెవ్వరికినిఁ దెలియశక్యములు కావు. ఆకర్మరహస్యములొక్క భగవంతునకుమాత్రమే తెలియును.

మఱియు సూర్యకులభూషణా! మీభానువంశ శిఖామణులు ప్రజాపరిపాలనమునే నిజజీవితఫలముగా భావింతురు. మిత్ర, పుత్ర కళత్రాది సంయోగ వియోగముల నంతగాఁబాటింపరు. ఈ వన్నె యొక్క మీయినకులమునకే కలదు. కావున నష్టవస్తువునకై యిటుల వ్యర్థముగా విలపింపక, జననమరణములు ప్రాణుల కనివార్యములని, తెలిసికొని, ప్రజాపరిపాలనాసక్తచిత్తుఁడవై, బాలేందుసుందరుఁడగు నందను నాయింరుమతికిఁ బ్రతినిధిగానిడుకొని, విచారముడిగి, ప్రాజ్ఞ మార్గమున సంచరింపుము.

అజుఁడు:—జ్ఞాననిధీ! నాప్రియురాలి యీయసహజమరణదుఃఖ మును నేనెట్లుతొలఁగిపుత్తును? ఆదయావతి నాపైఁజూపిన యవ్యా జానురాగమును వెంటనేమఱచి కృతఘ్నుఁడనై యుండుటయెట్లు? దేశికేంద్రా! జీవులకలయికలింతటి యస్థిరములా?.

వసిష్ఠ:—రాగమోహితుఁడా! నీకామినీమరణము సహజమే

కాని యెంతమాత్రమసహజముకాను. దేహులకు మరణమేస్వభావము. చావకుండుట యసహజము. నిప్పునకుఁగాల్చుటసహజగుణము. అట్టి యగ్నినిఁ జేపట్టినప్పుడు కాల్పకున్నచో వింతఁజెందవలయును కాని దహించిననాఁడు వెఱఁగందరాదుకదా? అటులనే పోఁదగినశరీరము చెడి పోక నిలచిననాడు వింతచెందవలయునుగాని పాడైపోయిననాడు వెర గందరాదు. నృపేంద్రా! సన్నిహిత సంబంధముగల శరీరి శరీరములకే వియోగము నిత్యమైనప్పుడు, నిజదేహములకంటె వేఱుగానున్నవార లతో నెడబాటు లేకుండుట యెట్లుపొసగును ?

రాజచంద్రా! శాంతచిత్తుఁడవై యిటు వినుము. నీవు నాతో నీ యర్ధాంగి మరణించినదని, తెలిపియుంటివే ? ఆమరణించిన యామె నెప్పుడైన జూచియుంటివా ? నీవు చూచి ప్రేమించినది శరీరముకదా ? దాని నేల దహింపఁజేసితివి ? కావున వత్సా! ఇదియే పెద్దమోసము. జనులు దేహసౌందర్యమునుజూచి, మోహమును జెందుదురేకాని దేహాంతర్గతమగు నాత్మ సౌందర్యమునుఁ దిలకింపఁజాలరు. అట్లుండి నను ప్రాణములుపోయినవెనుక తామదివఱకుఁ బ్రేమించిన దేహమును రోసి, తామెన్నడును, జూడనిదానికై, విలపింపఁదొడఁగెదరు. ఇది వింత కాదా ?

అజుఁడు:—గురువరా! నిజమే! నేఁజూచిన సుందరవస్తువు నా ప్రియురాలి దేహమే, నేనిపుడు చనిపోయెననుకొనుచున్నదాని నెన్న డునుచూచి యెరుంగ, కాని యా యదృష్టవస్తువునకై విలపించుచుం టిని గురూత్తమా! దేహమునువీడిన జీవుడేమగును ?

వసిష్ఠ:—రాజా! కొంచము దారిలోనికివచ్చితివి వినుము జను లకు శరీరములే కానవచ్చునుకాని, శరీరులు కానరారు. జీవులు కర్మ వశమున నణుస్వరూపులై పూర్వదేహముల నదిలి క్రొత్తదేహములఁ బ్రవేశించుచుందురు. జీవునకుఁ గర్మబంధమున్నంతవఱకిట్టి మార్పు తప్పదు. కావునఁ గర్మానుసారము జీవులనేక దేశములతోడను, ననేక యోనులతోడను, ననేక దేహములతోడను, సంబధము కలవారలై జననమరణాదులచే నొందటినో సుఖదుఃఖముల పాలుసేయుచుందురు.

సృష్టివైచిత్ర్యమును దెలిసిన తత్వవేత్తలు జననమరణాదులచే వికారముపొందరు. దీనినెఱుంగని వారలు వ్యామోహితులగుచుందురు, భూపాగ్రణీ! యెవ్వతెరూపమునుజూచి, భ్రమసితివో, ఆ కాంతామణి యిపుడు నీకు మోహమును గలిగించిన దేహమునువీడి, వేఱొక శరీర మునజేరి, నర్తకియై నృత్యము చేయుచున్నయది.

అజుఁడు:—దేశికేంద్రా! అటులనా? ఇంతలో నంత వింత శరీర మునుదాల్చెనా? నన్ను మరచెనా? యంతటి యనురాగమును దగ్ధ మొనర్చెనా? ఈ లోకదాంపత్యమొక తటిచ్చంచలమగు బూటకపు నాటకమా? గురువరేణ్యా! క్షమింపుడు నాయర్థాంగియట్లు నిర్లజ్జగా నాట్యమాడుచున్నదన నే నమ్మజాల మర్యాదాప్రధానమగు విదర్భ రాజవంశమున జననమంది, ఆత్మగౌరవ ప్రధానమగు కోసలరాజకుల మున గౌరవింపఁబడిన యిందుమతి యాటకత్తియ యగునా? కాదు, కానేరదు, నాకు నాపైఁ దీవ్రవిరాగముకలిగింప నిటులఁ దెల్పు చుంటిరి.

వసిష్ఠు:—వెఱ్ఱితేఁడా! ఎంతటి వ్యామోహమునఁ బడియుం టివి. నీయవస్థఁజూడ నవ్వును, జాలియును, గూడఁ గల్గుచున్నయవి. భూపాలా! విను మానర్తకీ వృత్తాంతమును పూర్వము తృణబిందుఁ డను మహాముని నిశ్చలసమాధి నిష్ఠుఁడై తీవ్రముగాఁ దపమాచరించు చుండ, స్వార్థపరులలో నగ్రేసరుఁడగు సురేంద్రుఁడాతాపసి తపము నను, భీతిల్లి యవలీలగా, శాంతి సమాధులఁ బడఁగొట్టుటలోఁ బ్రసిద్ధి గాంచిన, హరిణియను నప్సరసను నామునితపో విఘ్న మొనర్పమన ఆ వంచనాపండిత యాజ్ఞానిధినిఁ జలింపఁజేయ వెడగుచేతలఁజేయుచుండ ఆతాపసోత్తముఁడు మహోగ్రుఁడై "మనుష్యస్త్రీవై జన్మింపుము" అని దాని శపియించెను. అంత నాసుర వారకాంత సంతాప సమన్విత యై యాముని పాదసారసములపైఁ బడి "మునిసార్వభౌమా! నేను పరాధీనను సురసార్వభౌముని యాజ్ఞచే మీ తపోవిఘ్నమొనర్ప వచ్చి తినిగాని స్వబుద్ధిచే రాలేను. క్షమింపుడు" అని దీనముగా వేడికొనఁ గరుణాళుఁడగు మునివరుఁడు, శాంతుఁడై, "నీపై నెపుడు దేవసుమమా

లిక పడునో, యప్పుడు శాపవిముక్త, వగుదువు” పొమ్మనెను ఆశా పకారణముచే నాహారిణి విదర్భరాజవంశమున నిందుమతియను పేర జన్మించి, స్వయంవరమున నిన్నుఁజేపట్టి, యీపట్టినిగని పిమ్మట మందారమాలికా స్పర్శముచే, మానవదేహమును వీడి, వెడలి పోయెను.

అజుఁడు:—మునీంద్రా! యీ మందారమాలిక యెట్లువచ్చెనో తెలుపఁ బ్రార్థించుచున్నవాడను.

వసిష్ఠుఁడు:—ప్రభావతీనందనా! మీదంపతులిరువురు వనస్థలినిగూర్చుండి మాటలాడుచున్నయపుడు నారదుఁడు వీణను వాయించుచు గోకర్ణక్షేత్రమున నున్న సదాశివునిసేవింప నాకాశమార్గమున నేగుచుండెను. అపుడు వీణాశిరమున వ్రేలుచున్న మందారమాల గాలి వలనఁ దూలి యిందుమతిపైఁబడెను, దాననాపె యసువులఁబాసెను.

అజుఁడు:—మునిచంద్రా! మీతపశ్శక్తిచే నొకసారి నాకు నా హారిణినిఁ జూపఁగోరుచున్నవాడ మీరెన్ని చెప్పినను నిందుమతి, యట్లు నటకత్తెయగునని విశ్వాసము, కలుగకున్న యది.

వసిష్ఠు:—భూపాలా! నీవు కోరినరీతిని నాయచ్చరను నిచ్చటికి వచ్చునట్లు చేసి చూపెదను కనుఁగొనుమని కన్నులుమూసికొని ధ్యాన్నింప నింద్రసభలో నృత్యము చేయుచున్న, యా హారిణి వెంటనే యానృత్య వేషముతోడనే యటకువచ్చి యాకసమున నిలచి యిట్లనెను “మునీంద్రా! ననుఁబిలువఁగారణమేమి ?”

వసిష్ఠు:—నందనవనవిహారిణీ! హారిణీ! యీనీ ప్రాణేశ్వరుఁడగు నజరాజేంద్రుఁడు నీవియోగమును భరింపఁ జాలక నిన్నుఁ బిలువుడనుటచే శిష్యునిమాట కాదననేఱక యిటకుఁబిలచితిఁ బాపమీతనికిఁ దగు రీతిని, ధైర్యమును బోధింపుమన హారిణి యిట్లుపలికెను.

హారిణి:—కోసలరాజేంద్రా! నీవునాకుఁ బ్రియుడవని వ్యవహరింపఁబడుటకుఁ గారణభూతములగు దేహకాలములు గతించిపోయినవి నా నిజరూపమిదియే అప్పటిరూపము శాపకల్పితము. కాని నిజముకాదు నేనా శాపరూపము ఎపుడుపోవునా యని, యెదురుచూచుచుండెడిదానను మందారమాలాసంపర్కముచే నా కా నీచ

దేహముపోయి తిరుగ నీదివ్యదేహము సంప్రాప్తమైనది. కావునఁ జంచలములగు దేహసంపదలపై నాశచెందక నిష్కామకర్మముల నాచరించి, మోక్షమునకేగుము. ఇదియే మీ పూర్వంపు సూర్యవంశరాజుల మార్గము బ్రహ్మవేత్తయు బ్రహ్మమానసిక నందనుఁడునగు వసిష్ఠునకు శిష్యుఁడవైన నీకిట్టి వ్యామోహముతగదు; నే వేగముగా దివమునకేగకున్న నాయేలికయగు సురేంద్రుఁడు నన్నుశిక్షించును కావున నేను పోయెదను మునీంద్రా! శెలవొసంగుడు అని వెడలిపోయెను.

అంత నజుఁడట్లు కాళ్లకు గజ్జెలుగట్టికొని సతీవిరుద్ధమగు వేషముతోనున్న హరిణి వికారరూపమును దిలకించిన తోడనే లజ్జితుఁడయ్యెను.

వసిష్ఠు:—కోసలేశా! చూచితివా నీప్రియురాలిని నీకుఁ దృప్తి కలిగినదియా?

అజుఁడు:—తపోనిధీ! నిజముగా నీపెయా! యా యిందుమతి? అన్నా! యిట్టి సామాన్యను రాణినిగాఁజేసికొని యుంటినే యని సిగ్గు చెందుచుంటిని మునిచంద్రా! నేనీనర్తకి రూపమును జూడకున్న నాకీపెపై వ్యామోహము తగ్గకయుండెడిది ఇపుడన్ననో కీర్తిమర్యాదలతోనున్న సూర్యవంశమునకు నొక కులటను గోడలినిగాఁజేసితినే! యను చింతపుట్టుచున్నది. మునీంద్రా! మీ కటాక్షముచే నాహృదయమున వ్యాపించియున్న విషయవ్యామోహాంధకారముపీడిపోయి మట విరాగతేజముదయించినది. గురూత్తమా! నాసుతుఁడు రాజ్యార్హుఁడైన వెంటనే యాతని సింహాసనాసీనునిగాఁజేసి మీ యాశ్రమమునకు వచ్చి మీవలన, బ్రహ్మతత్వమును దెలిసికొనియెదను.

ఆహా! ఈ యచ్చర యిందుమతీరూపముతో నాకనురాగమును, హరిణీరూపముతో విరాగమును గలుగఁజేసినది. జేబగల్లొకవస్తువునుండియే కలుగునట్టుల రాగవిరాగములును నొక పదార్థమువలననే జనించినవి.

వసిష్ఠు:—సత్యప్రియుడా! నీవనినట్లు ద్వంద్వభావములు బాహ్యపదార్థాశ్రయములు కావయ్యవి యంతఃకరణ వృత్తులు కావున చిత్తమును శుద్ధిచేసికొనిన వారికి ద్వంద్వధర్మములు కలుగనేఱవు. నీవు

నీపుత్రునిఁ బెద్దవానినిఁగాఁజేసి యాతనికి రాజ్యమొసంగి తత్త్వవేత్తవై మోక్షసామ్రాజ్యమును బడయుము. ఇయ్యది యే మీకులపురుషుల మర్యాద. నే పోయివచ్చెదఁ బిరుగ రాగ వ్యామోహమునఁ బడక, జాగరూకుడవై ప్రజలఁ జక్కఁగఁ, బాలింపుము అన నజుఁడు గురుచరణములకు నమస్కరించి నిజనందనుని జూపెను. ఆమునీంద్రుఁడు శ్రీహరికిఁ దండ్రికానున్న దశరథుని దీవించి నిజాశ్రమమునకు వెడలిపోయెను.

అజమహారాజు దశరథునకు విద్యాబుద్ధులు నేర్పించి సర్వతంత్ర స్వతంత్రునిగాఁజేసి కోసలసింహాసనఁ బట్టాభిషేక మొనర్చి నిజనందనుఁడు నిరుపమాన పరాక్రమముతోడను, అసమానవిజ్ఞానముతోడను, నిరభిమాన సౌశీల్యముతోడను, గోసలరాజ్యమును బరిపాలించుటను గాంచి, సంతసించి, తత్త్వజ్ఞానాభిలాషియై గురువనమునకు నేగెను.

అజుని యనంతరము దశరథుఁడు నవయవ్వనుఁడయ్యు విషయలోలత లేక, మహాధనికుఁడయ్యు గర్వమెఱుంగక, సార్వభౌముఁడయ్యు స్వేచ్ఛగాఁ దిరుగక, జితేంద్రియుఁడై, నిగర్వియై, ధర్మబద్ధుఁడై, ప్రజల గురునివలె బోధించుచుఁ దండ్రివలెఁ గాపాడుచు సోదరునివలెఁ బ్రేమించుచు, రాజ్యమును బాలింపఁదొడఁగెను, ప్రజయు నాపంక్తిరథుని దైవమునుగా భావించి, భయభక్తులతోఁ గొలువఁదొడంగెను.

దశరథుఁడొకప్పుడు నిజపరాక్రమచక్రముతో భూవలయమును జుట్టగోరి, అయోధ్యనుండి పృతనాసమేతుఁడై, బయలువెడలి క్రమముగా నరిన్పృపాలుర యౌద్ధత్యముల నడంచుచు, నగ్రముల నుద్ధరించుచు, నిట్లు నలుదిశల మహోన్నతములగు జయగోపురముల నిర్మించి, స్వర్లోకమునకు దేవేంద్రుఁడద్వితీయ సార్వభౌముఁడైనట్లు భూలోకమున కనన్యచక్రవర్తియై వెలయుచుండెను.

ఇటులుండ నాపిన్న తేఁడొక దివసమున సరయునదీతీరారణ్యమున కేగి విలువిద్య నభ్యసించుచు నాటి వెన్నెలరాత్రి శబ్దభేది శస్త్రమును బ్రయోగింప గుఱికై చూచుచుండ ఆనది కావలియొడ్డునుండి బుడబుడయను చప్పుడు వినవచ్చెను ఆపుడా బాల వీరుఁడు ఆధ్వని జలపాన మొనర్చుచున్న యేనుగయొక్క తుండాగ్రధ్వానమని కర్మవశమున

నిశ్చయించి, ధ్వని వినవచ్చుచున్న తావునకు బాణమును విడచెను. అంతనా నిశితాస్త్రము తిన్నగానేగి, దప్పిఁగొనియున్న తలిదండ్రులకై కలశములో నదీజలములఁ జేకొనుచున్న శ్రావణుఁడనుమునికుమారునకుఁ దగుల హా! పితరులారా! యని కేక వేసెను.

## చతుర్దశాధ్యాయము.

### —: శ్రా వ ణో పా ఖ్యా న ము :—

మధురాపుర నివాసియగు రత్నగుప్తుఁడను వైశ్యబాలుఁడును, పాటలీపుత్రనగరవాసియగు సువర్ణగుప్తుఁడను కోమటికొమరుఁడును వారణాసి కేగి, వాణిజ్యవిద్య నభ్యసించుచుండిరి కొంతకాలమునకు నా యిరువురు సాధునందనులును మిత్రులై యొక గృహమునందే వసింపఁ దొడఁగిరి అట్లాయూరుజసుతులు పరమమైత్రితోఁ గాశిని నివసించి వాణిజ్య విద్యయందుఁ గృతార్థులై వారణాసినివీడి నిజనగరముల కేగున పుడు వారిరువురు ముందుఁ దమకు సంతానము కలుగుచో నన్యోన్య సంబంధములు నెఱపఁ బ్రతినఁజేకొని వెడలిపోయిరి.

కొంతకాలమునకు రత్నగుప్తుఁడు వ్యాపారమునభివృద్ధి చేయఁద లఁచికొని యనేకామూల్యవస్తువులఁ దీసికొని యొడనెక్కి సముద్రము పై విదేశముల కేగి యావస్తువుల విక్రయించి యపారధనములనార్జిం చి యింటికి మఱలి వచ్చుచుండ మార్గమధ్యమున నోడలో మంచినీరై పోవుటచే నొక యరణ్యసమీపమున నోడనాపి యా యరణ్యములోని కేగి దాహోదకములఁ దెచ్చుటకు, సేవకుల నావర్తకుఁడు నియ మించెను.

అంతకుఁబూర్వమా యడవిని వింధ్యవాసినియగు దుర్గను సేవిం పఁ గుటుంబముతో నేగుచున్న కేశవదాసుఁడను ధనికుని నాటవికులగు చోరులు ముట్టడించిరి, ఆసమయమున నాధనికుని భార్య తన శిశువును వడిలోవేసికొని పరిగిడి యొక చెట్టునీడను బట్టపైఁ బరుండఁబెట్టి జోకొ ట్టుచుండఁ గొందరు దొంగలువచ్చి యాపాదజు నిల్లాలిని బలవంతముగా లాగికొని పోయిరి పాపమా యనాథశిశువు చెట్టుక్రిందఁ నేడ్చుచుండెను.

ఇటులుండ రత్నగుప్త సేవకులు మంచినీటికై వెతకుచు దైవవశమున నటకువచ్చి కారుకారుమని యేడ్చుచున్న యాశిశువును జూచి జాలిఁజెంది తమలో నొక్కని నక్కడఁ గావలియుంచి, యాయరణ్యమంతటను గేకలిడుచు వెతకిరి కాని, ఆబిడ్డను గన్నవారుకాని, తమ కేకలవిన్నవారు కాని, కానరాకుండుటచేఁ దిరుగఁ జెట్టుకడకేతెంచి మున్ను శిశువుదగ్గరనుంచిన వానిని తాము వచ్చువఱకు నా బాలికను గాపాడుచుండుమని, తెలిపి, యొకసరోవరమునుండి జలములఁదీసికొని పడవకడకేగి, రత్నగుప్తునితోఁ దాముచూచిన యనాధబాలికయవస్థ నుదెలుప, నావణిజుడా మాటలువిన్నతోడనే మనసుకరగి యోడదిగి సేవకుల వెంటనిడికొని యచటికేగి యసదృశమగు సోయగముతో నా చెట్టుక్రింద బట్టపైని సరసీరుహకోమలదళమువలె ముద్దుగా జూపట్టుచున్న యాపసిబిడ్డనుజూచి వత్సలుడై, యాబిడ్డను నెత్తికొని, ముద్దిడి, తిరుగ వనమంతయు వెతకించి, యెవ్వరును గానరాకుండుటచే నొకరాగిరేకుపైని నిజనగరనామాంకములను వ్రాయించి "ఆబిడ్డనుగన్నవారు తన కడకువచ్చినచో నాబాలిక నిత్తున"ని ప్రకటించి యారేకును జెట్టున వ్రేలాడగట్టించి యాబిడ్డను దీసికొని మధురాపురికి వచ్చి తనభార్య కిచ్చెను.

అ సాధుభార్య . సంతానము లేనిదగుటచే నాబిడ్డను జేకొని మనసుదీరముద్దులిడి యతిప్రేమతోఁ బెంపఁదొడగెను ఆవర్తకుఁడా శిశువునకు అన్నపూర్ణయని పేరుపెట్టి సంతతిలేదను ఖేదమును మఱచెను.

అంతకుబూర్వమే సువర్ణగుప్తునకు విశ్వేశ్వరకృపచే నొకపుత్రుఁడు కలిగెను. ఆకుమారునకు విశ్వనాథుఁడని నామకరణమొనర్చెను. కాలక్రమమున విశ్వనాథుఁడును నన్నపూర్ణయు వివాహానుకూలమగు వయసునకువచ్చిరి. అది వఱకా యిరువురు బేటులుచేసికొన్న శపథానుసారము రత్నగుప్తుఁడు తన పుత్రికయగు నన్నపూర్ణను సువర్ణగుప్తసుతుఁడగు విశ్వనాథునకొసంగి వివాహమతివైభవముతో నెఱపెను. వివాహమైనది మొదలు ఆ వధూవరులు ఘనానురాగముతో మెలఁగుచుండిరి.

కొంతకాలమునకు దైవదుర్విపాకముచే నన్నపూర్ణతలిదండ్రులు దివంగతులైరి. కోటీశ్వరుఁడగు నాకోమటి ధనమంతయుఁ గుమారులు లేకుండుటచేఁ బుత్రికయగు నన్నపూర్ణకుఁ జేరినది యిట్లుపుట్టినింటి సంపదయు నత్తింటి విత్తమును గలయ నాదంపతుల భాగ్యమగణ్యమై వెలయుచుండెను కాలవశమున విశ్వనాథుని పితరులుకూడ శివసాయుజ్యమునుబొందిరి. అందుచే నన్నపూర్ణావిశ్వనాథులు సంసారమునకు బెద్దలైధర్మపరులై విత్తాఢ్యులమని విఱ్ఱవీఁగక వినయసంపన్నులై కాఁపురముచేయుచుండిరి.

అన్నపూర్ణకుఁ జిన్ననాఁటినుండియుఁ బరులకన్నమిడుటయందు సంతోషము మెండు. ఆసూరశేన దేశమున నానాధ్వి పేరుదానధర్మములకుఁ బ్రసిద్ధిఁ జెందియుండెను. ఆయూరన్యదంపతులుధనధాన్యసంపన్నులైసకల సౌఖ్యముల ననుభవించుచున్నను సంతానములేని లోపము వారిని బాధింపఁదొడఁగెను. మానవసౌఖ్యములెవ్వరికిని బరిపూర్ణములు కానేరవు. ఒకటియున్న వేఱొకటి యుండ నేఱదు. సంతానప్రాప్తికై వారొనర్చిన నోములకును దానములకును మేఱగానరాదు. కొంతకాలమిట్లా జాయాపతులు సంతతికాంక్షులై యీశ్వరారాధనములతోఁ గాలమును గడపుచుండఁ బరమేశ్వరానుగ్రహముచే నావణిగ్భార్య గర్భవతియై శ్రావణమాసమునఁ బూర్ణిమనాఁడు పుత్త్రునిఁబ్రసవించెను. విశ్వనాథుఁడాశిశువునకు శ్రావణుఁడని, పేరుపెట్టి యత్యానందభరితుఁడై, బ్రాహ్మణోత్తములకు భూరిసంభావనలనొసంగి, పూజించెను.

శ్రావణుఁడాఱేండ్ల ప్రాయమువాఁడైయుండ సూరసేనదేశమున భయంకరక్షామము సంప్రాప్తమాయెను. ఆకలువుచేజనులన్నము. లేక విలపింపఁజొచ్చిరి. దేశమున నెటుచూచినను, అన్నమన్నమని యార్తనాదములు వినవచ్చుచుండెను. తిండిలేక, మృతులైనవారిసంఖ్య దినదినముఁ బెరుఁగఁజొచ్చెను. ఈ ఘోరవార్త మధురాపురినున్న యన్నపూర్ణ చెవికి ములుకువలెఁదాఁకెను ఆసతీమణి యాదుర్వార్తవిన్నతోడనే దేహము కంపింపఁ గన్నులదుఃఖాశ్రువులు వ్యాపింప వ్యాకులితచిత్తయై తిన్నగా వ్యాపారమును జూచికొనుచున్న భర్తకడకేగి, యిట్లుపలుకఁజొచ్చెను.

అన్నపూర్ణ:—ప్రాణేశ్వరా! వింటిరా కాటకము మాట యెంతటి భయంకరముగా నున్నదియో! మనోవల్లభా మన మీనాఁటిని వాణిజ్యము నుండి నివృత్తులమై యార్తులకన్నదానము చేయుటకుఁ బూనికొనవలయును. ఈ క్రూరక్షామరాక్షసి మన దేశమునుండి వెడలిపోయిన పిమ్మటఁ దిరుగ వ్యాపారమును జేయవచ్చును కావునఁ గఱవు తొలఁగుపర్యంతము నాయందు దయయుంచి మన మెల్లరమును, అన్నదానవ్రతమునఁ బాలుగొనవలయును.

సాధుశేఖరా! దీనుల సంరక్షింపఁజాలని విత్తములు, ఇల్లూడ్చిన చెత్తలవంటివి. అట్టి ధర్మానుకూలములు కాని విభవములకు నధికారి యనిపించుకొన్నటకంటె సన్న్యాసియై సంచరించుట మేలు. సోదరసంఘ మన్నము లేక మలమలమాఁడుచుండ మేడలలోఁ దిని కూర్చుండుటయు, నోడలనెక్కి దిరుగుటయుఁ, బక్వాన్నముల మెక్కి భాగ్యశాలుర మని విఱ్ఱవీఁగుటయు, నెంతమాత్రము తగదు. పరసౌఖ్య సంపాదనవిముఖులై కేవల నిజసౌఖ్యపరాయణులై సంచరించువారలకే రాక్షసులని పేరు.

తత్త్వజ్ఞా! ధనమును గాపాడవలయు నని దాని నెట్టియినుప పెట్టెలలోఁ బెట్టి దిట్టముగా నెంతటి బీగములు వేసినను, ఓరుగాలిలోఁ బెట్టిన దీపమట్లు ధన మెగిరిపోవునే కాని నిలువనేరదు. దానినిఁ గాపాడు విధి ధర్మమే; సొత్తుకలవారు మూఁడువిధములుగా విభజింపఁబడియున్నారు. ధనవంతులనియు, భాగ్యవంతులనియు, శ్రీమంతులనియు, అందు దాము తినక యొరులకుఁ బెట్టక తమకున్న ధనమును తను బాఁతులలోనో, గోతుల లోనో, పూడ్చి రాత్రులు దొంగలు రాకుండఁ జేతఁ జేటలనో చింకిచేఁదలనో పట్టుకొని వాయించుచు జాగరణములఁ జేయువారలు, ధనికులు.

స్వార్జితవిత్తములతోఁ దాము సుఖియించుచు, నితరుల సంతసింపఁ జేయుచు, విత్తముల నుపయోగించు వారలు భాగ్యవంతులు. అవసరమగుచో నిజధనములఁ దాము తినక పరార్థముపయోగించి యుపవసించువారలు శ్రీమంతులు.

ప్రాణవల్లభా! ధనములు, నిత్యములు కావు. తనువులు శాశ్వతములు కావు. ఈ రెండునుఁ గూడ క్షణభంగురములె. ధర్మ మొక్కటియే

యవ్యయమై నిలుచునది. కావున మనచేత ధనమున్నంతవఱకు నన్నార్తులైయున్న మన సోదరమానవులకు భక్తితో భక్తమొసంగి కాపాడవలసిన బాధ్యత మానవులమగు మనపైఁబడియున్నది. పరబాధలఁదీర్పఁజాల్గొనువారలే, సురలు, కావున నర్యావతంసా! మనకడ ధనమున్నంతవఱకు నీక్షామసమయమున నార్తులఁ గాపాడఁ దగుప్రయత్నములఁ జేయఁగోరుచున్నదానను. ధనసంపాదనముకంటెఁ బుణ్యసంపాదనము ముఖ్యము. నేఁటినుండియే మనము నిత్యాన్నదాన యాగమునకు సంకల్పమొనర్చి దీక్షితులము కాఁగోరుచున్నదానను, కావున, మనయింట నార్తులకు నెడతెగకుండ నన్నదానము చేయఁబడునని దేశమంతటను బ్రకటింపవలయును.

విశ్వనాథుఁడు:—ప్రాణేశ్వరీ! మన మనుభవింపవలసిన యిహలోకసుఖములన్నియుఁ బూర్తియైనవి. వార్ధకముచే శరీరపాటవము తగ్గిపోవుచున్నయది. కావున నిఁక మనకుధర్మమే శరణ్యము. అందుకర్హమగు సమయమును సంప్రాప్తమైనది. అన్నదానముతోఁ దుల్యమగు దానము లేదు "అన్నస్యక్షుధితం పాత్రం" అని యన్నదానమున కాఁకలికొనియున్నవారలే పాత్రులు. అందునుక్షామమున క్షుధితులఁ గాపాడువారు కైలాసమునఁ బార్వతీ పరమేశ్వరులఁ జెంతనుందురని శాస్త్రములు తెలుపుచున్నవి. గుణవతీ! "ధర్మస్యత్వరితాగతిః" అనుటచే మనము జాగుసేయక నీవుచెప్పినట్లే నాఁడే యన్నదానయజ్ఞదీక్షను బూనుదమని నిజపరివారజనుల నన్నదానమునకు వలయు బనులఁ జేయ నియమించి, సర్వము సిద్ధముచేసి, యన్నపూర్ణతో నిట్లుపలికెను. ప్రేయసీ నేనువీథిలోనిలిచి యన్నార్తులను లోనికిఁ బంపుచుందును నీ వా యతిథులకు భోజనమిడి సత్కరించుచుండుము. వంటవారలును వడ్డనవారలును నిర్ణయింపఁబడియున్నవారలు. కాశీవిశ్వేశ్వరుఁడును, అన్నపూర్ణయుమనయన్నదానయాగమును నిర్విఘ్నముగా నెఱవేఱుతురుగాకయని శ్రోత్రసుఖదమగు చల్లని సువార్తనుదెలుప, ఆసతీమణి హృదయసంతాపము చల్లాఱెను. నిజమే, యార్యదంపతుల కలయికలిట్టివియే; వారుకార్యాచరణ

మున నేకమనస్కులై యుందురు కాని భిన్నాశయులై యుండనేరరు. వారిహృదయము లద్వైతానందభరితములు

అంత నన్నపూర్ణ నిజవల్లభుఁడు తన మనోరథమున కనుకూలుఁడగుటచేఁ బరమానందమునంది యన్నదానవ్రతకంకణమును జేతికిఁగట్టుకొని పరమేశ్వరప్రీతికై యార్తులకన్న మొసంగ మొదలిడెను. క్రమక్రమముగా మధురాపురిని, అన్నపూర్ణ యతిథుల నాదరించి యన్నమిడుచున్నదనువార్త దేశమంతటను వ్యాపించెను అందుచేనాఁకలి బాధకుఁదాళఁజాలని జనులుగుంపులుగా నన్నపూర్ణ మందిరమునకురాఁదొడఁగిరి. అన్నపూర్ణయునచ్చిన యతిథుల దైవములనుగాభావించి కడుపార నన్న మొసంగి తనపేరును సార్థకముచేసికొనుచుండెను.

ఇట్లాకఱవు పండ్రెండేడ్లవఱకును నాదేశమును విడువక బాధించెను. అన్నపూర్ణయు నాదీర్ఘకాల మంతయు విసువుచెందక యన్నదానముచేయుచుండెను. ఇట్లు దినదినము వేనవేలజనులు భుజించుచుండుటచే వారికడనున్న ధనమంతయు వ్యయమయ్యెను. పిమ్మట వారు వస్తువాహనాదులును నటుపిమ్మట మడిమాన్యములును తదనంతరము గృహోపకరణములను, ఆవెంటఁ బ్రాసాద మందిరాదులను గ్రమముగా విక్రయించి యావిత్తముతో నన్నదానయాగమును నిర్విఘ్నముగా సాగించిరి. దైవకృపచే నాక్షామము చల్లాఱి ప్రజలు తిరుగ నిజవ్యాపారములఁ జేసికొన మొదలిడుచుండిరి. కానితుదకాక్షామాంత దివసమునవారు తినుటకుఁ దిండిలేనియవస్థకువచ్చిరి దైవవశమున నాఁడేకాదశియగుటచే నాపుణ్యదంపతులు పుత్రునితోఁ గలసి, యుపవసింప నిశ్చయించుకొని నవారలై శ్రీహరిని ధ్యానించుచు రాత్రి జాగరణముచేయఁదొడఁగిరి. అప్పుడు వారి సంతోషమునకు మితిగానరాకుండెను. సామాన్యముగా నత్యల్పకార్యములు, నెఱవేఱునపుడే మానవులానందించుచుండ నంతటి ఘనమగు నన్నదానయజ్ఞమును ద్వాదశవర్షములు నిర్విఘ్నముగా సాగించినవారి సంతోషమున కంతుండునా ?

అపుడు వారిట్లు ప్రసంగింపఁదొడంగిరి.

అన్నపూర్ణ:—హృదయేశా! శ్రీహరికృపవలనఁగ అవుపూర్తిగా దొలఁగిపోయినది దేశము సస్యసంపన్నమై తేజరిల్లుచున్నయది. క్షుధార్తుల కరుణభాషితములు వినవచ్చుటలేదు. మీదయచే నేఁదలపెట్టిన యన్నదానవ్రతము పరిపూర్ణమైనది. నా మనోరథమీడేఱినది.

విశ్వనాథుఁడు:—ధర్మపత్నీ! విశ్వేశ్వరకృపచే మన మీ కాటకము ముగియువఱకు నన్నదానముచేయఁగలిగితిమి. దేశము క్షామరహితమగుటచే నా మానస మానందభరిత మైనది. ఆహా! మనయింటి కన్నార్థులై వచ్చినవారిస్థితిని దలంప గుండెచెఱువగుచున్నది. ఎట్టి యభిమానవంతులుగూడఁ దిండిలేక మాఁడిపోయిరే! ఓకరుణాకరా! జగదీశా! యిఁకముందిట్టి కాటకములు రాకుండఁజేయుము.

శ్రావణ:—జననీజనకులారా! ఈక్షామసమయమున మీరలొనర్చిన యన్నదానవ్రతమును గన్నులారఁగాంచితిని, సంతసించితిని, యిట్టి ధర్మాత్ములకు సుతుఁడనైనందుకు మదినిగర్వించితినని. ఇట్లు వారన్నములేనిస్థితికివచ్చియున్నను స్వవిషయమున విచారింపక పరుల కన్నదానమొసఁగినందుకు సంతసింపసాగిరి. నిజమే ఘనహృదయులు తాము పూనినవ్రతమును నిర్విఘ్నముగా సాగింప సర్వస్వములను దృణప్రాయములుగఁదలంచి విసర్జింతురు; హరిశ్చంద్రుఁడు సత్యవ్రత సంరక్షణార్థము నిజరాజ్యసంపదలనే కాక దారాపుత్రుల బాసియు కాటికి కాపరియయ్యు నిజసత్యవ్రతమును నిశ్చలచిత్తుఁడై నెఱవేర్పలేదా?

ఇట్లుండ నానిశీథసమయమున నెంతదూరమునుండియో తిండి లేక నీరసముచే నడువఁజాలక ఎట్టెట్టులో మథురాపురిఁజేరి యా యన్నపూర్ణగృహమునకే తెంచి యన్నాతురులగు నలుగురు జనులు "అమ్మా యన్నమన్నము" అని నీరసముగా నడుగ, ఆ సన్నస్వరము చెవినిఁబడినతోడనే యన్నపూర్ణ భర్తతో నిట్లుపలికెను.

అన్న:—ప్రాణేశా! ఎవ్వరో యన్న మన్నమని, సన్నని యెలుంగుతోఁ గేకవేయుచున్నవారు, కావున, వారెవ్వరో కనుంగొనుఁడు. దిక్కుమాలిన కఱవింకను జనులఁబీడించుచున్నయది. అన నావైశ్యశిఖామణి వీథిలోనికేగి, తన గృహమునకుముందు శవాకారములతోఁ బడి

యున్న దీనులఁజూచి "ఆర్యులారా మీరెవ్వరు ?" అన నందొక యువకుఁడిట్లు ప్రత్యుత్తరమొసఁగెను.

యువకుఁడు:—మహాశయా ! అన్నమన్నము, నాలుగుదివసములనుండి మంచినీరుతప్ప మఱియొండెఱుఁగము. అన్నపూర్ణ చేయుచున్న యన్నదానమహిమను విని తిండిలేక మాఁడుచున్న తలిదండ్రులను భార్యను వెంటనిడికొని యెటులనో యిటకువచ్చితిని, ఆర్యా! మాయాఁకలి బాధ నాయన్నపూర్ణామతల్లితోఁ దెలిపి మాప్రాణములనిలువఁబెట్టుఁడు. ఆమాటలువిన్నతోడనే విశ్వనాథుఁడు ఖిన్నుఁడై, తెల్లఁబోయినిలిచెను. సత్యమే. చేత డబ్బులేని సమయమున దానవీరునికడకు యాచకుఁడు వచ్చినచో నాదానవ్రతుఁడు తనమానసమునఁజెందు వ్యాకులము సర్వజ్ఞుఁడగు భగవంతునికిఁగూడఁ దెలియునో తెలియదో.

విశ్వ:—ఆర్యులారా ! భయపడకుఁడు, తెల్లవాఱనున్నయది. సూర్యోదయమైనతోడనే మీకన్నము నొసంగుదుము. అనిపలికి, మెల్లగ వారిని లోపలికి దోడ్కొనివచ్చి యొకగదిలో పరుండఁబెట్టి పిమ్మట భార్యకడకేగి, యాయభ్యాగతుల స్థితిని దెలిపెను.

అన్న:—ప్రాణేశ్వరా ! తెల్లవాఱినతోడనే వీరికి మనమన్నము పెట్టవలయును, లేకున్నమనయింట, వీరుప్రాణములువిడుచుటనిశ్చయము. ఇపుడు మనకడ నేమియునులేను, మనము బీదలమగుటచే నెవ్వరును మనకరువియ్యరు. ఏమిచేయుదము ? ఇంతవఱకు నడిగినవారికి లేదనక యన్నములుపెట్టియుంటిమి, కాని, వీరిని దృప్తులనుగాఁ జేయఁజాలమని తోఁచుచున్నది. మనకంఠములఁబ్రాణముండనునాలుక లేదనఁదగునా ; మనకన్నుల నాయాప్తులఁ జూడఁగలమా !

ఓ సర్వాంతర్యామి ! సర్వజ్ఞా ! దీనబాంధవా ! మాయింటికి వచ్చిన యతిథులప్రాణములు పోకమునుపే మాజీవితముల ముగింపఁజేయుము. నేఁడేకాదశియగుటచే నీరాత్రి మా ప్రాణములు పోయినచో మాపాపములు పరిహారములగును. పుత్రుఁడా ! శ్రావణుఁడా ! నిన్ను నిఱుపేదనుగఁ జేసితిమనియన్యథా భావింపకుము. మమ్ము మఱవకుము కట్టా, విద్యాబుద్ధుల నాఱితేఱియున్న నీకు వివాహమొనర్చి, పసుపుబట్ట

లతో భార్యాసమేతుఁడవై నీవు మాపాదములకు వందనమొనర్పదీవిం
చు భాగ్యము మాకుఁ జేకూరదాయె. పుణ్యము నిన్నుఁ గాచుఁగావుత !
మాజీవితము లింతటితో సరియని పలుకుచున్న తల్లిని జూచి శ్రీవణుఁ
డిట్లుపలికెను.

శ్రీవ:—అమ్మా ! ఇదియేమి ? నిరీహాతో నీశ్వరార్పణముగాఁ
గోట్లకొలది ధనముల ధర్మముచేసి, యనేకజన్మలకు నన్నమిడి, కన్నతల్లి
వలెఁ గాపాడిన దానశీలవగు నీవు సంతసింపవలసిన సమయమున చేల
వై విచారింతువేల ! యమ్మా ? అమ్మా ! చేపుకూడ నన్నదానమొనర్చి
యాయన్నాతురులఁ గాపాడఁగలుగుదువు. దయాళుఁడగు భగవానుఁడు
నిజభక్తులకు నగౌరవమును రానీయఁడు.

అన్న:—వెఱ్ఱిబిడ్డఁడా ! కరమున గాసులేక, యింటగంటెడుగంజి
లేక, యున్న మనము నలుగురు క్షుధార్తుల కన్నమెట్లుపెట్టగలము ?
మనమేదియేని వస్తువును విక్రయింతుమనినను మనయింట నెట్టివస్తువును
లేదే.

శ్రావణ:—తల్లికో ! భీతిల్లకుము నాజనకుఁడు ఘనానురాగము
తో నీకంఠమునఁగట్టిన మాంగళసూత్రము ప్రకాశించునంతవఱకు నీకర
మన్న మొసంగునే కాని లేదను సంజ్ఞను జేయఁజాలదు. అమ్మా ! మన
కీపురమున నెందరో సొమ్ములియ్యవలసినవారున్నవారు అందెవరైన
రేపుదయమున సొమ్మియ్యరాదా ? ధనమెట్లుసమకూరునో యేరికిఁ
దెలియును.

అన్న:—ఆహా ! పుత్రరత్నమా! ఎట్టికష్టసమయమునఁ దోడ్పడి
తివి నాగళమున మాంగళసూత్రము మెఱయుచుండుటను దుఃఖవశమున
మఱచితిని నేనిపుడె, నాగ్రీవమునఁ బసుపుకొమ్ముఁగట్టుకొని, నాకంఠ
మునున్న సువర్ణమంగళసూత్రముతో నాకంఠగతప్రాణులఁ గాపాడెద
అని కంఠమునఁ బసుపుకొమ్ము గట్టుకొని, మంగళసూత్రమును భర్త కి
చ్చి "దీని విక్రయించి యాధనముతో భోజనపదార్థములఁ గొనితెండు"
అని ప్రార్థించెను.

అట్లా విశ్వనాథుఁడు మంగళసూత్రమును విక్రయించి, భోజన సామగ్రులఁగొని తెచ్చి నిజసతికిచ్చెను. అంత నాపతివ్రత సూర్యోదయముకాఁగానే ద్వాదశఘడియలేగగముండే తన యింటను పవశించి యున్న కుటుంబమునకుఁ దనివితీరభోజనముపెట్టి, సత్కరించి, భుక్తశేషమగుభక్తమును పతికిని, సుతునకును బెట్టి తాభుజించెను.

ఇదేకదా ! జాలియన్న, యదియేకదా ! ధర్మమన్న, నియ్యదియేకదా సత్కుటుంబమన్న ఇట్టి గృహమొక్కటిచాలదా ? లోకమును బావనముచేయుటకు పురాణసారస్వతమున, వినునపుడు తనువులఁ బులకరింపఁజేయునట్టియు, గన్నుల నానందభాష్పములొలుకఁ జేయునట్టియు, మనోహరపావనోపాఖ్యములెన్నియో గనులరత్నములవలె వెలయుచున్నయవి

ఎంతటిపుణ్యాత్ములకును గర్మఫలమనుభవింపకతీరదు. కావున నేపుట్టినది మొదలు గిట్టువఱకును పుణ్యములుదక్క వేఱొండెఱుంగని సాధువులకుఁగూడ దుర్భరదుఃఖములు కలుగుచున్నయవి " నాభుక్తం క్షీయతేకర్మ " అని పెద్దలు తెలిపియున్నారు. ఇందుకుఁబుణ్యాత్ములగు నీవణిగ్దంపతుల జీవితములే నిదర్శనములు.

అట్లు కలువుకాలమున ధనమంతయు వ్యయముచేసి, యన్నాతురులఁగాపాడిన యన్నపూర్ణావిశ్వనాథులకు వృద్ధతయేకాక యంధత కూడ సంప్రాప్తమాయెను. అట్లువృద్ధాంధులగు పితరులకు శ్రవణుఁడు పరమభక్తితో సర్వోపచారములఁజేయుచు గంటికిరెప్పవలెఁ గాపాడుచుండెను. కాని వారేపూటకాపూట తిండికైతరుము కొనవలసిన స్థితికి వచ్చిరి. అపుడువారుశ్రవణునిజూచి యిట్లుపలికిరి ;

దంపతులు:—ప్రియనందనా ! మాయీకాలముననీవెంత శ్రమపడుచుంటివి. ఇపుడుమాకునిలచియున్నది నీప్రేమభాగ్యముతప్ప వేఱెద్దియును లేదు. మాతలిదండ్రులు మముగోటీశ్వరులగాఁజేసియుండ నీతలిదండ్రులు నినుగూటికిలేనివానినిగానొనర్చిరి. ఓహో ! మనముసంపన్నులముగానున్నప్పుడు నిత్యయదర్శనమిచ్చు మిత్రనామధారులిపుడు

కంటఁబడమానిరే! జనులువిత్తహీనులఁ బ్రాణహీనులకంటెను నధము లనుగాఁజూతురు.

సుతరత్నమా! విన్ను నిరుపేదగాఁ జేసియుంచుటేగాక మావార్ధకమునకుఁదోడు గ్రుడ్డితనముచేర, నీచే నహర్దివము సర్వోపచారములఁ జేయించుకొనుచున్నవారలము. బిడ్డా! యింకముందు మనమెట్లు జీవింపఁగలుగుదుమో?

శ్రవణః:—ఆర్యులారా! అనశ్వరములగు మీపాదారవిందసేవా సంపదల నాకొసంగియు, నన్ను దరిద్రునిగాఁజేసితిమని మీరువిచారించుట భావ్యముకాదు. పూజ్యులారా! పితరులారా! నాకుధనములేదను చింత యావంతయులేదు. కావుననాయందువాత్సల్యముంచి నాకుధనములేకుండఁజేసితిమని విచారింపకుఁడు. కరమునభిక్షాపాత్రమునుబట్టి "భవతిభిక్షాందేహి" అని సతీమణులఁయాచించి మిమ్ముఁబోషింతును. బ్రహ్మచారికి మధుకరవృత్తి పరమపావనము.

అన్న:—వత్సా! మనమెచ్చటఁజేతఁ బరమాన్నపాత్రములఁ బట్టుకొని యతిథులపంక్తులఁదిరిగితిమో యచటనే భిక్షాపాత్రమును గరమునఁబట్టి తిరుగుటతగదు. కావునమనమీవీటినివిడిచి వేరొకపట్టణమునకేగుదము.

విశ్వ:—కుమారా! మీతల్లి యుపదేశము నాకును నచ్చినది. ప్రస్తుతము మనమున్న యీచిన్నయింటిని విక్రయించి, యాధనముతోఁ బుణ్యతీర్థముల సేవింపవలయు నని యున్నది. కావున దీనిని వెంటనే యమ్మివేయుదము. మీ యభీష్టము తీర్చుటయే నాజీవితఫల మని, యా యింటిని విక్రయించి, శ్రవణుఁడొక కావడిని, దట్టలనుగొని, యాతట్టలలో మెత్తగ బట్టలఁబఱచి, తలిదండ్రుల నందుఁ గూర్చుండఁబెట్టి, కావడిబద్దను భుజముపై నిడికొని భగవన్నామోచ్చారణముచేయుచు మధురాపురినివిడిచి క్రమముగాఁ బుణ్యతీర్థములకుఁ బితరులఁ బరమానందముతోఁ గొంపోవుచుండెను.

## పంచదశాధ్యాయము.

### —: ఇందిరా చరితము :—

శ్రీవణుఁ డొకనాఁడుదయమునఁ గావడిని భుజముపై నిడికొని, మాహిష్మతీపుర రాజవీథిని వచ్చుచుండెను. అప్పుడాపురాధీశ్వరుఁడగు మయూరుని పుత్రిక యిందిర మేడపైనుండి యాతనిఁజూచి, చెలికత్తెతో నిట్లు పలికెను.

ఇందిర:—సఖీ! పద్మా! ఆవచ్చుచున్న సుందరాంగుని రూపమును జూడుము. ఓహో! మందస్మితసుందరమై, విశాలనేత్రయుగళరంజితమై, శాంత పావనమైన, యీ మహనీయుని వదనమును జూచిన తోడనే నాహృదయము కన్యకాభావముపై విరాగము చెందుచున్నది. నెచ్చెలీ! ఒకశాటినిగట్టి, వేఱొకశాటిని మొలకుజుట్టి, భుజశిరమున గావడిబద్దనిడికొని, మున్ను శివునిజయింప ధనువును మూఁపుపైనిడికొని యేగుచున్న మనసిజునివలె నీటువచ్చుచున్నవాఁడు. ఆస్సృష్టికర్త యెంత కాలమున కిట్టి సహజసుందరాంగుని బుట్టింపఁగలిగెను; ఈతని వదన సరోజమకరందమును గ్రోలనానేత్రమధుపములు పరుగిడుచున్నయవి.

పద్మ:—రాజకుమారీ! నీవన్నయట్లీ మునికుమారుని రూపము లోకమోహనమనుటకు సందియము లేదు. ఈతఁడెవఁడో తెలియకున్నను చూచినతోడనే నమస్కరింపవలయునను నూహపుట్టుచున్నది. ఈయంద గాని సృజించిన వాఁడు వనజభవుఁడయి యుండఁడు, తప్పకమనోభవుఁడై యుండును, గాని ప్రియసఖీ! యిదివఱకు నీజనకుఁడుచూపిన రాజకుమారులందఱకును వరుసగాఁ బంగనామములువెట్టిన యొయ్యారికి నీశాటీధారి యెట్లునచ్చెనమ్మా.

ఇందిర:—సఖీ! ప్రేమకారణమును దైవమే తెలుపలేఁడు. దీనికేమికాని నీవీమహనీయుని వెంటనేగి యీ భాగ్యశాలి చరితమును నిపుణముగాఁదెలిసికొనిరమ్ము. నీవు వచ్చువఱకు నేనిచ్చటనే యుందును. అన పద్మ యాతనివెంటనేగి సర్వమును దెలిసికొని యిందిరకడకు వచ్చెను. అపుడిందిర యిట్లు పద్మనుఁ బ్రశ్నించెను.

ఇందిర:—పద్మా! ఆమహాత్ముని చరితమును సాకల్యముగాఁ

దెలిసికొంటివా ? యాపుణ్యాత్ముఁడు మనపట్టణమును దాఁటిపోలేదు కదా ?

పద్మ:—సఖీ! వారొక సత్రములోదిగిరి. అచట వారి ప్రసంగ ముల వలన నేను సర్వమును దెలిసికొంటిని వినుము, తట్టలలోనున్న వృద్ధులాతని తలిదండ్రులు. అంధులు, దరిద్రులు. ఆపుణ్యాత్ముఁడు పిత రులను తీర్థములసేవింపఁజేయఁ గొనిపోవుచున్న వాఁడు. ఆతఁడు బ్రహ్మ చారి. ఓహో! యేమి యాతనిమాటలయందలి మాధుర్యము, చూపుల యందలి పావనత్వము! ఆసచ్చరితుఁడు నావైపు కన్నెత్తి చూడనేలేదు.

ఇందిర:—నెచ్చెలీ ! యా సుశీలుఁడు బ్రహ్మచారి యని యెట్లు తెలిసికొంటివి ?

పద్మ:—రాజపుత్రీ! అద్వీయమగు యజ్ఞోపవీతమును, అసదృ శమగు బ్రహ్మతేజమును నాతఁడు శుద్ధబ్రహ్మచారి యని తెలుపకయే తెలుపుచున్నయవి.

ఇందిర:—పద్మా ! అటులైన వినుము నామానస మీతనిభర్త నుగాఁ బడయనభిలషించుచున్నయది. ఈయూహకుఁ గారణము దెలియ రాకున్నయది. ఇందుకు నీవేమందువు ?

పద్మ:—కన్యకామణీ! సీలసౌందర్యములనే స్వయంవరమునకుఁ బ్రధానకారణములుగాఁ జేకొను కన్యలు తప్పక యిట్టివారినే ప్రేమిం తురుగదా !

ఇందిర:—ప్రియసఖీ ! గుణహీనులగు సంపన్నులకంటె ధనహీ నులగు గుణవంతులే వరణార్హులు.

పద్మ:—నిజమే ప్రాణహీనమగుకుణపమును, గుణహీనుఁడగు బురుషుఁడును, సమానముగాఁ జూడఁబడుదురు. కాని నృపనందిని ! నీ కోర్కెకు నీ తలిదండ్రు లనుకూలురు కావలయును గదా ?

ఇందిర:—పద్మా ! వారనుకూలింపకున్నచో నాకు బ్రహ్మ చర్యమో, యరణ్యమో, శరణ్యములు. సఖీ ! రమ్ము మాతల్లిగారికడ కేగి నామనోరథమును దెలుపుదము. అని ఇందిర పద్మతోఁ దల్లికడకేగి నమస్కరింప నారాణి "కల్యాణమస్తు" అని దీవించి యిట్లుపలికెను.

రాణి :—అమ్మా ! యిందిరా ! నీవు రాజపుత్రుల నిరాకరించుటచే నీతలిదండ్రులమగు మాకుఁజాలవిచారముగానున్నయది. పుత్రీ! నీవు సకలధర్మముల నెఱింగినదానవుకదా కన్య లవివాహితలై యింట నుండవచ్చునా ? లోకులు వారిఁగూర్చి సంశయింపరా ?

ఇందిర:—తల్లీ ! మీకీయపవాదమును దొలఁగింపఁ బ్రయత్నించుచునేయుంటిని. కాని నాప్రయత్నమునకు దైవంబింతవఱకనుకూలుఁడు కాఁడాయెను. ఈ సుదివసమున దయామయుఁడగు భగవానుఁడు నాకు వల్లభుఁడు కాఁదగిన పుణ్యశీలుని బ్రత్యక్షముచేసినాఁడు. నేనా సంతోషవార్తను మీకెఱిఁగింపవచ్చితిని

రాణి:—పుత్రీ ! యెన్నాళ్లకు నిన్నుఁ గన్యాదానముచేయు భాగ్యము మాకు లభ్యమయినది. నిజముగా నేఁడు సుదివసమే! అమ్మా! యాతఁ డేదేశనృపకుమారుఁడు.

ఇందిర:—పద్మా! అమ్మగారికి నాతనివృత్తాంత మెఱిఁగింపుము. అనఁ బద్మయాశ్రవణుని చరితమును వివరముగాఁదెలిపెను.

రాణి—పుత్రీ ! చక్రవర్తిసుతులఁ జేపట్టఁదగిన నీవు నిఱుపేదను బ్రేమించుటతగునమ్మా ? ఇందులకు మహారాజంగీకరించునమ్మా ? అసమానానురాగ మానందదాయకమగునటమ్మా ?

ఇందిర:—మాతరో ! మీరంగీకరింపకయున్న నాకన్యాత్వ మెట్లు తొలంగును ? తల్లీ ! మానసికవివాహము జరిగినది. ఇఁకమాంగళసూత్రధారణము మిగిలినది. జననీ! ఇదే నీపాదములపట్టి ప్రార్థించుచున్నదానను. నీవునాయందుఁ గనికరముంచి, నాజనకునకునచ్చఁజెప్పి నామనోరథమీడేర్పుము. అన నారాజభార్య రాజుకడ కేగి యిందిర కోరికనెఱిఁగింప నాతఁడు తనపుత్రిక దృఢసంకల్పమును దెలిసికొని యామెయిష్టానుసారము చేయనిశ్చయించుకొని మంత్రినిబిలిచి యామునికుమారునిఁ దనకడకుఁ దీసికొని రమ్మని పంపెను.

మంత్రి, పద్మ తెలిపినరీతిని సత్రమునకేగి తలిదండ్రులకుపచారములఁ జేయుచున్న శ్రావణునిరూపమునకాశ్చర్యమునొందియిట్లుపలికెను. "ఆర్యా ! నిన్నుఁదోడ్కొనిరమ్మని, మాహిష్మతీపురాధీశుఁడు నన్నుఁ

బంపెను. నేనాతనిప్రెగ్గడను. కావుననాతో రాజమందిరమునకు రావల యును. గుఱ్ఱపుబండి నీకైసిద్ధముగానున్నయది".

శ్రావ:—మంత్రివరా! నన్నేల యామహారాజు తీసికొని రమ్మనెను? నేనెట్టితప్పును జేసియుండలేదే? ఐనను రాజశాసనమును ల్లంఘనీయముకదా! పితరులారా! యీదేశాధీశుఁడేలకో ననుదీసికొని రమ్మని తనమంత్రినిబంపియున్నవాఁడు, కావున, రండు వారిని దర్శించి వత్తము; అని పితరులఁగావడిలోఁ గూర్చుండఁబెట్టి యాకావడిభుజమున నిడుకొనఁబోవుచుండ నామంత్రియిట్లుపల్కెను.

మంత్రి:—సాధుజనాగ్రణీ! చతురశ్వయానము మీకైసిద్ధము గానున్నయది యందులో నెక్కి రాజమందిరమునకుఁబోవుదము.

శ్రావ:—సచివపుంగవా! మన్నింపుఁడు, నాతలితండ్రుల నే స్వయముగాఁదీసికొనివత్తును. తాముఁబండిపైరండు. అనమంత్రియుఁ గాలినడకను వారిని దీసికొని కోటలోని కేగి యావృద్ధదంపతుల రాజ చత్వరమునఁగూర్చుండఁజేసి శ్రావణుని లోనికిఁగొంపోయి రాజున కెదుటనిలిపెను. అంతమయూరుడిట్లుఁబ్రశ్నించెను.

మయూ:—మునికుమారా! మీదేదేశము? మీకులమెయ్యది? మీరిటకురాఁగారణమేది?

శ్రావణుఁడు:—మహారాజా! మాదిశూరసేనదేశము మేము వైశ్యులము. తీర్థములసేవింప నేగుచుంటిమి. అనినతోడనే రాజుదిగు లొంది, రాణివాసమునకేగి "అమ్మా! యిందిరా! యాతఁడొకకోమ టి కొడుకు. మనముక్షత్రియులము. కావున నీవీప్రయత్నమునుండి విర మింపుము".

ఇందిర:—ప్రియజనకా! నేఁబ్రేమించినది శరీరముగాదు శరీ రాంతర్గతమగునాత్మ. కులము దేహమునకుగాని దేహికిలేదు. ఈతత్వ మెఱుఁగనిసంసారులకు వర్ణధర్మములుపాటింపఁదగినవియే. కావుననన్నుఁ గాముకురాలినిగఁదలంపక భక్తురాలిగ భావించి, యామునిపుత్రునకొసం గి నామనోరథమీడేర్పుము లేదా నేనామరణాంతము కన్యగానేయుం దును. కాని యన్యునిబరిగ్రహింపను. అని తెలుప రాజుకర్తవ్యమును

స్వయముగా నిర్ణయింపనేరక మంత్రులంబిలిపించి వారితోఁదర్కింప వారిట్లు తెలిపిరి.

మంత్రులు:—మహారాజా! యీతఁడెవ్వఁడో శాపవశమున భూలోకమునజన్మించిన సిద్ధపురుషుఁడుకానిసామాన్యమానవుఁడుకాఁడు. ఈతనియాకారమే దీనినిదెలుపుచున్నయది. మహారాజా? మీకు మేము బోధింపఁదగినవారముకాము కాని సమయము వచ్చినప్పుడు ప్రభువుల సంశయములఁదీర్చుకుంట సేవకులకు ధర్మముకాదు. కావున మనవిచేయు చున్నవారము. ఈయిందిర తమకేకపుత్రిక యీపె యీచిన్నవానినే గాని యన్యులవలదనుచున్నయది. కనుక నాపద్ధర్మముగా భావించి, ఈబ్రహ్మచారికిఁ దమపుత్రిక నొసంగి, మీయనంతరము రాజ్యమును గూడ నీతనికిఁజెందునట్లు చేయుఁడు. దానసర్వమును సంపన్నమగును. అన మంత్రులబోధల కారాజు, సమ్మతించి ప్రధానామాత్యుని బంపి శ్రీవణునితలంపెట్లున్నదియో తెలిసికొనఁగోరెను. ప్రధానామాత్యుఁ డు రాజాజ్ఞచేశ్రీవణునికడకేగి యిట్లు తెలిపెను.

ప్రధాన:—సాధునందనా! మామహారాజు నీకుఁదనపుత్రిక నిచ్చి వివాహముచేయుఁదలంచినాఁడు. ఆచిన్నదియు నిన్నుజూచిప్రేమిం చినది. ఆపెగుణవతి కావున వివాహమునకు సంసిద్ధుఁడవుకమ్ము.

శ్రీవణు:—ఘనహృదయా! నన్నిట్లుగేలిసేయుట న్యాయమా? నేనెక్కడ! చక్రవర్తిపుత్రికయెక్కడ! నన్నంతటి దురాశాపాతకుఁడను గాఁ దలంపకుఁడు.

ప్రధాన:—సజ్జనోత్తమా! నేను నినుబరిహసించునంతటి కుమ తినిగాను నిజముగారాజునీకడకునను బంపుటచేవచ్చితిని.

శ్రీవ:—ఆర్యా నాతప్పుక్షమింపుడు నేనువివాహార్హుఁడను గాను. నన్ను విడిచిపెట్టుడుపోయెదను.

ప్రధాన:—ఓ వెఱ్ఱికుఱ్ఱవాఁడా! ఇదేమి! అప్రయత్నముగా సం ప్రాప్తమయిన గుణవతియగు కన్యారత్నమును ముందుసంప్రాప్తము కానున్న రాజ్యసంపదను జేతులారఁద్రోసిపుచ్చుకొనుచుంటివి,వ్యాకుల చిత్తుడవై వేగిరపడక శాంతమానసుఁడవై బాగుగనాలోచించుకొనుము.

శ్రీవణు:—అమాత్యవరా! బాగుగానాలోచించియే మనవిచేసికొనుచున్నవాఁడను నేనుఁరాజపుత్రీ, కరగ్రహణమునకుఁగాని, రాజ్యపరిగ్రహణమునకుఁగాని, యెంతమాత్రమును దగినవాఁడనుగాను. నాయందుఁబుత్రవాత్సల్యముంచి నన్ను విడిచిపెట్టుము.

ప్రధాన:—వణిజ్నందనా! ధనమునకుసాధ్యముగానిది యిహలోక పరలోకములయందేదియునులేదు. నీవునీతలిదండ్రుల సౌఖ్యపెట్టుటకును, ఇతరులఁబోషించుటకును, విత్తమక్కఱకువచ్చును. కావునఁ బిచ్చిమాటలాడక రాజపుత్రినిబరిగ్రహించి, భాగ్యశాలివికమ్ము.

శ్రీవణ:—ఆర్యా! ధనమెట్టిదో నేనెఱుంగుదును. అదిపుత్రుని శత్రువునిగను, తండ్రిని యమసమానునిగను, మార్చును. స్నేహమహీరుహమును మొదలంటఁగూలఁద్రోయును, మామదిరామహిళలు, మదహేతువులు. అందులో మొదటిది మిగతరెంటికంటె నతితీవ్రమైనది.

ప్రధా:—ఓయమాయకుఁడా! ధనములమాటయటుంచుము. మారాజపుత్రిక, వినయసంపన్న, ధర్మజ్ఞ, నీకును, నీతలిదండ్రులకును దాసివలె సేవలఁజేయును. కావున గుణవతియగు యువతిని బరిగ్రహించి పితరులకు సౌఖ్యమును సమకూర్పుము.

శ్రీవణ:—జ్ఞాననిధీ! నిజమే మీరనినట్లా నృపనందిని గుణవతి యగావచ్చును. కానిదరిద్రసుతుఁడనగునాకును, జక్రవర్తిపుత్రికయగు నామెకును, గలయికయెట్లుపొసఁగును? పంకమునకును, విద్యుల్లతకును సామానాధికరణ్యమెట్లొడఁగూడును? కావునమహనీయా! నేనద్వితీయుఁడనైనాపితరులకుదాస్యముచేయఁగోరుచున్నవాఁడ, నన్నువిడిచిపెట్టుఁడు. నమస్కారములు. మీమాటలకు వ్యతిరేకముగాఁ బలికినందులకుఁ గోపింపకుఁడు. అన ప్రధానామాత్యుఁడామాటల మహారాజునకుఁదెలుప రాఁజిందిరనుబిలిచి, యిట్లుబోధించెను.

మయూరుఁడు:—అమ్మా! మంత్రులెంతబోధించినను, ఆవైశ్యకుమారుఁడు నిన్నుఁబరిగ్రహించుటకంగీకరించుటలేదు. వివాహమన్యోన్యానురాగసహితమై యుండవలయును. లేకున్న సుఖావహము

కానేరదు. కావున నీమునిసుతునిపైనుండి నీమానసమును మరల్చికొని వేఱొకరాజపుత్రుని నెన్నికొనుము.

ఇందిర:—తండ్రీ! నేనీపద్మతో నేగి యాసత్పురుషునితో నొకసారిమాటలాడుటకాజ్ఞను దయచేయఁగోరుచున్నదాన ననరాజాంగులకు సమ్మతింప నిందిర పద్మతోఁగలిసి, శ్రీవణునికడకేగి, యిట్లుపలికెను.

ఇందిర:—ఆర్యనాదనా! వందనము, నేనిందిరయనురాజనందనను, మనోహరమగు నీరూపమును, పాపహరమగునీపితృసేవను, సంతోషజనకమగునీధననిరాశను శ్రుతిసుఖదమగు నీసంభాషణమును, నేను, నిన్నుఁబ్రేమించుటకుఁగారణములు. నయశీలా!సాధ్వులకునార్యకన్యకలకు, గుణములయందు నాసక్తిమెండుకావున నను బరిగ్రహించి సంతోషమును సమకూర్పుము.

శ్రీవణ:—రాజపుత్రీ! సమవస్తువుల సమ్మేళనము శోభావహము విరుద్ధపదార్థములకూడిక వికారకారణము.

ఇందిర:—మనకలియికయుండట్టి విరుద్ధమేమున్నయది?

శ్రీవణ:—జంబుకము సింహితోఁగలయఁగోరుట విరుద్ధము కాదా?

ఇందిర:—అయ్యది వివేకములేనితిర్యగ్జంతువులగుటచే సమభావముతో సంచరింపనేరవు.

శ్రీవణు:—భూలోకవాసియగు మర్త్యుఁడు దివ్యలోకవాహిని యగు మందాకినీరసముఁగోరిల శక్యమగునా?

ఇందిర:—కాకేమి. ఆవియన్నది ప్రేమాతిశయముచేఁ గ్రిందికి దిగివచ్చిన దానిరసమునాస్వాదమొనర్పఁదగునుగదా?

శ్రీవణ:—గర్భదరిద్రుఁడు, ఆగర్భశ్రీమంతుఁడగు సార్వభౌమునితో సంబంధమును నెఱపఁగోరుట తగినపనియా?

ఇందిర:—అట్టులైన దరిద్రభక్తుఁడు లక్ష్మీపతియగు శ్రీహరిని జేరఁగోరుటయుఁదగదు.

శ్రీవణు:—అట భక్తిముఖ్యముకాని ధనముప్రధానముకాదు.

ఇందిర:—ఇక్కడనుశీలముప్రధానముగాని,ధనసంచయముకాదు.

శ్రీవణు:—రాజపుత్రీ! దేశకాలపాత్రములఁ దెలిసికొని కార్యాచరణమునకుఁబూనవలయును. నాకిపుడామూఁడునువిపరీతముగానే యున్నయవి. నన్ను మన్నించివిడువుము. సర్వవిధములనీకనువగు రాజపుత్రునెన్నికొనుము. నీబంధుజనులకు మోదమునుసమకూర్పుము.

ఇందిర:—సదాశయా! ప్రేమోదయమునకు దేశకాలములతో నిమిత్తములేదు. ఒకసుముహూర్తమునేర్పఱచి సుక్షేత్రమునకుఁగొంపోయి ప్రేమనుబుట్టింప శక్యముకాదు.

శ్రీవణు:—రాజపుత్రీ! నేస్వతంత్రుఁడనుగాను, నాతలిదండ్రులయాజ్ఞానుసారము నడువవలసినవాఁడను.

ఇందిర:—గురువిధేయా! నీతలిదండ్రులయాజ్ఞలఁబడసియే నాయీప్సితమునుదీర్పుము. నేను నాపితరులయాజ్ఞలఁబొందియున్నదానను.

శ్రీవణు:—సతీమణీ! నాతల్లితండ్రులిచటికివచ్చి చాలకాలమయినది, నేనువారిని వేఱొకరాజమందిరములో నుంచియిటకువచ్చియుంటిని. కావున నేనువారిని పైకిఁ గొంపోవుదును. పోయివచ్చెదను. సెలవొసంగుము.

ఇందిర:—సత్యవ్రతా! నీవన్నచివరిమాటమఱువకుము. పోయిరమ్ము. అన, శ్రీవణుఁడు పితరులకడకేగి వారినిదిరుగసత్రమునకుఁ గొంపోయెను.

## షోడశాధ్యాయము.

## పితృభక్తి.

శ్రీవణుఁడు తలిదండ్రుల సత్రమున విశ్రమింపఁజేసినతోడనే వారిట్లు తమతనయునిఁబ్రశ్నించిరి. "నాయనా! యారాజెందులకు నిను బిలిపించెను? రాజమందిరాంతరమున జరిగినవిషయమేమి?"

శ్రీవ:—పితరులారా! ఇదియొక విషమాలంకారప్రకరణము, వినుఁడు, ఈదేశప్రభువునకు నొకపుత్రికకలదు. ఆమెనన్నుఁజూచి బ్రమసినది, రాజుతనపుత్రిక యిష్టానుసారము నాకాపిల్లను వివాహముచేయనెంచి, మంత్రినినానిమిత్తముపంపెను. ఈసంగతి మంత్రినాకెఱింగింప నేను "నాకెంతమాత్రమీవివాహమంగీకారముకాదని" తెలిపితిని. అంత

నారాజకుమారి స్వయముగావచ్చి, నన్నుఁబరిగ్రహింపుఁడని బహువిధములఁ బ్రార్థించినది. అసమానపరిగ్రహ మవమానహేతువనితలంచి యాపెమాటల నిరాకరించితిని. ఇదియే రాజమందిరమున నడచిన విచిత్రనాటకము.

విశ్వ:—సుపుత్రా! అట్లువినయానురాగములతోఁ బ్రార్థించిన కన్యకకోరికను నిరాకరించుట తగుననియే యెంచితివా?

అన్నపూర్ణ:—నయశీలా! అప్రయత్నముగా దైవముసమకూర్చిన మంగళములఁగాదనరాదేమో, యోజించితివా!

శ్రీవ:—పుత్రవత్సలులారా! తలంచితి, యోజించితి, నాకుమీ పాదారవిందసేవ ముఖ్యముకానికాంతాకనకములుకావు. దయామయులారా! ఇపుడు నేనీరాజపుత్రిని బరిగ్రహించితినా! మీపరిచర్యలకునీళ్లు వదలికొనవలసినదియే. ఏమందురా! నేనుమహారాజునకు నల్లుఁడనైతినా నాచే మీకుపచారములఁజేయింప, రాజదంపతులంగీకరింపరు. సేవకుల నియమింతుమందురు. ఇఁకనేనన్నో రాజమందిరమునమహారాజ వైభవములదిలకించుచు మిమ్ముదర్శింపఁజాలకుందును. పెక్కేల? తుదకు మీయట్టిదరిద్రులు తలిదండ్రులనిపించుకొనుటకుఁ గూడ సిగ్గుపడఁ జొత్తును, కావున నట్టిదుర్దశ రాకుండుగాపుతమని, నాకొమరితెను వలదంటిని.

అన్నపూర్ణ:—పుత్రా! నీయట్టి సుగుణవీరునకట్టి దుర్దశయెన్నఁటికిని రానేరదు. తండ్రీ! నాకొకచిన్నకోరికయున్నది.

శ్రీవ:—అమ్మా! భక్తితో శ్రీహరిని ధ్యానించుచుంటివి, సజ్జనుల నాదరించియుంటివి, భాగ్యకాలమున గర్వమన్నమాటయెఱుంగకుంటివి, క్షామకాలంబున నమితమగు ధనరాసులదానమొనర్చియుంటివి. ఇపుడు విధేయుఁడగుపుత్రునకు సద్బోధలఁజేయుచు భర్తతోఁదీర్థముల సేవించుచుంటివి ఇఁకనీవు కాంక్షించునదేమియున్నది?

అన్నపూర్ణ:—ఏదియూ! నాకోడలిని సౌభాగ్యవతివి కమ్మని, దీవించుట, కావున నామాటవిని యారాపట్టినిజేపట్టి మాకును నాకన్నియ తలిదండ్రులకును సంతోషమునుగలిగింపుము.

శ్రీవ:—మాతలారా! నేఁడేదియోదుర్దినము, లేకున్నఁదలిదండ్రులు పుత్రునిఁ దూరముచేయఁగోరుదురా? అమ్మా! నేనుభిక్షాపాత్రమును జేఁబట్టుదునన్నపుడు, అభిమానముతో నట్లనుటతగదంటివే, ఇపుడేలనన్నంతకంటెను నికృష్టమగు పరాన్నగ్రహణమునకుఁబాలు సేయఁజూచుచుంటివి? తల్లీ! నీవుతలపెట్టిన యన్నదానయాగమును నిర్విఘ్నముగా సాగించుకొని, నేనుసంకల్పించుకొన్న పితృసేవావ్రతమునకు విఘ్నముసేయఁజూచుచుంటివేల? తలిదండ్రులారా! మీకునాపై కోపముకలిగినచో దూరముగాఁదొలఁగిపొమ్మనుఁడు. కాని రాజకన్యకను బరిగ్రహింపుమని మాత్రమాజ్ఞాపింపకుఁడు. వినుఁడు రాజకన్యాపరిగ్రహ వైభవమును వివాహమైన నేకొలఁదిదినములో కొంచెమాదరించిన నాదరింతురు కాని యటుపిమ్మటఁ బేదసగునన్ను, అత్తమామలేకాక వారిపరిచారకులు,గూడ నలుసుచేతురు. పరికించిచూడ గాఁబోవుపరాభవ పరంపరలు సాగరతరంగములవలె గానవచ్చుచున్నయవి. స్వయముగా ధనమార్జించి పదుగురఁబోషింపసమర్థమగు వైశ్యకులమునఁబుట్టి పరాన్నమునకై వాయసమువలె వేచియుందునా? వివేకసాగరులారా, నేఁడేలొకో మీరుదూరమాలోచింపక సామాన్యబోధలఁజేయుచున్నవారలు. ఇదియంతయు నాదురదృష్టఫలమేయని తలంచెద.

లేకున్న, చక్రవర్తిపుత్రికయెడ? ఈ పేదబేరిబిడ్డఁడేడ? సాధువులమగు మన యూహలకును, సార్వభౌములగు వారి తలంపులకును, అన్వయము సరిపడునా? "భగవన్ దీనదయాళో"! నన్నుఁ బితృభక్తునిగాఁజేయఁదలఁతువేని, నాతలితండ్రుల జీవితకాలములో నన్ను బ్రహ్మచారినిగానే యుంచుము.

అన్నపూర్ణ—కుమారా! నీకు సుఖముకలుగునని తలంచి రాకన్నియను బరిగ్రహింపుమంటిని గాని నిన్ను దూరముచేయు నూహతోఁ గాదు. నాతండ్రీ! మాకు సర్వసౌఖ్యముల సమకూర్చుచు కనులు లేవను కొఱంత దెలియరాకుండ మాకుబహిఃప్రాణమవై కాపాడుచున్న నిన్ను మేము త్యజింపఁజూతుమా? నాయనా! నామాటలు నీకింత మనోవ్యథను గలిగించునని తలంపనైతిని తండ్రీ! నాపొరపాటును మన్నింపుము.

విశ్వ—వైశ్యకులదీపకుఁడా! పుత్త్రుఁడా! నీవు మమ్ముఁబాసియున్న నాఁడు మా దేహములఁ బ్రాణములుండి యేమిప్రయోజనము? స్త్రీలు తమస్థితిగతులఁ బరిశీలింపనేరక తమ బిడ్డల పెండ్లిండ్లకై తల్లడించుచుందురు. పుత్రరత్నమా! నీవు తెలిపినట్లు త్వరపడి యారాజకన్యకను పరిణయమాడిననాఁడు మనకన్నియుగష్టములేకాని స్వేచ్ఛాసౌఖ్యములుండనేరవు. బందాలు చెఱయందుండునట్లు మనమారాజమందిరమున దీనులమైయుండవలసినదియే. వృద్ధులమగుటచే మాబుద్ధి మొదటఁబెడదారిఁ బట్టినది కావున మామాటలకుఁ గినియకుము.

శ్రావణ:—దైవతములారా! ఈశ్రావణునకు మీపైఁగోపమా! యది మీతనయుని జీవితమునఁగలుగనేరదు. పితరులారా! మనమిఁక నిటనుండుట తగదు. రాజు బలవంతుఁడు, ముందేమి చేయునో? కావున మనమీరాత్రియే యెవ్వరికిఁదెలియకుండ వెడలి పోవుదము. ఈ రాజ్యసీమనుదాఁటి వేఱొక యేలికయెల్లలలోనికిఁ బోతిమా మనకిఁకేనిభయముండదు. అనిన వారామాటల కంగీకరింప శ్రావణుఁడానాటిరేయి మాహిష్మతీపురమునువీడి, తలిదండ్రులఁదోడ్కొని మత్తేభముకరణి యెక్కడను నిలువక యతివేగముగా నేగుచుండెను. అప్పుడన్నపూర్ణకు దాహముకలిగి నాలుక యార్చుకొనిపోఁజొచ్చెను. అంత నాసాధుకాంత యిట్లుపలికెను.

అన్నపూర్ణ:—నాయనా! శ్రావణా! నాకుదాహబాధమిక్కుటముగానున్నయది. ఇఁక నొక ఘంటలో దాహోదకముదొరకకున్న నీయుపచారములకు దూరురాలనగుదునని తోఁచుచున్నది. ఆమాటవిన్నతోడనే శ్రావణుఁడు వారల నొక వృక్షముక్రింద దింపి కలశమును బట్టుకొని నీటికై వెతకుచుఁబోయిపోయి సరయూనదీతీరముచేరి, కలశముతో నీటినిఁ జేకొనుచుండ, వాఁడికోలయొకటివచ్చి యొమ్మన గ్రుచ్చుకొన "హా తలిదండ్రులారా!" అని కేకవేసి నేలపై నొఱగెను.

ఆబాణమును విడిచిన దశరథుఁడు ఆ యార్తనాదమును విని లోని ప్రాణములు పైకెగుర, "నాహా! యెవ్వనికో నాబాణము ప్రాణహారముగాఁ దాఁకినది"అని వెంటనే నద్దియొనలియొద్దునకువెళ్లి, చూచు

సరికి మునికుమారుఁడొకఁడు కలశహస్తుఁడై నేలపైఁబడియుండుటను గనుఁగొని కరుణార్ద్రహృదయుఁడై "ఆర్యా ! నీవెవ్వఁడవు?" అనినఁ శ్రావణుఁడు కొంచెమొత్తిగిలి, కనులు విచ్చి, దశరథునిఁ జూచి, "అయ్యా ! నేనొక పితృసేవకుఁడనగు మునిపుత్త్రుఁడ" నని చెప్పి "హా! తల్లీ! నీకిన్ని మంచినీళ్లియ్యఁజాలనైతినిగా ! హా ! క్రూరదైవమా ! యెంతచేసితివి ! ఈపాటికాయిల్లాలు దాహబాధకోర్వఁజాలక ప్రాణములు విడిచియుండును" అని మూర్ఛిల్లెను.

దశర:—(తనలో)ఆహా! నేనెంతటిపాపాత్ముఁడను! ఈబాలునిజంపి బ్రహ్మహత్యాపాతకమునే కాక యితనిమాటలనుబట్టి చూడ స్త్రీహత్యాపాపమును గూడసంపాదించుకొందునని, తోఁచుచున్నది. నాజన్మచే స్వచ్ఛమగు సూర్యవంశపటముపై మచ్చ యేర్పడినది.

శ్రావణ:—ఆర్యా ! నీవెవ్వఁడవు ? ఇట్లేలవిలపించుచుంటివి ? నన్నుఁ జంపినవానికి బ్రహ్మహత్యాదోషము చెందనేరదు. నేను బ్రాహ్మణవటుఁడఁగాను, వైశ్యబాలుఁడ, నాయెడ నీవు జాలింగొనుటకుఁ గారణమేమి ?

దశర:—సాధుసందనా ! నీకీదుర్దశను గలిగించినదురాత్ముఁడను నేనే. వనగజభ్రాంతిచే నీపై బాణమును వదలితిని. ఇట్టిఘోరపాతకమునఁబడితిని.

శ్రావణ:—ఆర్యా ! దీనికేమి కాని నాకొక యుపకారముచేయుఁడు. సంతసింతును. నాతలిదండ్రులు శతవృద్ధులు, అంధులు, అందు మాయమ్మ దాహపీడితయై యుండ నేను వారినొక చెట్టుక్రిందదించి జలములకై యిటకువచ్చి నీచేఁగూల్పఁబడితిని. కావున నీకలశోదకమును జేకొని మాటలాడక మాయమ్మకుఁ ద్రాగనిచ్చి, యామెదాహముతీరిన పిదప నా యవసాన నమస్కారమును నావృద్ధదంపతుల కెఱింగింపుము. అని, తిరుగ బాణబాధచేఁ గనులు మూసికొని యమ్మా ః యని కొట్టుకొనఁజొచ్చెను.

దశర—అయ్యో! నేనెంతటిపాతకిని పితృసేవాపరాయణుఁడగు సజ్జనపుంగవునిజంపి యా వృద్ధదంపతులఁ జంపనున్నవాఁడను! నేనిఁక

క్షత్రియపదమున కర్హుఁడనుగాను. రాక్షసపదార్హుఁడను. కోసలసింహాసనమును మెట్టఁదగను. కిరాతజాతిలోఁ బుట్టఁదగుదును; నాయట్టి క్రూరులు రాజులుగా నుండఁదగరు, రాలుగానుండఁదగుదురు.

శ్రావణ—సోదరుఁడా! నేను నాజీవితవినాశమును గూర్చి విచారించుటలేదు. కడువృద్ధులును, గ్రుడ్డివారును, నగు తలిదండ్రులఁ దలంచి, దుఃఖించుచున్నవాఁడను. ఇఁక వారికి నీటిని, గూటిని నోటికందిచ్చువారెవరు ? కట్టా! తుదకు మాయమ్మ తుదిదప్పికను దీర్పఁజాలనైతిని. ఈబాణము నేనామె దాహము శాంతింపఁజేసిన పిదపఁ దగిలిన బాగుగనుండెడిది. కర్మమిట్లుండ నట్లేలజరుగును ? అయ్యో! చేతులార నాపితరులకు జలాంజలుల సమర్పించు భాగ్యముచేకూరదాయె, ఆహా! యేమి యీకర్మవైచిత్ర్యము ఒకరాజకుమారిబారినుండి తప్పించుకొని వచ్చి వేఱొకనృపకుమారుని ఘోరశరమునకు గుఱియైతిని కట్టా! దాహబాధచే నాతల్లి తాళఁజాక నన్నెన్నిసారులు శ్రావణా! యని పిలిచియుండెనో కదా? అబ్బా! పాపమాతపస్విని ప్రాణముల విడుచునేమో! ఓయన్నా! నీవు త్వరితముగ జలముఁగొంపోయి మాతల్లికిమ్ము. వారిటకు దక్షిణముగానున్నయొకచెట్టుక్రిందనున్నవారు. సోదరా! ఈబాణబాధను సహింపఁజాలకున్నవాఁడను. కావున దీని నాయురమునుండి దీసివేసి పొమ్మనెను.

దశరథుఁడాబాణమును లాగినతోడనే యాశ్రావణుఁడు హా! శ్రీహరీ! యని ప్రాణములవిడిచెను. దశరథుఁడదిచూచి, కడుదుఃఖితుఁడై కలశముతో జలములఁబట్టుకొని చెట్టుకడకేగుచుండ విశ్వనాథుఁడాతని పదధ్వనినివిని యిట్లు పలికెను.

విశ్వ—ప్రియనందనుఁడా! యింతజాగేలచేసితివయ్యా! దాహము దాహమని నీతల్లి నీరాకకై యెదురుచూచుచున్నయది తండ్రీ! నీతల్లి గాని నేనుకాని, యన్నమాటలకుఁ గోపమువచ్చెనా? మాటలాడవేల ?

అన్నపూర్ణ—ఓప్రాణాధికుఁడా! పుత్త్రుఁడా! నేనారాజపుత్త్రిని బరిగ్రహింపుమనుటచే నాపై నలిగితివా? నాతండ్రీ! యిటురా, ముందు నాకు ముద్దిచ్చి పిమ్మట జీవనములనొసంగుము. లేకున్న నేజలములఁ

గోత్రులుదానఁగాను. బిడ్డా! మేముసౌఖ్యముగానున్నపుడుకూడ మమ్మెడఁబాసి, యుండనేరకుంటివే? యిపుడిట్లు దాహబాధచేఁ బ్రాణములవిడువనున్న సమయమున నింతవిలంబమేలచేసితివోయీ? నీయవ్యాజప్రేమయేమాయెనోయీ?

విశ్వ:—తనయా! తల్లికిబదులుపలుకవేమి? ఒక్కపరుగుననింతదూరము మమ్ముమోసికొనివచ్చుటచే నాయాసముచెందితివా? నీటికైయేగుటచే నలసితివా?

అన్న:—ప్రాణేశ్వరా! యీవచ్చినవాఁడు మనబిడ్డఁడుకాఁడు. ఆతనినవనీతసమానహృదయము మనకుఁదెలియదా? నిజముగానీతఁడాతఁడేయగుచో మనతోమాటాడక యింతబాధించునా? ఈతఁడెవ్వఁడో పాషాణహృదయుఁడుగా గన్పట్టుచున్నవాఁడు.

విశ్వ:—ప్రియసీ! నాకుమనట్లే తోచుచున్నది యడిగిచూచెదను. "అయ్యా! నీవెవ్వండవు? మాటలాడవేల? దొంగవా? మాకడనీవపహరింపఁదగిన వెద్దియును లేదు.

దశ:—నాలుక తడియాఱ, దేహము కంపింప, నిట్లు పలికెను. "తల్లీ! ముందీనీరములఁ జేకొని దాహశాంతిఁజేసికొనుఁడు. పిమ్మటనావృత్తాంతము తెలుపుకును."

అన్నపూ:—ఓయీ! మానందనుఁ డుండ నీ వేల నీటినిఁదెచ్చియుంటివి? నేనాతఁడువచ్చి, జలమిచ్చినగానితాగను. ఏదియోవిపరీతము జరిగినది, తప్పను తప్పదు నాకుడికన్న దరుచున్నయది.

విశ్వ:—ఆర్యా! మాకుశ్రవణుఁడెచ్చటనున్నవాఁడు? తాను రాక నిన్నేలపంపె? జాగుసేయక తెల్పుము.

దశ:—మునివరా! నేనుదశరథుఁడను, కోసలరాజును (తనలో) అబ్బా! యేమనిచెప్పుదును. అనిజరిగినదంతయుఁదెల్పెను. ఆదుర్వార్తవిన్న వెంటనే యాదంపతులు "హాప్రియపుత్రా" యని నేలపైపడిపోయిరి. దశరథుఁడు శీతోపచారములచే వారిమూర్ఛ దేర్ప, నాముదుసళ్లుకన్నులనీరు కాలువలై పాఱ నిట్లువిలపింపఁదొడంగిరి.

విశ్వ:—హా ! గుణఖనీ ! ప్రియకుమారా ! మమ్మిట్లు ఘోరాటవీమధ్యమున దుర్భర, దుఃఖ, పంకమున దిగఁద్రొక్కి, నీవొంటరిగ దివికేగ మనసెట్లు వచ్చె? దాహపీడితయగుతల్లికి దాహబాధఁదీర్పక యే ముక్తినందదగునా? మాకెవ్వరిని గతిగా నేర్పాటుచేసిపోయితివి? కటకటా! ఎట్టిదుర్దినము సంప్రాప్తమాయె, వత్సా! యిఁకమాతో మాటలాడవా? నాతోధర్మములఁగూర్చి చర్చింపవా? ఓదశరథా! మాసుతస్నేహము నింకఁజేసి మాప్రాణదీపముల నార్పి వేసితివి.

అన్నపూర్ణ:—కట్టా! సుకుమారా! కుమారా! ఈరాజు నిన్నొక్క కోలతోఁగూలనేసెనా? ఇఁక నాకుమనోహరములగు నీమాటల వినిపింపవా? ఇంతటితో మాతోఁ గలసియుండుటను ముగించితివా? మాయన్నా! మాకుస్త్రీవలెను, పురుషునివలెను, సమస్తోపచారముల జేసియుంటివే! హా దయానిధీ! దైవమా నేఁజేసినయన్నదానవ్రతమునకు ఫలమిదియా? ఓక్రూరనృపుఁడా! బాణముచేరక్తపాతమొనర్చి మా సుతుని యసువులను నీక్రూరతరవాణిచే నిశ్శోణితముగా మాప్రాణములను బోనడచితివి. అబ్బా! ఈరాత్రివేళ నాపుత్త్రునిఁజంప నీ వెక్కడ దాపరించితివి. సూర్యవంశనృపనందనులు పరసంరక్షణార్థమై నిజప్రాణములవిడుచుచుండ నీవుపరప్రాణహరణార్థము బాణముల వదలుచుంటివి; కట్టా యేమియీవిపరీతము పుత్రా! ఆరాజసుతకుఁబతివై యుండినచో నీగతిసంప్రాప్తముకాకుండెడిదికదా?

విశ్వ:—ఓయీ! మమ్ముమాకుమారుఁడు పడియున్నచోటికిఁ గొంపోయి మానందనుని సుందరదేహమునైనఁ జూపుము; అనిన దశరథుఁడు వారలమెల్లఁగాఁ గాపడితోఁదీసికొనివెళ్ళి యాశ్రావణశరీరము కడఁ గూర్చుండఁబెట్టెను అంతవారాచేతనరహితమగు దేహమునుచేతులతోఁ దడవుచు, నిట్లువిలపింపఁదొడఁగిరి.

అన్నపూర్ణ:—నాతండ్రీ! నీమనోహరరూపసంపదను జూచు భాగ్యమిదివఱకే సర్వేశ్వరుఁడు లేకుండఁజేసెను. నీదేహమున్స్పృశించు సంపదను నీనరేశ్వరుఁడు తొలఁగించెను. ఇప్పటికి నాపురాకృతకర్మవ్వ

క్షము పూర్ణముగా ఫలించినది. ప్రియనందనా! ఇదినీమృతదేహమా? అబ్బా! నాహృదయము పాషాణనిర్మితము కావుననే పగలకున్నయది.

విశ్వ:—పుత్రరత్నమా! తెల్లవారుటకుమున్నే లేచి స్నానసంధ్యాదులఁదీర్చి నీవుచేయుమనోహర సామగానమింకనాకెట్లు వినఁబడును? కుమారా! అంధుల మగుమమ్ముఁ బోషింపనేరక మముపీడి స్వర్గమున కేగితివా? దశరథా! మాకెంతటి విపత్తుతెచ్చిపెట్టితివి! నిష్కారణముగా నెట్టిపాపమెఱుఁగని పితృసేవాసక్తచిత్తుఁడగు సాధుకుమారుని క్రూరముగాఁజంపితివే! ఓకఠినాత్ముఁడా! మావలెనే, నీవును బుత్రశోకముచేఁ బ్రాణములనువిడుతువుగాక యనిశపించి, యిట్లనెను. "రాజా! మమ్మీనదిలోస్నానముచేయించి మాచేఁబుత్రునకు దహనసంస్కారములఁ జేయింపుము. అనినదశరథుఁడు శాపోక్తిచేతను, పాపప్రాప్తిచేతను, ఖిన్నుఁడై వారలస్నానముచేయించి చితినేర్పఱిచి యాశ్రవణదేహమును దానిపైనుంచి, విశ్వనాథునిచే నగ్నిసంస్కారముచేయించెను. విశ్వనాథుఁడట్లు దహనక్రియను నివర్తించి, స్నానమాడి, పుత్రునకుఁ దర్పణములవదలెను.

అంతశ్రవణుఁడు దివ్యరూపముతో విమానారూఢుఁడై యాకాశమునుండి యిటులుపలికెను.

శ్రవ:—తలితండ్రులారా! పావనమగుమీపాదారవిందసేవచే దివ్యవిమానముపై నుత్తమలోకములకు నేగుచున్నవాఁడను. మీరుకూడవేగముగా నాలోకమునకువత్తురు, విచారింపకుఁడు. అన విశ్వనాథుఁ డామాటలవిని దశరథునితోనిట్లుపలికెను.

విశ్వనాథుఁడు:—ఓరాజా పరమపవిత్రుఁడగు మాపుత్రుని తెచ్చి పైమఱికొన్ని కట్టెలువేసి ప్రజ్వలింపజేయుము. మేమిదేయోగముచేఁ బ్రాణములవిడుచుచున్నవారము. మామృతదేహముల నాచితిలోవేసి దహనసంస్కారమొనర్పుము, అనాథప్రేతసంస్కారము మహాఫలప్రదము. అని వారుభయులు కనులుమూసికొని పరమేశ్వరునిధ్యానించుచు, ప్రాణముల వదలిరి. దశరథుఁడు వారుకోరినరీతిని వారిదేహముల కగ్నిసంస్కారములొనర్చి సరయూనదిలో స్నానమాచరించి యాతఁడిచ్చిన

శాపమునకును, వారికిఁ దనమూలమున సంభవమైన వినాశనమునకును జింతించుచు నదీతీరమునుండి కదలనేరక యటఁగూర్చుండి, పరిపరివిధము లఁ బరితపింపసాగెను.

అట మాహిష్మతీపురమున నిందిర పద్మనుబిలిచి "సఖి ! యా పుణ్యాత్ముఁడు తనతల్లిదండ్రుల యాజ్ఞనుపొందినదియు, లేనిదియుఁ దెలిసికొనిరమ్ము నాకునిదురపట్టుటలేదు వేగముగాసత్రముకడకేగుము అన, పద్మయట కేగి నలుగడల వెదకి,శ్రావణాదులుగానరామికి, వగచి కావలివారలఁ బ్రశ్నింపఁ వారలు "ఇపుడే యాచిన్నవాఁడుతలితండ్రు లఁదీసికొని యుత్తరదిక్కుగా నేగినాఁడు" అని తెలుపఁ బద్మఁగూవార్త నిందిర కెఱిఁగించెను. ఆమాటవిన్నతోడనే 'హా ! దైవమా! "హతాస్మి" అని మూర్ఛిల్ల-పద్మ మూర్ఛదేర్ప. నిందిర శ్రావణుని వియోగమును సహింపనేరక యొక, పత్రముపైఁ దన సంకల్పమునువ్రాసి తెల్లవారిన తోడనే దానిని దనతల్లిదండ్రుల కిమ్మని పద్మతోఁదెలిపి, తక్షణము సేవ కునిచే నశ్వమును దెప్పించి, దానిపైనెక్కి నిర్జనారణ్యమునఁబడి తెల్ల వారుచుండగా సరియూనదీతీరయినకుఁజేరి, యటఖిన్నుఁడైయున్న దశ రథునిగమనించి, గుఱ్ఱమునుండిదిగి యాతనికడకేగి యిట్లుబ్రశ్నించెను.

ఇందిర—ఆర్యా! మీరెవ్వరు! ఓతండ్రీ! యీదారిని వృద్ధులగు తలిదండ్రులఁ గావడియందుంచుకొని యెవ్వఁడేని యావ్వనుడిటు వచ్చెనా?

దశరథుడు:—అమ్మా ! నాతోమాటలాడకుము, నేనొక మహా పాతకుఁడను.

ఇందిర :—తండ్రీ! మీరిట్లుపశ్చాత్తాపము నొందవలసినదోష మేది ?

దశరథుడు:—దోషమా! ముగ్గురుసాధువుల నొక్కబాణము తో హత మొనర్చితిని అమ్మా నీవడిగినవారు నీకేమికావలయు.

ఇందిర:—సదాశయమా ! వారునాకుముందుజన్మమున నత్తమా మలును, భర్తయుఁ గావలసియున్నవారలు ఆర్యా! వారినేనా? మీరు బాణముతోఁగూల్చినది ?

దశరథుడు:—సాధ్వీమణీ! సంశయమేమి? యూతాపసదంపతుల సుతసహితముగా నొకకోలతోఁగూలనేసితిఁ గాని నేజావనేరకుంటి ఇంకనుముందెందరుసజ్జనులు నాచేజాపఁబడవలసి యున్నవారో! తెలియను.

ఇందిర:—హాశ్రీహరీ! యెంతపాపాత్మురాలను నేనీమునికుమారునిబ్రేమించి, వేడికొనకున్న నిట్టియకాలమృత్యు వాసాధుపుత్త్రునకు సంభవించెడిదికాదు. ఓపశ్చాత్తప్తుఁడా! సోదరుడా! వీరలనందరిని జంపినది, నావేడికోలుకాని నీవాడికోలకాదు. ఆర్యా! వారిమృతదేహములెక్కడ?

దశరథుడు:—అమ్మా! వారిదేహములలో సుతునిదేహమును బితంసఁదహించినాడు ప్రాయోపవేశముచేవారు ప్రాణములువిడిచిన పిమ్మట నాదంపతులదేహముల వారిపుత్త్రునిచితిపైనునిచి నేనుదహించినాఁడ; పాపములమూటగట్టికొని యిటఁగూర్చుండియున్నవాఁడ అమ్మా! నేనుగూడ వారితోఁబ్రాణములువిడియున్న నీకీదుర్వార్తను దెలుపకుందునుగదా? ఓజముడా! నీవిటనాకుఁ జోటలేదా? ఓవిధాతా! నాకై ప్రత్యేకనరకము సృష్టింపఁదలఁచితివా?

ఇందిర:—ఆర్యా! కర్మగతులతిక్రమింప శక్యముగాదు దేవేంద్రాదులకుఁగూడ నియతినిమీఱ వలనుపడదు. నీబాణము, నిమిత్తమాత్రము వారికర్మమేవారినట్లు హతమొనర్చినది. సోదరా! పశ్చాత్తాపము పాపహరము అనిపలికి,సరయూనదిలోస్నానమాడి,యాయిందిర, చితికడకేగియందుఁగొన్నియింధనములవేసి,యాయగ్నికి ముమ్మారు ప్రదక్షిణముచేసి "ఓ సర్వాంతర్యామి! సత్స్వరూపా! దయాబ్ధీ! నేను విశుద్ధచరితనేయగుదునో? నాకీమునికుమారుఁడు రాబోవుజన్మమునఁ బతియగుఁగాక, తలిదండ్రులారా! మీగర్భమున నాయట్టిమోసకత్తియ పుట్టకుండనుండుగావుత,నేపుణ్యాత్మనైనచో సర్వేశ్వరుఁడుమీకుఁగులాలంకారుఁడగు కుమారునొసంగుఁగావుత, అని మండుచున్న చితిలోఁబడి యాసతిపతిసాయుజ్యమునుపొందెను. దశరథుఁడాసాధ్వి సాహసమునకబ్బురమంది ఇప్పటికినలుగురఁజంపితిఁ జాలునీపాటిశస్త్రాభ్యాస మనివి

చారించుచు నయోధ్యాపురికేగెను. "ఆహా! యేమియీపావనశాస్త్రవణోపాఖ్యానమహిమ భారతీయబాలవీరహృదయేందీవరముల వికసింపఁజేసి శీలశ్రీసుందరములనుగా జేయుటకీ వైశ్యబాలజీవితభాస్కరకాంతియొకటి చాలదా! ఈవణిజ్నందనుఁడు పితృసేవకై యెంతటిత్యాగమొనర్చెను. కాంతాకనములకై యువ్విధ్యాస పిన్నవయసున జితేంద్రియుఁడై తేజరిల్లెను.

## సప్తదశాధ్యాయము.

### కౌసల్యాకళ్యాణము.

దక్షిణకోసలాధిపతియగు కోసలునకు ననమానసౌశీల్యయగు కౌసల్యయనుపుత్రికకలదు. ఆగుణవతికి స్వయంవరమునేర్పాటుచేయుట కానృపుఁడు యోజించుచుండె. ఇట్లుండ నొకనాడత్రిమహాముని కోసలునిమందిరమునకువచ్చెను. కోసలుఁడెదురేగియర్ఘ్యపాద్యాదులచే నామునివరునిబూజించి మందిరములోనికిఁగొనివచ్చి, తనపుత్రికయగు కౌసల్యను నామునీంద్రునకు నుపచారములఁజేయ నియమించెను.

కౌసల్య తండ్రియాజ్ఞానుసారమును, తనకుఁగలభక్తివలనను, ఆమునివరునిఁ బూజింపఁదొడగెను. అత్రి యామెయుపచారములకు సంతసించి, "రాజేంద్రా! నీపుత్రిక గొప్పభాగ్యశాలినికానున్నది యీమె గర్భమున లోకైకవీరుఁడును, సకలజనసంస్తూయమాన నాముఁడును, నగుపుత్రుఁడు పుట్టనున్నవాఁడు. కాని, యీమెకు గ్రహదోషములు మెండుగానున్నయవి; వానికిఁదగుశాంతిక్రియలు చేయవలయును, కావునసీవు నావెంటనీమెను మాయాశ్రమమునకుఁ బంపితివా కొంతకాలమటనుంచి మంత్రోదకములచే గ్రహపీడలఁ దొలగించి పంపుదును కావున సందేహింపక నాభార్యయగునసూయకడఁ గొంతకాలముంచుము దానసీసుతకు నన్నివిధముల శుభముచేకూరును" అని తెలిపెను.

కోసలుడు:—మహాత్మా! యిట్లయాచితముగ మేలుసమకూర్పదలంచిన మీయొక్క యాజ్ఞలను గాదందునా? తాపసేంద్రా! తప్పక యీపుత్రికను మీతనయనుగా భావించి, మీ యాశ్రమముననుంచి గ్రహదోషముల నివర్తింపఁజేసి సంరక్షింపఁ గోరుచున్నవాఁడను, అన

నాయతిప్రియారాజపుత్రిని దీసికొని తన యాశ్రమమునకు వెడలి పోయెను.

ఇటులుండ దశరథుఁడు దేవేంద్రునిపిలుపై స్వర్గమునకేగి, యట నుండి యాకాశమార్గమునఁ గ్రిందికివచ్చుచుఁ, దనకెదురుగా నేతెంచుచున్న శనిరథమునకు, స్వరథము నడ్డముగా నడుపింపసాగెను. అప్పుడాహారమునకు వెడలిన జటాయువు దూరమునుండి దశరథునిజూచి "దశరథుఁడా! తొలగుము, తొలగుము." అని కేకలిడుచుండ దశరథరథము శనిరథమునకుఁదాక దశరథుఁడు భగ్నరథుఁడై యతిప్రి తపోవనమునకు సమీపముగానున్న నడవిలోఁబడి మూర్ఛపోయెను. అప్పుడతిప్రికడనున్న కౌసల్య ప్రియసఖితో వనవిహారమొనర్చుచు, అట్లు నేలఁబడియున్న దశరథునిజూచి, యాతని సౌందర్యమునకు వింతచెంది, యిట్లు పలికెను.

కౌసల్య:—సఖి! చూచితివా? యీరాజకుమారుని మారాకారమును ఈతఁడేదియో ప్రమాదవశమున నాకలోకమునుండి భూలోకమునఁ బడిన త్రిదివేంద్రసూనుఁడని తలంచెద; లేకున్న మనుష్యులలో నిట్టి సుందరాకారులుందురే! ప్రియసఖి! యీమహనీయుఁడు గాఢముగ సొమ్మసిల్లి, యున్నవాఁడు నీవు వెంటనే యుటజమునకేగి కలశముతో శీతోదకములఁ గొనివచ్చి, యీతనిపైఁజల్లి మూర్ఛదేర్పుము, అని చెలికత్తెను బంపి; తనలో

కౌసల్య:—ఈతఁడు మానవరాజకుమారుఁడై, బ్రహ్మచారియై నన్ను బరిగ్రహింప నంగీకరించుచో, నాజీవితము సఫలము కాగలదు. ఇతఁడేదేశరాజపుత్రుఁడై యుండునో ? నేనున్నది తపోవనమైనను నా చిత్తము చేతోభవవికారమునకు లోనగుచున్నయది. నాహృదయము మీ తనినుండి మరలింప సాధ్యముకాదని తోచుచున్నయది. ఈతనిపాటునకుఁ గారణమేమైయుండునో! అని తలయెత్తిచూచి, అదిగో నానెచ్చెలి జలములఁగొని తెచ్చుచున్నయది, యనుచుండ చెలికత్తెయవచ్చి యిట్లు పలికెను.

చెలి:—కౌసల్యా! యియ్యవిగో శీతలోదకములు,

కౌసల్య:—చెలీ! ఆలేమావిచిగుళ్లతో నాశీతలనీరము లీ నీసుకు మారుని పైఁ జల్లుము దాన నీతఁడు మూర్ఛదేరును.

చెలి:—కౌసల్యా! నాకు భయమగుచున్నది. నీవెపోయి మూర్ఛదేర్పుము. మొదట నీశీతలజలసేచనములచే నీతఁడు కన్నులు తెఱచి పిమ్మట నీసితావలోకన ప్రసారములచే సంతృప్తుఁడుకూడ నగును. అని జలకలశమందిచ్చెను.

కౌసల్య:—ప్రియసఖీ! యీయది జాగు సేయుటకు సమయము కాదు. అని దశరథునికడకేగి చూతకిసలయాగ్రములతో శీతోదకముల నాతని పైఁ జల్లి, వెనుకకువచ్చి చెట్టుచాటున నిలచెను. దశరథుఁడా చన్నీటితాకుఁడుచే మెల్లగఁ గన్నులువిప్పి చూచుచుండ జటాయువు గగనమునుండి దశరథునిముందు వాలి యిట్లు పలికెను.

జటాయువు:—దశరథరాజేంద్రా! యెంతటి పొరబాటు చేసియుంటివి. నీవెంత బలాఢ్యుఁడవైనను, దివ్యరథములతో డీకొననగునా? నీవు నీరథమును శనిరథమునకడ్డముగాఁ బోనిచ్చుచుండుటను నేనుజూచి "వలదువలదు" అని కేకలిడితిని. నే నతి దూరమున నుండుటచే నా మాటలు నీకు వినఁబడవాయె.

దశర:—పక్షీంద్రా! కర్మప్రవాహమునఁ బడి బుద్ధిపర్ణములు కొట్టుకొనిపోవుచుండును. నేఁబడియున్న ప్రదేశ మేదేశమునకు సంబంధించియున్నది?

జటా:—రాజచంద్రా! యిది యత్రిమహాముని యాశ్రమమునకుఁ జేరియున్న యరణ్యప్రదేశము. ఇపుడు నీవు విరథుఁడవై, యలసియున్నవాఁడవు కావున నాపై గూర్చుండుము నిన్నొకక్షణములో నయోధ్యలో విడుతును.

దశర:—ఆపద్బాంధవా! యింతకంటెఁ గావలసినదేమి! సజ్జనులు కోరఁబడకయే విపన్నులఁగాపాడఁ బరుగిడుదురు. ఘనుఁడు ప్రార్థింపబడి లోకతాపము నడంచుచున్నవాఁడా? సూర్యుఁడు కోరబడి వెలుఁగు నొసంగుచున్నవాఁడా? కానిమిత్రమా! నాకు దాహబాధ మిక్కుటముగా నున్నయది, కావున శీతోదకమును గొంచెము సంపాదించి తెచ్చి దాహ

శాంతియొనర్చి నన్ను సాకేతము జేర్పుము. అన జటాయువుజలములకై నిటునటుఁ జూచుచుండెను.

కౌసల్య:—సఖి! యీశీతలనీరమును గొనిపోయి, యీ రాజశేఖరున కొసఁగిరమ్ము. అన చెలికత్తె జలములఁ దీసికొనివెళ్లి "రాజేంద్రా! యీశీతల పానవోదకములఁ బరిగ్రహించి దాహశాంతిఁ జేసికొనుము" అని జలకలశమును ముందుంచెను.

జటాయువు:—సుముఖి! నీవెవ్వతెవు? యీ నీర మెటనుండి గొని తెచ్చితివి?

చెలి!—ఖగేంద్రా! దక్షిణ కోసలాధిపుఁడగు కోసలుని పుత్రిక కౌసల్యకు నేను జెలికత్తియను. ఈయుదకము నానెచ్చెలి యాజ్ఞఁచే నత్రిమహాముని కుటీరమునుండి తీసికొనివచ్చితిని

జటాయువు:—ఆపె యీనీరముల నెందులకుఁ దీసికొనిరమ్మనెను?

చెలి:—ఈకోసల సార్వభౌముఁడు మూర్ఛితుఁడై పడియుండుటను నాప్రియసఖికనుగొని నాచే నీరములఁదెప్పించి యీమహానీయునిపైఁ జల్లి, మూర్ఛదేర్చినది. అంత మీరురాగా జలకలశమును చేతఁ బట్టుకొని యీచెట్టుచాటున కేగినది.

దశరథుఁడు:—ఎక్కడికుసుమపురము ఎక్కడి యత్రితపోవనము ఇంతదూరమేల ఆమత్స్యకంఠి రావలసివచ్చె ?

చెలికత్తె:—మామహారాజు తనపుత్రికకు గ్రహాప్రతికూల్యముండుటచే తన్నివారణమునకు నీయత్రిమునివరుని యాశ్రమమునను౦చి మంత్రోదకములచే దైవానుకూల్యమును గల్గింపనెంచి ఇటకుబంపియున్నవాడు ఆకారణముచే మేమిటగొంతకాలమునుండి యుంటిమి.

దశ:—అబలామణీ! యీపొన్నగున్న మాటున నున్నవన్నెకత్తె నీచెలికత్తెయేనా ? ఆసుహృదయకు మాకృతజ్ఞతను దెలుపుము. అకోమలియొనర్చిన యుపకారమునకుఁ బ్రత్యుపకార మొనర్పఁజాలనందుకు వగచుచుంటిమని తెలుపుము. పక్షిఱేఁడా ! నన్ను సాకేతమునవిడువుము. అనజటాయుయువు దశరథునిదనవీపుపైనెక్కించుకొని రెప్పపాటులో నయోధ్యలోదింపెను.

దశ:—విహగనాయకా! ఇదిమొదలు మనమిద్దఱము ప్రియమిత్రులమై మెలగవలయును. అనిపలికి, బంగరుగిన్నెలతోఁ బాయసాదులనొసంగి సంతృప్తునిగాఁ జేసి పంపెను.

అత్రిమహాముని కౌసల్యకుఁ గ్రహదోషమును నివర్తింపజేసి కోసలునికడకుఁ బంపెను. కుసుమపురీశుఁడును తనపుత్రికకు స్వయంవరమేర్పాటుజేసి రాజులనందర రాఁబిలచెను. అపుడుస్వయంవరమంటపమునఁ గౌసల్య దశరథుని వరియింప నాకోసలుఁడు దశరథునకుఁదనపుత్రికనిచ్చి వివాహమొనర్చి బహువిధామూల్యవస్తువుల నొసంగియల్లునిగారవించెను. పంక్తిరథుఁడు కౌసల్యతో అయోధ్యకువచ్చి సతీసహితుఁడై రాజ్యమునుసౌఖ్యముగాఁ బాలించుచుండెను. ఆయజనందను రాజ్యమునఁ బ్రజలు పొందరానిసౌఖ్యమేదియును లేదు. దేవతలకుఁగూడఁ గోసలమున జన్మించి, దశరథక్ష్మాపాల పరిపాలనసౌఖ్యముఁ బడయఁగోరికలుదయించుచుండెను. ఇట్లుస్వర్గసౌఖ్యములఁ బ్రజలువలదనునట్లు కోసలరాజ్యమును నాయిందుమతీనందనుఁడు పాలించుచుండెను. ఇటులుండ వామదేవుఁడు దశరథునకు నొకయాఁడుబిడ్డను తెచ్చియొసంగెను. దశరథుఁడాశిశువును జేకొనియిట్లుపలికెను.

దశ:—మునివరా! యీశిశువునెటనుండి కొనితెచ్చితివి? ఈ బాలిక తలిదండ్రులెవరు?

వామదే:—రాజేంద్రా! వినుము, దేవేంద్రుఁడుగౌతమభార్యనవమానములపాఁబాలుచేసినందులకు నాయహల్యానందనుఁడగు శతానందుఁడు క్రుద్ధుఁడై యిట్లుతలంచెను. ఇట్టినీచహృదయుఁడు స్వారాజ్యమునకు సార్వభౌముఁడుగానుండ నెంతమాత్రమును నర్హుఁడుకాఁడు ఆ శచీపతి నధఃపతితునిగాఁ జేసెదను. అని ఘోరముగాఁ దపముచేయఁజొచ్చెను. అట్లుకొంతకాలమగుసరికి శతానందుని తపోవహ్నిలోకసంతాపజనకమై తేజరిల్లఁజొచ్చెను.

ఆసంగతిదేవేంద్రుఁడు తెలిసికొని భీతుఁడై వెంటనేయూర్వశిని బిలిచి, శతానందుని తపోవిఘ్నమొనర్ప నియమింప నామోహనకత్తియ శతానందుని యాశ్రమమునకేగి, సమయానుకూలముగ హావభావము

లఁబ్రకటించుచుండుదకేటులనో యాతాపసకుమారునిమారు బాటికిలోఁ జేసి, కొంతకాలమాతనితోఁ గూడియుండి, ఒకయాఁడుబిడ్డనుగని, యాశిశువునుశతానందునకుఁజూప "అన్నా ! దీనిమోహపాశమునఁ జిక్కి మోసపోతిని " అని సిగ్గుచేఁదలవంచి యాశిశువును జూడకుండెను. అంత నాయూర్వసియాపసిపాపను జిగురుటాకులఁబరుపుగాఁ బేర్చి, దానిపైఁ బరుండఁబెట్టి కుమతి, నీతిని, వీడునట్లు లాయమరయువతిసుతనువిడిచి, త్రిదివమునకు వెడలిపోయెను. శతానందుఁడును క్రోధము, శాంతినిఁ ద్యజించునటుల నాబాలికనువిడచి, వెడలిపోయెను. ఆవెంటనే నేను వసిష్ఠుని యాశ్రమమునుండి యిటకువచ్చుచు గంగాతీరమహీరుహచ్ఛాయను ఒకతలిరుటాకులమెత్తపైఁ బరుండి, కాలుసేతులు పైకెత్తికిల కిలనవ్వుచున్న యీశిశువును జూచినతోడనే జాలిచెందినవాఁడనై యీనిర్జనప్రదేశమునకు నీశిశువెట్లు వచ్చినదని, శంకించుకొని దివ్యదృష్టినిసర్వముఁ దెలిసికొంటిని. కావునరాజేంద్రా ! యీరహస్యమును బరులకుఁదెలియనీయక యీచిన్నదానిని బుత్రికనుగాభావించి, పోషింపుము. ఈపెతో నీకుముందుఁ బ్రయోజనముకలుగనున్నది అనెను. ఆమాటలనువిని దశరథుఁడు సంతానములేనివాడగుటచే నాశిశువును గౌసల్యకొసంగెను.

కౌసల్య యెక్కుడుమక్కువతో నాపసిబిడ్డను నిజగర్భజనితయగు పుత్రికనువలె బెంపఁదొడగెను. దశరథుఁడాశిశువునకు శాంతయని పేరుపెట్టెను. ఇట్లుముచ్చటగా నాశాంతపెరుఁగుచుండదశరథునకు బాల్యసఖుఁడగు రోమపాదుఁడను నంగదేశాధిపతిఁయయోధ్యకువచ్చి దశరథునిచే సన్మానితుఁడై సంతోషముగానాతనితో మాటలాడుచుండ శాంత, లేనగవుల సోయగము మోమునఁదాండవింపఁ దప్పటడుగులిడుచు దశరథునికడకువచ్చెను. అపుడారోమపాదుఁడు, ఆచిన్నిపాపముద్దుపల్కులను విని యిట్లనెను.

రోమపాదుఁడు:—ప్రియమిత్రుఁడా! యీబాలికపై నాకువాత్సల్యముదయించినది, కావుననాకీబాలికనొసంగుము. పెంచుకొందునన దశరథుఁడు మాఱుమాటాడక "మిత్రమా? యటులనే, చేకొమ్ము"అనెను రోమపాదుఁడాశాంతను దనయింటికిఁ గొనిపోయిప్రేమగౌరవములతోఁ

బెంచుకొనుచుండెను. అంతనంగదేశమునఁ గఱవుచెలరేఁగి ప్రజల బాధింపఁజొచ్చెను. రోమపాదుఁడు క్షామనివారణార్థము విప్రులతో నాలోచింప వారు "విభండకసుతుఁడగు ఋష్యశృంగుని మనదేశమునకుఁ గొనితెచ్చినచో వర్షములుకురిసి దేశముక్షామబాధావిరహితమై క్షేమము"గానుండునని తెలిపిరి.

రోమపాదుఁడు విప్రోక్తములు తెలిపినరీతిని విభండకసుతుని దన పురమునకుఁ దోడ్కొనివచ్చెను. ఆమహనీయుఁడు రావెంటనే దేశము క్షామపీడావిరహితమై క్షేమముగానుండెను. అంగదేశాధిపతి ఋష్యశృంగుని తనపురమున నుంపఁదలచి శాంతకడకేగి యిట్లుపలికెను.

రోమపాద:—అమ్మా! శాంతా! మనదేశమును దుర్భిక్షము నుండి కాపాడి, సుఖసంపన్నమునుగాఁజేసి సంరక్షించిన యామునికు మారుఁడు మనయింటనే యున్నచో మనదేశమున ఈతిబాధ లుండనేరవు. కావున నామునిసార్వభౌమనందనునకు నృపసార్వభౌమనందినివగు నిన్నిచ్చి, వివాహమొనర్పఁ గోరుచున్నవాఁడను. పుత్రీ! నీకిదిసమ్మతమేనా?

శాంత:—తండ్రీ: నీపుత్రికను నీయిష్టానుసారము నీకునచ్చిన వరునకిచ్చివివాహముచేయవచ్చునుకదా? ఇటులుండ, నెవ్వనికి, రారాజులు కూడ విధేయులై మర్యాదలఁ జేయఁగోరుదురో, యెవ్వని తపశ్శక్తిచే దుర్భరక్షామపీడ తొలఁగింపఁబడెనో యట్టితాపసేంద్రనందనునకు, నట్టి తేజశ్శాలికి మీపట్టినిచ్చుటకు సందేహమేల కలుగవలయును?

క్షమింతలేందా! యుత్తమ క్షత్రియకుల సంజాతలగు కన్యలు నిజదేశసౌభాగ్యమునకును, స్వకులగౌరవమునకును తమ జీవితములఁ గూడఁ ద్యాగముచేతురు. కావున తండ్రీ! మనదేశమునకు మహోపకారమొనర్చిన యీమునిసుతునకు నన్నొసంగి నీభక్తి కృతజ్ఞతల వెల్లడింపుము. "రాజులు ప్రయోజనము తీరినతోడనే పెడమొగమిడుదురు" అను లోకాపవాదమునకు లోనుగాకుఁడు. అన నాపలుకులకు రోమపాదుఁడు సంతసించి యామునికుమారునకు శాంత నొసంగి యావైభండకుని దనమందిరమున నుంచుకొని పూజించుచుండెను.

## —: అష్టాదశాధ్యాయము :—

### —: కైకేయీ సుమిత్రా కళ్యాణములు :—

వశిష్ఠమహర్షి హిమాలయపార్శ్వమునందు గంగాతీరమున నొక మహాయాగమును జేయనెంచి, లోకమునఁగల మహర్షులను, చక్రవర్తులను, రాఁబిలిచెను. దశరథుఁడాయాగమునకు వెళ్లి యజ్ఞాంతమున గురునికడ సెలవుగైకొని యయోధ్యకు వెడలనుండ నాయజ్ఞమునకు వచ్చిన కేకయసార్వభౌముఁడగు నశ్వపతి దశరథునిఁ దనరాజధానియగు రాజగృహమునఁ గొన్నిదివసములుండఁగోరెను.

దశరథుఁడందు కంగీకరింప నశ్వపతి కోసలపతిని నిజరాజధానికిఁ దోడ్కొనిపోయి, వినయగౌరవములతో నొక ప్రాసాదముఁ బ్రవేశపెట్టి, వివిధ వినోదములతో దశరథుని సంతసింపఁజేయుచుండెను. దశరథుఁడొక దివసమున హర్మ్యతలమునుండి యుద్యానమునఁజెలులతోఁ జెండ్లాడుచున్న కైకేయిని జూచి, వ్యామోహితుఁడై యాకన్య నశ్వపతి దుహితనుగాఁ దెలిసికొని, సుమంత్రునిఁ గేకయాధిపుకడకుఁ బంపి తన తలంపెఱింగించెను.

అశ్వపతియు భూలోకదేవేంద్రుఁడని ప్రసిద్ధిగాంచిన దశరథుని కోరికకు వ్యతిరేకముగాఁ బలుకనేరక కైకేయినియ్య నంగీకరించి, సుమంత్రునిఁబంపి, యంతఃపురమునకేగి,నిజకాంతయగు భామతితో దశరథునకుఁ గైకేయినిచ్చుటకు నిశ్చయించినట్లు తెలిపెను. ఆమాటవిన్నతోడనే చండస్వభావ యగు నారాజపత్ని కోపముతో నిట్లు పలికెను.

భామతి:—రాజేంద్రా! మనపుత్రిక నాకోసలేశున కిచ్చి సవతిపోరు సంఘటింపఁజేయ నెంచితిరా? పురుషులు తమకన్నెకలకు వరుల నిర్ణయించుటలో నిజకాంతలతో నాలోచింపక, యేకాంతముగా వివాహములు సాగింపఁదగునా? లేక లేక పుట్టిన యాఁడుబిడ్డను సాకేతరాజున కిచ్చి, కౌసల్యకు దాస్యముచేయింప నెంచితిరా? వలదు. వలదు. ప్రాణవల్లభా! మనకీ సంబంధము వలదు.

అశ్వపతి:—కాంతామణి! సురేంద్రాభయప్రదాతయు, నసురేంద్రవిజేతయు, నగు కోసలచక్రవర్తి కన్యనిమ్మని ననుగోరుటయు,

నందుకు నేనంగీకరించుటయు, జరిగినవి. ఇపుడెట్లు మాఁతాడువాఁడ? అదృష్టమును దొలగింప నెరికిశక్యము. కావున మనపుత్రికను దశరథునకిచ్చి, నేనన్న బాసను గాపాడుకొందు, నిందుకు మాఱు పలుకకుము.

భామతి:—వసుమతీందా! సామదానాద్యుపాయములచేఁ గార్యముల సాధింప నెంచురాజులకు సత్యము కడుదూరము. కావున నేదియో సాకుఁగల్పించి, యానృపుని దృప్తునిజేసి పంపుఁడు.

అశ్వపతి:—భామతీ! సామాద్యుపాయములు రాజనీతికి సంబంధించినవికాని, సంఘనీతికిఁ బనికివచ్చునవికావు. అట్లుకాక ప్రతివిషయమునను సామాదులనే యాధారములనుగాఁ జేసికొనినచో మానవనీతి యంతయుఁ దాఱుమాఱైపోవును. కావున మన మర్యాదకు భంగము రాకుండఁ జూడుము.

భామతి:—నృపేంద్రా! అటులైన నారాజుతో నిటులు చెలుపుఁడు. "నాపుత్రికకుఁ బుట్టుసుతునకుఁ బట్టముఁగట్టశపథ మొనర్చినచోఁ గైకేయి నిత్తును" అని తెలుపుడు. అందుకాతఁ డంగీకరించునా, మంచిదే. అంగీకరింపఁడా మఱిమంచిది. ఇట్లుచేసి యీసంబంధమును దప్పింపఁ బ్రయత్నింపుఁడు. లేకున్న మనకైకేయికి సవతికయ్యము తప్పదు. అశ్వపతి భామతిమాటలకుఁ గాదననేరక నిజామాత్యుని దశరథుని కడకుఁబంపి భామతి చెప్పినరీతిని శపథము చేసినచోఁ గైకేయిని బరిగ్రహింపవచ్చునని తెలియఁజేసెను.

కైకేయీ వ్యామోహితుఁడగు దశరథుఁడందుకు సమ్మతించెను. "కాముకులు కార్యసిద్ధినే కాంక్షింతురు కాని, కార్యాంతమునఁ గలుగు ఫలమును గాననేరరుకదా. మంత్రి యశ్వపతితో దశరథుఁడు శపథమునకు నంగీకరించెనని నివేదింప నారాజు భామతితో దశరథాంగీకారమును దెలిపి, యామె యిష్టముపైఁ గైకేయిని దశరథునకిచ్చి, పరిణయమొనర్చెను. దశరథుఁడటఁ గొన్నిదివసములుండి, ప్రియురాలితో నయోధ్యకేగెను. ఇటుల దశరథుఁడు కౌసల్యా కైకేయులతోఁ గూడి

ఛాయోషస్సులతోఁగూడిన సూర్యునివగిది విరాజిల్లుచుఁ బ్రజల సౌఖ్యముగాఁ బాలించుచుండెను.

ఇటులుండ రఘుమహారాజునకు దౌహిత్రుఁడును అజమహారాజునకు భాగినేయుఁడును దశరథమహారాజునకు మేనబావయును, సింధుదేశాధిపతియునగు నయచంద్రుని రాజధానియగు గోమతీపురమును యవనరాజులు చుట్టుముట్టి బాధించుచున్నారను వార్త వినరా దశరథుఁడు వెంటనే రథమునెక్కి వెడలి గోమతీపురము ముట్టడించియున్న యవనరాజుల సైన్యసమేతముగా సంహరించి, నయచంద్రునకు విజయము సమకూర్చి మేనత్తకొడుకు దన్ను బ్రార్థింపఁ గొన్నిదివసములటనుండి యయోధ్యకు మఱలివచ్చుచు మార్గమధ్యముననున్న గుణచంద్రుని తపోవనమునకేగి, నయచంద్రుని విజయవార్తను మేనత్తయగు కరుమదినికిఁ దెలుపఁగోరి యటకుఁబోవుచుండెను. అపుడు "రాజేంద్రా! కాపాడుము. కాపాడుము." అని యార్తనాదము వినరాగా దశరథుఁడు రథమునాదిక్కునకు మరల్పుమని సుమంత్రున కాజ్ఞాపించి, యటకేగి, దీనవదనలై విలపించుచున్న కన్నియలఁజూచి యిట్లుపలికెను.

దశర:—అబలామణులారా! మీకుఁగలిగిన యాపదయేమి?

కన్యలు:—మహాశయా! మాప్రియసఖియగు సుమిత్రను శోణితాక్షుఁడను రాక్షసుఁడెత్తికొని పోవుచున్నవాఁడు. అదిగో కనుఁడు దక్షిణముగా నల్లమబ్బువలె మెఱపుతీఁగెవంటి సుమిత్రనెత్తికొని పరుగిడుచున్నవాఁడు. వానినిసంహారించి మాప్రియసఖిని సంరక్షింపుఁడు. అన దశరథుఁడు వెంటనే వానివెన్నంటి పోవవాఁడు రథధ్వానమునువిని, వెనుకకువిరిగి, రథముపైనున్న పంక్తిరథుని గాంచి, భీతుఁడై యాసీరజాక్షినొక గిరిశిఖరముపై విడిచి, పాఱిపోయెను. దశరథుఁడటకేగి మూర్ఛితయైపడియున్న సుమిత్రను దనరథముపై నిడికొని తీసికొనివచ్చి యాపెచెలికత్తెలకడదింపెను.

వారమిత సంతోషముతో నాపెకు శీతోపచారములొనర్చి మూర్ఛతేర్ప సుమిత్రమెల్లగాఁ గనులువిచ్చి దశరథుని జూచివిస్మితయై సిగ్గుచేఁదలవంచి సఖులతో నిట్లుపలికెను.

సుమిత్రః:—నెచ్చెలులారా! ఆరాక్షసుఁడేమాయె? నన్నిటకుఁ గొని తెచ్చినదెవరు? చెలియలారా! తిరుగమిమ్ముఁ జూచుభాగ్యము నాకు లేదనుకొంటిని. నేనిటనారాక్షసరూపమును జూచినవెంటనే మూర్ఛిల్లితిని. తిరుగనిచ్చటనే తెలివినొందితిని. ఈలోపున నేమిజరగెనో నేనెఱుంగను.

సఖులు:—మగధరాజపుత్రీ! ఆనిశాచరాధముని బాఱిఁదోలి నినురక్షించినది యీవీరవరేణ్యుఁడే. ఈమహానీయుఁడు మాప్రార్థనములమన్నించి నిన్నుఁగాపాడెను. దయామయుఁడగు భగవానుఁడు మన కీతనిరూపమునఁ బ్రత్యక్షమయ్యెననితోఁచుచున్నది. సుమిత్ర వారిమాటల వినినతోడనే తిరుగదశరథుని వదనమును సానురాగముతో నవలోకించి నిజాంతరంగమున నాతనిచక్కఁదనమునకు నానందించి యారాజేంద్రుఁడు తనకుఁజేసిన యుపకారమునకు నమ్రయై నవోద్భవమైన మనోవికారమునకు లజ్జితయై సఖులతోనిట్లుపలికెను.

సుమిత్రః:—ప్రాణసఖులారా! మనమీయభయప్రదాత కేమి ప్రత్యుపకారము చేయఁజాలుదుము? ఈతఁడు రాక్షసునుండి నన్నువిడిపించి, నామానసమును నపహరించినాఁడు. ఈతఁడెవ్వఁడో తెలియుటయెట్లు?

సఖులు:—రాజపుత్రీ! యీతఁడు నీమానసచోరుఁడైనందులకు నీజనకునితోఁజెప్పి, నీకౌఁగిటఁబంధివిగాఁ జేయింపుము.

సుమిత్రః:—సఖులారా! అంతటిభాగ్య మెంతపుణ్యముండినఁ జేకూరవలయు, నీతఁడేదేశసార్వభౌముఁడో తెలిసికొనుఁడు.

సఖులు:—నృపవరేణ్యా! మా నెచ్చెలి మీకుఁబ్రత్యుపకారము చేయుటకు నర్హమగు వస్తువునుగానక వగచుచున్నయది. మహారాజా! మాయేలికకీవృత్తాంతము తెలుప "మిమ్ముఁగాపాడిన మహనీయుఁడెవ్వఁడని" మమ్మడిగినపుడు మేముమీపావనామమును దెలుపవలసియుండును, కావునఁ గొంచెముదయయుంచి మీనామధేయమున భాసిల్లుచున్నయక్షరములఁదెలుపఁగోరుచున్నవారలము.

దశరథుః:—— చకితహరిణేక్షులారా! మీకుసంతోషము కలుగు టయే మాకుఁబ్రత్యుపకారము. మీరుమీరాజుతో నాపేరుచెప్పఁదగినంత గొప్పకార్యమేదియు నేజేసియుండలేదు. కావున, నానామధేయమును దెలిసికొనుటలో విశేషములేదు.

సఖులు:—— మహాశయా! ప్రాణదానమును మించినఘనదానమీలోకమున వేఱొండుకలదా? మేముమీపేరు దెలుపకున్న మాయేలిక మమ్ముఁగృతఘ్నులగాఁ దలంపడా?

దశరథు:—మృదుభాషిణులారా! ఆపన్నులఁ గాపాడుట మాయినకులసంభవులకు సహజవ్రతము. ఇద్దానిని మావంశమునఁబుట్టిన పసిబాలురుగూడ సాగించుచుందురు.

సుమంత్రుఁడు:—సోదరీమణులారా! మీకు సహాయ్య మొనర్చిన యీవీరుఁడు కోసలసార్వభౌముఁడగు దశరథుఁడు; సాధ్వులారా! మీరిట కిట్లొంటరిగా రాఁగారణమేమి?

సఖులు:—ఆర్యా! మేము గంగాతీరమున విహరించుటకు రథములపై వచ్చి జాహ్నవీతటమున సంచరించుచు మనోహరములగు పూగుత్తులఁ గొంచెము దూరములోఁ గాంచితిమి. వానిఁగోయ ఁ గుతూహలముతో నటకుఁబోతిమి. క్రమముక్రమముగా ముందుముందు వింత వింత కుసుమమంజరులు కనులపండువు చేయుచుండుటచే వానికై క్రమముగా నేగుచుంటిమి కాని యిదియంతయు రాక్షసస్పృష్టియనిఁ తెలియఁజాలమైతిమి. అటులు కృత్రిమ కుసుమసృష్టిచే మమ్మింతవఱకుఁ గొనివచ్చి యొకరాక్షసుఁడు "చిక్కితివిశోణితాక్షునకు నిఁక నెక్కడికిఁబోయెదవు" అని మాచెలికత్తె నెత్తుకొనిపోయెను. మేమిటకు రాఁగారణమియ్యదియ.

దశరథుడు:—ఇందీవరాక్షులారా! సూర్యుఁడ స్తమింపనున్నవాఁడు కావున మీరిటనుండుట క్షేమకరముకాదు. ఆరాక్షసుఁడు పారిపోయెను. కాని మాచే వధింపఁబడలేదు. తిరుగ రావచ్చును. సుమంత్రుఁడా! ఈసుబలామణుల మనరథముపైఁ గూర్చుండఁబెట్టి మగధ రాజధానియగు కుసుమపురమున భద్రముగా విడిచిరమ్ము. నీవువచ్చు

దాఁక నేను, కుముదినీ గుణచంద్రిల యాశ్రమంబున నుందును. అనిన సుమంత్రుఁడా వారిజాక్షుల రథముపై నెక్కించి కుసుమపురమునకుఁ గొంపోయి రాజమందిరము కడ దింపెను.

సుమిత్ర సఖులతోఁ దలిదండ్రులకడ కేగి జరిగినసంగతిని వారికి వివరించి తెలిపి తన్నుఁగాపాడిన దశరథునకు దన్నొసంగి వివాహము చేయఁ బ్రార్థింప, నామె తండ్రియగు విక్రమరాజేంద్రుఁడు కూఁతురి కుతూహల మన్నివిధముల దీర్పఁదగియుండుటచే వెంటనే యాదశరథ రథముపైనెక్కి గుణచంద్రాశ్రమమున నున్న దశరథుని గలిసికొని తన పుత్రికను బరిగ్రహింపు మని కోరెను.

దశరథుఁడు మేనత్తయొక్కయు, మేనమామయొక్కయు, అంగీకారముపైఁ గుసుమపురమున కేగి, సుమిత్రను బరిణయమై యాసతీతిలకమును వెంటనిడికొని యయోధ్య కేగి, ప్రభుమంత్రోత్సాహశక్తులకరణి కౌసల్యా, కైకేయీ, సుమిత్రలుతన్నుసంతసింపఁజేయుచుండ యజ్ఞయాగాది సత్కర్మలనాచరించుచు సౌఖ్యముగా బ్రజలఁ బరిపాలించుచు లోకత్రయ విఖ్యాతయశస్కుఁడై తేజరిల్లుచుండెను.

ఓంతత్సత్,

పూర్వకాండము సంపూర్ణము.

# దిద్దుపాట్లు.

కృతిపరిశంస మొదటిపొరటలో 2వపంక్తిలో "ఎవరినిగూర్చి నవియో" దీనికి పిమ్మట "యీమాటలు" చేర్చియు, 6వ పంక్తిలో 'నార్యుల' ఘునియు 17వ, పంక్తిలో 'యాంధ్ర' విడచియు చదువవలయును. ఇకకృతిలో నీక్రిందిరీతిని జదువవలయు.

| పొరట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 5 | 20 | వెటనే | వెంటనే |
| ,, | 21 | పలుకుచుడ | పలుకుచుండ |
| 12 | 26 | భూలము | భూముల |
| 20 | 16 | గ్రహించు | గ్రహించుచు |
| 54 | 4 | కుమిదిని | కుముదిని |
| 55 | 1 | కుమిదిని | కుముదిని |
| ,, | 22 | బరుష | బురుష |
| 58 | 3 | నుప్పినీళ్లు | నుప్పునీళ్లు |
| 59 | 19 | భానుమతి | ప్రభావతి |
| 62 | 18 | వసుందర | వసుంధర |
| 68 | 26 | కులభాషిణి | కలభాషిణి |
| 83 | 2 | సూరసేన | శూరసేన |
| ,, | 17 | కుడిచేత | కుడిచేతి |
| 95 | 12 | వారణసి | వారాణసి |
| 96 | 5 | విన్న | విన్న |
| ,, | 8 | గుప్తడుతో | గుప్తునితో |
| 97 | 10 | సూరశేన | శూరసేన |
| ,, | 21 | సూర | శూర |
| 98 | 17 | మెరిగి | మెగిరి |
| ,, | ,, | గాపాడుది | గాపాడునది |
| ,, | 23 | దాయి | దాము |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
| --- | --- | --- | --- |
| 99 | 10 | ప్రకటించవలయు | ప్రకటింపవలయు. |
| 100 | 11 | డేళ్ల | డేండ్ల |
| 104 | 3 | వశాచి | వశించి |
| ,, | ,, | వేగగ | వేగక |
| ,, | 21 | తరుముకొాన | తడుముకొాన |
| 110 | 22 | ననీకడ | నన్నునీకడ |
| 113 | 6 | నేర్పిరిచి | నేర్పరచి |
| 118 | 3 | కుదురు | దగరు |
| ,, | 13 | జాక | జాలక |
| ,, | 24 | చున్నయది | నున్నయది |
| 122 | 15 | తీరయినకు | తీరమునకు |
| 123 | 15 | జోట | జోటు |
| 125 | 1 | యాశ్రమయి | యాశ్రమము |
| ,, | 3 | పిలుపై | పిలుపుపై |
| 127 | 27 | జటాయుయు | జటాయువు |
| 128 | 20 | మానముల పాబాలు | మానములపాలు |
| 134 | 25 | పావనామము | పావననామము |
| 136 | 15 | యసస్కుడై | యశస్కుడై |